RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Referred Journal &
Peer Reviewed Journals

Vol : 22 | Spl. Issue 8 | August 2025 | BHAVAVEENA | ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

తెలుగు రామాయణములు - సమాలోచన

ప్రత్యేక వ్యాస సంకలనం

గోన బుద్ధారెడ్డి

మొల్ల

విశ్వనాథ

తెలుగు రామాయణములు - సమాలోచన

ప్రధాన సంపాదకులు :

డా॥. జి. శ్రీనివాసరావు

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము

తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

సంగారెడ్డి, తెలంగాణ.

ఉప సంపాదకులు :

డా॥. మరపతి మాంతయ్య

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము

తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

సంగారెడ్డి, తెలంగాణ.

డా॥. రాపోలు శ్రీనివాస్

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము

బి.జె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

నారాయణగూడ, హైదరాబాద్, తెలంగాణ.

డాII. జి. శ్రీనివాసరావు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము,
తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి.

తేది : 5-8-2025

శ్రీమద్రామాయణ వ్యాస వైజయంతి

శ్రీరామనామము ఓంకారము వలె పరమపవిత్రము, మధురాతిమధురము, పరమానందదాయకము, ఆత్మజ్ఞాన జనకము, మోక్షప్రాప్తికారకము. శ్రీరాముడంటే నరుడుగా అవతరించిన నారాయణుడు. నరుడు ఎలా సత్యసంధుడై, ధర్మనిష్ఠాపరుడై ఉండవలెనో ఆచరించి చూపినవాడు. అందుకే యుగాలు గడిచినా, తరాలు మారినా తరగని కథ రామకథ. నదులు, గిరులు, సూర్యచంద్రులున్నంతవరకు రామకథ ఉంటుంది.

శ్రీమద్రామాయణాన్ని రచించి పరమ పూజ్యుడైన వాల్మీకి మహర్షి తాను తరించి, ఎందరినో తరింపజేశాడు. సాహితీ మాగాణములలో శ్రీరామకథాసుధలను, నదులుగా, కాలువలుగా పారించిన కవులెందరో. ఆ నదులలో మునిగి తరించిన వారు, తరిస్తున్నవారు కోకొల్లలు. తెలిసి నదిలో దూకినా, తెలియక నదిలో పడినా తడవక తప్పదు. అత్తరుషాపు దగ్గరికి వెళ్ళినవారు అత్తరు కొన్నా, కొనక పోయినా ఆ పరిమళాన్ని ఆస్వాదింపవచ్చు. అలాగే రామాయణాన్ని రచించినా, పఠించినా, ప్రవచించినా, పాడినా, విన్నా అది బ్రహ్మానందసంధాయకమగును. మన తెలుగు కవులెందరో పరమాద్భుతముగా శ్రీరామకథను వివిధ ప్రక్రియలలో సృజించారు. ఆ తెలుగు రామాయణములను లోతుగా చదివి, హృదయంగమం చేసుకొని 19 మంది వ్యాసకర్తలు మంచి విశ్లేషణాత్మకమైన వ్యాసములను వెలువరించినారు.

"తెలుగు రామాయణము - సమాలోచన " అనే శీర్షికతో భావవీణ పత్రిక ప్రత్యేక వ్యాససంకలనముగా తీసుకురావడానికి కారకులైన వారు, సాహితీ పత్రిక అయిన 'భావవీణ' ప్రధాన సంపాదకులు డా.జి.నాగయ్యగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

వ్యాసరచనాయజ్ఞమను పవిత్ర కార్యమున నాకు పూర్తి సహాయ సహకారములందించిన మిత్రవరేణ్యులు, ఉపసంపాదకులు అయిన డా.మఠపతి మాంతయ్యగారికి, డా.రాపోలు శ్రీనివాస్‌గారికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు, ఈ వ్యాస సంకలనంలోని చాలా వ్యాసాలను టైపు చేసి పంపిన ప్రియ మిత్రుడు డాII. పి. భగ్గుకు ప్రత్యేక ధన్యవాదములు. వ్యాసములను గుదిగ్రుచ్చి వైజయంతిమాలను తయారు చేసి శ్రీరాముని కంఠమునలంకరింపజేసిన వ్యాసకర్తలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

05/08/2025
(డా. జి. శ్రీనివాసరావు)

డా॥ మఠపతి మాంతయ్య
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము,
తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి.

తేది : 5-8-2025

రామచంద్రునికొక నూలుపోగు

వాల్మీకి వ్యాసమహర్షులు జగద్ధితమును కోరి రామాయణ, భారత భాగవతాది పురాణేతిహాసములు రచించినారు. వాల్మీకి రామాయణమును గోనబుద్ధారెడ్డి, భాస్కరుడు, మొల్ల మొదలుకొని విశ్వనాథుల వరకు తెలుగులో రామాయణములు వ్రాశారు. కథకెంత ప్రాధాన్యతనిచ్చారో గుణరీతిరసౌచిత్య ధ్వన్యాది సాహితీ సౌందర్య హేతువులైన కవిత్వ లక్షణాలకు ప్రాధాన్యతనిచ్చి కావ్య రామణీయకతను దృశ్యమానం చేశారు. సందర్భోచితంగా ఎడనెడ అవాల్మీకాంశాలను చొప్పించినా కథను సమూలంగా ఎక్కడా మార్చలేదు. రామాదుల ద్వారా ధర్మమార్గమును లోకమున ప్రతిష్ఠించినట్లైనది. సత్య, ధర్మములను విశ్వమంతా విస్తరింపజేయుటకు కవులు చేసిన ప్రయత్నము ఎన్నడూ వృథా కాలేదు. ద్విపదతో మొదలైన రామకథా స్రవంతి చంపూ కావ్యాలుగా, యక్షగానాలుగా, హరికథలుగా, పాటలుగా, శతకాలుగా, నాటకాలుగా, చలన చిత్రాలుగా, టీ.వీ.సీరియల్లుగా ఎన్నో రూపాలు సంతరించుకొని అవిచ్ఛినంగా ప్రవహిస్తూనే ఉంది. రామాయణములోని ప్రతి పాత్ర ఎన్నో నైతిక విలువలతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాఠకున్ని ప్రభావితం చేస్తూనే ఉంటుంది. ఈ వ్యాససంకలనమున వ్యాసములు రచించిన 19 మంది వ్యాసకర్తలు ధన్యులు. రామాయణము(ల)ను చదివి, హృదయంగమం చేసుకొని ఆయా రామాయణ రచనా విశేషాలను, రచనా చమత్కారాలను వెలువరిస్తూ చక్కని వ్యాసాలు వ్రాసినారు. ఈ వ్యాస సంకలనము తెలుగు సాహితీ లోకముచే మన్ననలు పొందుతుందనేది నిస్సందేహము. ఇతర రామాయణ రచనల వలె ఈ "తెలుగు రామాయణములు - సమాలోచన" అనే ఈ వ్యాస సంకలనము రామచంద్రునికి సమర్పించిన ఒక నూలుపోగుగా భావిస్తాను.



డా॥. రాపోలు శ్రీనివాస్
అసోసియేట్ ప్రొఫెసర్, బాబూ జగ్జీవన్ రామ్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర), నారాయణగూడ, హైదరాబాద్.

తేది : 5-8-2025

తెలుగు రామాయణములు – సమాలోచన

రామాయణం భారతదేశంలోని అన్ని భాషలలో, అన్ని ప్రాంతాలలో ఎంతో ఆదరణీయం, పూజనీయం. ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదు, ఇది జీవితంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను కూడా తెలియజేస్తుంది. రాముడి ద్వారా ధర్మం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. రాముడు తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలన్నింటినీ ధర్మం పాటించడం ద్వారానే ఎదుర్కొన్నాడు. రామాయణం కుటుంబ సంబంధాలు, భార్యాభర్తల అనుబంధం, సోదర ప్రేమ వంటి వాటి గురించి కూడా తెలియజేస్తుంది. రామాయణం ద్వారా దయ, క్షమాగుణం, ధైర్యం వంటి మానవ విలువలను నేర్చుకోవచ్చు. సమాజంలో ఎలా మెలగాలో, ఇతరులతో ఎలా ప్రవర్తించాలో కూడా తెలియజేస్తుంది. మానవ జీవితం యొక్క పరమార్థాన్ని, మోక్షాన్ని పొందే మార్గాన్ని కూడా సూచిస్తుంది. జీవితం యొక్క గమ్యం మోక్షం పొందడం. మోక్షాన్ని పొందడానికి ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించడానికి అర్థాన్ని, కామాన్ని జయించాలి. ఏ పురుషుడైనా ఏకపత్నీవ్రతుడై యుండాలి. సత్యము చెప్పడం, మాటపై నిలబడటం, తండ్రి మాట జవదాటకుండా ఉండడం పాటించాలి.

తెలుగు రామాయణములు సమాలోచన అనే ఈ పుస్తకంలో, రామాయణంలోని వివిధ అంశాలపై 19 వ్యాసాలను పొందుపరిచాము. ఈ వ్యాసాలలో, రామాయణంలోని వివిధ పాత్రలు, సంఘటనలు, మరియు వాటి ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ముఖ్యంగా, సీతారాముల ప్రేమ, భరతుని సోదర ప్రేమ, హనుమంతుని భక్తి, ఆదర్శ వ్యక్తిత్వం నీతి, ధర్మం, మానవ సంబంధాల గురించి ఎన్నో విలువైన విషయాలను నేర్పుతాయి.. నిర్వచనోత్తర రామాయణం, మొల్ల రామాయణం, భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, అచ్చ తెలుగు రామాయణం, జానపద రామాయణాలలోని అంశాలపై ఉన్న వ్యాసాలు రామాయణ కథను వివిధ కోణాలనుండి తెలుసుకొని పరిపూర్ణమైన అవగాహన పొందడానికి దోహదపడతాయి. ఈ వ్యాసాలు పాఠకులకు రామాయణం యొక్క గొప్పతనాన్ని, దాని నుండి నేర్చుకోవలసిన విషయాలను తెలియజేస్తాయని ఆశిస్తున్నాము. ముఖ్యంగా సుగుణాలరాశి అయిన శ్రీరామచంద్రుని గుణశీలాలు, మహా పతివ్రత, ధైర్యశాలి, సహనశీలి సీతాదేవి వ్యక్తిత్వం నేటి యువతను ఆదర్శ పథాన నడిపిస్తాయి. ఈ పుస్తకాన్ని చదివిన తర్వాత, పాఠకులు రామాయణం గురించి మరింత తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారని, దాని నుండి స్ఫూర్తి పొంది, వారి జీవితంలో మంచి మార్పులు చేసుకుంటారని ఆశిస్తున్నాము.



(డా॥. రాపోలు శ్రీనివాస్)

BHAVAVEENA
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

ముద్రణ	:	ఆగష్టు - 2025
ప్రతులు	:	500
వెల	:	రూ. 300/-
కాపీలకు	:	డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.
గమనిక	:	ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.
ఎడిటోరియల్ చిరునామా	:	డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.
డి.టి.పి & ప్రింటింగ్	:	తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Founder :
Kolla Sri Krishnarao (Late)

E-mail :
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

Vol. 22 - Spl. Issue. 8 - August 2025 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 300/-

EDITORIAL BOARD

Honourable Editor
Dr. PITTA SANTHI
M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.

Chief Editor
Dr. PAYARDA NAGAIAH
M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.
135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

ADVISORY COMMITTEE

1. Prof. K. Madhu Jyothi, M.A., PhD.
Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

LEGAL ADVISER

Pitta Sundara Babu, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, #135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, GUNTUR - 522 034. Andhra Pradesh. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com. Printed at : GLS Enterprises, Guntur - 2. Ph. 94 94 660 509.

Contents (విషయ సూచిక)

1. రంగనాథరామాయణం - రచనా విశేషాలు	- డా॥. మఠపతి మాంతయ్య	9
2. భాస్కర రామాయణము - సమాలోచన	- డా॥. జి. శ్రీనివాసరావు	13
3. మొల్ల రామాయణం - ఆదర్శదూత హనుమ	- డా॥. రాపోలు శ్రీనివాస్	17
4. నిర్వచనోత్తర రామాయణము - తిక్కన కవితాలక్షణములు	- డా॥. నందవరం మృదుల	22
5. రామాభ్యుదయము - ప్రబంధ వర్ణన	- డా॥. ఆర్. రమాదేవి	32
6. రామాయణ కల్పవృక్షం - బాలకాండలోని కమనీయ ఘట్టాలు	- డా॥. రమేశ్ బాబు మామిడాల	35
7. భాస్కర రామాయణం - పరిశీలన	- డా॥. భూక్య తిరుపతి	41
8. తెలంగాణ యక్షగానాలు - రామాయణేతివృత్తాలు	- డా॥. కె. సురేశ్	45
9. తందనాన రామాయణము - కల్పనల ఔచిత్యం	- డా॥. మట్టా సంపత్కుమార్ రెడ్డి	49
10. రామాయణము - ఆదర్శజీవనము	- డా॥. హెచ్. వామనమూర్తి	56
11. మొల్ల మలచిన సీతమ్మ	- డా॥. ఆర్. మహేందర్ రెడ్డి	61
12. యక్షగాన సాహిత్యంలో రామాయణ కథాంశములు	- డా॥. తండు కృష్ణయ్య	66
13. అచ్చ తెలుగు రామాయణం - విశిష్ట తెలుగు పదాల ప్రయోగం	- డా॥. పెబ్బేటి మల్లికార్జున్	73
14. అచ్చ తెలుగు రామాయణం - అవాల్మీకాంశాలు	- డా॥. ఎల్. విజయ	79
15. అచ్చ తెలుగు రామాయణం - అలంకారాల అభిషేకం	- డా॥. వి. కళ్యాణి	83
16. శ్రీరఘుకుల సార్వభౌమ శతకం - రామతత్త్వం	- డా॥. ఎం. వేణుగోపాల్ శర్మ	87
17. బంజారాలు పాడుకునే శ్రీరాముని పాటలు - విశ్లేషణ	- డా॥. పి. భగ్గు	93
18. రంగనాథ రామాయణం - భరతుని పాత్ర చిత్రణ	- శ్రీమతి గొంగులూరి కృష్ణవేణి	99
19. కన్నడ శ్రీరామాయణ దర్శనం - తెలుగు శ్రీమద్రామాయణ కల్పవృక్షం - తులనాత్మక పరిశీలన	- డా॥. పి. విజయ కుమార్	106

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

1. రంగనాథరామాయణం - రచనా విశేషాలు

- డా॥. మరపతి మాంతయ్య

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల (అటానమస్), సంగారెడ్డి.

ఉపోద్ఘాతం :

సంస్కృతంలో వాల్మీకి రామయణాన్ని రచించి, ఆదికవిగా ప్రసిద్ధికెక్కిన విషయం జగద్వితమే. తెలుగు సాహిత్యంలో అనేక రామాయణాలు వెలువడ్డాయి. ఆ విధంగా తెలుగులో వెలువడిన రామాయణాలలో రంగనాథరామాయణం అతి ప్రాచీనమైనది. ఇది బృహత్‌కావ్యం. ఇది ద్విపదకావ్యం. తెలుగు సాహిత్యంలో 'ద్విపద'ను సృష్టించి, బసవపురాణము, "పండితారాధ్యచరిత్ర"లను రచించిన మహాకవి పాల్కురికి సోమనాథుడు. అదే మార్గంలో రామాయణ కావ్యాన్ని ద్విపదలో రచించిన కవిశేఖరుడు గోనబుద్ధారెడ్డి.

రంగనాథరామాయణం తెలుగు సాహిత్యంలో బహుళ ప్రసిద్ధి పొందిన గ్రంథం. గోనబుద్ధారెడ్డి తండ్రి విఠలుడు. తండ్రి ఆదేశంతో తాను రంగనాథరామాయణాన్ని రచించినట్లుగా ప్రకటించుకున్నాడు కవి. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని క్రీ.శ.1280 సం॥లో రచించినట్లుగా పరిశోధకులు నిర్ధారించారు.

రంగనాథరామాయణం - నామప్రశస్తి :

రంగనాథరామాయణానికి 'ద్విపదరామాయణం' "గోనబుద్ధారెడ్డి రామాయణం" "విఠలనాథ రామాయణం" అనే పేర్లు ఉండాలి. కాని రంగనాథరామాయణమనే పేరు ఎలా వచ్చిందనే అభిప్రాయాలు చాలా మంది పరిశోధకులు వెలువరించారు.

రంగనాథ రామాయణానికి ఆ పేరు ఎలా వచ్చిందనే విషయంపై పరిశోధకులు రకరకాల ఊహాగానాలు చేశారు. పింగళి లక్ష్మీకాంతంగారు "పాండురంగ విఠలనాథుడు" అనే పేరులోని "రంగనాథ" అనే పదంతో "రంగనాథ రామాయణం" అనే పేరు వచ్చిందనే వాదనను శిష్టారామకృష్ణగారు ఖండించారు. కృతిపతి ననుసరించి, ఈ పేరు రాలేదని ప్రకటించడం సరియైనదే, కాని ప్రాచీన కాలంలో దీనికి రంగనాథరామాయణమనే పేరు లేదు. తంజావూరు ప్రతిలో కూడా రామాయణమనే ఉందని మల్లంపల్లివారు పేర్కొన్నారు.

ప్రముఖ సాహిత్య పరిశోధకులైన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు "రంగనాథుడు" అనే పేరు గల వ్యక్తి ఎవరో

రాసి, గోన బుద్ధారెడ్డిగారి పేరుతో ప్రకటించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "గోనబుద్ధారెడ్డి" మొదట "బుద్ధరాజు" అని, అతడు పరిపాలనాదక్షుడని, కావ్యరచనా సామర్థ్యం కలవాడని తరువాత పరిశోధకులు నిర్ధారించారు.

ఈ బుద్ధరాజు అనేక మంది కవి పండితులను పోషించాడని, ఈతనికి "సుమనీష పోషణోత్సుక సుఖోన్నతుడు", "కవి కల్పతరువు", "కవిలోక భోజుడు" అనే బిరుదులున్నాయని పరిశోధకులు వెల్లడించారు.

రచయిత నామ వైశిష్ట్యం :

"గోన బుద్ధారెడ్డి" పేరులోనే విశేషమున్నది. దశావతారాలలో "బుద్ధుడు" కూడా ఒక అవతారమని హిందువులు నమ్ముతారు. కావున బుద్ధుని పేరు పెట్టుకోవడం గమనార్హం. కాకతీయులు అనేక దేవాలయాలను నిర్మించారు. కాకతీయరాజైన మొదటి ప్రతాపరుద్రుని మంత్రి వెల్లంకి గంగాధరుడు బుద్ధునికి దేవాలయమే నిర్మించాడు.

పరమేశుండు హరి బుద్ధ
స్వరూపుండై యసురవరుల వంచించుటనా
హరి యని య పట్టశాలన్
జిరముగ బుద్ధ ప్రతిష్ఠ సేసితిభక్తిన్

అని నగునూరు శాసనంలో పేర్కొన్నాడు. పట్టశాల కరీంనగర్ జిల్లాలోనిది.

తెలంగాణలో లభించిన శాసనాలను అనుసరించి గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణ రచనా కాలానికి ప్రతాప రుద్రుని ఆశ్రితునిగా వర్ధమానపురం (నేటి వడ్డెమాన్ ప్రాంతం) ను రాజధానిగా చేసుకొని పరిపాలించాడని తెలుస్తుంది.

రంగనాథ రామాయణ వైశిష్ట్యం :

మూలకథ వాల్మీకి రామాయణంలోనిదే అయినప్పటికీ "రంగనాథరామాయణము" యథా మాతృకగా సాగలేదు. వాల్మీకి పై గౌరవంతో

"ఆది కవీశ్వరుడైన వాల్మీకి
ఆదరంబున బుఝ్యులందరూ మెచ్చ
జెప్పిన తెరగున"

అని అవతారికలో చెప్పినప్పటికీ చాలా వరకు గోన బుద్ధారెడ్డి రంగనాథరామాయణాన్ని స్వతంత్రంగానే తీర్చిదిద్దాడు.

గోనబుద్ధారెడ్డి తన సమకాలీన ప్రజలలో విస్తృతంగా ప్రచారంలో గల గాథలను అవాల్మీకాలైనా స్వీకరించాడు. వాల్మీకి రామాయణాన్ని తన కృతికియథామాతృకానువాదంగా స్వీకరించలేదు. ప్రజలకు ఆమోదయోగ్యంగా సరళంగా, గానం చేయుటకు ద్విపదలో రచించాడు.

రంగనాథరామాయణంలో జనబాహుళ్యంలో గల వివిధ ఘట్టాలను స్వీకరించినట్లుగా తెలుస్తుంది. యక్షగాన, తోలుబొమ్మలాటలలో గేయరూపంగా రామాయణం వర్ణింపబడింది. అహల్య రాతిగా మారడం, రామపాదస్పర్శ వల్ల ఆమె యధారూపాన్ని ధరించడం, లక్ష్మణరేఖ, రావణాసురుడు విభీషణుని తన్నడం, మండోదరి రామచంద్రుని గుణగణాలను కొనియాడడం, భర్తయైన రావణుని మందలించడం, కాలనేమి వృత్తాంతం, సులోచన చరిత్ర, పాతాళ హెూమం, ఖండించిన వెంటనే రావణుని తలలు మొలవడం వంటి అతి మనోహరమైన గాథలు రంగనాథ రామాయణంలో వర్ణింపబడినాయి.

రంగనాథరామాయణంలో వాల్మీకి రామాయణంలో లేని కథాంశాలు చాలా ఉన్నాయి. వీటిని మూల సాహిత్యంలో లేనివి గనుక "అవాల్మీకాలు" అని విమర్శకులు వివరించారు.

రంగనాథరామాయణం గోనబుద్ధారెడ్డి సామాన్య ప్రజల కోసం రచించారు. సామాన్యులు పాడుకోవడానికి అనుకూలంగా "ద్విపద" ఛందస్సును ఎంచుకున్నాడు. ఆనాటికే "రామాయణం" ప్రజల నోళ్ళలో పాటల రూపంలో ఉన్నది. పద్యరూపంలో రాసిన రామాయణం అయితే పండితులకు మాత్రమే పరిమితమవుతుంది. రంగనాథ రామాయణం పాటరూపంగా గ్రామీణులు పాడుకునేది. వారి కోసం రాసినప్పుడు వారికి తెలిసిన కథలు దీనిలో ఉండాలి. అప్పుడే వారు దానిని తనదిగా భావిస్తారు. కావున గోనబుద్ధారెడ్డి ఆనాటికే ప్రజలలో విస్తృతంగా ప్రచారంలో గల అవాల్మీక గాథలను పాటల (ద్విపద) రూపంలో తాను తన కావ్యంలో చొప్పించి రచించాడు. రావణుడు వాలిని గెలువదలచి అనేక ప్రయత్నాలు చేసి విఫలమౌతాడు. వాలి రావణుని అంగదుని తొట్లెకు 'దశాననకందుకము (పది తలల బొమ్మ)గా కట్టాడు. రావణుడు వాలి ఆధిక్యతను అంగీకరించి, లంకకు వెళ్ళిపోయాడని గోనబుద్ధారెడ్డి వివరించాడు.

రంగనాథ రామాయణం ఒక గేయ కావ్యం. ఈ కావ్యాన్ని పాడుకోవడం, పారాయణం చేయడం, తెలుగువారు చేస్తుండేవారు. తోలుబొమ్మలాడించే కళాకారులు బొమ్మలాడిస్తూ, నేపథ్యంలో కథాగమనానికి వాడేవారు.

వర్ణనలు :

రంగనాథరామాయణంలో అద్భుతమైన, మనోహరమైన వర్ణనలున్నాయి. వర్ష ఋతువర్ణన అద్భుతంగా ఉంటుంది.

సురుచిరామృత వార్ధి సుతయును బోలె
హరియుక్తమైన నిజాంగంబు గల్గి
చారు వసంతమాసంబును బోలె
నారక్తపుల పలాశాళిగలిగి
వరదాన శీలు నివాసంబుబోలె
కరమొప్ప నధిక మార్గణకోటి గలిగి
....

అని ఈ విధంగా వసంత ఋతువర్ణన సాగుతుంది.

బాలకాండలో అర్ధరాత్రి వర్ణన దిగువ పేర్కొన్న విధంగా కొనసాగుతుంది.

నడురాత్రియరుదెంచె నరలోకనాథ
కడుడస్సినాడవు కనుమోడ్తుగాక
చలియింపకున్నవి సకలవృక్షములు
మెలగవు వనభూమి మృగసమూహము
నెఱి విహంగంబులు నీడముల్ చేరి
మఱచి యున్నవి తమమంజుల ధ్వనులు
యామినీ చరులైన యక్షరాక్షసులు
భూమి విచ్చలవిడి బొరి జరించెదరు
దీటుగ జీకటిదెసలునాకసము
కాటుక బూసిన కరణినున్నదియు
నీలాంబరంబున నిండుముత్తెములు
గీలించి బ్రహ్మాండ గేహగోళమున

గడునొప్పుగామేలు కట్లెత్తినట్ల,
యుడుగణంబులతోడ నున్నది నింగి
యడరంగ జనులను నానందమొదవ
నుడురాజు పొడతెంచుచున్నాడటన్న
....

అని అర్ధరాత్రిని సరళంగా, సహజంగా వర్ణించాడు కవి.

ముగింపు :

"రంగనాథరామాయణం" తెలుగు సాహిత్యంలో మణిపూస. తెలుగు సాహిత్యంలో వెలువడిన రామాయణాల్లో అగ్రగణ్యమైనది. రంగనాథరామాయణం సుదీర్ఘమైన కావ్యం. ఆరుకాండలతో సంపూర్ణంగా రచింపబడిన కావ్యం.

ఈ రామాయణంలో మనోహరమైన భావాలున్నాయి. హనుమంతుడు సముద్రాన్ని లంఘించే సమయంలో కొండలు పిండి అయినాయని వర్ణించాడు కవి. దీనికి దృష్టాంతంగా రావణుడు ఇంతకుముందే సంపాదించిన కీర్తి పొడిపొడి అయినట్లు అయిందని వర్ణించాడు గోనబుద్ధారెడ్డి.

ఈ విధంగా రంగనాథరామాయణంలో ఎన్నెన్నో విశేషాలున్నాయి. తెలుగు సాహిత్యంలో వెలువడిన అపూర్వమైన మణిపూస "రంగనాథరామాయణం" అని పేర్కొనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీరంగనాథరామాయణము - తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రచురణ 1998.
2. ఆధ్యాత్మ రామాయణం - బ్రహ్మశ్రీ చెదలవాడ సుందరరామశాస్త్రి.
3. వాల్మీకి రామాయణము - గీతాప్రెస్ గోరక్‌పూర్ వారి ప్రచురణ.
4. రామాయణ రత్నాకరము - విద్యాప్రకాశానందగిరిస్వామి.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

2. భాస్కర రామాయణము - సమాలోచన

- డా॥. జి. శ్రీనివాసరావు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, తారా ప్రభుత్వ కళాశాల(స్వ), సంగారెడ్డి.

1. పరిచయము :

శ్రీరామ కథామృత తరంగిణియగు శ్రీమద్రామాయణము వాల్మీకి మహర్షి హృదయ స్థానమున ఆవిర్భవించి మానవ జాతి ఉన్నంత వరకు వారిని ధర్మమార్గంలో నడిపిస్తూ, స్థల కాల పరిమితులనధిగమిస్తూ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది. సంస్కృతమున వ్రాయబడిన ఈ రామాయణమును ఎందరో మహాకవులు తెలుగులో విభిన్న ప్రక్రియలలో పరమాద్భుతంగా రచించి తరించారు. ఇంకా వ్రాస్తూనే ఉన్నారు. తెలుగున వెలసిన రామాయణములలో కొన్ని యథావాల్మీకములు కాగా చాలా వరకు తమ ప్రతిభాపాటవములతో అద్భుతంగా సృజించియున్నారు. తెలుగున ఆవిర్భవించిన రామాయణములలో గోనబుద్ధభూపతి రచించిన శ్రీరంగనాథ రామాయణము మొదటిది కాగా భాస్కర రామాయణము రెండవది. దేశీయమైన ద్విపద ఛందస్సులో వ్రాయబడినది రంగనాథ రామాయణము. మార్గపద్ధతిలో చంపూ కావ్యముగా వ్రాయబడిన రామాయణములలో మొదటిది భాస్కర రామాయణము.

2. వివరణ :

13వ శతాబ్దములో బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కంధాకాండ, సుందరకాండ, యుద్ధకాండ - ఆరుకాండలుగా 5897 గద్యపద్యాలతో వ్రాయబడినది భాస్కర రామాయణము.

2.1. కర్తృత్వ చర్చ :

తెలుగులో రచింపబడిన భారత, భాగవతముల వలెనే భాస్కర రామాయణము కూడా బహుకర్తృకము. హుళక్కి భాస్కరుని కుమారుడైన మల్లికార్జునభట్టు బాలకాండ, కిష్కింధాకాండ, సుందరకాండలను, కుమార రుద్రదేవుడు అయోధ్యాకాండను, హుళక్కి భాస్కరుడు అరణ్యకాండ, యుద్ధకాండ పూర్వ భాగమును, అయ్యలార్యుడు యుద్ధకాండ శేషమును రచించారు. ఈ విధంగా నలుగురు కవులు రచించినప్పటికీ భాస్కరుని పేరనే ప్రసిద్ధమైనది. భాస్కరుని ఆధ్వర్యములో రచింపబడటమే దీనికి కారణము. అరణ్యకాండ, యుద్ధకాండ పూర్వభాగములను రచించినది హుళక్కి భాస్కరుడు కాదనియు, తిక్కన తాతగారైన మంత్రి భాస్కరుడని ఒక వాదమున్నది. కాని ఆ వాదము అసత్యమని పండితలోకము తీర్మానించినది.

2.2. అవాల్మీకాంశములు :

భాస్కర రామాయణములో కథలో స్వల్పమైన మార్పులు చేయబడినవి కాని పెద్ద మార్పులు కావింపబడలేదు. యథావాల్మీకముగ కాకుండ కథలోని వర్ణనములను కొన్ని చోట్ల పెంచియు, కొన్ని చోట్ల సంక్షిప్తీకరించియు, కొన్నిచోట్ల వదిలివేసియు స్వతంత్రానువాద పద్ధతిననుసరించినారు. భాస్కర రామాయణములో అవాల్మీకాంశములను చేర్చుటకు కారణం అధ్యాత్మ, ఆనందాది సంస్కృత రామాయణములు, తెలుగున గల రంగనాథ రామాయణము, జన వ్యవ హారములోని కథలు. అవాల్మీకాంశములలో కొన్నింటిని చూద్దాం. వాల్మీకి రామాయణములో అహల్యను పాషాణమగుమని శపించినట్లు లేదు. కాని భాస్కర రామాయణములో గౌతముడు "...ఈవనంబున ననేక దివ్య సహస్రవర్షంబులు వాయు భక్షణవు నిరాహారవు భస్మశాయినివియునై యెవ్వరికి గానరాక పాషాణంబవై యుండుమని యంతట గరుణార్ద్ర మనస్కుండై యెప్పుడివ్వనంబునకు రామచంద్రుడు వచ్చునప్పుడ శాపవిముక్తవై తదాతిథ్య సత్కారంబున నిజరూపంబు గైకొని ముదంబందెదవు" (భా. రా. బాలకాండ - 510. పుట:52)

వాల్మీకి రామాయణములో మంథరకు రామునిపై ద్వేషము కలుగుటకు కారణమేమియు కానరాదు. కాని భాస్కర రామాయణములో "....ఇది రామచంద్రుని పట్టాభిషేక మహోత్సవంబుగాబోయి దీనికి విఘ్నంబు గావింప వలయునని విచారించి తొల్లి కౌసల్యాతనయు చేతందనకునైన చరణ తాడన భంగంబు వైర కారణంబుగా గొని...." (భా.రా. అయోధ్యా - 10. పుట:78) రాముడు బాల్యములో చేసిన చరణతాడనమువైరకారణమని చెప్పడం జరిగింది.

వాలి వధానంతరము "సీత రామునకు లభించినను అనతికాలములోనే సీత భూప్రవేశము గావించి రామునకు వియోగ దు:ఖము కలిగించును" అని తార రాముని శపించడము అవాల్మీకము. (భా.రా. కిష్కింధా - 303. పుట:235)

ఇటువంటి అవాల్మీకాంశములు భాస్కర రామాయణములో పలు కథా సందర్భములలో మనం చూడవచ్చు.

2.3. వర్ణనలు :

భాస్కర రామాయణమంతయు వర్ణనలతో పరమ రమణీయంగా ఉంటుంది. ఈ వర్ణనలు తరువాత ప్రబంధ కవులకు మార్గదర్శకమయ్యాయి. కథాసందర్భోచిత, రసోచిత వర్ణనలు భాస్కర రామాయణమునకు వన్నె తెచ్చాయి.

మల్లికార్జున భట్టు సుందరకాండలో హనుమదాది వానరులు మధువనమున ప్రవేశించి చేసిన కోతి చేష్టలను స్వభావోక్తి అలంకారములతో హాస్యరసబంధురముగా వర్ణించినాడు.

ఒక్కని వీపుపై కుతికి యొక్కరుడుండగ వాని మూపుపై
నొక్కరు డెక్కవానితలనొక్కరు డెక్కగ నోలి దొంతులై
దిక్కుల నాడగానొకడు తీవ్రతవారల గూల దన్నగా
నొక్కడు వాని మూపులు మహోన్నతినెక్కుచు జీరుచుందగన్ (భా.రా. సుందర.539. పుట:349)

చిత్రకూట వర్ణన అద్భుతముగా ఉంది.

అటజని కాంచిరంత వసుధాధిపులారతి లోల కిన్నరీ
ఘటితగుహా కుటీ కనక కమ్రకవాటము సన్మణి ప్రభా
హటదురు శృంగ జూటము సమావృతమాల్యమతీ తరంగిణీ
తటతరు వాటమున్ బహుళ తాపస కూటము చిత్రకూటమున్ (భా.రా. అయోధ్యా.159.పుట:94)

2.4. నాటకీయత :

భాస్కర రామయణములో నాటకీయత ఉట్టిపడు ఘట్టములనేకములు కలవు. ఉదాహరణకు రావణ సుగ్రీవులు యుద్ధము చేయుచు పరస్పరము అధిక్షేపించుకొను ఘట్టమున గల నాటకీయతను పరికిద్దాం.

వంచన రాముదేవిగొని వచ్చిన యట్టుల గాదురోరి న
క్తంచర నన్ను నాహవముఖంబున డాయుటలన్న నయ్యరే
క్రించ సహోదరున్ గరము గీడ్పడి మానవు చేత బొంచి యే
యించుట గాదులే ననుజయించుట నీకు నటంచు నవ్వినన్ (భా.రా. యుద్ధ.483. పుట:399)

2.5. అలంకారములు :

కావ్యానికి శోభ కలిగించేవి అలంకారములు. భాస్కర రామాయణము చక్కటి శబ్ద, అర్థాలంకారములతో శోభాయమానంగా ఉంది.

యుద్ధకాండలోని ఈ ఉత్ప్రేక్షాలంకారాన్ని చూద్దాం.

జానకీ వియోగ సాగరమగ్నుడై
రామచంద్రుడుండగా మనోజ్ఞ
భంగినింకదగునె పద్మినీభోగమ
న్నట్లు గ్రుంకెనర్కుడపర జలధి (భా.రా.యుద్ధ.33.పుట:356)

శ్రీరాముడు సీతావియోగముతో దు:ఖించుచుండగా తాను పద్మినీ భోగమనుభవించుట తగదని సూర్యుడు పడమర దిక్కున అస్తమించాడట.

సుందరకాండలోని చంద్రోదయ వర్ణన సందర్భోచితంగా ఉంది.

పావనికి సీత వెదకం
గా విశ్వము గానిపింప ఘనతమ మడపన్
దేవతలెత్తిన దీపము
కైవడి చందురుడు వెలిగెగగన తలమునన్ (భా.రా.సుందర.89. పుట:302)

2.6. అనుకరణములు :

భాస్కర రామాయణములో అక్కడక్కడ తన పూర్వ, సమకాలీన సంస్కృ కవులను మరియు తెలుగు కవులైన నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, గోనబుద్ధారెడ్డి, తిక్కనలనుఅక్కడక్కడ అనుకరించిన పద్యములు లేకపోలేదు.

తిక్కన భారతోద్యోగ పర్వములో ద్రౌపది తన గొప్పదనము గురించి చెప్పే "వరమున బుట్టితిన్ ...." పద్యమువలె సీతాదేవి తన గురించి చెప్పుకొనే పద్యము ఇలా ఉంది.

అనయము ధాత్రికిన్ దనయనై యెలమిన్ మిథిలేశుడైన య
జ్జనకుడు పెంపగా బెరిగి సమ్మదమందగ నీకు పత్నినై
యినకులుడైన యా దశరథేశ్వరు కోడలినైన నాకు ని
ట్లనుచిత పాపకృత్యముల యందుల వేడ్కలు గల్గనేర్చునే (భా.రా.యుద్ధ.2345.పుట:615)

అనంతర కవులెందరో భాస్కర రామాయణములను అనుకరించినారు. ఉదాహరణకు

మందార భూజంబు మరగిన భృంగికి
　　బిచుమంద శాఖపై ప్రేమగలదె
లలిమానసంబున మెలగెడు హంసికి
　　వెలయు పల్వలముపై వేడ్కగలదె .... (భా.రా.యుద్ధ.2401.పుట:621)

ఇలాంటి పద్యము పోతన కవీశ్వరుని భాగవతమున సుప్రసిద్ధము.

మందార మకరంద మాధుర్యమునదేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలదూగు
రాయంచ సనునె తరంగిణులకు.... (శ్రీమహాభాగవతము.సప్తమ.150.పుట:23)

ఉపసంహారము :

ధర్మస్వరూపుడు, మర్యాదాపురుషోత్తముడైన శ్రీరాముని కథను మార్గ పద్ధతిలో, చంపూకావ్యముగా సంస్కృతపద బంధురముగా, వర్ణనాలంకారభూయిష్టముగా కావ్యశైలిలో రసోచితంగా రచింపబడిన భాస్కర రామాయణము నాటికీ నేటికీ తెలుగువారి తరగని సాహితీనిధి.

ఆధార గ్రంథాలు :

1. పోతన, బమ్మెర. 2015. శ్రీమహాభాగవతము, హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పదకొండవ ముద్రణ).
2. భాస్కరుడు, హుళక్కి. 1926. భాస్కర రామాయణము.
3. బుద్ధభూపతి, గోన. 2016. రంగనాథ రామాయణము. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
4. శ్రీనివాసరావు, గొట్టె. 2024. పోతన భాగవతం - అలంకార శిల్పం. హైదరాబాదు: శ్రీరాధాకృష్ణ ప్రచురణలు.
5. శ్రీహరి, రవ్వ. 1988. భాస్కర రామాయణము - విమర్శనాత్మక పరిశీలనము. హైదరాబాదు: రచయిత.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

3. మొల్ల రామాయణం - ఆదర్శదూత హనుమ

- డా॥. రాపోలు శ్రీనివాస్

అసోసియేట్ ప్రొఫెసర్, బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర), నారాయణగూడ, హైదరాబాద్.

ఉపోద్ఘాతం :

"మొల్ల రామాయణము మొల్లపువ్వంత పరిమాణము. మల్లెపువ్వంత పరిమళము" అన్నారు. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు. "సుగంధ సంవాసిత పుష్ప నామధారిణి ఐనందుకు మొల్ల సౌరభము వెదజల్లు చక్కని కవిత్వము చెప్పి ఆంధ్రసారస్వతమున శాశ్వతస్థానము సంపాదించినది" అన్నారు ఆచార్య కోవెల మలయవాసినిగారు. ఆతుకూరి మొల్లకు ముందు చాలామంది రామాయణాన్ని రచించినప్పటికీ తను రామాయణ కథాకావ్యాన్ని రచించడంవల్ల లక్షణ సంపాద్యం, పుణ్యస్థితి లభిస్తాయి కాబట్టి చెపుతున్నానంటుందొక పద్యంలో- 'అది రఘురాము చరితము / నాదరముగ విన్నఁ గ్రొత్తయై లక్షణ సం / పాదమ్మై పుణ్యస్థితి వేదమ్మై తోఁచకున్న వెఱ్ఱినె చెప్పన్ '(మొ.రా. అవతారిక -20) తాను రచించిన రామాయణమును నాటి రోజుల్లో అనేక కవులు చేయుచున్న విధముగా ధనము, కీర్తిని ఆశించక ఏ రాజులకూ అంకితము ఇవ్వలేదు. ఇది ఆమె యొక్క రామభక్తికి నిదర్శనము. మొల్ల రామాయణము ఆరు కాండములలో సుమారు 870 పద్యములతో కూడుకున్నది. అంతకు మునుపే పలువురు రామాయణమును గ్రంథస్థం చేసిన విషయమును ప్రస్తావించుచూ తన పద్యకావ్యములోని మొదటి పద్యములలో ఇట్లనినది. "రాజిత కీర్తియైన రఘురాము చరిత్రము మున్ గవీశ్వరుల్ / తేజ మెలర్ప చెప్పి రని తెల్సియు గ్రమ్మర జెప్పనే లనన్ / భూజన కల్పకం బనుచు, భుక్తికి ముక్తికి మూలమంచు, నా / రాజును దైవమైన రఘురాము నుతించిన దప్పు గల్గునే?"

తెలుగులో రామాయణం రచించిన ప్రథమ కవయిత్రిగా గుర్తింపు పొందింది. ఈమె రచించిన రామకథ 'మొల్ల రామాయణం'గా ప్రసిద్ధికెక్కింది. మొల్ల రామాయణం వాల్మీకి సంస్కృత రామాయణానికి అనువాదం కాదు. మొల్ల రామాయణం స్వతంత్రమైన సంక్షేపరచన. మొల్ల రామాయణం రాశిలో చిన్నదయినా వాసిలో ఎన్నదగింది. ఈ రామాయణంలో బాలకాండ నుండి అరణ్యకాండ చివరివరకు కథ పరుగులు పెడుతుంది. సుందరకాండ నుండి మొల్ల రామాయణం ఉన్నతమైన స్థాయినందుకుని పాఠకులను పరవశుల్ని చేస్తుంది.

మొల్లకు దేశీయమైన తెలుగు రచనపై మక్కువ ఎక్కువ. "క్రమ్మఱ ఘనమగు సంస్కృతము చెప్పగా రుచియగునే"

అని సామాన్య ప్రజానీకానికి పఠనయోగ్యంగా తను రామాయణ రచనకు శ్రీకారం చుట్టానని కావ్యాదిలో చెప్పింది. మొల్ల రామాయణం సరళసుందరంగా, సరసాలంకారాలతో, పాండిత్య స్ఫూర్తితో, ఔచిత్యరసపోషణతో నిండి ఉంటుంది. మొల్ల కందపద్య రచనలో అందెవేసిన చెయ్యి. ఈమె రామాయణంలోని కంద పద్యాలనన్నింటిని వరుసగా కూర్చితే "మొల్ల కంద రామాయణం" కాగలదని పరిశోధకులు ప్రశంసించారు. మొల్ల రామాయణం తెలుగు సాహితీ సరస్వతికి అమూల్య కంఠాభరణం.

కవయిత్రి మొల్ల :

మొల్ల నెల్లూరు సమీపంలోని గోపవరపు గ్రామ నివాసి. ఇంటిపేరు ఆతుకూరి. క్రీ.శ. 1581కి ముందు జీవించి ఉండేదని పరిశోధకుల అభిప్రాయం. మొల్ల ఏ విధమయిన సంప్రదాయ విద్యను అభ్యసించలేదు. తన సహజ పాండిత్యమునకు ఆ భగవంతుడే కారణమని మొల్ల చెప్పుకొనినది. ఈమె కుమ్మరి కుటుంబములో జన్మించింది. మొల్ల శ్రీ కృష్ణదేవరాయలు సమయములోనిదని ప్రశస్తి. మొల్ల శైలి చాలా సరళమైనది, రమణీయమైనది. జనసామాన్యంలో ప్రచారంలో ఉన్న కథలు మొల్ల, తెనాలిరామలింగడు సమకాలీకులని వెల్లడిస్తున్నాయి. ఈమె జనకుడు కేతనసెట్టి. ఈమె ఆజన్మ బ్రహ్మచారిణి అని చెప్పెదరు.

మొల్ల తాను శ్రీ కంఠ మల్లేశ్వరుని వరం చేతనే కవిత్వం నేర్చుకున్నానని స్వయంగా చెప్పింది. గోపవరంలో శ్రీరామాలయం ఉంది. తరతరాలుగా జనం చెప్పుకునే మొల్ల బండ ఉంది. గ్రామస్థులు ఈ బండకు పూజ చేసేవారు. శ్రీ కృష్ణదేవరాయలు ఈ గోపవరంలో బస చేసినట్లుగా స్థానికులు చెప్పుకొంటూ ఉంటారు. మొల్ల పూర్వీకులు ఆత్మకూరుకు చెంది ఉంటారనీ, అందుకే ఆతుకూరు ఇంటిపేరు అయిందనీ కొందరి అభిప్రాయం. కుమ్మరి కులానికి చెందిన మొల్ల ఈ ప్రాంతానికి చెందినదనడానికి గోపవరం దగ్గర కుమ్మరి కులాలవారు ఉన్నారు. మొల్ల నివసించిన ఇల్లుగా గోపవరంలో పాడుబడిన ఇల్లు ఉంది. పెద్దన, తెనాలి రామలింగడు కూడా గోపవరం వచ్చి మహా భక్తురాలైన కవయిత్రి మొల్ల గారిని దర్శించినట్లు ఆమెపై చేసిన దూషణను మన్నించవలసినదిగా ప్రాధేయపడ్డారు.

మొల్ల స్వంతంత్ర భావాలు కలిగి ఉండేదని, చిన్న తనములోనే తల్లిని కోల్పోగా తండ్రి కేసన శెట్టి గారు ఈమెను గారాబముగా పెంచినట్లు తెలుస్తున్నది. ఈమెకు తండ్రి అంటే అమిత ఇష్టము. చివరి దాకా తండ్రి యొక్క ఇంటి పేరునే ఉపయోగించడము మూలాన మొల్ల పెళ్ళి చేసుకోలేదని అనుకోవచ్చు. ఈ కావ్యమును మొల్ల కేవలము ఐదు రోజులలో రాసినదని ప్రతీతి. మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధముగా వాడుక భాషకు దగ్గరగా ఉంది.

తనకు శాస్త్రీయమైన కవిత్వజ్ఞానం లేదనీ, భగవద్దత్తమైన వరప్రసాదంవల్లనే కవిత్వం చెబుతున్నాననీ ఆమె అన్నది. కాని ఆమె అనేక సంస్కృత, తెలుగు పూర్వకవులను స్తుతించిన విధం చూస్తే ఆమెకు వారి రచనలతో గణనీయమైన పరిచయం ఉండిఉండాలని తెలుస్తుంది. తనకు పాండిత్యం లేదని మొల్ల వ్రాసినది. సంస్కృతిలో భాగమైన అణకువ, విధేయత వంటి లక్షణాల కారణంగానే తప్ప వేరే కాదని స్త్రీ రచయిత్రుల చరిత్ర వ్రాసిన నిడదవోలు మాలతి భావించారు. గ్రంధావతారికను బట్టి ఈమె తక్కిన కవయిత్రులవలె గురువునొద్ద విద్యనభ్యసించలేదని, గోపరపు శ్రీకంఠ మల్లేశు కృపను కవిత్వమును చెప్పనేర్చినదనియు తెలియుచున్నది. ఈమె కావ్యలక్షణాలు మొదలగునవి ఏమియు తెలియకపోయినను నన్నయ తిక్కనాది కవుల గ్రంథములను మాత్రము క్షుణ్ణముగా చదివినదని ఈమె పద్యముల తీరు నడకలను బట్టి చెప్పవచ్చును. ఈమెపై పోతన కవితా ప్రభావము ఎక్కువగా ఉంది.

హనుమంతుడు :

రామాయణంలో రాముడి తర్వాత అంతటి ఉన్నత స్థానాన్ని అందుకున్న భక్తాగ్రేసరుడు హనుమంతుడు.

కిష్కంధకాండలో హనుమ ప్రత్యక్షమవుతాడు. సుందరకాండలో తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. ఆపై యుద్ధకాండ ముగిసేవరకు, అంటే శ్రీరామ పట్టాభిషేకం పూర్తయ్యేవరకు హనుమ కీలక పాత్ర పోషించాడు. భక్తుడిగా పరిచయమై, రామకార్యాన్ని పూర్తిచేసి భగవంతుడిగా పూజలందుకున్నాడు. కార్యసాధనకు మారుపేరు ఆంజనేయుడు. సముద్రాన్ని లంఘించడం నుంచి లంకాపురి చేరేవరకు ప్రధానంగా నాలుగు లక్షణాల్ని హనుమ ప్రదర్శిస్తాడు. అవి ధైర్యం, దృష్టి, సుమతి, సామర్థ్యం. లక్ష్య సిద్ధికోసం చిత్తశుద్ధితో పనిని జయప్రదంగా చక్కబెట్టడం ఎలాగో హనుమంతుని నుంచి నేర్చుకోవాలి. రామాయణంలో ఆంజనేయుడు నిర్వహించిన ప్రతి అంశం నుంచి మనం వర్తమాన జీవితానికి ఉపయోగపడే సందేశాల్ని అందుకోవచ్చు.

పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి హనుమంతుడు ప్రతీక. నేటి యువతరానికి సదా అనుసరణీయం, ఆచరణీయం. సుగ్రీవుడికి మంత్రిగా మాత్రమే హనుమ సీతాన్వేషణలో ముఖ్యపాత్ర పోషించాడు. గొప్పతనం చేసే పనిలోకాక, ఆ పనిని ఎంత సమర్థవంతంగా చేస్తున్నామనే దానిలోనే ఉంటుందని చాటి చెప్పాడు. వ్యవహారదక్షతకు హనుమ మారుపేరు. ఎవరితో ఎప్పుడు, ఎలా మాట్లాడాలో మనకు మార్గనిర్దేశనం చేశాడు. చేపట్టిన పనిలో తోటివారందరినీ తనతోపాటు కలుపుకొని పోవడమెలాగో సూచించాడు. తన క్షేమం కోసంకాక, సంక్షేమం కోసం ఎలా పాటుపడాలో వివరించాడు. ఇచ్చిన మాటను ఎట్టి పరిస్థితుల్లోనైనా నిలుపుకోవడానికి ఎలా కృషి చేయాలో హనుమ దారిచూపాడు. తనను నమ్ముకున్న రాముడికి సీత జాడను తెలిపి, లక్ష్మణుడి ప్రాణాల్ని నిలిపి రాముడికి ఆనందాన్ని పంచాడు. విజయానికి దగ్గరదారి ధైర్యంతో శ్రమించడమేనని పేర్కొన్నాడు. కపిశ్రేష్ఠుడైనప్పటికీ సుగ్రీవుడి మంత్రిగా, రాముడి బంటుగా, జాంబవంతాది పెద్దలందరికి సేవకుడిగా వారిపట్ల వినయాన్ని ప్రదర్శించాడు. గర్వరహితంగా మసలుకున్నాడు. హనుమ అనుసరించి చూపిన బాట మన జీవితాలకు వెలుగు బావుటా. ఆ దారిలో ముందుకు సాగడమే అసలైన ఆంజనేయ ఆరాధన.

మొల్ల రామాయణంలో హనుమ :

రామదూత హనుమ ప్రియభాషి. తన మాటల ద్వారా ఎదుటివారికి సంతోషాన్ని కలిగిస్తాడు. ఎదుటివారిలోని విచారాన్ని, దుఃఖాన్ని తొలగిస్తాడు. ఎలా మాట్లాడాలో బాగా తెలిసినవాడు. ఆకట్టుకునే విధంగా అతని సంభాషణ ఉంటుంది. హనుమంతుడు వాక్య కోవిదుడు. హనుమంతుని మాటలు విని శ్రీరామచంద్రుడే ఆశ్చర్యపోతాడు. హనుమంతుని మాటలను విన్న శ్రీరాముడు లక్ష్మణునితో ఇలా అంటాడు. "ఇతని మాటలను బట్టి ఈ వ్యక్తి వేదవేదాంగాలను క్షుణ్ణంగా చదివాడని తెలుస్తుంది. ఇతని మాటల్లో ఎక్కడా అపశబ్దంగానీ, నాన్చినాన్చి సాగదీయడంగానీ లేదు. అలాగనీ అతిక్లుప్తత, అస్పష్టతా లేదు. అనవసరాలు, అప్రస్తుతాలు లేవు. ఇలా మాట్లాడితే శత్రువైనా లొంగిపోవాల్సిందే. ఇటువంటి వానిని మంత్రిగా, దూతగా పొందిన పాలకుడు భాగ్యవంతుడు" అని హనుమంతుని కొనియాడాడు.

ఉన్నాడు లెస్స రాఘవుఁ
డున్నాఁడిదె కపులఁగూడి యురుగతి రానై
యున్నాఁడు నిన్నుఁ గొనిపో
నున్నాఁడిది నిజము నమ్ము మూర్వీతనయా!

శ్రీరామచంద్రుడు బాగున్నాడు. నిన్ను లంక నుండి తీసికెళ్లడానికి వానరసైన్యంతో కూడి తొందరగా ఇక్కడికి వస్తాడు. నేను నిజం చెబుతున్నాను. నన్ను నమ్ము సీతమ్మ తల్లీ అంటాడు హనుమ. ఈ మాటలు చెప్పిన తీరు వినే సీతకు సంతోషాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయి. లంకలో రాక్షసుల మధ్య బాధపడుతూ రామున్నే తలస్తూ అతని

రాకకొరకు ఎదురు చూస్తున్న సీతకు ఈ మాటలు సంతోషాన్ని కలిగిస్తూ, ఎంతో ఊరట నిస్తూ, ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపే విధంగా, సీత దుఃఖాన్ని తొలగించే విధంగా ఉన్నాయి.

అంగనఁ బొడఁగన నీ వి
య్యంగను గడుఁజాలు వాఁడ వంచును నాచే
నుంగరమంపెను శ్రీరఘు
పుంగవుఁ డిదెకొమ్మటంచు భూమిజ కిచ్చెన్.

'మాల్యవంత పర్వతము వద్దనున్న రాముడు కపిసైన్యాన్ని అన్ని దిక్కులకు పంపుతూ దక్షిణవైపునకు మమ్ములను కొందరిని పంపాడు. అందులో మీ జాడను తెలుసుకొన సమర్థుడను నేనేనని భావించి శ్రీరామచంద్రుడు తన ఉంగరాన్ని మీకివ్వమని నాకు ఇచ్చాడు. దీనిని స్వీకరింపుము తల్లీ!' అని హనుమంతుడా సీతకు ఉంగరాన్ని ఇచ్చాడు. శ్రీరామునికి హనుమంతుని సామర్థ్యంపై అపార విశ్వాసం. అందుకే హనుమంతునికి మాత్రమే తన ఉంగరాన్ని ఇచ్చాడు. శ్రీరాముని విశ్వాసాన్ని చూరగొన్న రామదూత హనుమ. హనుమ తన సంభాషణా శైలి, వినయంతో రాముని విశ్వాసాన్ని చూరగొన్నాడు. రామునిపై అపారమైన భక్తి గలవాడు. రామకార్యం కొరకు సర్వం త్యాగం చేయగలడు. సముద్రం దాటి లంకకు చేరే సామర్థ్యం హనుమంతునికి మాత్రమే ఉంది. ఇతడు మాత్రమే లంక లోకి ప్రవేశించి రహస్యంగా సీతజాడను కనుగొనగలడని రాముని నమ్మకం. తన శరీరాన్ని సూక్ష్మరూపంగా మార్చగలడు వాయుపుత్రుడు. కావున ఎక్కడికైనా చేరుకోగలడు, దేన్నైనా సాధించగలడు. శక్తి, భక్తి, మేధ, దౌత్యం, విశ్వాస యోగ్యత ఈ ఐదు గుణాల సమ్మేళనం హనుమంతునిలో ఉండడం వల్లే శ్రీరామచంద్రుడు తన ముద్రికను హనుమంతుని కిచ్చాడు. అందుకే హనుమంతుడు రామహృదయాన్ని అర్థం చేసుకుని రామదూతగా ప్రసిద్ధి చెందాడు.

ఉరుతరాటవిలోన మహోగ్ర తపము
వాయుదేవుని గుఱియించి వరుసఁజేసి
యంజనాదేవి గనియె నన్నర్థి తోడ
నర్కజుని మంత్రి హనుమంతుఁడండ్రు నన్ను.

లంకలో సీతను చూసిన హనుమంతుడు తనను గూర్చి చెబుతూ భయంకరమైన అడవిలో తన తల్లి యంజనాదేవి వాయుదేవుని గూర్చి మహోగ్రతపము చేసి తనకు జన్మనిచ్చిందనీ, సుగ్రీవుని మంత్రిననీ, తనను హనుమంతుడని పిలుస్తారనీ నిగర్వంగా చెప్పుకుంటాడు. ఈ మాటలలో హనుమంతుని అణకువ, వినమ్రత, సంభాషణా నైపుణ్యం వ్యక్తం అవుతున్నాయి. అతని మాటలు, చెప్పే విధానం సీతాదేవి భయాన్ని పోగొట్టే విధంగా ఉండడమే కాకుండా హనుమంతునిపై నమ్మకాన్ని కలిగించేవిగా ఉంటాయి. హనుమంతుడు తనను రామదూతగా, సీతమ్మలో విశ్వాసాన్ని నింపగలవానిగా, భక్తునిగా పరిచయం చేసుకుంటాడు. ఈ పరిచయం సీత భయాన్ని పోగొట్టే విధంగా ఉంటుంది.

ఇనుఁడుదయింపక మున్నే
వననిధి లంఘించి మనుజవల్లభుకడకున్
నినుఁగొనిపోయెదఁ వీఁపున
జననీ కూర్చుండు మనిన సంతోషమునన్

'సూర్యోదయానికి ముందే నిన్ను రాముని వద్దకు చేరుస్తాను, నా వీపున కూర్చుండుము తల్లీ' అని హనుమ కోరగా సీత సంతోషించి, 'నీవు అంతటి సమర్థుడవే కానీ నీ వెంట వచ్చినట్లయితే జనులు రావణుని కంటే రాముడే పెద్ద దోషి'యని నిందిస్తారని అంటుంది. హనుమంతుడు తన శక్తిపై అమితమైన నమ్మకంతో పలకడం అతని ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతుంది. ఈ మాటలు హనుమంతుని భక్తి, సేవాభావం, కర్తవ్యనిష్ఠకు నిదర్శనం.

ముగింపు :

హనుమంతుడు సీతా రాముల దాసునిగా, రామభక్తునిగా, విజయ ప్రదాతగా, రక్షకునిగా హిందూధర్మంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే దేవుడిగా కనిపిస్తాడు. హనుమంతుడు ఎంత బలవంతుడో, అంతటి వినయ సంపన్నుడు. హనుమంతుడు సమస్త శాస్త్ర కోవిదుడు, ఉత్తమ దూత, వ్యవహారవేత్త మరియు అసమాన కార్యదక్షుడు. ఇది మనకు కిష్కింధకాండ, సుందరకాండలలో స్పష్టంగా తెలుస్తుంది. దూతగా హనుమంతుడు సుందరకాండలో కనబరచిన కుశలత, వాక్చాతుర్యం మనకు ఆదర్శం. యుక్త వయసులో ఉన్నవారికి వాక్పటిమ ఎంతో ముఖ్యం. వృత్తిలో, సమాజంలో వాక్పటిమ కలిగిన వారిని ప్రజలు అనుసరిస్తారు. హనుమంతుని ఆరాధన వల్ల వాక్శక్తి పుష్కలంగా కలుగుతుంది. స్వయంగా శ్రీరామచంద్రుడే వేనోళ్ల హనుమంతుని శుభలక్షణాలను లక్ష్మణునికి వర్ణిస్తాడు. కావున హనుమంతుడు ఆదర్శదూత అని చెప్పడం సమంజసం.

ఉపయుక్త గ్రంథసూచి :

1. దొరస్వామిశర్మ రావురి : 1972, తెలుగు సాహిత్యము-రామకథ, త్రివేణీ పబ్లిషర్స్, మద్రాసు.
2. ఆతుకూరి మొల్ల: మే, 1971, మొల్ల రామాయణం, ఎం. శేషాచలం అండ్ కో, సికిందరాబాద్.
3. మలయవాసిని కోలవెన్ను : 2015, మొల్ల సాహితీ సౌరభం, శ్రీ ప్రభాసాంబ సాహితీ పీఠం, విశాఖపట్టణం.
4. మొల్ల ఆతుకూరి : 1987, మొల్ల రామాయణము, బాల సరస్వతీ బుక్ డిపో, మద్రాసు.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

4. నిర్వచనోత్తర రామాయణము – తిక్కన కవితాలక్షణములు

– డా॥. నందవరం మృదుల

అసోసియేట్ ప్రొఫెసర్-తెలుగుశాఖాధ్యక్షులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్), బేగంపేట, హైదరాబాద్.

ఉపోద్ఘాతం :

మహాకవులందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమ కవితాశైలిని రచనలో తప్పక ప్రస్తావిస్తూ ఉంటారు. ప్రాచీన కవులు నన్నయ మొదలుకొని, ఆధునిక కవితకు బాటలు వేసిన శ్రీశ్రీ, తిలక్, కుందుర్తి మొదలైనవారు; వారి బాటను అనుసరిస్తున్న నేటి కవులందరూ తమ కవితారీతిని తమ కవిత్వంలో తెలియజేస్తుంటారు. ఈ రీతిని మనం అర్థం చేసుకుంటే ఆ కవి రచనలోని కావ్యాత్మనూ, గ్రహించవలసిన పరమార్థాన్ని అందుకుంటాము. అప్పుడు ఆ కావ్యము యొక్క ప్రయోజనం నెరవేరుతుంది.

కావ్యరచనపై 'ప్రత్యేకదృష్టి' పెట్టిన తిక్కన, తన తొలిరచన 'నిర్వచనోత్తర రామాయణం'లో తన కవితాదృష్టిని విపులంగా తెలుపుతాడు. క్రీ.శ.1వ శతాబ్దిలో వెలువడిన తొలిలక్షణ గ్రంథం భరతముని నాట్యశాస్త్రం. ఇది మొదలుకొని 19వ శతాబ్ది వరకు దాదాపు వంద అలంకార శాస్త్ర గ్రంథాలున్నట్లు పండితుల అభిప్రాయం. (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 1981. కావ్యాదర్శం-పీఠిక. పుటలు:12-29). తిక్కన కాలం నాటికే ప్రామాణికమైన అలంకారశాస్త్ర గ్రంథాలు వెలువడి తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసాయి. క్రీ.శ. 9వ శతాబ్దికి చెందిన ఆనందవర్ధనుడు 'ధ్వన్యాలోకం' రచించి భరతుడు తెలిపిన రూపక రసాలను శ్రవ్య కావ్యానికి అన్వయింపచేశాడు. 11వ శతాబ్దిలో అభినవగుప్తుడు భరతుని నాట్యశాస్త్రానికి 'అభినయ భారతి' అనే పేరుతోనూ, ఆనందవర్ధనుడు రచించిన ధ్వన్యాలోకానికి 'లోచనం' అనే పేరుతోనూ వ్యాఖ్యానాలు రచించి దృశ్య, శ్రవ్యకావ్యశాస్త్రాలకు ఒక సమన్వయం తీసుకొచ్చాడు. ఇంతటి సాంస్కృతిక పరిణతి సాధించిన స్థితిలో నన్నయ భారత రచనకుపక్రమించాడు. ఆ తరువాత వచ్చిన తిక్కన-దృశ్య శ్రవ్య కావ్యలక్షణాలను సమన్వయిస్తూ కావ్యరచన చేశాడు. ఈ శైలికి నిర్వచనోత్తర రామాయణాన్ని తొలి వేదికగా చేసుకున్నాడు.

1. నిర్వచనోత్తర రామాయణం :

మనుమసిద్ధి రాజ్యం ఏర్పడి స్థిమితపడిన తొలినాళ్ళలో తిక్కన రచించిన కావ్యము ఇది. (సుబ్రహ్మణ్యం, జి.వి.: 2011, శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము; పీఠిక:8)

"అంబర శశి శాకా
బ్దంబులు చనఁగాళయుక్తి భాద్రపదపు మా
సంబున నంబరమణి బిం
బంబనదగు తిక్క యజ్వ బ్రహ్మము జేరెన్!

అన్న లెక్కను తిక్కన నిర్యాణం క్రీ.శ.1288 అని తేలుచున్నది. అనగా తిక్కనగారి కాలం క్రీ.శ.1210-88 అన్నమాట. నిర్వచనోత్తర రామాయణ రచన సుమారు క్రీ.శ. 1250-58 ప్రాంతం" (చంద్రమౌళిశాస్త్రి, బెల్లంకొండ. 1967. దశకుమార చరిత్ర. కేతన. పీఠిక. పుట.7) 1281 పద్యాలను కూర్చి పది ఆశ్వాసాలలో నిర్వచనోత్తర రామాయణాన్ని రచించాడు తిక్కన.

ప్రథమాశ్వాస ప్రారంభంలో తిక్కన, తన కావ్యశరరీరాన్ని ప్రస్తావిస్తూ శబ్దార్థాలు, పద ప్రయోగాలు, ఛందస్సు, కావ్యేతివృత్తము మొదలైన వాటి గురించి స్పష్టంగా వ్యక్తీకరించాడు. తిక్కన తన కావ్యలక్షణాల ప్రస్తావనలో ప్రధానంగా రెండు అలంకారశాస్త్ర గ్రంథాలను ఆధారం చేసుకున్నట్లు భావించవచ్చు.

1.1. కావ్యాదర్శము

1.2. ప్రతాపరుద్ర యశోభూషణము

1.1. కావ్యాదర్శము :

తిక్కనకు దండిపట్ల ప్రత్యేకాభిమానము. అందుకు మొదటి ఆధారం దండి రచించిన 'దశకుమారచరిత్ర' అనే గద్య కావ్యాన్ని కేతన చేత పద్యకావ్యంగా రచింపచేసి ఆ కథాకావ్యాన్ని స్వీకరించడం. ఇందుకు ఉపబలకంగా ఈ వాక్యాలను గుర్తించవచ్చు. "కేతనార్యుని నన్ను విఖ్యాత యశుని అత్యాదరంబున రావించి యాసనార్ఘ్యపాద్య తాంబూలాంబరాభరణ దానాద్యుపచారమ్ముల బరితుష్ట హృదయుంజేసి సంస్కృతాద్యనేక భాషా కావ్యరచనా విశారదుండవగుట జగత్ప్రసిద్ధంబుగావున నొక్క కావ్యంబు రచియించి నన్ను గృతి పతిం జేయవలయునని సగౌరవంబుగా బ్రార్థించిన నేనును మదీయ కావ్యకన్యకకుం దగువరుండగుట అతని మనోరథంబు సఫలంబు గావింపం దలచి-

గద్యమ్మును బద్యముంచెర యనంచిత భావరసోదయాభి రా
మమ్మగునట్లుగా దశకుమారచరిత్రము సెప్పబూనితిన్ (దశ.-×. 23, 24, 25)

అని కేతన తన రచనకు పూర్వాపరాలు తెలిపాడు. తిక్కన కోరిక మేరకు కావ్యరచన చేసినట్లు, అందునా లోకజ్ఞుడైన తిక్కన కృతిపతి గారికి సంతృప్తి కలిగించాలంటే లౌకిక కథాసంపన్నమైన ఇతివృత్తాన్ని చేకొనాలి. పద్యరచననూ చెయ్యాలి అని కేవల కల్పనాకథ రచిస్తే సమాజం ఆదరించదు. కనుకనూ అప్పటికి (ఇప్పటికిన్నీ) అనువాదాల మోజు ఎక్కువగా ఉన్నందుననూ........ వచనమని ఎవ్వరూ అనువదించటానికి పోని దశకుమార చరితాన్ని చంపువుగా వ్రాసి తాను, తృప్తిపడ్డాడు. మహాకవిని సంతృప్తిపరిచాడు" (చంద్రమౌళిశాస్త్రి, బెల్లంకొండ. 1968. దశకుమారచరిత్ర. కేతన. పీఠిక. పుట.4)

ఈ వాక్యాలు తిక్కన తాను అంకితంగా తీసుకోదలచిన కావ్యానికి కూడా కొన్ని ఉదాత్త లక్షణాలు ఉండాలని భావించినట్లు తెలుస్తుంది. తిక్కనకు దండిపై ప్రత్యేకాభిమానం ఉన్నట్లుగా తెలిపే మరొక ఆధారం నిర్వచనోత్తర రామాయణంలో ఆయన పేర్కొన్న కావ్యలక్షణాలు కావ్యాదర్శాన్ని తలపించటం.

1.2. ప్రతాపరుద్రయశోభూషణము :

తిక్కన కాలానికి బహుళ ప్రాచుర్యంలో ఉన్న కావ్యలక్షణాలను తెలియజేసే ప్రసిద్ధ లక్షణ గ్రంథం - విద్యానాథుని

(క్రీ.శ. 1268-1328) ప్రతాపరుద్ర యశోభూషణం. దక్షిణదేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం గల ఉత్తమ గ్రంథం ఇది. రూపకాలను గూర్చి కూడా చర్చించటం ఈ గ్రంథంలోని వైశిష్ట్యం" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 1981). కావ్యాదర్శం ఇచ్చిన కావ్యశరీర ప్రాధాన్యం, ప్రతాపరుద్రయశోభూషణం ఇచ్చిన కావ్యాత్మ ప్రాధాన్యం - ఈ రెండూ నిర్వచనోత్తర రామాయణంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

2. కావ్యలక్షణాలు :

భరతుని (క్రీ.శ. 1వ శతాబ్ది) నాట్యశాస్త్రం, జాయపసేనాని నృత్తరత్నావళి (క్రీ.శ. 13వ శతాబ్ది) తిక్కన రచనలపై వేసిన ప్రభావాన్ని ఆయన రచనలనుండి వేరు చేసి చూడలేము ఈ నేపథ్యంతో నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన అనుసరించిన కావ్యలక్షణాలను పరిశీలించినట్లయితే- ప్రధానంగా మూడు అంశాలు కనిపిస్తాయి.

2.1. నాంది

2.2. ఇష్టదేవతా ప్రార్థన

2.3. కావ్యావతారిక

2.1. నాంది :

కావ్యాదర్శంలో దండి మహాశయుడు చతుర్ముఖ ముఖామ్భోజ కలహంస వధూర్మమ మానసే రమతాం 'నిత్యం' సర్వశుక్లా సరస్వతీ (I.1) అని గ్రంథం నిర్విఘ్నంగా పరిసమాప్తి కావడానికి సరస్వతీదేవిని ప్రార్థించాడు. కావ్యాలంకార సంగ్రహంలో కృతిపతి క్షేమాన్ని కోరినట్లే నిర్వచనోత్తర రామాయణంలోనూ తిక్కన, కృతిపతి మనుమసిద్ధి రాజ్యక్షేమాన్ని ఆశిస్తూ....

శా॥. శ్రీరాస్తాం మనుమ క్షితీశ్వర భుజాస్తమ్భే జగన్మణ్డల
ప్రాసాద స్థిర భాజి దధతీససా, సాలభఞ్జిశ్రియం
శుణ్డాలోత్తమ గణ్డభిత్తిషు మదవ్యాసవశ్యాత్మనాం

అని మంగళశ్లోకాన్ని రచించాడు. నాట్యశాస్త్రం కూడా కావ్యాన్ని మంగళ వచనాలతోనే ప్రారంభించాలని చెబుతుంది.

2.2. ఇష్టదేవతా ప్రార్థన :

"ఆదౌ నమస్క్రియా శీర్వావస్తు నిర్దేశ ఏవవా
క్వచిన్నిందాఖలాదీనాం సతాం చ గుణకీర్తనం
..... సర్గాన్తే భావి సర్గస్య కథాయా భవేత్"

"కావ్యారంభమున నిష్టదేవతా నమస్కారము గానీ ఆశీర్వాదముగానీ వస్తు నిర్దేశముగానీ యుండవలెను. ఏ కవుల గ్రంథములను జదివి, తాము విజ్ఞానమార్జించిరో వారి యెడల గృతజ్ఞతను జూపుట ధర్మము గదా! అదియే సుకవిస్తుతి. సర్గాంతమున భావి సర్గ కథాసూచన యుండవలెను" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 1987. కావ్యాలంకార సంగ్రహం. పుట.244) అని లక్షణకర్తలు, వ్యాఖ్యాతల అభిప్రాయం". కావ్యాలంకార సంగ్రహం (ప్రతాపరుద్రయశోభూషణం)లో ముగురమ్మలను విద్యానాథుడు కీర్తిస్తే (I-2,3,4,5 పద్యాలు) నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన త్రిమూర్తులను స్మరించాడు.

చం. హరిహర పద్మగర్భులను నాది కవీంద్రుల నూత్న సత్కవీ
శ్వరులను భక్తి గొల్చి తగవారి కృపం గవితా విలాస వి
స్తర మహనీయుడైన నను సర్వగుణోత్తరమూర్తి మన్మభూ
వరుడు దగంగరా బనిచి వారని మన్నన నాదరించుచున్

తిక్కన త్రిమూర్తులను, కవీశ్వరులను స్తుతించి, వాల్మీకి వ్యాస కవీంద్రులను, కొత్తగా కావ్యనిర్మాణం చేపట్టిన కవులను ప్రార్థించి, వారి కృపవలన తాను కవితావిద్యను పొందినట్లు, అటువంటి తనను మనుమసిద్ధి ప్రేమతో ఆదరించినట్లు తెలిపాడు.

2.3. కావ్యావతారిక :

కావ్యావతారికలో తిక్కన, ఏడు ప్రధానాంశాలను ప్రస్తావించాడు.

2.3.1. పదప్రయోగం

2.3.2. ఛందస్సు

2.3.3. ఉభయ కావ్య ప్రౌఢత్వం

2.3.4. కావ్యేతివృత్తం

2.3.5. కావ్యనాయకుడు

2.3.6. కావ్యప్రామాణికం

2.3.7. కావ్యాంకితం

ఉ॥. భూరివివేకచిత్తులకు బోలు ననం దలపన్ దళంబులన్
సౌరభ మిచ్చు గంధవహు చందమునం బ్రకటంబుచేసి నిం
పారెడు పల్కులం బడయ నప్పలుకుల్సరిగ్రుచ్చునట్లుగా
జేరుప నేర గావలయు జేసెదనే గృతి యన్న వారికిన్

గాలికి పూలపరిమళం అబ్బినట్లుగా, పలుకులకు ఇంపైన భావం అమరాలని, ఇటువంటి పలుకులతో కూర్చిన కావ్యమే పండితుల ప్రశంసలు అందుకుంటుందని తిక్కన అభిప్రాయం. అటువంటి కావ్యాన్నే రచించబోతున్నట్లు ధ్వనింపజేశాడు. తన పద ప్రయోగం యొక్క లక్షణాలను విపులీకరిస్తాడు. ఎటువంటి పదాలు పఠితలకు ఆనందాన్నిస్తాయో కావ్యాన్ని మేలుగా తీర్చిదిద్దుతాయో తిక్కన చెబుతాడు.

2.3.1.1. రస నిర్భర పద ప్రయోగం

2.3.1.2. సరసమధుర వచన పద ప్రయోగం

2.3.1.3. లలిత పద ప్రయోగం

2.3.1.4. అచ్చతెనుగు పద ప్రయోగం

2.3.1.5. వ్యాకరణబద్ధ పద ప్రయోగం

2.3.1.1. రస నిర్భర పద ప్రయోగం :

రసవంతములైన పదాలే కావ్యార్థాన్నీ కావ్యరసాన్నీ పఠితలకు అందిస్తాయని, అందుకే వాటిని తన రచనలో సమకూరుస్తానని అంటాడు.

చ. పలుకుల పొందులేక రసభంగము సేయుచు బ్రాతవడ్డ మా
టల దమ నేర్పు చూపి యొకటన్ హృదయంబలరింపలేక యే
పొలమును గాని యట్టి క్రమముం దమ మెచ్చుగ లోకమెల్ల న
వ్వుల బొరయం జరించు కుకవుల్ ధర దుర్విటులట్ల చూడగాన్

రసభంగము కలిగిస్తూ, పొంతనలేని మాటలతో, పాతపడిన పదాలతో కావ్యాన్ని కూర్చేవారు కుకవులనీ వారు పఠితల హృదయాలను అలరించలేరని - తిక్కన తేల్చి చెప్పాడు. రసభంగము కలిగించే వారే కుకవులని పరోక్షంగా కుకవి నింద కూడా చేసాడు.

2.3.1.2. సరసమధుర వచన పద ప్రయోగం :

కం. అని సత్కవీంద్ర మార్గము
మనమున నెలకొల్ప సరస మధురవచో గుం
ఫన సుప్రసాద సంబో
ధన గోచర బహు విధార్థ తాత్పర్యముగాన్

సరసము, మధురము అయిన పదాలతోనూ, ప్రసాద గుణముతోనూ సుకవులు కావ్యరచన చేస్తారని తిక్కన పై పద్యము ద్వారా తెలుపుతున్నాడు. అటువంటి కావ్యమార్గాన్నే తానూ అనుసరిస్తూ నిర్వచనోత్తర రామాయణ రచనకు పూనుకుంటున్నానన్నాడు.

2.3.1.3. లలిత పద ప్రయోగం :

కం. లలిత పద హృద్యపద్యం
బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై
యలతి యలతి తునియల గా
హల సంధించిన విధంబు నమరగ జేతున్

సుకుమారమైన పదాలతో కూర్చిన పద్యాలే హృద్యంగా ఉంటాయని, చిన్నచిన్న పదాలతో కూర్చిన కావ్యం, కాహల సంధించినట్లుగా ఉంటుందన్నది తిక్కన అభిప్రాయం. అటువంటి కావ్యాన్నే తాను రచిస్తున్నట్లు తిక్కన సూచిస్తున్నాడు.

2.3.1.4. అచ్చతెనుగు పద ప్రయోగం :

తిక్కన తన కావ్యరచనలో అచ్చతెనుగు రచనకే ప్రథమ ప్రాధాన్యమిచ్చాడు. జాత్యముగామి నొప్పయిన సంస్కృత మయ్యెడ జొన్ప...' (ని.ఉ.రా.I.14) రచనలో సంస్కృతం అవసరమైనా తెలుగు భాషకు ఒప్పనప్పుడు ఆ భాషా పదాల్ని చేర్చనన్నాడు.

2.3.1.5. వ్యాకరణ బద్ధ పద ప్రయోగం :

తిక్కన వ్యాకరణ విరుద్ధమైన ప్రయోగాన్ని అంగీకరించడు. నిర్వచనోత్తర రామాయణంలో-

కం. అలవడ సంస్కృత శబ్దము
తెలుగుబడి విశేషణంబు తేటపడంగా
బలుకు నెడ లింగ వచనం
బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్

కావ్యంలో సంస్కృత శబ్దానికి తెలుగు విశేషణం చేరికలోనూ, లింగవచనాల ప్రయోగంలోనూ దోషము లేనప్పుడే బుధజనులు మెచ్చుకుంటారని తిక్కన స్పష్టం చేశాడు. ఈ పద్యం ద్వారా కవులు, సాధారణంగా చేసే పొరబాట్లను తిక్కన ఎత్తిచూపి, దోషరహితంగా కావ్యం ఉండాలని తెలిపాడు.

2.3.2. ఛందస్సు :

తిక్కనకు పూర్వం, ఆదికవి నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం చంపూ కావ్యంగా రూపుదిద్దుకుంది. శివకవుల యుగంలో ప్రత్యేక ఛందస్సులతో (ద్విపద, రగడ, సీసము మొదలైన వాటితో) కూడిన - బసవ పురాణం, బసవ రగడ, చెన్నమల్లు సీసములు నిర్మించబడ్డాయి. ఈ నేపథ్యంలో వచ్చిన నిర్వచనోత్తర రామాయణం, వచన రహితంగా, పూర్తి ఛందోబద్ధమైన పద్యకావ్యంగా వెలువడింది. అంటే తిక్కనకు ఛందస్సు మీద ఉన్న ప్రత్యేకాభిమానం వ్యక్తమవుతుంది. ఈ ఛందోభిమానంతోనే 'కవిసార్వభౌమ ఛందస్సు' అనే గ్రంథం కూడా రచించాడని ప్రతీతి. (శేషయ్య, చాగంటి. ఆంధ్ర కవి తరంగిణి. సంపు.2. పుట.185) నిర్వచనోత్తర రామాయణంలో ఛందోపరంగా రెండు విషయాలను ప్రత్యేకంగా వ్యక్తీకరించాడు.

2.3.2.1. యతిప్రాసల ప్రాధాన్యం :

2.3.2.2. గద్యరహితం

2.3.2.1 యతిప్రాసల ప్రాధాన్యం :

తిక్కన తన కావ్యంలో యతిప్రాసలకు ప్రాధాన్యాన్నిస్తూ రచించిన పద్యం-

కం. తెలుగు కవిత్వము చెప్పం
దలచిన కవి యర్థమునకు దగి యుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బులిమి పుచ్చుట చదురే

తెలుగులో కవిత్వం చెప్పదలచిన కవి, అర్థానికి తగిన పదాలను మాత్రమే ఎన్నుకొని యతులు ప్రాసలు నిలుపకపోతే అది కావ్యం అనిపించుకోదని తిక్కన తేల్చి చెప్పాడు. 'ప్రాసము ప్రకారము వేఱగు, నక్షరంబులన్ శ్రుత్యను రూపమంచు నిడ...' చెవికి ఇంపుగా ఉన్నాయని ప్రాసకు భిన్నమైన అక్షరాలను తన కావ్యంలో ప్రయోగించనని తిక్కన తెలిపాడు.

2.3.2.2. గద్యరహితం :

నిర్వచనోత్తర రామాయణకాలం నాటికి తిక్కన గద్య రహితమైన దానినే కావ్యమని భావించాడు.

'.... వాక్య సాంగత్యము సేయుచోనయిన గద్యము తోడుగజెప్పి పెట్టదౌ
ర్గత్యము దోప.... ఇవ్విధమింపు బెంపదే'

పై పద్యంలో తిక్కన తన కావ్య నిర్మాణ శైలిని తెలియజేస్తూ రెండు పద్యాల మధ్య సమన్వయంగానైనా గద్యము (వచనం) రాయనని, గద్యరహితంగా రాసిన కావ్యమే కావ్యమని, దానినే పండితులు మెచ్చుకుంటారని చెప్పాడు. ఇదే భావాన్ని మరొక పద్యంలో -

కం. వచనము లేకయు వర్ణన
రచియింపగ గొంత వచ్చు బ్రౌఢులకు గథా
ప్రచయముఁబద్యములన పొం
దుచితంబుగ జెప్పుటార్యులొప్పిద మనరే

వచన రహితంగా రచన చేస్తాననీ, వర్ణన విషయంలోనూ కథాబోధనలోనూ పద్యాలను రచించి పండితుల చేత ఒప్పనిపించుకుంటాననీ తిక్కన స్పష్టం చేస్తూ నిర్వచన కావ్యాన్ని ప్రారంభించాడు. ఈ సందర్భంలో ఛందో

విషయికంగానూ వచన విషయికంగానూ ఆధునిక పండితుల అభిప్రాయం గుర్తించదగినది. "మన యాంధ్ర కావ్యములలో నిర్వచనోత్తర రామాయణము దక్క, మిగిలిన కావ్యములన్నియు జంపూ కావ్యములే. వీనికిపుడు ప్రబంధములని వ్యవహారము వచ్చినది... ఇప్పటి కవులలో గొందఱు సంస్కృత కావ్యములలో వలె, నొక్కటే వృత్తము దురికాక వాడుచున్నారు. ఇందేది సమీచీనమని ప్రశ్న వచ్చుచున్నది. గాయకుడు తన పాట కచ్చేరీలో మొదట నుండి తుదిదాక నొకే రాగముతో బాటలన్నియును బాడడు. కృతి, వర్ణము, జావళీ, రాగము మొదలైనవన్నియు, వివిధ రాగములతో వివిధ తాళములతో బాడును. అట్లుగానిచో లోకము మెచ్చదు. అట్లే కవియను నిర్వచనముగా భిన్న భిన్న వృత్తములలోనే వ్రాసినచో సమంజసమని నా తలంపు" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 1987. కావ్యాలంకార సంగ్రహం. పుట.243) ఈ వాక్యాలు తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణానికి ఆధునికులు ఇచ్చిన అత్యున్నత స్థానాన్ని తెలియజేస్తున్నాయి.

2.3.3. ఉభయ కావ్య ప్రౌఢత్వం :

తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని ఉభయ కావ్య ప్రౌఢత్వముతో రచిస్తానన్నాడు. "అమలోదాత్త మనీషనే నుభయ కావ్య ప్రౌఢి బాటించు శిల్పమునం బారగుడం గళా విదుడ..." అని తిక్కన తన ప్రతిభను వ్యక్తీ కరించాడు. ఈ ఉభయ కావ్యత్వంలో 'సంస్కృత-ఆంధ్ర; శివ-కేశవ; మార్గ-దేశి; దృశ్య-శ్రవ్య; శాస్త్ర-కావ్య' నిర్మాణాలను గుర్తించవచ్చు. పద్య-గద్య; ఆర్య- ద్రావిడ, సీమ-తెలంగాణ భావాలను కూడా గుర్తించవచ్చు. తిక్కన అటు అలంకారశాస్త్రములోనూ, ఇటు కావ్యరచనలోనూ ప్రౌఢత్వం సాధించినవాడు కాబట్టి శ్రవ్య కావ్యకళలో దృశ్య కావ్యకళను చొప్పించగలిగాడు.

"... దృశ్యకావ్యమున నిషిద్ధములయిన వన్నియు శ్రవ్య కావ్యమున నిషిద్ధములగానక్కఱలేదు, కావున గావ్య వస్తువు రస వ్యంజకము గావలయునన్నచో సందర్భోచితముగ రచింపవలయును. ఇదియే కావ్యశిల్పము. ఈ శిల్పదృష్టియే కవికి ముఖ్యముగా నుండవలయును" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 1987. కావ్యాలంకార సంగ్రహం. పుట. 239) అన్న విమర్శకుల మాటలు తిక్కన రచనకు పరిపూర్ణంగా వర్తిస్తాయి. ఇటువంటి శిల్పంతోనే తిక్కన నిర్వచనోత్తర రామాయణ రచనకు పూనుకున్నాడు. 'శిల్పపారగు'

2.3.4. కావ్యేతివృత్తం :

నిర్వచనోత్తర రామాయణ కావ్య ప్రారంభంలో తిక్కన, ఇతివృత్తాన్ని ప్రస్తావిస్తూ-

కం. ఎత్తఱినైనను ధీరో
దాత్త నృపోత్తముడు రామధరణీ పతి స
ద్వృత్తము సంభావ్యమగుట
నుత్తర రామాయణోక్తి యుక్తుడనైతిన్

రాముని సచ్చరిత్రను 'ఉత్తర రామాయణము' అనే పేరుతో రచిస్తానని తిక్కన పేర్కొన్నాడు. కావ్యవస్తువు సద్వ ృత్తము కలిగి ఉండాలన్నది తిక్కన అభిమతం. కావ్యేతివృత్తాన్ని దండి పేర్కొంటూ -

ఇతిహాస కథోద్భూత మితరద్వా సదాశ్రయమ్
చతుర్వర్గ ఫలాయాత్తం చతురోదాత్త నాయకమ్

"రామాయణ మహాభారతాదులలోని ఇతరమైన చారిత్రక గ్రంథములలోని కథలను ఆశ్రయించి ఉన్నది; ధర్మ-అర్థ-కామ-మోక్షములనెడు నాలుగు పురుషార్థ ఫలమునకు సంబంధించినదై... ఉదాత్త స్వభావము కల నాయకుడు కలిగినది - కావ్యము" (శ్రీరామచంద్రుడు, పుల్లెల. 1981) తిక్కన చెప్పిన- "ఎత్తఱినైనను... నైతిన్" పద్యము పై శ్లోకభావానికి దగ్గరగా ఉంది. ధీరోదాత్త నాయకుడైన రాముడు కేంద్రంగా సాగిన రామాయణ ఇతివృత్తాన్ని,

చతుర్వర్గ ఫల ప్రదాయినిగా తిక్కన రచించడానికి పూనుకున్నాడు.

2.3.5. కావ్యనాయకుడు: నాయకుని ఆధారం చేసుకునే కవి ఇతివృత్తాన్ని స్వీకరిస్తాడు. తాను ఉన్న రాచరిక వ్యవస్థకో, సామాజిక పరిస్థితికో తగిన నాయకుడిని ఎన్నుకుంటాడు. నిర్వచనోత్తర రామాయణం కాలం నాటికి మనుమసిద్ధి రాజ్యంలో అనేక ఒడుదుడుకులను ఎదుర్కొని కొంత స్థిరత్వం సాధించాడు. అంతిమ విజయం ధర్మానిదే అని నిరూపించేట్లుగానూ స్ఫురింపజేసేట్లుగానూ తిక్కన రామాయణ రచనకు పూనుకున్నాడు. ధర్మజీవనంలో ఆ రాముడు ఆదర్శమైనట్లుగా, రామరాజ్యస్థాపనకు మనుమసిద్ధి పూనుకోవాలని సూచిస్తున్నాడా అన్నట్లు, తిక్కన రామాయణ రచనకుపక్రమించాడు.

కం. ఎత్తఱినైనను ధీరోదాత్తనృపోత్తముడు...
నుత్తర రామాయణోక్తి యుక్తుడనైతిన్

అని ధీరోదాత్తనాయకుడు, రాజులలో ఉత్తముడైన రాముని ఇతివృత్తమే ఉత్తర రామాయణ కావ్యంగా రచింపబడుతున్నదని పేర్కొన్నాడు. ఉదాత్తలక్షణాలున్న నాయకుని ఇతివృత్తంతో నిర్మించబడిన కావ్యం, పఠితకు కూడా ఉదాత్త భావాలను అందిస్తుంది. కవి కోరుకున్న అంతిమ ప్రయోజనం ఇదే.

2.3.6. కావ్యప్రామాణికం :

కవి వెలువరించిన కావ్యం పండితుల ఆమోదాన్ని పొందాలని, అటువంటి కావ్యమే రాబోయే కాలంలో నిలబడుతుందని తిక్కన అంటాడు.

తే. ఎట్టి కవికైనఁ దన కృతి యింపు బెంప
జాలు గావునఁ గావ్యంబు సరసులైన
కవుల చెవులకు నిక్కినగాని నమ్మ
డెందు బరిణతి గలుగు కవీశ్వరుండు

ఏ కవికైనా తన కావ్యం అద్భుతంగానే కనిపిస్తుందని, కాని పరిణతి చెందిన కవి, సరసులైన కవులు తన కావ్యాన్ని ప్రశంసిస్తేనే ఆనందపడతాడని తిక్కన భావించాడు. ఇతివృత్తం, వర్ణనలు, పదప్రయోగాలు, ఛందోరీతులు మొదలైనవన్నీ లక్షణయుక్తంగా ఉన్నప్పుడే కావ్యం చిరకాలం స్థిరంగా ఉంటుంది. 'కావ్యం బుధపుంగవ హృదయంగమంబు' (కావ్యాలంకార సంగ్రహం. కృత్యవతారిక)గా ఉండాలని విద్యానాథుడు అంటాడు.

2.3.7. కావ్యాంకితం :

ఉత్తమ నాయకేతివృత్తం కలిగిన కావ్యం, ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన రాజుకు అంకితమివ్వడమే సార్థకత. కావ్యేతివృత్త నిర్ణయం ఎంత ముఖ్యమో కావ్యాంకిత నిర్ణయమూ అంతే ముఖ్యమని తిక్కన భావించాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణ కావ్యాన్ని

సీ॥ సకల లోక ప్రదీపకుడగు పద్మినీ
మిత్ర వంశమున జన్మించెననియు;
జూచిన మగలైన జొక్కెడునట్టి సౌందర్య
సంపద సొంపుదాల్చెననియు;
జన హృదయానందజనకమై నెగడిన
చతురత కల్మిన ప్రతిముడనియు;

మెఱసి యొండొంటికి మిగులు శౌర్య
త్యాగ విఖ్యాతకీర్తులు వెలసెననియు;

తే॥. వివిధ విద్యాపరిశ్రమ వేది యనియు
సరస బహుమాన విరచనాశాలి యనియు
మత్కృతీశ్వరుడగుచున్న మనుమ నృపతి
సుభగు గావించుటకు సముత్సుకుడనైతి (ని.ఉ.రా.I.4)

సూర్యవంశ సంజాతుడు, సౌందర్యవంతుడు, జన హృదయానందకారకుడు, శూరుడు, విద్యావంతుడు, రసహృదయుడు, అయిన మనుమసిద్ధికి తన కావ్యాన్ని అంకితమిస్తున్నట్లుగా తిక్కన తెలియజేశాడు. కావ్యకథానాయకుని లక్షణాలకు దగ్గరగా కావ్యభర్త యొక్క లక్షణాలు ఉండటం, విద్యావంతుని చేతిలోనే కావ్యం రాణిస్తుందని భావించటం కారణంగానే తిక్కన మనుమసిద్ధికి అంకితమిచ్చినట్లు తలచవచ్చు. కావ్య భర్త కోరుకున్నది - కావ్య కర్త తలచినవి ఒక్కటిగా ఉండడమే కాకుండా, కథానాయకునికి, కావ్యభర్తకు లక్షణాలలో కొంతసామ్యం ఉన్నట్లయితే కావ్యాంకితం ఔచితీమంతమవుతుందని చెప్పవచ్చు.

ఆదిరాజ యశోబిమ్బమాదర్శం ప్రాప్య వాఙ్మయమ్
తేషావ సన్నిధానే-పిన స్వయం పశ్యనశ్యతి (కావ్యాదర్శం I.5)

కావ్యనిర్మాణానికి ఆధారభూతులైన రాజులు నశించినప్పటికీ, ఆ కావ్యం ద్వారా ఆ రాజు స్థిర కీర్తిని పొందుతాడని పై శ్లోక భావం అంటే, ఉత్తమ కావ్యం ఉత్తమరాజుకు అంకితమివ్వటం వల్ల చిరకాలం కీర్తిని పొందటం లోకరూఢం. అందుకే తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని మనుమసిద్ధికి అంకితమిచ్చి మనుమసిద్ధి ఔన్నత్యాన్ని ఇనుమడింపజేశాడు. ఉత్తమ కావ్యాన్ని రాజుకు అంకితమివ్వడం వల్ల ఉత్తమ నాయకలక్షణాలు ఆ రాజుయందు మరింత పాదుకొల్పినట్లవుతుంది. పైగా ఇతివృత్తానికి సార్థకత లభించినట్లవుతుంది. అందుకే ఆనాడు ఉత్తమ కావ్యం రచించడం; రాజుకు అంకితమివ్వడం- అన్నది కవికి సామాజిక బాధ్యతగా నిలిచింది. ఈ నేపథ్యంలో తిక్కన కవిగా, మంత్రిగా తన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాడని చెప్పవచ్చు.

ఈ విధంగా తిక్కన తన నిర్వచనోత్తర రామాయణ కావ్యాన్ని, ఆనాటి ఆలంకారిక శాస్త్రాలకు అనుగుణంగా రచించాడని, ధీరోదాత్తుడైన రాముని సద్వృత్తమైన ఉత్తర రామాయణాన్ని అనేక ఛందస్సులతో, వర్ణనలతో, లలితమైన పదాలతో, దోషరహితమైన యతిప్రాసలతో వ్యాకరణబద్ధంగా నిర్వచనంగా రచించాడని చెప్పవచ్చు. నిర్ణయించుకున్న ఒకే ఛందస్సుతో కావ్యాలు వెలువరించిన శివకవి యుగానికన్నా భిన్నంగా అనేక ఛందస్సులతో రామాయణ కావ్య నిర్మాణం చేపట్టడం ఆనాటి ఆలంకారిక, కావ్యధర్మంగా తిక్కన భావించాడు. నిర్వచనోత్తర రామాయణంలో నిరూపించాడు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. కేతన. దశకుమార చరిత్ర. 1967. (సంపా.) చంద్రమౌళిశాస్త్రి, బెల్లంకొండ. హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.
2. తిక్కన సోమయాజి. ఆంధ్ర మహాభారతము - విరాటపర్వము. 2011. (ప్రధాన సంపాదకులు) ఆచార్య సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్రప్రదేశ్. తిరుమల తిరుపతి దేవస్థానములు.

3. తిక్కన సోమయాజి. నిర్వచనోత్తర రామాయణం. 1968. పరిష్కర్త: మాధవశర్మ, పాటిబండ. హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.
4. దండి. కావ్యాదర్శం. 1981. (వ్యాఖ్యాత) శ్రీరామచంద్రుడు, పుల్లెల. హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.
5. శేషయ్య, చాగంటి. 1948. ఆంధ్ర కవి తరంగిణి. సంపుటం.2. రాజమహేంద్రవరం. సుజనరంజనీ ముద్రశాల.
6. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 1987. (అను.) కావ్యాలంకార సంగ్రహం. హైదరాబాదు. తెలుగు విశ్వవిద్యాలయం.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

5. రామాభ్యుదయము - ప్రబంధ వర్ణన

- డా॥. ఆర్. రమాదేవి

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), విద్యానగర్, హైదరాబాదు.

1. పరిచయం:

రామాభ్యుదయము అయ్యలరాజు రామభద్ర కవి రచించిన ప్రబంధ కావ్యం. ఇది 8 ఆశ్వాసములతో కూడిన రసవత్తరమైన ప్రబంధ కావ్యం. ఈ కావ్యమును అలియరామరాజు మేనల్లుడు అయిన గొబ్బూరి నరసరాజుకు అంకితం ఇచ్చెను.

అయ్యలరాజు రామభద్రుడు 16 వ శతాబ్దానికి చెందిన కవి. ఈయన ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు, విజయనగర సామ్రాజ్య పాలకుడు అయిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములోని భువనవిజయంలోని అష్టదిగ్గజాలలో ఒకడు.

ఈ కవి ఈనాటి కడప జిల్లాకు చెందినవాడు. సుమారు 1500 -1565ల కాలానికి చెందినవాడు. ఈయన అయ్యలరాజు వంశానికి చెందిన అయ్యలరాజు తిప్పయ్య గారి మనుమడు అని ఆరుద్ర కవి చెప్పారు.

అయ్యలరాజు రామభద్రుడు వాల్మీకి రామాయణంలోని కొన్ని ఘట్టములను స్వీకరించి, మార్పులు చేర్పులు చేసి, రామాభ్యుదయమును రచించెను.

ఈ కావ్యంలో మొదటి ఆశ్వాసంలో దశరథుని వనవిహారము, జలక్రీడలు మొదలగు అంశములను వర్ణించెను. రెండవ ఆశ్వాసంలో ఋష్యశృంగునకు శాంతతో వివాహ వర్ణన గురించి చెప్పెను. మూడవ ఆశ్వాసంలో పుత్రకామేష్టి, రామజననము, విద్యాభ్యాసము మొదలగు అంశములను గురించి వర్ణించెను. నాలుగవ ఆశ్వాసంలో విశ్వామిత్రుని యాగరక్షణము, తాటక వధ, శ్రీరామ కళ్యాణం, పరుశురామ విజయం మొదలగు అంశములను వర్ణించెను.

ఐదవ ఆశ్వాసంలో అరణ్య గమనము, పాదుకా పట్టాభిషేకము, పంచవటి ప్రవేశము, సీతాపహరణము, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకము మొదలగు అంశములను వర్ణించెను.

ఆరవ ఆశ్వాసంలో శ్రీరాముని విరహము, హనుమత్ సందేశం, లంకా దహనము అంశములను వర్ణించెను. ఏడవ ఆశ్వాసంలో శ్రీరాముని యుద్ధసన్నాహము, అంగదు రాయభారము, ఉభయసేనల యుద్ధసన్నాహము అంశములను వర్ణించెను.

చివరగా ఎనిమిదవ ఆశ్వాసంలో శ్రీరామ విజయం, విభీషణ పట్టాభిషేకము, రాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన తర్వాత శ్రీరాముని పట్టాభిషేకం మొదలగు అంశములను వర్ణించెను.

ఈ కావ్యంలో అయ్యలరాజు రామభద్రుడు రామాయణ కథను అతివేగముగా నడిపి తన కవితా చమత్కృతితో వర్ణించి, ప్రబంధముగా తీర్చిదిద్దెను.

దశరథుని వనవిహార వర్ణన, జలక్రీడా వర్ణన, ఋతు వర్ణన మొదలగు అంశములను కల్పించి, అష్టాదశ వర్ణనలతో సందర్భానుసారంగా చెప్పెను.

2. వ్యాస వివరణ :

I. ఈ క్రింది పద్యంలో కవి వర్ష వేళను వర్ణించు సందర్భంలో...

శా॥. ధారాశుద్ధి ప్రసిద్ధి వహించి ఘనశబ్ద స్ఫూర్తి వర్ధిల్లగా
దోరంబైన రసస్థితిన్ దరళవిద్యున్మాలికా లక్షణో
దారంబై కవి సేవ్యమౌ వనమయూరారూఢి బ్రాపించి వ
ర్షారంభము ప్రబంధమట్లఖిల పద్యా క్రాంత మయ్యెందగన్.

పై పద్యంలో ప్రబంధ లక్షణాలు ఉన్నాయి. ధారాశుద్ధి ఉత్తమ కవిత్వమునకు పట్టుకొమ్మ అంటారు. ఇందులో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఘనమైన శబ్ద స్ఫూర్తి, రసస్థితి ఉంది.

ఇందులో శబ్దములు వర్ష ఋతు పరముగను, ప్రబంధ పరముగాను రెండు అర్థములను ఇచ్చుచున్నవి. ఇందులో వర్షారంభము ప్రబంధము వలె ఉన్నది.

II. హనుమంతుని సముద్ర లంఘన ప్రయత్నము ఈ పద్యంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

సీ॥. మాతులుంగంబుల జాతు లుంగంబుల
నీరంధ్ర మగుపట్ల నెమకి నెమకి
భిల్ల వల్లుల చెంత పుల్ల మల్లుల పొంత
నదవద యొదవంగ వెదకి వెదకి
కల్లోల డోలా సముల్లోలలీలా స
రాళ మరాళ వాచాలఝురము
లుంగలవంగాను షంగి బృంగీజాత
సంగీత భంగీ తరంగితంబు..

ఇందులో దీర్ఘ సమాసములు సమతాపాదకములై శోభిల్లుచున్నవి. ఈ పద్యము ధారాశుద్ధి సహృదయ హృదయానందకరముగా ఉంది.

III. సీతా రావణునితో హితబోధ చేసిన సమయంలో వర్ణించిన పద్యము.

శా॥. అన్నా నీవు పులస్త్య వంశ మణివై యాఖండలాదుల్ బళీ
యౌన్నత్యంబిదిరా యనన్ బ్రతికి నీవయ్యో! యిదేమీ యవి
చ్ఛిన్న ప్రాభవనాశహేతువు పరస్త్రీ కాంక్ష చాలింపు మిం
త న్నన్నే లిన వాడు రాముడితరుల్ నాకుందనూ సంభవుల్.

పై పద్యంలో సంభాషణ, నాటకీయ పద్ధతిలో ఉక్తి చాతుర్యముతో రామభద్ర కవి వర్ణించెను..

IV. సీతాదేవిని వర్ణించే సమయంలో చెప్పిన పద్యం.

తే॥. ఎక్కి పెక్కుతరుల నొక్కొక్క చిగురాకె
యెత్తి వెదకజొచ్చి రిగురుబోడి
దంతి తప్పి చనిన దొంతికుండలలోన
జెయి పెట్టి వెదకి బోయినట్లు.

పై పద్యంలో సీతాదేవి చిగురుబోడి కావున చిగురాకులలో వానరులు సీతను వెతకుట సార్థకము. ఇందులో ఉపమాలంకారము ఉంది.

V. శబ్దాలంకార ప్రయోగం ఈ పద్యంలో ప్రస్ఫుటముగా కనిపిస్తుంది.

తే॥. చొక్కపు బసిండి నక్కుల జెక్కు జెక్కు
లక్కలికి కొప్పు నీలాంబు ముక్కు ముక్కు
కనక గాంధఫలీ సారకంబు కంబు
కవిత రేఖా విలాసమంగళము గళము.

పై పద్యంలో సీతాదేవిని వర్ణించు సందర్భంలో మేలిమి బంగారు నక్కులు, చెక్కు చెక్కిళ్ళు, కొప్పు నల్లని మేఘము, ముక్కు సంపెంగ, కంఠము శంఖ రేఖ అని శబ్దాలంకారంలో శబ్ద చమత్కృతితో వర్ణించెను.....

VI. రామభద్రుని పదబంధములు చమత్కారములు ఈ పద్యంలో కనిపిస్తుంది.

మ॥. భరతుండా రఘురామ పాదుకలపై భక్తిం ప్రతిష్ఠించి ని
నిర్భర భూచక్రము రామరాజ్యముగ మర్యాదాన యౌదార్య సు
స్థిర శౌర్యంబుల నేలచుండె జని నందిగ్రామ సంస్థాయియై
సరవిం దత్పున రాగమక్రమ దిదృక్షా దక్ష దీక్షా కృతిన్...

పై పద్యంలో రామరాజ్యము అను పదమును చమత్కారముగా ప్రయోగించెను. మర్యాద, ఔదార్యము, సుస్థిర శౌర్యము మొదలగునవి రాముని గుణములు. భరతుడు రామరాజ్యముగనే పాలించెననుట...

3. ఉపసంహారం :

రామభద్ర కవి సంభాషణలను నాటకీయ పద్ధతిలో ఉక్తి చాతుర్యంతో వర్ణించెను.

హనుమంతుడు సముద్రమును దాటుటకు ప్రయత్నించు సందర్భంలో చేసిన వర్ణన చాలా అద్భుతంగా ఉంది.

మూలములో గల వాల్మీకి కథ, కుశ లవుల రామాయణ గాన వృత్తాంతము, విశ్వామిత్ర, వశిష్టుల కలహము, సముద్ర మధనము మొదలగు ఘట్టములను స్వీకరింపలేదు.

రామాభ్యుదయ కావ్యంలో ధారాశుద్ధి, శబ్ద సౌందర్యము, రస స్ఫూర్తి, శ్లేష చమత్కారములతో రామాభ్యుదయమును రచించి కవి ధన్యుడయ్యెను.

ఆధార గ్రంథాలు :

1. జి.నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష
2. ద్వానా శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర
3. పల్లా దుర్గయ్య - ప్రబంధ వాఙ్మయ వికాసము.

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

6. రామాయణ కల్పవృక్షం - బాలకాండలోని కమనీయ ఘట్టాలు

- డా॥. రమేశ్ బాబు మామిడాల

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

పరిచయం :

ఆదికవి వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణ మహాకావ్యం ఆధారంగా భారత దేశంలో మరియు ప్రపంచంలోని వివిధ భాషలలో కవులు కొందరు అనువదిస్తూ మరికొందరు స్వతంత్రంగా రామాయణాన్ని లేదా రామకథ ఆధారం చేసుకొని ఎంతో సాహిత్యాన్ని రచించారు. ఎవరు ఎన్ని అవాల్మీకాలు చేర్చినప్పటికీ వాల్మీకి రామాయణమే అన్నిటికి మూలముగా నిలుస్తుంది. విశ్వనాథ గారు ఈ రామాయణ కల్పవృక్షం కావ్యం లోనే అన్నట్లు "కవి ప్రతిభలోన ఉండును. కావ్య గత శతాంశములు తొంబదియైన పాళ్ళు" ఏ కావ్యంలోని అంశాలనైనా నూటికి తొంబై పాలు కవి ప్రతిభను బట్టే నిలుస్తాయి లేదా నీరు గారి పోతాయి అన్నది అక్షర సత్యం. కొన్ని వేల రామాయణాలు వివిధ కవులు వివిధ కాలాలలో రచించినప్పటికీ ఒక్కో భాషలో కొన్ని రామాయణాలు మాత్రమే ప్రామాణికంగా, ప్రసిద్ధంగా నిలిచి పోయాయి. అలా తెలుగులో నిలిచిన రామాయణాలలో నిర్వచనోత్తర రామాయణం, రంగనాథ రామాయణం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, గోపీనాథ రామాయణం, నిర్వచన రామాయణం(వేంకట పార్వతీశ కవులు), సీతారామ రామాయణం(తూము రామదాసు), ఆనంద రామాయణం(సోమవేంకట సుబ్బరాయ కవి) శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం(వావికొలను సుబ్బారావు) వంటి రామాయణాలతో పాటు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన శ్రీమద్ రామాయణ కల్పవృక్షం కావ్యం కూడా ఒకటి. విశ్వనాథ గారి రచనలన్నీ ఒక ఎత్తు, ఈ ఒక్క కల్పవృక్ష కావ్యమే ఒక ఎత్తుగా తెలుగు సాహితీ విమర్శకుల అభిప్రాయం.

"రామాయణ కల్పవృక్షం" విశ్వనాథ గారి సాహితీ ప్రతిభకు, తాత్విక భావాలకు, ఆధ్యాత్మిక ధోరణికి, తెలుగు సాహిత్యంలో పద్య కావ్యాల విశిష్టతకు నిదర్శనంగా ప్రసిద్ధమైంది. శతాధిక గ్రంథకర్త ఐన విశ్వనాథ గారు వేయిపడగలు వంటి బృహత్ నవలా రచనకే 30 రోజులు తీసుకుంటే ఈ కావ్య రచనకు మాత్రం దాదాపు 30 సంవత్సరాలు (1932 నుండి 1962) తీసుకున్నాడట. అంతగా ప్రేమించి రచించారు ఈ కావ్యాన్ని. ఈ కావ్యమునకే 1970లో భారతదేశ అత్యున్నత సాహితీ పురస్కారం, జ్ఞానపీఠ పురస్కారం వచ్చింది. విశ్వనాథగారు కావ్యమంతా వాల్మీకిని అనుసరిస్తూనే తెలుగుదనం మరియు తెలుగు భాషా చమత్కృతులతో రచించారు.

వివరణ :

రామాయణ కల్పవృక్షములో కథావిభాగాలకు వాల్మీకి రామాయణములాగానే కాండలని పేర్లు పెట్టారు విశ్వనాథ గారు. అవి 1. బాలకాండము, 2. అయోధ్యాకాండము, 3. అరణ్యకాండము, 4. కిష్కింధ కాండము, 5. సుందరకాండము, 6. యుద్ధకాండములనేవి. మళ్ళీ ఆ కాండలను వాల్మీకి సర్గలుగా విభజిస్తే విశ్వనాథ గారు ప్రతి కాండను అనేకమైన ఖండములుగా విభజించారు. అలా విభజించిన ఖండములకు ఆ భాగమునకు గల ప్రత్యేకతను బట్టి వివిధ పేర్లను పెట్టారు. అలా బాలాకాండను ఇష్టిఖండం, అవతారఖండం, అహల్యాఖండం, ధనుషఖండం మరియు కల్యాణ ఖండం అని ఐదు ఖండాలుగా విభజించారు.

రామాయణ కల్పవృక్షములోని బాలాకాండలో కావ్య అవతారిక ప్రధానమైనది. "శ్రీమజాషిక..........." అంటూ ప్రారంభమైన అవతారికలో ఆ విశ్వేశ్వరున్ని నమస్కరిస్తూ మొదలై మరల "నిదేల రామాయణం బన్నచో" అన్న పద్యంలో రామాయణ ప్రాధాన్యతను, తండ్రిగారి ఆజ్ఞ, తండ్రిగారి ప్రశంస, గురుస్తుతి, ఇష్టదేవతా స్తుతి, పూర్వ తెలుగు మరియు సంస్కృత కవుల ప్రశంస, తన రచనాశైలి, స్నేహితులు మరియు వివిధ పీఠాధిపతులకు నతులు సమర్పించుకొని కావ్యాన్ని ఇష్టిఖండం అంటూ ప్రారంభించారు విశ్వనాథగారు.

ఇష్టిఖండం మొదలు కల్యాణ ఖండం వరకు అనేక కమనీయ ఘట్టాలు ఉన్నాయి. మచ్చుకు ఇక్కడ ఈ వ్యాసంలో కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాము. ముందుగా ఇష్టిఖండంలో విశ్వనాథగారు నిస్సంతులైన తల్లిదండ్రుల ఆవేదనను, వారి నైజాన్ని వర్ణించిన తీరు అపూర్వము. దశరథ మహారాజు యొక్క పుత్ర కాంక్ష మరియు మనోభావములను విశ్లేషించి మన కళ్ళ ముందు నిలిపారు విశ్వనాథ.

"అసివాళ్ళేగుచు ధారణీపతి యయోధ్యావీధి నే వర్ణపున్
శిశు వైనం గనిపించినన్ నిలిచి వీక్షించున్ హసించున్ గృపా
వశుఁడై వానినిదీసి యెత్తికొని యే భక్ష్యమ్ములో తెచ్చి యి
చ్చు సమాశ్వాసన సేయు నంతటన పుచ్చున్ దీర్ఘ నిశ్వాసమున్" -(బాలాకాండ ఇష్టి-11)

సీ॥ "అంగళ్ళలోనఁ గ్రయ్యంబులై యుడిన
శిశు శ్రేణి యాట వస్తువులు చూచి
యేరైనఁగొని యింటికేగుచో దారిలోఁ
దోఁతెంచు నుయ్యేలతొట్లు గాంచి
చిత్రపటంబులన్ జిన్ని పిల్లలు నవ్వు
చున్నట్లు వ్రాసిన యొఱపు లరసి
యెందైనఁ బసిపిల్ల లేడ్చుచున్నట్లు
విన్పించినఁ జెవియొగ్గి విని చలించి

గీ॥ తన మనోవాంఛ యెల్ల సంతానమయము
గాఁగ నజధారణీపతి కన్నకొడుకు
ధరణి రాజ్యకార్యముల మధ్యమునఁ గూడఁ దన్నె
విస్మృతిఁగని పరధ్యాన మందు - (బాలాకాండ - ఇష్టి - 12)

గీ॥ "రాజపూరుషామాత్యతనూజు లెవ్వ
రైనఁ దండ్రులతో సభ కరుగుదెంచి

నపుడు పతి రాజకార్యము లట్టెపెట్టి
వారితోఁగూడి కాలయాపనము చేయు" - (బాలాకాండ-ఇష్టి-1)

పై మూడు పద్యాలలో దశరథ మహారాజు విహారమునకేగుచు అయోధ్యానగర వీధుల యందెక్కడైనను, యే వర్ణపు పసిబాలుడు కనుపించినను కొంచెము సేపాగి యా బాలుని వైపు తదేక దృష్టి సారించి చిరునవ్వుతో పలుకరించి చాలా ఆనందము పొందేవాడు. దయార్ధ హృదయుడై యా బాలుని దీసి యెత్తికొని యే పండో ఫలమో, తినుబండారమో తెప్పించి చేత బెట్టి యాతని బుగ్గలపై చిటికలు వేయుచూ బాలుని నుత్సాహపరచెడి వాడు. మరల అంతలోనే నైరాశ్యము నొంది దీర్ఘ నిట్టూర్పు విడుచేవాడు. అంగళ్ళలో నమ్ముటకై యుంచిన చిన్న పిల్లల యాట వస్తువులను చూసినప్పుడు, ఎవరైనను అంగడి నుండి యింటికేగుచు తమ చంటి పాపల కొఱకు కొనిన ఊయెలలను చూసినప్పుడును, చిన్న పిల్లలు నవ్వుచున్నట్లు చిత్రీకరించిన సుందర చిత్రపటములను తాదాత్మ్యముతో వీక్షించువాడు. ఏ మూలనైనను పసి పిల్లల యేడ్పులు వినినంతనే చలించిన హృదయముతో చెవియొగ్గి వినెడివాడు. ఈ విధముగ తాను రాచకార్య భారముల యందు నిమగ్నుడై యున్నను తన మనోవాంఛలన్నియు సంతానమయము కాగ, అజ మహారాజ పుత్రుడైన దశరథుడు సంతానమున్కై యెల్లపుడు పరధ్యానముగ కాలము గడుపుచుండువాడు. అంతియగాక తన మంత్రుల , రాజపురుషుల బిడ్డలెవరైనను వారి తండ్రితోబాటు సభకు వచ్చినచో రాజు తన రాచ కార్యములను ప్రక్కన బెట్టి యా బాలురతో యమితానందముగ కాలక్షేపము చేసేవాడు. అంటూ దశరథునిలో పరకాయ ప్రవేశం చేసినట్లుగా మనోహరంగా వర్ణిస్తారు విశ్వనాథ.

మరియొక ఘట్టంలో తల్లి కౌసల్యాదేవి బాల రాముని అలంకరించుటలో ఆడించుటలో చూపిన తన్మయత్వము బాలుర సహజ స్వభావం విశ్వనాథ గారి నిషిత పరిశీలన దృష్టికి తార్కాణములుగా చెప్పవచ్చు. బహుశా ఈ నిషిత దృష్టికే ఈ కావ్యమునకు జ్ఞానపీఠ అవార్డు వచ్చి ఉంటుంది.

శా॥. "చూడారత్నము కాళ్ళగజ్జెలు కటీజూతిస్వనత్కింకిణుల్
వ్రీడాముగ్ధ ముఖారవిందము రదావిర్భూతహాసంబులున్
గ్రీడాకార్ముక మంసవీథికను వ్యాఘ్రీ శ్రీనఖోద్భాసి వ
క్షోడంబాకృతి తల్లికై కరము సాఁచున్ రామచంద్రుం డొగిన్" - (బాల-అవతార-327)

బాల రామునికి చూడారత్నమును కాళ్లకు గజ్జలను కటి పై మువ్వలతో బంగారు మొలతాడు తో అలంకరించి శిశువు నడుస్తూ ఉంటే గల గల మనే మువ్వల శబ్దానికి బాలరాముడు సిగ్గు పడుతూ ఉంటే చాలా అందంగా ఉన్న రామున్ని కౌసల్య దగ్గరికి తీసుకోవడంతో బోసి నోరుతో హాయిగా నవ్వుతున్నాడట. క్రీడాకార్ముకము అనగా చిన్న బొమ్మ ధనుస్సును, మరియు వక్షస్థలము పై పులిగోరు తో కూడిన కంఠ హారమును వేసి ఆటలాడిస్తుండగా బాలరాముడు అప్పుడప్పుడు తల్లి దగ్గరికి చేతులు సాచి పరిగెత్తుకుంటూ వస్తున్నాడట.

మరొక పద్యంలో కౌసల్య బాలరామున్ని దగ్గరకు తీసుకొని నీ పేరేమిట్రా అని అడుగగా బాల రాముని సమాధానాలు కౌసల్య లాలింపులు ఇక్కడ చూడవచ్చు.

శా॥. "తానో 'లాములు' తండ్రి పేరెవరయా? 'దాచాతమాలాలు' 'నౌ
లే! నా పే' రన 'నమ్మగాల' నఁగ నోలిందల్లి 'కౌసల్య తం
డ్రీ!' నాగా ననఁబోయి రాక కనులన్ నీర్వెట్టఁ 'గౌసల్య నౌఁ
గానే కానులె యమ్మనే' యని ప్రభున్ గౌసల్య ముద్దాడెడిన్" - (బాల-అవతార-335)

అప్పుడప్పుడే మాటలు నేర్చుకుంటున్న రాముడు తానో 'లాములు' తన పేరు లాములు (రాముడు) అని, తండ్రి పేరడగగా 'దాచాతమాలాలు' (దశరథ మహారాజు) అని, నా పేరేమిటి అనగా 'నమ్మగాల' (అమ్మగారు) అని చెప్పాడట. కౌసల్య నా పేరు కౌసల్య రా అని చెప్పి, ఏదీ ఒక సారి అను అన్నదట అప్పుడు బాలరాముడు నోరు తిరుగక, అనలేక కనులలో నీరు నింపుకునే సరికి కౌసల్య బాలరామున్ని దగ్గరకు తీసుకొని ముద్దాడి సరేలేరా నేను అమ్మ గారినే అన్నదట.

మరొక కమనీయ వర్ణన మనకు అహల్య ఖండములో కనిపిస్తుంది. రాముడు గౌతముని ఆశ్రమానికి వచ్చే సందర్భములో భర్త శాపంతో రాయిగా మారిన అహల్య రాముని రాకతో రాయికి అవయవాలు ముఖ్యంగా పాశాణానికి పంచేంద్రియాలు వచ్చి మరలా స్త్రీ రూపాన్ని పొందే క్రమాన్ని ఇక్కడ విశ్వనాథ వారు అత్యంత కమనీయంగా వర్ణిస్తారు.

సీ॥ "ప్రభు మేనిపై గాలి పై వచ్చి నంతనే
పాషాణ మొకటికి స్పర్శవచ్చె
ప్రభు కాలి సవ్వడి ప్రాంతమైనంతనే
శిల కొక్క దానికిఁ జెవులు గలిగె
ప్రభుమేని నెత్తావి పరిమళించిన తోన
యశ్మంబు ఘ్రాణేంద్రియంబుఁ జెందె
ప్రభు నీల రత్నతోరణ మంజులాంగంబు
గనవచ్చి ఱాతికిఁ గనులు గలిగె

ఆ॥ ఆ ప్రభుండు వచ్చి యాతిథ్యమును స్వీక
రించినంత నుపల హృదయవీథి
నుపనిషద్వి తాన మొలికి శ్రీరామ భ
ద్రాభి రామమూర్తి యగుచుఁ దోఁచె" - (బాల-అహల్య-554)

ప్రభువు (శ్రీరామచంద్రుడు) ఆ ఆశ్రమ సమీపానికి రాగానే ఆ రాముని శరీరాన్ని తాకిన గాలి ఈ రాయిని సోకగానే ఆ గాలి స్పర్శను ఆఘ్రానించడానికి అన్నట్లు రాయికి ముందుగా స్పర్శ (చర్మము) ఏర్పడిందట. రాముడు దగ్గరగా సమీపిస్తుండగా రాముని కాలి అందెల సవ్వడి వినడానికి సంకల్పించిన ఆ శిలకు చెవులు మొలిచాయట. ఆ ప్రభు మరింత దగ్గరకు రాగానే ఆతని శరీరం పై నుండి వచ్చే సుగంధాన్ని ఆఘ్రానించడానికి అన్నట్లు ఘ్రానేంద్రియమైన ముక్కు ఏర్పడిందట. పుంసాం మోహనరూపాయ అన్నట్లు ఉండే ఆ రాముడు ఇంద్రనీల మణులతో కట్టిన తోరణం లా నల్లటి మేఘం రంగులో మెరిసి పోతున్న రామచంద్రున్ని చూడాలన్న ఊహ రాగానే ఆ రాతికి కనులు వచ్చాయట. ఆ రాముడు వచ్చి ఆతిథ్యమును స్వీకరించగానే ఆ రాతికి (అహల్యకు) రుచి (నాలుక) ఏర్పడి క్రమంగా రాయి అహల్యగా శ్రీరామమూర్తి ముందు నిలిచిందట. ఈ ఘట్టం మలిచిన తీరు చూశాక వడలి మందేశ్వర రావు గారు చెప్పినట్లు "ముఖ్యంగా కవి అయిన వానికి కీట్సు ఒక చోట అన్నట్లుగా కవి అన్న వానికి వ్యక్తిత్వం ఉండదని. కవికి ఒక మూర్తిమత్వం అనేది ఉండనే ఉండదట ! అన్ని ప్రాణులలోనికీ పరకాయ ప్రవేశం చేయటమే అతని పని. దీనివల్ల ఆ యా జీవుల లక్షణం కవికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయా ప్రాణుల ఆలోచనలనూ, అనుభవాలనూ, మూర్తిమత్వాన్నీకవి అనుభవించి, ఆవిష్కరించినట్టుగా మరెవ్వరూ చెయ్యలేరు. కవిలోని ఈ పరకాయ ప్రవేశ శక్తి వల్లనే కవికి ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉండదు.

అందుచేత "ఎన్ని పుట్టువుల పెట్టైతే" కవికి అంత మంచిది. అన్ని అనుభవాలను సంతరించుకుంటాడుబీ అంతటి

ఆలోచనాపరుడవుతాడు'' అన్నది అక్షర సత్యం. బాలకాండలో అత్యంత మనోహర ఘట్టము శివధనుర్భంగము. ఈ ఘట్టాన్ని వివరించే సందర్భములో విశ్వనాథ వారి రచనా విశ్వరూపాన్ని తిలకించవచ్చు. శివధనుస్సును చేత బూనిన రామచంద్రుడు దాని యొక్క వింటి నారి ఎక్కుపెట్టే సమయం లో తనకు జానకికి మధ్య ధనుస్సు అడ్డంగా ఉన్నట్టు భావించిన రాముడు ఒక్కసారిగా ధనుస్సు ఎక్కుపెట్టాడు. దానితో నతని దృష్టికి జానకి యాఁగలేదు అతని కృష్టికి శివధనుస్సాఁగలేదు సీత పూజడ వెన్నుగా శిరసువంచె చెఱుకుగడవోలె నడిమికి విఱిగె ధనువు చెఱకు గడవోలె నడిమికి విరిగిన శివ ధనుస్సు శబ్దం ఒక్కో లోకం లో ఒక్కో విధంగా వినిపించిందట బహుషా ఇలాంటి పద్య రచన వల్లనే విశ్వనాథ గారికి పాషాణ పాక ప్రభు అన్న బిరుదు వచ్చి ఉంటది.

ఈ పద్యాలను అర్థం చేసుకోవడమే కాదు చదవడం కూడా కష్టమే. విశ్వనాథ ఊహయే కాదు వర్ణన కూడ అపూర్వం, అద్భుతం కూడా మొదటి పద్యంలో.....

శా॥ ''నిష్ఠావర్ష దమోఘ మేఘపటలీ నిర్గచ్ఛ దుద్యోతిత
స్పేష్టరమ్మదమాలికాయుగప దుజ్జృంభన్మహాఘోర బం
హిష్ఠ స్ఫూర్జథు షండమండిత రవాహీన క్రియా ప్రౌఢి ద్రా
ఘిష్ఠంబై యొకరావ మంతట నెసంగెన్ ఛిన్న చాపంబునన్'' - (ధనుషఖండం-303)

అంటూ విల్లు విరగగానే ఇంద్రలోకంలో ప్రళయ కాలంలో వర్షాలు ఎడతెరిపి లెకుండా ఏడు సంవత్సరాలు కురుస్తుంటే, మెరుపులు మెరుస్తూ ఉంటే, ఆ మెరుపుల సంఘటన కారణంగా వజ్రాయుధపు దెబ్బ తగిలినపుడు ఏ శబ్దం వస్తుందో, పిడుగు పడినపు ఏ శబ్దం వస్తుందో, కొన్ని వేల పిడుగులు పడ్డపుడు ఏ శబ్దం వస్తుందో అటువంటి శబ్దం అది కూడా రవాహీన ఆనగా ఏ మాత్రం రవం లేకుండా ప్రాణాలు తీసే శబ్దం ఇంద్ర లోకంలో వినిపించిందట.

అదే కైలాసంలో అనగా శివుని ధనుస్సు శివలోకంలో.....

శా॥ ''హేరంబోన్నత శూర్పకర్ణ వివరహ్రీకారియై, షణ్ముఖ
స్ఫార ద్వాదశ నేత్రగోళ వివృతిప్రాకారమై, శైలక
న్యారాజ న్నవ ఫాలమండల విభుగ్న క్రీడమై, యాశ్చల
ద్దీరుగ్రప్రమథంబుగా ధనువు మ్రోఁగెన్ శైవలోకంబులన్'' - (ధనుషఖండం-304)

కైలాసంలో కఒక్కసారి ఈ ధ్వని వినపడగానె చాటలవంటి చెవులు కలిగిన వినాయకుని చెవులలో ఒక్కసారిగా భరింపగ రాని హ్రీకారం తో గింగురులు మ్రోగాయట.మంత్రమయ వాణీ సత్యనారాయణ అంటారు. ప్రక్కనే ఉన్న షణ్ముఖ స్వామి తన ద్వాదశ నేత్రాలను విచ్చి దిక్కులు చూసాడట అసలేం జరిగింది అన్నట్లుగా, తన ఇద్దరు పిల్లలూ ఈ శబ్దంతో ఝుడుసుకునే సరికి అమ్మ వారు శైలరాజ కన్య ఒక్క సారిగా ఆశ్చర్యపోయి తన తల ఎత్తి ఫాలమెత్తి అసలేం జరిగిందో తెలుసుకొని గజముఖ, షణ్ముఖులను ఊరడించిందట. కాని ఆ లోకం లోనే ఉన్న ప్రమథులు ఆ ధ్వని విని తమ శివునికేదో జరిగిందన్నట్లు ఉగ్రులై సిద్ధమౌతున్నారట ఆ ధ్వని విని.

శా॥ ''నృత్యన్మంజుల తారహారకబరీనిష్యందిముక్తామణి
ప్రత్యగ్రప్రసవాక్షిసంకలనదీవ్యత్కంధరాభేద సా
హిత్య ప్రౌఢనవాప్సరోనటనసాహిత్య ప్రశస్తాచ్ఛదృ
గీత్యాకారమనోజ్ఞమై ధనువు మ్రోఁగెన్ సర్వలోకంబులన్'' - (ధనుషఖండం-305)

స్వర్గలోకంలో అప్సరసలు నాట్యం చేస్తుంటే ప్రక్క వాయిద్యాలలో నట్టువాంగము, మృదంగము మొదలైన వాయిద్యాల శబ్దం లాగా, అలాగే గాయకుల బృందము ఒక్క తీరుగా ఉచ్చైస్వరంతో పాడే పాటలకు నాట్యం

చేస్తున్న అప్సరసల జడల ముడులలో ఉన్న పూలన్నీ రాలిపడుతున్నాయి, అలాగే వారి మెడలోని ముత్యాల హారాలు జారి పడుతున్నాయి. రసమయంగా, మనోజ్ఞంగా వినిపించడంతో వారి కన్నులు, విరులు, ముత్యాలు ఏవి ఏవో తెల్చుకోలేకపోతున్నారట.

శా॥ "దర్పస్వీకృతహాస విశ్లేథనరుంధద్దుష్టవాగ్ధారణీ
సర్పద్వీరచమూపథశ్లథనమై సంసత్కటీ శాటికా
కుర్పాస ప్రకటోగ్ర సాధ్వస వధూగుర్విణ్యభద్రాధ్వమై
దర్పాడంబరమై ధనుస్సు మొఱసెన్ దైతేయలోకంబులన్" - (ధనుషఖండం-306)

ఇక రాక్షస లోకంలో భయంకరంగా రాక్షసుల దర్పం అణగి పోయేవిధంగా వికటాట్టహాసంతో ఇక మీ పని ఐపోయింది అన్నట్లుగా, భయపెట్టే విధంగా వచ్చేసరికి ఈ రాక్షసుల ఛాతీ భాగానికి, నడుముకు శత్రువుల బాణాలు తలగకుండా కట్టుకున్న శాటికలు, కూర్పాసములు జారిపోయాయట, ఇక కొందరు రాక్షస గర్భంతో ఉన్న స్త్రీలకు ఈ శబ్దం వల్ల గర్భస్రావం జరిగిందట. ఇక మీ రాక్షస వంశం పెరగడానికి అవకాశం లేదు అన్నట్లుగా....

శా॥ "స్ఫీతాష్టాపదవిద్యుదుజ్జ్వల పయఃపీయూషధారాధునీ
నీతాస్వాద్యతర ప్రగల్భవచన స్నిగ్ధాననాంభోజ సం
ధాతీర్థంకర మాగధోల్బణము నానా మేదినీరాట్సభా
గీతిస్వాదు మనోజ్ఞమై ధనువు మ్రోఁగెన్ రాజలోకంబులన్" - (ధనుషఖండం-307)

ఇక ఇతర రాజలోకాలలో రాజమందిరాలలో ఒక్కసారిగా మెఱుపు మెరిసినట్లుగా, ఆ మెఱుపు కూడ స్వచ్ఛమైన బంగారము పోత పోసినట్లుగా మంచి నిగారింపుతో, పాలు మరియు అమృతం రెండూ కలిసినట్లుగా, రాజులందరూ ప్రగల్భవచనాలు పల్కుతున్నట్లుగా, వంది మాగధులు తమని కీర్తిస్తూ మంగళ వచనాలు, స్తోత్ర పాఠాలు పాడుతున్నట్లుగా ఆ శివధనుస్సు విరిగిన శబ్దం వినిపించిందట.

ముగింపు :

ఇలా కల్పవృక్షం ప్రతి పద్యమూ, ప్రతి వర్ణనా, ప్రతి సన్నివేశమూ, అమృతమయమే. అఘ్రాణించే హృదయం ఉండాలి అంతే. మరల నిదేల అంటూనే మనకో ఇక్షు రసంతో నింపి మరో రామాయణాన్ని తెలుగు జాతికి అందించిన విశ్వనాథ ధన్యుడు. అందుకున్న ఈ తెలుగు జాతి, భాష ధన్యమయ్యాయని చెప్పవచ్చు. స్వస్తి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఇది కల్పవృక్షం-వడలి మందేశ్వర రావు.
2. పిబరే రామరసం-శ్రీపాద శ్రీహరి
3. గరికపాటి నరసింహారావు గారి రామాయణ కల్పవృక్షం ఉపన్యాసాలు.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

7. భాస్కర రామాయణం – పరిశీలన

– డా॥. భూక్య తిరుపతి

ఆచార్యులు, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం రామాయణం. ఆదికవి వాల్మీకి. తెలుగు సాహిత్యంలో చంపూ కావ్య రూపంలో వెలువడిన మొట్టమొదటి రామ కథ భాస్కర రామాయణం. దీనిని భాస్కరుడు రచించాడు. కవిత్రయ భారతం, భాగవతం లాగానే ఇది కూడా బహుకర్తృకం. ఇందులో బాల, కిష్కింధా, సుందరకాండములను భాస్కరుని పుత్రుడైన మల్లికార్జున భట్టు, అయోధ్యా కాండమును భాస్కరుని శిష్యుడైన కుమార రుద్రదేవుడు, అరణ్య, యుద్ధకాండ పూర్వ భాగాలను హుళక్కి భాస్కరుడు, యుద్ధకాండ శేషమును భాస్కరుని మిత్రుడైన అయ్యలార్యుడు అనే నలుగురు కవులు రచించారు. ఇంతమంది కవులు రచించినను వీరందరూ భాస్కరుని ఆధ్వర్యంలో గ్రంథ రచన చేయడం వలన దీనికి భాస్కర రామాయణం అనే పేరు ప్రసిద్ధి అయ్యింది. భాస్కరుని పుత్ర శిష్యమిత్ర సహితంగా రాయబడింది భాస్కర రామాయణం. భాస్కర రామయణంను సాహిణి మారన ఆశ్రమంలో రచించబడింది.

ఎర్రన రామాయణం, భాస్కర రామాయణం రెండును సమకాలీక రచనలే. దీని గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ఇలా అంటారు. "రెడ్డి రాజధానిలో ఎఱ్ఱాప్రెగడ రామాయణంను రచించుచుండెనన్న వార్త విని, దాని కంటే ముందు తాను ప్రోత్సహించిన రామాయణము పూర్తి కావలెననెడి ఉత్కంఠతో సాహిణి మారన భాస్కరుని హెచ్చరించగా, ఆ కవి తనకు తోడ్పాటుగా తన కుమారుడైన మల్లికార్జున భట్టును, మారన కుమారుడైన కుమారరుద్ర దేవుని ఆ కార్యంలో నియోగించి తన కుమారునిచే బాల, కిష్కంధ, సుందరకాండములను, మారన కుమారునిచే అయోధ్యకాండమును వ్రాయించి, తాను అరణ్యకాండమును యుద్ధకాండమును గైకొని ఉండును" అని పేర్కొన్నారు. అయితే భాస్కర రామాయణము రచించుటలో ప్రధానుడు భాస్కరుడే. భాస్కర రామాయణ కవులైన మల్లికార్జున భట్టు భాస్కర శబ్దమును, అయ్యలార్యుడు హుళక్కి భాస్కర శబ్దం ప్రయోగించారు. అరణ్యకాండము రెండు ఆశ్వాసములు రచించిన భాస్కరుడు యుద్ధకాండములో కొంత భాగమే చెప్పిన హుళక్కి భాస్కరుడు ఒకరు, ఇద్దరా అనే వాదం కూడా సాహితీ లోకంలో కలదు.

భాస్కర రామాయణం వాల్మీకి రామాయణాన్ని అనుసరించి రాసినట్లు కనబడినను ఇందులో కొన్ని అవాల్మీక అంశాలు ఉన్నాయి. ఈ రామాయణ కవులలో హుళక్కి భాస్కరుడిదే ప్రౌఢ కవిత్వం అని విమర్శకుల అభిప్రాయం.

ఇతని రచనల్లో ఔచిత్యం, రసపోషణ ఎక్కువగా కనిపిస్తుంది. నాటకీయతలో కూడ వ్యంగ్యం తెలిసినవాడు. భాస్కర రామాయణంలో అవాల్మీక అంశాలలో సీతా జన్మ వృత్తాంతం కల్పనతో కూడుకున్నది. భాస్కర రామాయణంలో సీత జననం ప్రకారం ఋష్య శృంగాదుల జననమును పోలి ఉంటుంది. జనకుని మానస పుత్రికగా సీత భూగర్భంలో నుంచి జన్మించినదని చెప్పబడింది.

అలాగే అరణ్యవాసం తొలి ఘట్టంలో రాక్షసుడు సీతను తీసుకుపోతుంటే ఆ ఘట్టంలో రాముడు చేత హుళక్కి భాస్కరుడు పలికించిన తీరు పరిశీలిస్తే

"అని పలికి వినుము లక్ష్మణ జనకదైన్యంబు సూడిద....దొరగెద దనువున్" (అరణ్య 1-20)

సీత లేకపోతే తన బ్రతుకు ఏమవుతుందో అనే విషయాన్ని ఇక్కడ చెప్పించాడు. సీతను రావణాసురుడు తీసుకుని పోతున్నటువంటి సందర్భంలో ఆమె హా రామా! ఓ హా నాథ అని హాహాకారాలు చేసినటువంటి విషయాన్ని 17 పద్యాలలో హుళక్కి భాస్కరుడు వర్ణించాడు. అందులో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే

"అంత నఖిలదిశలు 'హారామ హానాథ' యను నెలుంగు వినుచు నడల దొడగె జనకతనయనీడ
జాడ సింహాది సత్త్వముల గములు వెంట దగులుతుండే" (అరణ్య 2-150).

అలాగే మరో సందర్భంలో సీత లేని పర్ణశాలను రాముడు చూశాడు. అంతా వెతికాడు, సీత ఎక్కడా కనబడలేదు ఆ సమయంలో రాముడి మనస్సు మనస్సులో లేదు. ఆలోచనలు లేవు. అంతా ఆందోళనగా ఉంది. ఆందోళన ఆవేదన తాను తానేనా ఇది నిజమేనా అనే సందేహాలు అన్ని తన మనస్సులో వచ్చి చేరాయి. ఆ సందర్భంలో రాముడు పడిన వేదనను హుళక్కి భాస్కరుడు వర్ణించినటువంటి తీరును చూస్తే

"'ఏయేయి నడుగులు లేనిది యేమరుదో పర్ణశాల యిది గాదొకొ యె రాముడుగానో రాముడు రామం బెడబాసి క్షణంబ్రతుకగ గలడే?" శ్రీరాముని ఆరాటాన్నే కాక అందాల రూపును కూడా హుళక్కి భాస్కరుడు కమనీయంగా వర్ణించాడు. అహల్య రాయిగా శపింపబడినట్లు భాస్కర రామాయణంలో కలదు. మరో కోణంలో రంగనాథ రామాయణాన్ని భాస్కర రామాయణాన్ని పరిశీలిస్తే ఈ రెండింటిలోనూ మంథరకు రామునిపై ఈర్ష్య పుట్టుటకు కారణం తెలుపబడింది. అయితే రంగనాథ రామాయణంలో బాల్యంలో రాముడు మంథర కాలు విరిచినట్లు చెప్పబడిన, భాస్కర రామాయణంలో మంథర రాముని వలన పొందిన చరనతాడన భంగం కారణమని చెప్పబడింది. వాలి వధ ఘట్టము భాస్కర రామాయణంలో ఉన్న మరొక నూతన అంశం అవాల్మీకాంశం. అలాగే తార రావణ సంహారంన సీత లభించినను, అనతి కాలంలోనే, ఆమె భూవివరము జొచ్చి శాశ్వత వియోగ దు:ఖమును కలిగించునని రామునికి శాపం ఇచ్చినది. ఈ శాప వృత్తాంతం ఏ ఇతర తెలుగు రామాయణాలలో కనబడదు. విభీషుని పత్నియైన సరమ హనుమంతుని క్షేమవృత్తాంతమును సీత తెలుసుకున్నట్లు భాస్కర రామాయణంలో కలదు ఇది అవాల్మీక అంశమే.

రావణుని నాభియందు నిగూఢమై ఉన్న అమృతకలశ రహస్యమును విభీషణుడు రామునికి తెలిపినట్లు రంగనాథ మరియు భాస్కర రామాయణంలో రెండింటిలోనూ సమానంగా కనబడుతుంది. రాముని పాత్ర చిత్రణలో రంగనాథ, భాస్కర రామాయణంలో కొంత భేదం కనబడుతుంది. గోనబుద్ధ భూపతి రాముని పురుషోత్తముడుగా పేర్కొంటే భాస్కరుడు మాత్రం రాముని ఉత్తమ పురుషునిగా చిత్రించారు. సీతారాముల వివాహ వర్ణనలో రంగనాథ రామాయణంలో లౌకికమైనటువంటి అంశాలు ఉండగా, భాస్కర రామాయణంలో వైదికపరమైన అంశాలతో రాయబడింది. అలాగే భాస్కర రామాయణంలో ఇతిహాసానికి సంబంధించినటువంటి అంశాలు జోడించబడ్డాయి. వర్ణన చేయడంలో మల్లికార్జునభట్టు వర్ణనలు మితంగా వాడాడు. బాలకాండ ప్రారంభంలో మల్లికార్జున భట్టు

ప్రౌఢప్రబంధ రీతితో చేసిన అయోధ్యాపుర వర్ణన మూలంలో లేదు. మల్లికార్జునుడు మిగతా భాస్కర రామాయణ కర్తల కంటే శబ్దాలంకారాలను ఎక్కువగా వాడాడు. అతని శబ్దాలంకారాలు రసపోషకాలై ఔచితీ శోభితాలుగా ఉంటాయి. ఇతని శబ్దాలంకార ప్రయోగానికి తాటకావర్ణనలోని అంత్యానుప్రాస ఒక ఉదాహరణం.

"పాటిత దుష్ట సత్త్వవన వాటక, నిద్ధ బలావరుద్ధ శృం
గాటక, గ్రంధిలభ్రుకుటి గాఢలలాటక, గ్రూర తారక కా
నాటక, నాంత్ర కాంచి పరిణద్ధ శవప్రవత త్రిమిచ్చటా
కీలక, రక్తసిక్త పటుఖేటక దాటక గాంచిరయ్యెడన్" (బాలకాండము:261)

ఇందులో 'టక' ఏడుసార్లు ఆవృత్తమై తాటక నడక తీరును పారుషాన్ని వ్యక్తం చేస్తుంది. మల్లికార్జున భట్టు రసపోషణ విషయంలో సందర్భానుగుణంగా వివిధ రసాలను సముచితంగా పోషించాడు. విశ్వామిత్రుడు మేనకావశుడు కావటానికి ఆమె సౌందర్యం మూలంలో ఒక్క విశేషణంతో వర్ణింపబడగా మల్లికార్జున భట్టు అనేక విశేషణాలతో వర్ణించి, విశ్వామిత్రుని మోహాంధతకు తగిన భూమికను కల్పించాడు.

"కరికుంభస్తన భారమున్నత తటి త్కల్పప్రియాకారమున్...జరింపంజూచి మోహాంధుడై" (బాల:661) అదేవిధంగా ఋష్యశృంగుని చరిత్రలో హాస్యంతో కూడిన ముగ్ధ శృంగార విషయాలు, కరుణ రసం, వాలి సుగ్రీవుల యుద్ధ సందర్భంలో వీరరసం, మధువనంలో వానర చేష్టలలో హాస్యం చక్కగా పోషించబడ్డాయి.

కుమార రుద్రదేవుని కవిత విశేషాలను పరిశీలిస్తే మిగిలిన ముగ్గురు కంటే మూలాన్ని సంక్షేపించాడు. అయోధ్యకాండలో కవితా శిల్పం అంతగా కనిపించదు. ఇతని కవితల్లో దీర్ఘ సమాస రచన, చిన్న చిన్న దేశ్య పదాలతో కూడిన రచన కనబడుతుంది.

హుళక్కి భాస్కరుని కవితా విశేషాలు పరిశీలిస్తే రచన క్రమాన్ని బట్టి మూడోవాడైన కవితా శిల్పాన్ని బట్టి ఇతను అద్వితీయుడు. మూలంలో జటాయువు వర్ణన 'భీమపరాక్రమం'అని ఒక పదంలో ఉండగా భాస్కరుడు బలితంపు ఱెక్కలు గలిగిన మైనాకకుధరంబు మీఱిన గొప్పమేను అనే సీస పద్యంలో రచించాడు. జటాయువు వర్ణన అతని రూపాన్ని పాఠకుడి కన్నులకు కట్టినట్లు నిలుపుతుంది. రావణ జటాయువుల పోరాటం జటాయువు వీరత్వానికి పోషకంగా ఉంది. అలాగే భాస్కరుడు రాముని పాత్రను ఉదాత్తంగా చిత్రించడంలో అనితర సాధ్యమైన నేర్పు ప్రదర్శించాడు. విభీషణున్ని లంకా సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ని చేస్తున్నప్పుడు, రావణుడు శరణనివస్తే అయోధ్యనిస్తానని రాముడనటం ఇందుకు నిదర్శనం. ఇది లోకంలోని కథల నుండి తీసుకున్నది. సుగ్రీవ దాశరథుల సంభాషణ వాల్మీకి రామాయణంలో కనబడదు. అమూలకమైన ఈ సన్నివేశాన్ని హుళక్కి భాస్కరుడు రాముని పాత్రను ఉదాత్తంగా చిత్రించాడు. సుగ్రీవ రావణుల యుద్ధం చేయుచు పరస్పర అధిక్షేపించుకొను ఘట్టమున గల ఈ క్రింది పద్యంలో నాటకీయత ప్రదర్శించాడు.

'వంచన రాము దేవి గొనివచ్చినయట్టులు గాదు,
కోరిన...నను జయించుట నీకు నటంచు నవ్వినన్'. (యుద్ధకాండ:485)

హుళక్కి భాస్కరుడు సేతు నిర్మాణ సందర్భంలో చేసిన చంద్రోదయ, సూర్యోదయ వర్ణనలు ఉత్ప్రేక్షాదులతో కూడి సంక్షిప్తములై ప్రకృతి కథా సందర్భము కలిగి ఉన్నవి.

'కంటికి గూర్కు లేక దశకంటునిచే బడు లోకమింక ని...
గైరవబంధుడు బంధురద్యుతిన్'. (యుద్ధకాండ:274)

హుళక్కి భాస్కరుడు రసాది వ్యంజనం కావిస్తూ అనేక పదాలను ఒకే పద్యంలో కూర్చి రచించడంలో నేర్పరి. మండోదరి నీతివాక్యాలకు రావణుడిచ్చిన ప్రత్యుత్తరంలోని పదాలన్నీ వ్యంజకాలే.

"ఎఱిగి యెఱింగి మున్నతడు యెగ్గొనరించెనుదానికై కదా
చెఱగని వచ్చితిం బిదప సీత వృథా కథలింకనేల పెం
పఱబ్రదుకింత తీయనే ఖరాదుల చావునకేమి చింతనీ మఱదలి బన్నమే పగిది మానిని యాగుదు
సంధి చేసినన్" (యుద్ధ:786).

ఇందులో వ్యంగ్యం అతి మనోహరం. హుళక్కి భాస్కరుడు ఎక్కువగా వాడే సామెతల్ని జాతీయాల్ని వాడుతూ అయ్యలార్యుడు యుద్ధకాండ శేషాన్ని రచించాడు. కాబట్టి ఇరువురి రచన చక్కగా అతికిపోయింది. అయ్యలార్యుని రచన మూలానుసారంగానే సాగింది. ఇతనికి వర్ణనాసక్తి ఎక్కువ.

ఆధార గ్రంథాలు :

1. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం (మొదటి సంపుటి) తెలుగు అకాడమి, హైదరాబాదు 2012.
2. జి.వి.సుబ్రహ్మణ్యం (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు) తెలుగు అకాడమి, హైదరాబాదు 2005.
3. వాల్మీకి రామాయణం (శ్రీరాముని దివ్య చరితం) భక్తి వికాస ట్రస్ట్.
4. జి.నాగయ్య (తెలుగు సాహిత్య సమీక్ష) మొదటి సంపుటి. 2003.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

8. తెలంగాణ యక్షగానాలు - రామాయణేతివృత్తాలు

- డా॥. కె. సురేశ్

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

పరిచయం :

తెలంగాణ ఎన్నో కళలకు, కళారుపాలకు పుట్టినిల్లు. తెలంగాణ సంస్కృతిలో జనించి, ఇక్కడి సాహిత్యంలో జవజీవాలను సంతరించుకొని, వేషభాషలలో తెలంగాణ ఉనికిని చాటుతూ తెలంగాణ ప్రజల దైనందిన జీవితంలో భాగమై నిలిచింది తెలంగాణ యక్షగానం. సాహితీప్రకర్ష, ప్రదర్శనావిధి కలిగిన ప్రక్రియగా విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికచింతన పెంపొందించే కళగా ప్రత్యేకంగా విరాజిల్లింది. తెలంగాణలో యక్షగానాన్ని భాగవతం, వీధిబాగోతం లేదా బాగోతం అని పిలుస్తారు. ఇది సంగీత, సాహిత్య, నృత్యాభినయాలతో కూడిన సమాహార కళారూపం.

రామాయణేతివృత్తాలు :

రామాయణకథ మిక్కిలి రమ్యమైనది వినసొంపైనది. రామాయణ కథాసూత్రంతో ముడిపడి, వాల్మీకి కథాసూత్రాన్ని అనుసరించి నడిచినా, అక్కడక్కడ జానపదకల్పనలు జతపడి తెలుగు రామాయణ అంతర్గత కథాంశాలు, అన్య భారతీయభాషలలోని రామాయణ ఘట్టాలు యక్షగాన రామాయణాలలో ప్రవేశించాయి. అయినా రామాయణ కథాంశాలతో కూడిన యక్షగానాలు అజరామరంగా నిలిచిపోయాయి. సీతాకళ్యాణము, సుగ్రీవవిజయం, కుశలవనాటకము, మండోదరిపరిణయం, సులోచనాపరిణయం, మైరావణ చరిత్రము, పరశురామవిజయము, లంకాదహనము, శ్రీరామవిజయము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన ఆధ్యాత్మిక, భక్తి ప్రపత్తులనే కాకుండా శృంగార, వీర, కరుణ రసములకు ఆలవాలమైనవి. వీటిలో కొన్ని యక్షగాన రామాయణ కథాంశాలను విశ్లేషిద్దాం.

సీతాకళ్యాణము :

ఈ యక్షగానం కొత్తపల్లి అనంతయ్య రచించారు. ఈయన కొత్తపల్లి గ్రామము, మెదక్ జిల్లాకు చెందినవారు. దశరథుని పుత్రకామేష్టి యాగముతో ప్రారంభమైన ఈ యక్షగానము రామలక్ష్మణుల బాల్యము, తల్లిదండ్రుల లాలన, విశ్వామిత్రుని ఆగమనము, యాగశాల రక్షణకై రామలక్ష్మణుల ప్రయాణము, తాటకి సంహారము, జనకమహారాజు సీతాస్వయంవరం ప్రకటించుట, శివునివిల్లు విరిచి సీతను చేపట్టిన శ్రీరాముడు అయోధ్యకు

వేంచేయుట మొదలగు కథా ఘట్టాలతో ఆద్యంతము కడుమనోహరమై వెలసిందీ యక్షగానము. ఇందులో వాద సంవాదములు, ఏలలు, జంపె, కురుజంపె మొదలైన తాళగతులు, కందము, ద్విపద, సీసార్ధములు మిక్కిలి శ్రవ్యమనోహరమై పాడునట్లు ఉన్నాయి.

సుగ్రీవ విజయము :

ప్రముఖ యక్షగాన రచయిత చెర్విరాల భాగయ్య మశురాబాద్ నివాసము. భాగయ్య రచనల్లో వస్తువైవిధ్యము గుర్తింపదగినది. పౌరాణిక గాథల్లో స్వతహాగా కల్పనతో చిత్రవిచిత్రమైన మార్పులు చేశాడు. సీతాన్వేషణలో శ్రీరామలక్ష్మణులు కిష్కంధకు చేరినపుడు సుగ్రీవుడు తన అన్నయైన వాలికి భయపడి దూరంగా వాసము చేయుచున్న సమయంలో రాముడు సుగ్రీవునితో చెలిమి చేసి ఇరువురు ఒడంబడిక చేసికొనుట, ఆంజనేయుని సూక్ష్మబుద్ధి, వాలి బలపరాక్రమములు, దుందుభి అనే రాక్షసుని సంహరించుట, వాలి పోరాటం, తార, రుమ స్త్రీ పాత్రల ప్రవేశం - వాలి వధ - రామునితో వాద సంవాదములు మిక్కిలి రసరంజకముగా సాగుతుంది. కరుణ వీర రసములు సొంపుగా రూపొందించబడ్డాయి.

కుశలవ నాటకము :

ఈ యక్షగానం రచించినవారు వేలూరుకుప్పుస్వామి. ఈయన మెదక్ జిల్లా రామన్నపేటకు చెందినవారు. కథలో దైవప్రార్ధన నింబాచల నృసింహునిపై కలదు. తరువాత అప్సరసలు రాకడ, లోకాపవాదము భరించలేక శ్రీరాముడు గర్భవతియైన సీతాదేవిని అడవిలో విడిచి ఆశ్రమ సమీపంలో వదులుట. అవాల్మీకాంశములెన్నో ఈ యక్షగానములో కనబడుచున్నవి. లక్ష్మణుడు సీతను చంపబోవుట, భూదేవి అడ్డం వచ్చుట. లవకుశులలో ఒకరిని ఎవరో అపహరించడం. అంతలో వాల్మీకి గడ్డిపరక (కుశ)తో ఇంకొక బాలున్ని సృష్టించడం అన్నీ కల్పితములే. మిగతా కథ సవ్యముగానే నడిచింది. రాముని అశ్వమేధయాగం, అశ్వాన్ని బంధించిన లవకుశులు. భరతలక్ష్మణులు బాలురతో పోరులో మూర్ఛిల్లుట. రాముడే స్వయంగా యుద్ధరంగములో అడుగుపెట్టుట. అక్కడ వివరమంతయు రాముడు వాల్మీకి ద్వారా తెలిసికొనుట. ఇందులో దరువులు, రాగములు, వృత్తములు జానపదశైలులతో సాగి అద్భుతముగా యక్షగానము కథాకథనం చేయుటకు తోడ్పడింది. ఇది కరుణ రస ప్రధానమైన యక్షగానము.

మండోదరి పరిణయము :

ఈ యక్షగానం రచించినవారు అణ్ణనాచార్యులు. అంధోల్ తాలూకా, చింతకుంట గ్రామవాసి. ఇతివృత్తము గోకర్ణ క్షేత్రమహాత్మ్యములోని మండోదరి పరిణయము. రావణుడు పాతాళలోకాధిపతియగు మయుని కుమార్తె మండోదరిని వివాహమాడెను. ఆమె అతిలోకసుందరి రావణుడు తన తల్లి కోరిన ఆత్మలింగము కొరకు శివుని చేరి, మోహవశమున పార్వతిని ఇమ్మని కోరినాడు. శివుడు వరములిచ్చి పార్వతిని పొమ్మనెను. నారుదుడు వచ్చి దుర్గ, పార్వతి ఇద్దరిని వేరుగా భావింపజేసి దుర్గను రావణుని వెంబడి పంపెను. అలా మోహపరవశుడై పాతాళలోకము వెళ్ళి మండోదరిని వెంటపెట్టుకొని వచ్చిన రావణుని చూసిన తల్లి ఆత్మలింగము ఏదని ప్రశ్నించగా, అవమానభారముతో తిరిగి వెళ్ళాక రావణుడు శివుని మెప్పించి ఆత్మలింగముతో తిరిగి వస్తూ సంధ్యావందనం వేళ అయిందని అక్కడి పశువులకాసే బాలునికి ఆ లింగాన్ని అప్పజెప్పగా దానిని నేలపై పెట్టాడు. ఆ బాలుడే విఘ్నేశ్వరుడు. రావణుడు వచ్చి ఎంత పెకలించినా అంత దృడమైనది. ఆత్మలింగం కొనిపోవడం సాధ్యం కాదని తెలుసుకొని అక్కడే గోకర్ణక్షేత్రంలో మాహాత్మ్యము ప్రతిష్ఠించాడు.

సులోచనా పరిణయము :

ఇది రామాయణ సంబంధమని చెప్పబడినను గజ్జెల నర్సయ్యగుప్త రచించిన కల్పిత కథ. సులోచన ఉన్నది

గాని ఆమె పెండ్లి చెప్పబడలేదు. రావణ - మండోదరిల కొడుకు మేఘనాథుడు (ఇంద్రజిత్తుడు). ఇతని జాతకము చూచి 12వ రోజున పెండ్లి జరుగునని చెప్పిరి. రావణుడు ఇది తప్పించాలని యెంచి, బాలుణ్ణి పెట్టెలో పెట్టి మీనరాజును సముద్రములో నిలిపి నోట్లో పెట్టుకొని ఉండమన్నాడు. అతడు పెట్టెను నోట్లో పెట్టుకొని యుండగా అచటికి గజరాజు వచ్చి యుద్ధానికి దిగాడు. మీననాథుడు చేయునదిలేక పెట్టెను ఇసుకదిబ్బపై పెట్టి గజరాజుతో యుద్ధము చేయుచుండెను.

అంతలో నాగలోకము నుండి నాగరాజు కూతురు సులోచన అక్కడికి వచ్చి పెట్టెను తెరచి చూచి, బాలుని అందానికి ముగ్ధురాలై పెట్టెను నాగలోకానికి గొనిపోయినది. నాగరాజు ఆ బాలునికి తన బిడ్డనిచ్చి లగ్నము చేసినాడు. నారదుడు వీరిని పెట్టెలో పెట్టి పూర్వపు స్థలములో పెట్టమన్నాడు. నాగరాజు అట్లే చేయించినాడు. యుద్ధములో గజరాజు ఓడిపోయెను. మీనరాజు గెలిచెను. తిరిగి ఆ పెట్టెనునోట్లో పెట్టుకొని సముద్రములో నిలిచెను. నారదుడు మీనరాజును రప్పించి పెట్టెను తెరచి చూడుమని రావణునకు చెప్పగా అతడట్లే చేసెను. అందులో కోడలు, కొడుకు కన్పించిరి. కోడలు మామ పాదాలు పట్టుకొని ఆశీస్సులు పొందెను.

మైరావణ చరిత్రము :

ఈ యక్షగానం రచించినవారు కొల్లూరు పురుషోత్తముడు. రామాయణ సంబంధమైనకల్పిత కథ. ఇది రామాయణములో కన్పించదు. అయినా ప్రసిద్ధి చెందిన కథ. శ్రీరాముడు వానర సైన్యముతో లంకపై దండెత్తి రావణ సైన్యాన్ని చంపినాడు. చివరకు రావణుడు మిగిలినాడు. అప్పుడు రావణుడు ఒంటరివాడై రణరంగము నుండి పారిపోయినాడు. తన స్నేహితుడైన పాతాళలోకాధిపతియైన మైరావణునికి విషయాన్ని తెలుపుతూ లేఖ వ్రాసినాడు. అతడు సహాయము చేయుటకు లంకకు వచ్చెను. లంక చుట్టు ఆంజనేయుడు తోకతో కోటను నిర్మించి అందులో రామలక్ష్మణులను నిద్రింపజేసెను. ఇంతలో మైరావణుడు వచ్చి వీరు నిద్రించు విధము తెలుసుకొని, విభీషణుని వేషము ధరించి, ఆంజనేయుని అనుమతిగొని కోట లోపలికి వెళ్ళి నిద్రించుచున్న రామలక్ష్మణులను ఎత్తుకొని పాతాళము చేరెను.

ఇంతలో ఆంజనేయుడు, విభీషణుడు విషయాన్ని గ్రహించి, పాతాళ లోకములో కాళికాదేవికి బలి ఇచ్చుటకు సిద్ధపడిన మైరావణుని జాడను తన (ఆంజనేయుని) కొడుకు అగు మత్స్యవల్లభుని సహాయముగొని మైరావణుని ప్రాణ రహస్యము తెలుసుకొనెను. సప్తసముద్రములు దాటి ఉదుకొండ గుహల్లో తిరిగే ఏడు తుమ్మెదలను తెచ్చి మైరావణుని ముందు నిలుపగా అతడు చనిపోయెను. రామలక్ష్మణులు విముక్తులైరి. సీతను అయోధ్యకు తీసుకొని వచ్చారు. ఇది కల్పిత కథ. ఆంజనేయుని కొడుకు మత్స్యవల్లభుడు, మైరావణుడు విభీషణునిగ మారుట, రామలక్ష్మణులు బంధింపబడుట కల్పితములే.

సీతాస్వయంవరం :

తెలంగాణ యక్షగాన పితామహుడని చెప్పదగిన శ్రీ చెర్విరాల భాగయ్య రచించిన సీతాస్వయంవరం 1950లో ప్రచురితమైంది. శ్రీరాముని పాదధూళి సోకి అహల్య చైతన్యాన్ని పొందుతుందన్న అంశంతో రామాయణ కథా ఘట్టాన్ని రచయిత ప్రవేశ పెడతాడు. యాగ సంరక్షణార్థం రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంబడి వచ్చారు. ఆ సందర్భంలో విశ్వామిత్రుడు వారికనేక శస్త్రాస్త్ర విద్యలు బోధించాడు. రాక్షస సంహారం జరిగింది. యాగం నిర్విఘ్నంగా ముగిసింది. రామలక్ష్మణులను విశ్వామిత్రుడు సీతాస్వయంవర నిమిత్తం మిథిలకు పయనం కట్టించాడు. త్రోవలో అహల్యకు శాపవిమోచనం జరిగింది. జనకుడు విశ్వామిత్రుని అర్ఘ్యపాద్యాదులతో గౌరవించాడు. ఉద్యానవనంలో ఉన్న సీతను రామలక్ష్మణులు చూస్తారు. సీతతో రాముడు మాట్లాడుతాడు. శివధనుర్భంగం చేసి స్వయంవరంలో

తనను చేపట్టమంటుంది సీత. రాముడొక అర్ధరాత్రి ఎరుకత వేషం ధరించి సీతకు ఎరుకత చెబుతాడు. చివరికి తన నిజస్వరూపం చూపి అదృశ్యమైపోతాడు.

మరుసటిరోజు జరిగిన స్వయంవరానికి వివిధ దేశాధీశులు వస్తారు. ధనస్సును చూచి భయపడతారు. రావణుడు శివధనుర్భంగం చేయబోయి భంగపడతాడు. ఈ శివధనుర్భంగం చేసి సీతను పరిగ్రహించే వీరులు ఈ క్షత్రియులలో లేరా అని జనకుడు ప్రశ్నిస్తాడు. విశ్వామిత్రుని అనుమతితో రాముడు శివధనుర్భంగం చేస్తాడు. సీతరాముని మెడలో మాల వేస్తుంది. జనకమహారాజు దశరథునికి ఆహ్వానం పంపిస్తాడు. చైత్ర శుద్ధ నవమినాడు సీతారాముల వివాహం జరుగుతుంది. ఇది సీతా స్వయంవరం సంగ్రహకథ.

అరవై మూడు పుటల ఈ యక్షగానంలో మొదటి 25 పుటలు అహల్య కథే నడచింది. ఆ పిదపనే స్వయంవర కథ కొనసాగింది. ఇది వాల్మీకి బాలకాండలోని కథను అనుసరించిన యక్షగానమే. అయితే ఇంద్రునికి నారదుని దుర్బోధ, రాముని ఎరుకత వేషం, ఉద్యానవనంలో స్వయంవరానికి పూర్వమే సీతా సందర్శనం - సంభాషణం, శివుని విల్లు ఎత్తడానికి వచ్చిన రాజుల అనుచిత వ్యవహారం, రావణుని గర్వభంగం మొదలైన ఘట్టాలన్నీ అవాల్మీకాంశాలే.

ముగింపు :

ఇటువంటి రామాయణాది ఇతివృత్తాలు ప్రయోగ సందర్భంలో ఎటువంటి ఇబ్బందులకు గురికావు. యక్షగాన రంగ పద్ధతిలోనే ప్రదర్శనా సందర్భమున ఎటువంటి అవరోధాలు కలుగకుండా కథ నడిపించే స్వేచ్ఛ ఉంది. కథాకథనంలో ప్రసిద్ధేతివృత్తాల్లో కల్పనలు చేరినప్పుడు మాత్రమే కొన్ని మార్పులూ చేర్పులూ చేసే అవకాశముంది. యక్షగానంలో శృంగార రసపోషణ, హాస్య రసపోషణ ఒక్కొక్కప్పుడు ఆయా నటుల స్థాయిని బట్టి, ఆయా మండలాల్లోని ప్రజల అభిరుచిని బట్టి దిగజారిపోయి రసాభాసం జరిగే పట్టులే ఎక్కువ. ఇందులో కూడా ఆ సన్నివేశాన్ని సరిగా నిర్వహించనప్పుడు రసాభాసం తప్పదు. అయితే రామాయణంలోని అనేక సన్నివేశాలను సంగ్రహించి, వందలాది యక్షగానాలు నిర్మితమయ్యాయి. తెలంగాణలో గత మూడు వందల సంవత్సరాలుగా ప్రజలను అమితంగా ఆకట్టుకున్నది పౌరాణిక ఇతివృత్తాలు కలిగిన యక్షగానాలే. అందులో రామాయణంలోని పాత్రలు తెలుగువారికి అత్యంత ప్రియమైన కథాంశాలుగా ప్రజాజీవనంలో భాగమయ్యాయి. ఇది ఒక సాంస్కృతిక వారసత్వంగా పురాగాథలను ఒక తరం నుండి ఇంకొక తరానికి ప్రసారం చేయబడుతున్న వారథులుగా యక్షగానాల పాత్ర బహూ ప్రశంసనీయం.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర. ఎస్వీజోగారావు.
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. సురవరం ప్రతాపరెడ్డి.
3. తెలంగాణలో యక్షగానం రచన - ప్రయోగం. పొద్దుటూరి ఎల్లారెడ్డి.
4. తెలంగాణ యక్షగాన వాఙ్మయము. మొరంగపల్లి శ్రీకాంత్ కుమార్.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

9. తందనాన రామాయణము - కల్పనల ఔచిత్యం

- డా॥. మట్టా సంపత్కుమార్ రెడ్డి
తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), సిద్ధిపేట, తెలంగాణ.

పరిచయం :

భారతీయ ధార్మికచింతనకు, మానవీయ విలువలకు, పటిష్టమైన కుటుంబవ్యవస్థకు నిలువెత్తు నిదర్శనం రామాయణం. సంస్కృతంలో వాల్మీకి రాసిన రామాయణం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషల్లోకి అనువాదమైంది. తెలుగులో 12వ శతాబ్దంలో గోనబుద్దారెడ్డి రాసిన "రంగనాథ రామాయణం"నుండి నేటి వరకు ఎందరో కవులు రామాయణాన్ని తెలుగులో వివిధ ప్రక్రియల్లో అనువాదం చేసారు. ఒక్కో ప్రక్రియ సమాజంలోని ఒక్కో వర్గానికి దగ్గరగా రామాయణాన్ని తీసుకెళ్ళింది. సామాన్య జన బాహుళ్యంలో పామరజనులకు సంబంధించిన ప్రదర్శనకళలను, జానపదసాహిత్యాన్ని చాలావరకు పండితులు చిన్నచూపు చూసారు. అలాంటి పరిస్థితుల్లో పండిత కుటుంబంలో పుట్టి శారదకాండ్ల బాణీకి ప్రభావితుడై అదే పద్ధతిలో తందనాన రామాయణం రాసి ఉత్తర తెలంగాణలో ఊరూరా రామనామాన్ని ప్రచారం చేసిన వాగ్గేయకారుడు విధుమౌళిశాస్త్రి. మాత్రచంధస్సులో సాగే దేశీకవితాకావ్యం తందనాన రామాయణం. చక్కని ఊనికతో కోలాటం, తిరుగుడుచప్పట్లు వంటి జానపదనృత్యాలకు అనుగుణంగా ఒదిగిపోయి ప్రజలనోట చిరస్థానం సంపాదించుకుంది. వాల్మీకి రామాయణంలో లేని సరికొత్త కల్పనలతో జానపదులను రంజింపజేసిన ఈ తందనాన రామాయణంలోని కల్పనల ఔచిత్యాన్ని తెలియజేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

కీలకపదాలు : తందనాన, మాత్రాఛందస్సు, జానపదబాణీలు, అవాల్మీకము, ఔచిత్యము, కల్పనాచాతుర్యం.

వ్యాసవివరణ :

రచయిత పరిచయం :

తందనాన రామాయణం కావ్యకర్త శ్రీ రుక్మాభట్ల విధుమౌళిశాస్త్రి గారు. ఈయన 1914 ఏప్రిల్ 7వ తేది రోజున సిద్ధిపేట జిల్లా గజవెల్లి (గజ్వేల్) గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు విఠల రాజయ్య శాస్త్రి, వెంకమ్మలు. విధుమౌళిశాస్త్రి చిన్నతనంలో రుక్మాభట్ల నర్సయ్య దంపతులకు దత్తపుత్రునిగా వెళ్ళినందున వీరి ఇంటిపేరు రుక్మాభట్లగా మారింది. గురువు శ్రీ యతివర భావానందస్వామి వారి నుండి "ఆధ్యాత్మ రామాయణం" పారాయణం చేయమని పొందిన ఆదేశం అనంతర కాలంలో "తందనాన రామాయణం" రచనకు ప్రేరణ అయింది. విధుమౌళిశాస్త్రి

తొలి రచన "తందనాన రామాయణం"తోపాటు దశావతార చరిత్ర, కృష్ణభజన, శ్రీరామకీర్తనలు, ఎరుకల నాంచారికథ బలుమూరికొండన్న కథ మొదలైన రచనలు చేసాడు. విధుమౌళి శాస్త్రిగారు 1986 నవంబర్ 24న రోజున పరమపదించారు.

"తందనాన రామాయణం" రచన నేపథ్యం :

గజ్వేల్ వాస్తవ్యులైన విధుమౌళిశర్మ గారు హరికథాగానంలో మిక్కిలి ఖ్యాతి గడించిన పండితులు. ఒకరోజు వారింటికి చంద్రయ్య-మల్లమ్మ అనే శారదకాండ్ల దంపతులు కిన్నెర మీటుకుంటూ, తందానతానే అని పాడుకుంటూ యాచించడానికి వచ్చారు. వారి గానంలో లయాత్మకత విధుమౌళి గారిని ఆకర్షించింది. ఆ బాణీని తందానేతానే లయను పదేపదే నెమరువేసుకుంటూ ఈ జానపద బాణిలో రామాయణ రచన చేసినట్టయితే ప్రజలకు బాగా చేరువవుతుందని భావించాడు. వారంరోజుల పాటు చంద్రయ్య-మల్లమ్మ దంపతులను తన వద్దనే ఉంచుకొని వారు పాడే తందానతానే పాటలు విని ఆ బాణీపైన పట్టుసాదించాక రామాయణ రచనకు పూనుకున్నాడు. రచనా కాలం నాటికి విధుమౌళిశాస్త్రి గారికి కొంత దృష్టిదోషం ఉండటం వల్ల ఆయన గానం చేస్తుండగా దీకొండ బాలనర్సు అనే లేఖకుడు ఈ రామాయణంను రాసాడు. తందనాన రామాయణాన్ని విధుమౌళిశాస్త్రి తన గురువైన యతివర భావానంద స్వామికి అంకితమిచ్చాడు.

"తందనాన రామాయణం" ప్రచారం :

విధుమౌళిశాస్త్రి "తందనాన రామాయణం" రచించిన తర్వాత తన గురువు ఆదేశం మేరకు ఊరూరు తిరుగుతూ 15 సంవత్సరాల పాటూ దీన్ని ప్రచారం చేసాడు. ఎందరికో ఇందలి బాణీలను నేర్పించి కొత్త బృందాలను తయారు చేసాడు. అనంతరం వీరి కుమారుడు రుక్మాభట్ల నరసింహవాస్త్రి గారు కూడా దశాబ్దకాలం పాటు ఈ రామాయణాన్ని ప్రచారం చేసి ఆడియో రికార్డ్ కూడా చేయించాడు. జనవ్యవహారంలో మిక్కిలి ప్రచారం పొందిన తర్వాత 1952లో మొదట దీన్ని చందా నారాయణశ్రేష్టిగారు ముద్రించారు. ఈ ముద్రణలో రచయితకు ఇచ్చే రాయల్టికి బదులుగా విధుమౌళిశాస్త్రి గారు గజవెల్లి రామాలయానికి గరుడవాహన సేవను చేయించమని కోరాడు. తందనాన రామాయణాన్ని మాతృకగా చేసుకొని వీరి కుమారుడు రుక్మాభట్ల నరసింహశాస్త్రిగారు "గేయ రామాయణం" రాసి విశేష ప్రాచుర్యం పొందాడు.

తందనాన రామాయణం నామౌచిత్యం :

గేయ కావ్యాలకు లయాత్మకత ప్రాణం. తందనాన రామాయణంలో ప్రతిపాదం చివర "తందానతాన" "జయ రామరామ" 2+3+3మాత్రలతో సాగే పదాలు పునరావృత్తం అవుతుంటాయి. దీనివల్ల ఈ రామాయణం అనాయాసంగా సులువుగా పాడుకోవడానికి వీలు కలుగుతుంది. మాత్రాఛందస్సులో రాయబడిన ఈ రచనలో ఆరు రకాల గతులను ప్రత్యేక రీతిలో వాడటం విశేషం. అందుకే ఇది ఇతర రామయణాల లాగా వ్యక్తి పేరుతోనో చందస్సు పేరుతోనో కాకుండా లయాత్మకతను సూచించే తందాన/తందానానా అనే పదం పేరుతో "తందనాన రామాయణం" అని ప్రసిద్ధి చెందింది.

అవాల్మీకాలు-ఔచిత్యవంతమైన కల్పనలు :

"నవనవోన్మేష శాలిని ప్రతిభ" అన్నట్టుగా ప్రతిభ గల కవి అంశాన్ని కొత్తగా చెప్పే ప్రయత్నం చేస్తుంటాడు. విధుమౌళివాస్త్రి తందనాన రామయణంలో చాలా చోట్ల విచిత్రమైన కల్పనలు చేశాడు. అందువల్ల ఈ రామాయణం జానపదులను ఎక్కువగా ఆకర్షించింది. ఈ కల్పనలన్నీ అవాల్మీకాలు. లయాత్మకతతో పాటు వాల్మీకి రామాయణంలో లేని ఈ కల్పనలే తందనాన రామాయణానికి ఒక ప్రత్యేకతను చేకూర్చాయని చెప్పవచ్చు. మూల కథకు ఏమాత్రం

భంగం చేయకుండా పాఠకునికి ఆనందం కలిగించే విధంగా, పండిత పామర జనరంజకంగా ఔచిత్యవంతంగా ఈ కల్పనలు ఉండడం విశేషం.

రామునికి చిన్నతనంలో కోతి సాహసం :

వాల్మీకి రామాయణంలో కిష్కింధకాండలో హనుమంతుడు రాముని కలుసుకున్నట్లు ఉండగా ఇందులో రామునికి చిన్నతనంలోనే హనుమంతుడు కలిసినట్టుగా కొత్త కల్పన చేశాడు.

"థశరథుండు దూతను త్వరగా-జయరామరామ,
తప్పక కిష్కింధకంపెను-జయరామరామ
దూతజేరి వాలిని అడుగ-జయరామరామ,
తోలించెను హనుమని వేగా-జయరామరామ
రాఘవుండు హనుమనిజూచే-జయరామరామ,
రమ్మనుచును చేతులు సాచే-జయరామరామ"

(తందనాన రామాయణము, బాలకాండ, పుట సంఖ్య 19)

చిన్నతనంలో రాముడు తనకు ఆడుకోవడానికి కోతి కావాలని మారాం చేస్తే దశరథుడు కిష్కింధ నుంచి కోతిని తెప్పించాడు. అదే హనుమంతుడని చిన్నప్పటి నుండి హనుమంతుడు రామునితో అతని సోదరులతో కలిసి పెరిగాడని చేసిన కల్పన ఆశ్చర్యపరుస్తుంది. చిన్నపిల్లలకు కోతి వంటి జంతువులతో ఆదుకోవాలని అనిపించడం సహజం. దాన్ని రామునికి ఆపాదించి హనుమంతున్ని రాముని చిన్నప్పటి స్నేహితుడిగా చేర్చి వారి ఆత్మీయ అనుబంధాన్ని బలపరిచే విధంగా చేసిన ఈ కల్పన ఔచిత్యవంతంగా అనిపిస్తుంది.

పతంగి దారం ఆధారంగా హనుమంతుడు ఇంద్రలోకానికి వెళ్ళి రావడం :

పిల్లలాడుకునే గాలిపటం దారం ఆధారంగా హనుమంతుడు స్వర్గానికి వెళ్ళినట్టు చేసిన కల్పన అభూతంగా కనిపించినా భవిష్యత్ కథలో హనుమంతుని సముద్రలంఘనం వంటి ఘనకార్యాలకు ఇది ప్రారంభమేమో అనే భావన కల్గిస్తుంది.

"తమ్ముళ్ళతో మారుతి తోడ-జయరామరామ, తరలిరాముడాటల నాడ-జయరామరామ
సరయునది తీరముజేరి-జయరామరామ, త్వరను పతంగము విడిచిర-జయరామరామ,
పతంగం స్వర్గం వరకు-జయరామరామ, పారినచట భామ కనుటకు-జయరామరామ,
హా జయంతు వనితగాంచెను-జయరామరామ, అపుడు భయమువీడి పట్టును-జయరామరామ,
పతంగము బట్టిరి హనుమ-జయరామరామ, పట్టుకొనగ వేగమె బొమ్మ-జయరామరామ,
ఈ సూత్రముపట్టి వెడలుము-జయరామరామ, ఇపుడా స్వర్గమ్ము చేరుము-జయరామరామ,
హనుమంతుడు సూత్రము ముట్టి-జయరామరామ, జనెనప్పుడు మార్గము బట్టి-జయరామరామ,
ఆ జయంతు భార్యను గాంచి-జయరామరామ, హనుమడంత మ్రొక్కి వచించే-జయరామరామ,
మా పతంగి మాకిడు మమ్మ-జయరామరామ, మా రాముని దౌనో యమ్మ-జయరామరామ

(తందనాన రామాయణము, బాలకాండ పుట-20)

రాముడు తన తమ్ముళ్ళు, హనుమంతునితో కలిసి గాలిపటాలెగరవేయడం సహజకల్పనే అయినా అది స్వర్గానికి చేరెట్టు ఎగరడం, అక్కడ జయంతుని భార్య పట్టుకోవడం విచిత్రంగా తోస్తుంది. అందులోనూదారం ఆధారంగా హనుమ స్వర్గానికి చేరడమనే ఆలోచన పిల్లవాడయిన రాముడు చేయడం విచిత్రమైనప్పటికీ అది వారి సహజాతంగా

తోస్తుందని చెప్పవచ్చు. ఇలా సహజము, విచిత్రము అయిన కల్పన ఈ రామాయణాన్ని జనబాహుళ్యానికి మరింత దగ్గర చేయగలిగింది.

జయంతుడు కాకాసురుడు కావడం :

ఇంద్రుని కుమారుడు జయంతుడు. అతని భార్య ఒకసారి రాముని అందాన్ని మెచ్చుకోగా ఈర్ష్యతో జయంతుడు కాకాసురునిగా మారి అరణ్యవాసంలో సీతారాములను బాధించాడని చేసిన కల్పనలో కూడా సహజత్వం కనిపిస్తుంది.

> "చిత్రకూటగిరి గుహనుండా-జయరామరామ, శ్రీరాముడు నిద్దురనుండా-జయరామరామ,
> జయంతుని భార్య వచ్చెను-జయరామరామ, జయరాముని చూచి మెచ్చెను-జయరామరామ,
> సతిసంతసమొందుచు చనెను-జయరామరామ, సత్వరమున బతికిటులనెను-జయరామరామ,
> శ్రీరాముని సొగసు ముందర-జయరామరామ, చేరదు నీ సొగసు ఎందున-జయరామరామ,
> జయంతుడు తాపమందెను-జయరామరామ, జనె రాముని వంచింపగను-జయరామరామ,
> కాకరూపమంది వెడలెను-జయరామరామ, పోకిరి చేష్టలను చేయును-జయరామరామ,
> సీత యూరునందు శిరమ్ము-జయరామరామ, చేరి పవ్వలించు ముదమ్ము-జయరామరామ,
> కాకాసురుండు చుంచుచే-జయరామరామ, లోకమాత బొటననుచీల్చే-జయరామరామ,
> రక్తమపుడు చిల్లుకొనంగ-జయరామరామ, రాముడపుడు మేలుకొనంగా-జయరామరామ,
> రాఘవుండు క్రోధము పెంచి-జయరామరామ, రయమున ఒక తృణమును చుంచి - జయ
> రామరామ,
> బ్రహ్మాస్త్రము చేసి పంపగా-జయరామరామ, భగ్గు మని మంట లెగియగా -జయరామరామ",
> (తందనాన రామాయణము, అరణ్యకాండ, పుట సంఖ్య 48)

జయంతుని భార్య రాముణ్ణి చూసి మెచ్చుకోవడం కల్పనే అయినప్పటికీ, అందుకు జయంతుడు కోపించడం సహజంగానే తోస్తుంది. ఎంతటివాడయినా తన ముందు ఇతర మగాడి అందాన్ని పొగిడితే సహించలేడు. ఈర్ష్య పొందుతాడు. ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తాడు. అందుకు జయంతుడైనా మినహాయింపు కాడు. ఇట్టి సహజమైన భావనను జయంతునికి ఆపాదించడం, అతడు ప్రతీకారం కాకాసురునిగా మారడమనే కల్పన చేయడం కథకు తగ్గట్టుగా కుదిరింది.

సప్తతాళ భేదనం వెనుక ఉన్న రహస్యం :

వాలి తినడానికి తెచ్చుకున్న తాటి పళ్ళు తక్షకుని కొడుకు తినగా వాలి ఆ పామును నరికి చంపడం, అందుకు కోపించిన తక్షకుడు ఈ ఏడు తాటిచెట్లు ఒకే బాణంతో నరికిన వాడి చేతిలో వాలికి చావు కలగాలని శపించడం అనే కల్పన ద్వారా రాముని వీరత్వాన్ని తెలిపే "సప్తతాళభేదనం"కు కారణమైన కథను ఔచిత్యవంతంగా తీర్చిదిద్దినట్లు తోస్తుంది.

> "వాలి తాటి ఫలములు ఏడు-జయరామరామ, వాంఛతోడ త్రెంపెను నాడు-జయరామరామ,
> సంధ్య కాలమాయెను త్వరగా-జయరామరామ, సంధ్యావందనం చేయగా-జయరామరామ,
> కోరిఫలములచ్చట నిలుప-జయరామరామ, సరోవరము తీరము పైన-జయరామరామ,
> సర్పమా ఫలములు మెక్కి-జయరామరామ, సరగుణ తన విషమును గ్రక్కే-జయరామరామ,
> తునకలటకు పారవేయగా-జయరామరామ, ఘనవృక్షములాయ చూడగాజయరామరామ,
> తక్షకుడా చెట్టుల జూచే-జయరామరామ, తన తనయుండంచును వగచే-జయరామరామ,

వాలినాదు కొడుకును చంపే-జయరామరామ, వాని జంపు శాపము నింపే-జయరామరామ,
సప్తతాళవృక్షములెవరు-జయరామరామ, శరము వేసి కూల్చెడివారు-జయరామరామ,
వారి వలన చచ్చునట్లుగా-జయరామరామ, వాలికంత శాపమిచ్చేగా-జయరామరామ (తందనాన రామాయణము, కిష్కంధకాండ పుట:65)

రామాయణంలో "సప్తతాళభేదనం" ప్రసిద్ధ ఘటన. వాలిని చంప గల శక్తి రామునికి ఉందో లేదో తెలుసుకోవడానికి సుగ్రీవుడు పెట్టిన పరీక్ష ఇది. ఇందుకోసం ఆ ఏడు తాటిచెట్లు వరుసగా మొలవడానికి కారణాన్ని సృష్టించాడు. అయితే ఈ కల్పనలో కూడా కొడుకును పోగొట్టుకున్న తండ్రి ఆవేదనను తక్షక శాపం రూపంలో కల్పించడం సహజమైన విశేషం.

హనుమంతుని తోకకు సీతమ్మ కోక :

హనుమంతుడు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రానికి కట్టుబడి రావణ సభలో నిలబడి సీతమ్మను తిరిగి రామునికి అప్పగించమని హెచ్చరించాడు. కోపగించిన రావణుడు హనుమంతుని చంపమని ఆజ్ఞాపించగా విభీషణుడు అడ్డుకుని దూతను చంపడం అధర్మమని అవసరమైతే అవమానం చేసి పంపమని చెప్పాడు. వానరులకు బలమైనది తోక. ఆ తోకను కాల్చివేసి అవమానపరచాలనుకున్నాడు రావణుడు. కానీ ఆ తోకను కాల్చడానికి ఎంత ప్రయత్నించినా వీలు కాలేదట. అక్కడ గమ్మత్తయిన కల్పన చేశాడు.

"తమ్ముని వాక్యమ్మును మెచ్చి-జయరామరామ, తిమ్మని వాలమ్మునుగాల్చి-జయరామరామ,
పంపుట మేలనచును దలచే-జయరామరామ, బట్టలు కొని రమ్మని పిలిచే-జయరామరామ,
సేవకులు గుడ్డలు బట్టి-జయరామరామ, చేరి కోతి తోకను చుట్టి-జయరామరామ,
తోక పెంచబూనె హనుమడు-జయరామరామ, కోకలెన్నో చాలకప్పుడు-జయరామరామ,
దనుజులకు వేసెటబుట్టి-జయరామరామ, అనుమనిపై కోపము పుట్టి-జయరామరామ,
దనుజుడు పలికె-జయరామరామ, అరుగుమన అవనిజ కడకు-జయరామరామ,
సీతకోక తెమ్మని యనగా-జయరామరామ, చిన్నదాయె వాలము కనగా-జయరామరామ
(తందనాన రామాయణము, సుందరకాండ, పుట సంఖ్య-86)

హనుమంతుని తోకకు నిప్పు అంటించడానికి రాక్షసులు తోకకు గుడ్డలు చుట్టారు. ఎన్ని గుడ్డలు చుట్టినా చాలనంతగా హనుమ తన తోకను పెంచాడు. విసిగిపోయిన రాక్షసులు సీతమ్మ కోకలు తెద్దామన్నారు. ఆ మాటలు విని వీరు సీతమ్మ కోక తెస్తే ఆ తల్లికి బాధ అవుతుందని అప్పటిదాకా రాక్షసులను అవస్థ పెట్టిన హనుమ తోకను తగ్గించాడు. ఈ కల్పనలో హనుమంతుని కోతిచేతలు కల్పించబడ్డప్పటికి అదే సమయంలో సీతమ్మ తల్లిపై అవ్యాజమైన భక్తి భావన వెల్లివిరిసేలా చేయడం ఔచిత్యంగా కనిపిస్తుంది.

తోక కంటిన అగ్గితో రావణుని మీసాలు కాలడం :

తోక కంటిన హనుమ కోతి చేష్టలు అంతటితో ఆగలేదు. తనను అవమానింప ప్రయత్నిస్తున్న రావణుణ్ణి కూడా తాను అవమానపరచాలనుకున్నాడు. అందుకు కవి మరో కల్పన చేశాడు. ఈ కల్పన ఒకవైపు నవ్వు తెప్పిస్తూనే అభాసుపాలైన రావణున్ని చూసి అయ్యోపాపం అనిపిస్తుంది. రావణుని ఆదేశంతో రాక్షసులు అతి కష్టం మీద తోకకు బట్టలు చుట్టగలిగారు. కానీ ఎంత ప్రయత్నించినా నిప్పు అంటించలేకపోయారు.

"తైలమపుడు బాగా తడిపిరి-జయరామరామ, వాలమపుడు కాల్చ బూనిరి-జయరామరామ,
వాలమునకు అగ్ని రగలకా-జయరామరామ, ఆలోచన దనుజులమూక-జయరామరామ,

చేసిచేసి హనుమని అడగా-జయరామరామ, చెవిబెట్టి హనుమని వడిగా-జయరామరామ,
లంకాపురి కమ్మరివారు-జయరామరామ, బింకముతో చేరుకున్నరు-జయరామరామ,
కొలిమినందు తోకనుంచిరి-జయరామరామ, గొప్పగా నూదంగా సాగిరి జయరామరామ,
రగులలేదు అగ్ని చూడగా-జయరామరామ, మిగుల నీరసమపుడు పుట్టగా-జయరామరామ,
వారు చాలా అలసటపడిరి-జయరామరామ, వాయుసుతుని అడగబూనిరి-జయరామరామ,
తిమ్మ నీకు తోకేటుకాలు-జయరామరామ, తీవ్రంగా చెప్పుము చాలు-జయరామరామ,
హనుమంతుడు కిలకిలయించు-జయరామరామ, దనుజులతో తానువచించే-జయరామరామ,
దశకంతుడు అగ్ని పెట్టిన-జయరామరామ, తగులునంచు చెప్పే బిరానా-జయరామరామ,
అనుమని వాక్యమ్మును వినిరి-జయరామరామ, అంత రావణునకు తెలిపిరి-జయరామరామ,
ధశాననుడు తమ్ముని చేరి-జయరామరామ, త్వరగనగ్ని చేరెను కోరి-జయరామరామ,
అగ్ని యందు వాలము నుంచే-జయరామరామ, అప్పుడు తానూదగ తగచే-జయరామరామ,
మంటలు దశముఖుని మీసము-జయరామరామ, మాడ్చి వేయ అవమానమ్ము-జయరామరామ,
కలుగవాయ దశకంతునకు-జయరామరామ, కదిలిపోయే వాడు సిగ్గుకు-జయరామరామ
(తందనాన రామాయణము, యుద్ధకాండ, పుటా87)

హనుమంతుని తోక ఎలా కాలుతుందని హనుమంతున్నే అడగడం విచిత్రం. రావణునంతటివాడు హనుమంతుని మాట నమ్మి కొలిమిలో తోక నుంచి తానే అగిగపుట్టించాలని ప్రయత్నించడం, ఒక్కసారిగా అగ్గి రాజుకొని మంటలెగసి రావణుని మీసాలు కాలిపోవడం, ఆ అవమానంతో అక్కడి నుండి సిగ్గుతో రావణుడు వెళ్ళిపోవడం ఈ కల్పనలన్నీ ప్రతినాయకుడైన రావణుని స్థాయిని దిగజార్చి చూపెడుతూ హనుమంతునికి గొప్ప వీరునిగా తెలియజేస్తాయి. జానపదులు కోరుకున్న ఇలాంటి కల్పనలు చేయడం వల్లనే దీనికి ఇంతటి ఆదరణ లభించిందని చెప్పవచ్చు. హనుమ మాటలు విని రావణుడు వచ్చి మీసాలు కాల్చుకోవడం రసాభాసమైనా కూడా ప్రతినాయకుని వ్యక్తిత్వం తగ్గించి చెప్పడం సరయినదనే జానపదులు భావించడం ఔచిత్యమే కదా.

ఆశ్చర్యపరిచే అవాల్మీకాలు :

పైన తెలిపిన విచిత్రమైన కల్పనలతో పాటు మాయా సీతా నిజ సీత వృత్తాంతాలు, వాలి వలన మండోదరికీ అంగదుడు జన్మించడం, అక్షయుడు ఉన్నంతవరకు లంకలోనికి రావద్దని విశ్వావసు బ్రహ్మ అంగదుడిని శపించడం, విభీషణుని సహాయముతో హనుమంతుడు సీతమ్మజాడ తెలుసుకోవడం, వారధి నిర్మాణం కోసం హనుమంతుడు తెచ్చిన గోవర్ధనగిరి కొండను బృందావనంలో ఉంచడం, యుద్ధంలో లక్ష్మణుడు రెండుసార్లు మూర్ఛపోవడం, పన్నెండు ఏళ్ళు నిద్ర లేని వారిచేతిలో ఇంద్రజిత్తుకు మరణం అనే శాపం, తెలంగాణలో మిక్కిలి ప్రచారంలో ఉన్న రామలింగేశ్వర ప్రతిష్టలో హనుమంతుడు కాశీ నుండి లింగం తెచ్చే కథ ఇవన్నీ వాల్మీకి రాసిన రామాయణంలో లేకుండా తందనాన రామాయణంలో కొత్తగా కల్పించబడ్డ విశేషాలు. ఇవి కల్పనలే అయినప్పటికీ సహజమని భావన కలిగేలా చేయడం, కొన్ని చోట్ల హేతుబద్ధత లేకున్నా అందలి కారణం కన్నా విచిత్ర కల్పన పట్లనే దృష్టి పడేలా వర్ణించడం ఔచిత్యవంతంగా కనిపిస్తుంది.

ఉపసంహారం :

సాధారణంగా జానపదులు తమకు దగ్గరగా ఉండే పాత్రలతో తాదాత్మ్యం చెంది ఆనందిస్తారు. వింతగా ఉండే కథలకు అబ్బురపడతారు. అందుకే ఈ కావ్య రచనలో గమ్మత్తయిన, విచిత్రమైన అంశాలను వివిధ రకాల

రామాయణాలనుండి, జన వ్యవహారంలో ఉన్న గాథలు కొన్నింటిని తీసుకొని విధుమౌళి శాస్త్రి కొత్త కల్పనలు సృష్టించాడు. ఇవి ఔచిత్యవంతంగా ఉండి అందరికీ ఆనంద ఆశ్చర్యాలను కలిగించాయి. అందువల్లనే తందనాన రామాయణం జానపదులలో విశేషంగా ప్రచారంతో పాటు ఆదరణ పొందింది.

ఆధార గ్రంథాలు :

1. తందనాన రామాయణం, రుక్మాబట్ల విధమౌళి శాస్త్రి, శ్రీ సిద్ధేశ్వర పబ్లికేషన్స్ హైదరాబాదు. 2015.
2. రామాయణం వచనానువాదం, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రగతి పబ్లిషర్స్.2019.
3. శ్రీరుక్మాబట్ల నరసింహ శాస్త్రి గారితో ఇంటర్వ్యూ.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

10. రామాయణము - ఆదర్శజీవనము

- డా॥. హెచ్. వామనమూర్తి

సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్, తెలంగాణ.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్,
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్

భూమిక :

రామాయణము భారతీయులకు జీవన విధానము బ్రతుకు విలువలను, జీవితాదర్శములను అందించినది. ఈ జాతి జీవన విధానముపై రామాయణము ప్రభావము ఎంతగానో ఉంది. ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ ధర్మ రక్షణకు, ధర్మ ఆచరణకు విఘాతం కలుగుతుందో, అప్పుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కొరకు ధర్మాన్ని తిరిగి నిలబెట్టడానికి భగవంతుడు అవతరిస్తూనే ఉంటాడు. అన్నింటికీ అతీతుడై శాశ్వత సచ్చిదానంద రూపంలో అవతరిస్తాడు. వివిధ రూపాలలో అవతరించినపుడు ఎన్నో అద్భుతాలు జరిగినవి. కృష్ణునిగా అవతరించినపుడు పూతనాది రాక్షసులను నిర్జించడం, గోవర్ధనోద్ధరణం వంటివి వివిధ అవతారాలలో ఎన్నో అద్భుతాలను విశేషాలను చూపించినాడు. అదే విధంగా శ్రీరామునిగా అవతరించినపుడు ధర్మాచరణ నిమిత్తం రాక్షస సంహారం, రావణ వధ వంటివి అధ్భుతములు రామాయణంలో కనిపిస్తాయి. ఒక సాధారణ మానవ రూపంలో, మానవ వ్యక్తిత్వంతో రాముడు జీవనం గడిపి ఎన్నో లీలలను ఆస్తిక జనులకు అందించాడు. వేల సంవత్సరాలుగా శ్రీరాముని చరిత్ర ఆస్తికజన సమూహానికి ఎంతో మానసిక శాంతిని, ఆధ్యాత్మిక భావాలను, ఆనందాన్ని ప్రసాదిస్తూనే వచ్చింది. రాముని లీలలకు సంబంధించిన కథలు ప్రతి మనిషిని ఉత్తేజితం చేశాయి. భారత ఇతిహాసములుగా ప్రఖ్యాతి పొందిన భారత భాగవత రామాయణాలలో రామాయణం అందరి నోళ్ళలో నేటికీ విశేషంగా ఆదరించబడుతుంది. ధర్మరక్షణ కోసం, మనిషిగా అవతరించడం అందరికి ధర్మ పథాన్ని నిర్దేశించడం కనిపిస్తుంది.

రామాయణం - వైశిష్ట్యం :

తెలుగు సాహిత్యంలో వాల్మీకి రామాయణ మార్గదర్శనంలో అనేక రామాయణాలు ఆవిర్భవించాయి. రామాయణం మానవ జీవన సంస్కృతికి ప్రతి రూపంగా నిలిచిన కారణంగా జాతి, మత, వర్గ, వర్ణాలతో సంబంధం లేకుండా రామాయణం మానవాళితో మమేకమయింది. జానపదులలో ద్విపదలు, ప్రబంధ, శతక, గేయ, యక్షగాన, సంకీర్తన

పదాలు రూపాలలో అవతరించినది. రామాయణం రామనామం అందరినీ తరింపజేసింది. తెలుగు నాట ప్రతి దేవాలయంలో ప్రవచనాలుగా, హరికథలుగా, బుర్ర కథలుగా, పాటలు గేయాల రూపంలో రామాయణం మానవాళిని కర్తవ్య నిర్వహణకు ఉత్తేజపరచింది. కర్తవ్య నిర్వహణలో ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కోవడం అనేది రామాయణం నుండి ప్రతి ఒక్కరు నేర్చుకోదగినది. రాముడు నిర్వహించిన ప్రతికార్యము సర్వజన హితమై, మానవాళికి కర్తవ్య నిర్వహణను తెలిపినది. రాముడు ధర్మ రక్షణ కోసం, లోకోద్ధరణ కోసం నిర్వహించిన ప్రతీ కార్యము మనం అనుసరించదగినది. మానవాళికి మనిషిని మనీషిగా ఎలా బ్రతకాలో నేర్పిస్తుంది. ఆదర్శవంతమైన గుణములు, కుటుంబ జీవనం, నైతిక విలువలు వీటన్నింటి మూలాలను రామాయణంలో ప్రతిష్టించినారు. వేల సంవత్సరాల తరువాత కూడా నాటికీ, నేటికీ ఆదర్శవంతమైన జీవితం ఎలా ఉండేది అనే విషయం ప్రతి మనిషికి గుర్తుకు వచ్చే విధంగా సీతారాములు కనిపిస్తారు. శ్రీరాముని కాలంలోని జనుల గురించి చేయబడిన వర్ణనలు కొన్ని దేవతలు మానవ రూపంలో అవతరించినారని అనిపించేటట్టుగా పాత్రలు సృష్టించబడినాయి. అందుకే రామాయణం

యావత్ స్థాస్యంతి గిరయః, సరితశ్చ మహీతలే,
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి.

ఈ జగత్తులో కొండలు నిలకడగా ఉన్నంత వరకు, నదులలో నీరు ప్రవహిస్తున్నంత వరకు రామాయణకథ సమస్త లోకాలలో ప్రచరిస్తుందని అర్థం. రామాయణంలో సీతారాములు సామాన్యుల దృష్టిలో భార్యాభర్తలు. కాని వారిని ఆదర్శదంపతులుగా భావించి ఆరాధించడం మన అందరికి ఆచారమయింది. నూతన వధూవరులను సీతారాముల ప్రతిరూపములుగా ఊహించుకొని పెళ్ళిళ్ళలో రామాయణమునకు చెందిన పాటలు పాడుకోవటం పరిపాటయింది. శ్రీ సీతారాముల కళ్యాణము చూతము రారండి...ఆనంద మానంద మాయెనే శ్రీరాముడు పెళ్లి కొడుకాయెనే, జానక్యా కమలామలాంజలి పుటే....మొదలయినవి పాటలు పారవశ్యముతో పాడుకొంటారు. ఈ తంతు అంతా సీతారాములు కేంద్ర బిందువుగా నడుస్తాయి. అందరి జీవితాలకు సీతారాముల దాంపత్యం ఆదర్శంగా, ఆరాధ్యంగా నిలిచి అనుసరణీయమైనది.

రామాయణం - పాత్రల విశ్లేషణ :

మహాభారతం ఒక సాంఘిక ఇతివృత్తంగా, భాగవతం ఒక ఆధ్యాత్మిక గ్రంథంగా, రామాయణం ఆదికావ్యంగా, ఆదర్శప్రాయమైనదిగా నిలిచినది. శ్రీ రాముని మొదలు ఇందలి ప్రతి పాత్ర అనుసరణీయమైనది.

వశిష్టుడు :

రామాయణంలో భారతీయ సంస్కృతిని, మానవీయతను కాపాడే వర్గంలో భాగంగా వశిష్టుడు కుల గురువుగా నిలిచినాడు. చాతుర్వర్ణ వ్యవస్థలో సంస్కృతిని పరిరక్షించే బాధ్యత గురు వర్గానికే అప్పచెప్పబడినది. వశిష్టుడు తన సర్వశక్తులను, విద్యలను ధర్మరక్షణ, ధర్మాచరణ కొరకు ఉపయోగించినాడు.

విశ్వామిత్రుడు :

రామాయణంలో ఉత్తమ గురువుగా కనిపిస్తాడు. కామధేనువు పుత్రిక నందినీ ధేనువు విషయంలో వశిష్టునితో గొడవపడి చివరికి వశిష్ట విశ్వామిత్రులు ఒక్కటవుతారు. అక్కడి రాక్షస కృత్యాలను నియంత్రించుటకు రాజుకు నచ్చచెప్పి వశిష్టుడు విశ్వామిత్రుడిని రామలక్ష్మణులకు రణనీతి, యుద్ధనీతి, రాజనీతి నేర్పుటకు నియమిస్తాడు. వశిష్ట విశ్వామిత్రులు ఏకమై, దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు పూనుకొన్న వైనం రామాయణంలో ప్రకటితమవుతుంది.

రాముడు :

"రామో విగ్రహవాన్ ధర్మః" అన్నది రాముని మహనీయతను ప్రతిపాదించే వాక్యము. రాముడు మర్యాదా

పురుషోత్తముడు. రాముని మాతృభక్తి జనులందరికీ అనుసరణీయం. కైకేయి రాముని పట్ల కఠినంగా ప్రవర్తించినా ఏనాడు కైకేయి పట్ల భక్తి ప్రపత్తి వీడలేదు. పితృవాక్య పరిపాలన, భ్రాతృప్రేమ, స్నేహశీలత, కృతజ్ఞత, కర్తవ్యనిష్ఠ, శరణాగత వాత్సల్యములకు రాముడు నిలయము.

సీతమ్మ :

సహనానికి ప్రతీకగా, ఆదర్శ మహిళగా, కుల స్త్రీగా, వ్యవహార కుశలత, శాస్త్ర నైపుణ్యం, కర్తవ్యనిష్ఠ, ఆత్మసమర్పణ మొదలగు గుణసంపదలతో సీతాదేవి రామునికి ఆత్మసమర్పణ చేసినది. సీతను అయోనిజగా వాల్మీకి సృష్టించి సీతకు తండ్రిగా జనకుడిని నిర్ణయించాడు. సీతారాములు సామాన్య వ్యక్తులు కారు. సీత అలౌకిక సౌందర్యవంతురాలు. మనోనిగ్రహము కలిగిన రాముని వంటి లోకోత్తర వ్యక్తి సీతమ్మ గుణాలను రాముడు మెచ్చుకోవడం చూస్తాము. ఒక విధంగా వారి శరీరాలు వేరు గాని ఆత్మ ఒక్కటే.

లక్ష్మణుడు :

శ్రీరాముని కీర్తికి ప్రతీక లక్ష్మణుడు. రాముని కర్తవ్య నిర్వహణలో ప్రధాన పాత్రదారుడు లక్ష్మణుడు. స్వామిసేవకై ప్రగాఢమయిన సేవా తత్పరతను దీక్షగా పూనినాడు. రాముడు లక్ష్మణుడిని ఏ దృష్టితో చూశాడో విశేషంగా చెప్పబడింది. లక్ష్మణుడు లేని రామకథ లేదు. క్రమశిక్షణ, సౌశీల్యము, కారుణ్యము వంటి పదాలకు నిలువెత్తు నిదర్శనం లక్ష్మణుడు.

దేశే దేశే కళత్రాణి దేశేదేశేచ బాంధవాః
తంతు దేశం నపష్యామి యత్ర భ్రాతా సహెూదరా ..... అని చెప్పబడింది.

భరతుడు :

రామాయణంలో రాముని తరువాత ముఖ్య పాత్రలో భరతుడు కనిపిస్తాడు. భరతుడు అన్న కోసం రాజ్యాన్ని త్యాగం చేసి తన హృదయ వైశాల్యం చాటినాడు. చరిత్రలో రాజ్యాల కోసం యుద్ధాలు చేసుకున్న సోదరులే కనిపిస్తారు. కాని "రాజ్యం నాకు వద్దు" అనే విషయం రామయణానికే సొంతం.

శత్రఘ్నుడు :

పరాక్రమానికి ప్రతీక యావద్రామాయణంలో లక్ష్మణుడు రామునికి అండగా నిలిచినట్లు, ప్రతి చోటా భరతుని వెంట శత్రఘ్నుడు కనిపిస్తాడు.

దశరథుడు :

"యథా రాజా, తథా ప్రజా" అని రాజుల వలెనె ప్రజలు ఉంటారనేది చారిత్రక సత్యం. ధర్మ నిరతితో పరిపాలించిన దశరథునికి ఉన్న విశాల హృదయం అతనికి దోషంగా పరిణమించినది. దశరథుడు కూడా మహనీయుడైనప్పటికినీ లోకోత్తరుడు అయిన రాముని జీవితము ముందు దశరథుడు దోషిగా నిస్తేజంగా చూపబడినాడు.

కౌసల్య :

రాముని పెంచడములో కౌసల్య ముఖ్య పాత్ర వహించింది. ఆమె అత్యంత ప్రేమమయురాలు. సరళ స్వభావం, సౌశీల్య సంపన్నురాలు. స్త్రీ సహజ స్వాభావము వలన రామునికి రాజ్యాభిషేకం జరుగుతుందని తాను రాజమాతను అవుతానని ఆనందపడింది. కాని అది కలగానే మిగిలిపోయింది. ఎందుకోగాని రాముని వనవాసం తరువాత రామునికి సింహాసనం లభిస్తుందని, మరొక వైపు భరతుడు అనుభవించిన రాజ సింహాసనముపై

కూర్చుండుటకు రాముడు ఇష్టపడడని, రాముడు, భరతుడు ఇద్దరూ తనకు సమానమని భావించినది. ఆమె దశరథునితో ధర్మ శాస్త్రము, రాజ్యశాస్త్రముల గురించి చర్చించేది. ఆమె సద్గుణాలు రామునికి సంక్రమించాయి. కౌసల్య రామునికి తల్లిగానే కాకుండా గురువుగా కూడా కనబడుతుంది.

కైకేయి :

రామాయణంలో కైకేయి పాత్ర కీలకమైనది. ఆమె లోని ఒక దోషము వలన సమాజము ఆమెను దుష్టురాలిగా భావించినది. కాని దుష్టురాలు కాదు. పన్నాగాలు పన్నడం కూడా రాదు. రాజు గారి చిన్న భార్య కావడం వలన ఆమెకు గర్వం సహజంగా వచ్చింది.. దశరథుడు నీ మాటే వింటాడని చెప్పుడు మాటల వలన ఈ పాత్రలో తీవ్రత కనిపిస్తుంది. కాని నిజానికి రామావతార ప్రయోజనానికి కీలకమైన భూమికను పోషించినది కైకేయి.

ఊర్మిళ :

మన ఇతిహాసాలలో ఎక్కడా కనిపించని స్త్రీపాత్ర ఊర్మిళది. సహనశీలిగా, భక్తితత్పరత, సౌశీల్యం మొదలగు సద్గుణ సంపత్తి ఆమె సొంతం. సీతారాములు వనవాసానికి వెళితే వారితో లక్ష్మణుడు కూడా వెళతానని చెప్పినపుడు స్త్రీ సహజమయినటువంటి వ్యతిరేకతను ప్రకటించక అందుకు అంగీకరించి పదునాలుగు ఏళ్ళు సుధీర్గ నిద్రకు వెళ్ళినట్టుగా రామాయణం చెబుతుంది. దీనిని బట్టి ఊర్మిళ వంటి స్త్రీ పాత్ర నభూతో న భవిష్యతి.

సుగ్రీవుడు :

వాలి సుగ్రీవుని పట్ల ప్రవర్తించిన తీరు రామునితో మైత్రికి దారితీసింది. సీతాన్వేషణలో సుగ్రీవుడు రామునికి సఖుడుగా, మిత్రునిగా మిగిలినాడు.

విభీషణుడు :

విభీషణుని సేవాభావం, ధర్మం, కర్తవ్య పరాయణత్వం వలన శ్రీరాముని శరణాగతిని రాజ్యాన్ని పొందగలిగినాడు. విభీషణుడు ప్రపన్న భక్తికి నిదర్శనంగా చిత్రించబడినాడు.

రావణుడు :

రామాయణంలో రావణుడు ప్రభావ వంతమైన వ్యక్తి. అతనిలో శౌర్యం, పాండిత్యం, సాహసం, భక్తి, పరాక్రమం ఎవరిముందూ తలవంచని గుణములు ఉన్నాయి. రావణుడు తండ్రి సంస్కారం వలన భక్తిని పొందినప్పటికినీ, తల్లి సంస్కారాన్ని అనుసరించి రాక్షసునిగా మారినాడు. రావణుడి పాత్ర లేనిదే రామాయణం లేదు. ఒక తేజోవంతుడే మరొక తేజోవంతుని ఎదుర్కొనగలడు. అందుకే రామ రావణ యుద్ధానికి సాటి, రామరావణ యుద్ధమే సాటి అని చెప్పబడినది.

హనుమంతుడు :

రామాయణంలో హనుమంతుని చరిత్ర విశిష్టమైనది. రామాంజనేయులు విడదీయదగరు. రాముడు ఎలా దైవంగా భావించబడినాడో, హనుమంతుడు కూడా అలాగే దైవంగా పూజింపబడుతున్నాడు. దాస్య భక్తికి నిదర్శనము హనుమ. సీతాన్వేషణ నుండి కనిపించిన హనుమంతుడు రామాయణం పూర్తి వరకు రామునితో కనిపిస్తాడు. హనుమంతుని ఒక వ్యాకరణ కర్తగా, బలవంతునిగా, బుద్ధి సంపన్నునిగా, రుద్రుని అవతారంగా చూస్తాము. బుద్ధిమతాం వరిష్ట: అని హనుమంతుడు సఫలుడైన దూతగా కనిపిస్తాడు.

జటాయువు :

రామాయణంలో జటాయువు పాత్ర కూడా వీరోచితమైనది. ఒక అధర్మాన్ని ఎదుర్కొనుటలో జటాయువు పోషించిన

తీరు అమోఘం. మానవ సహజమైన వాళ్ళు అవినీతిగా ప్రవర్తించినపుడు ఒక పక్షిగా ఆ అధర్మాన్ని ఎదుర్కోవాలని, అందులో రావణుని వంటి దీరుడితో పోరాడటం అసామన్యమయిన విషయము. జటాయువు సోదరుడయిన సంపాతి వలన సీత లంకా నగరంలో ఉన్నదన్న విషయాన్ని తెలుసుకున్నారు.

ఇలా ఎన్నో పాత్రలు ఆదర్శనీయములు. రామాయణంలోని ప్రతి పాత్ర నుండి నర, వానర, పక్షి వంటి అన్ని పాత్రలనుండి మనం అనుసరించవలసిన విషయములు ఎన్నో ఉన్నాయి. రామాయణంలో లేని నీతిలేదు. నీతిని చెప్పే సందర్భములో ప్రీతితో చెప్పాలి. వాల్మీకి తాను నీతిని బోధించినట్టు కనిపించక అంతర్లీనంగా ఆయా పాత్రల ద్వారా సమస్తమైన నీతులు తెలియచెప్పాడు.

ఈ విధంగా రామాయణం సొంతం అందలి పాత్రలు ఆదర్శనీయములు.

ఇలా ప్రతి పాత్ర మనకు ధర్మాలను ప్రబోధిస్తుంది.

ముగింపు :

ఈ విధంగా రామాయణంలో నైతిక విలువలు ఆదర్శ జీవనం ఆచరణీయములు. శాస్త్ర బద్ధంగా బతకడం, చక్కని సామాజిక వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, ధార్మిక సమాజ నిర్మాణం, గృహస్తాశ్రమ ధర్మం, స్త్రీ స్వాతంత్రం, సత్యనిష్ట వంటి ఎన్నో అంశములు రామాయణంలోని పాత్రలు మనకు దారి చూపుతాయి. దీనిని అనుసరించి రామాయణాన్ని, రాముడిని త్రికరణశుద్ధిగా సేవించి ధన్యులైనవారు ఎందఱో ఉన్నారు. త్యాగయ్య, తులసీదాస్, కబీర్ వంటి ఎందఱో మహనీయులు చరిత్రలో మనకు కనిపిస్తారు. రామనామమే మేలు, రామ చింతనే చాలు అనే చిన్న చిన్న పదాలతో కీర్తించినది ఒకరైతే, రామచరిత మానసాన్ని మానవాళి మనసులో నిలిపిన గోస్వామి. తులసీదాస్ రాముని చరిత్ర ఒక అయోధ్యను ఉద్ధరిస్తే, రామనామము యావత్ ప్రపంచాన్ని తరింప జేస్తుందని సెలవిచ్చారు. ఆర్తజన బాంధవుడయిన రామునికి సాటి మరొక దైవం లేరని రామదాసు ప్రకటిస్తాడు.

ఎందఱో మహానుభావులకి ఇంతటి అనుభవాన్ని అందించిన రామ భావనకు ఆధారము రామాయణం.

ఆధార గ్రంథాలు :

1. వాల్మీకి రామాయణం, భక్తి వికాస్ ట్రస్ట్.
2. రామాయణ పరమార్థం, తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ.
3. రామాయణ దర్శనం, ప్రబోధక్ ముద్రణాలయం, ముంబాయి.
4. ఆరాధనా - ధార్మిక మాస పత్రిక
5. శ్రీమద్రామాయణ అమృతతరంగిణి - ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

11. మొల్ల మలచిన సీతమ్మ

- డా॥. ఆర్. మహేందర్ రెడ్డి

తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), గజ్వేల్.

పరిచయం :

భారతీయ ధార్మిక జీవన విధానానికి నిలువెత్తు నిదర్శనం రామాయణం. సంస్కృతంలో వాల్మీకి విరచితమైన రామాయణానికి తెలుగులో రంగనాథ రామాయణం మొదలుకొని వందలాది రామాయణాలు అనువాదాలు గా వచ్చాయి. వాటన్నింటిలో మిక్కిలి సంక్షిప్తంగా ప్రసిద్ధి చెందిన రామాయణం "మొల్ల రామాయణం".

తెలుగు సాహిత్య చరిత్రలో ఇదిమిద్దమైన కాలనిర్ణయం కాని కవయిత్రిగా మొల్ల కనిపిస్తుంది. క్రీ.శ 12వ శతాబ్దం నుండి 16వ శతాబ్దపు మధ్య కాలానికి చెందిన మొల్ల తాను కుమ్మరి కులానికి చెందిన కేశనశెట్టి పుత్రికనని, నెల్లూరి గోపవరపు శ్రీకంఠమల్లేశ్వర స్వామి వరం వల్ల కవిత్వం చెప్పానని చెప్పుకుంది. తొలి తెలుగు కావ్య కవయిత్రిగా, రాజాశ్రయాన్ని నిరసించిన స్వాభిమాన ధీశాలిగా, "చెప్పుమనె రామచంద్రుడని" రామాయణ రచనకు భక్తిభావమే ప్రధాన కారణంగా వినమ్రంగా చెప్పుకున్న వినయ సంపన్నురాలిగా పేరొందిన కవయిత్రి మొల్ల కలం నుండి వెలువడ్డ కమనీయ కావ్యం "మొల్ల రామాయణం".

ఇరువది నాలుగు వేల శ్లోకాల వాల్మీకి మహర్షి సంస్కృత రామాయణానికి సంక్షిప్తంగా 850 పద్యగద్యాలుగా చంపూపద్ధతిలో రాయబడ్డ ఈ రామాయణం రాశిలో చిన్నది వాసిలో పెద్దది. ఇంతటి సంక్షిప్త రామాయణంలో కూడా ఇందులోని కంద పద్యాలను వరుసగా రాస్తే రామాయణ కథేతివృత్తం భంగం కాకుండా మరింత సంక్షిప్తమైన "కందపద్య రామాయణం" అవుతుంది. "తేనె సోక నోరు తీయనగు రీతి" గా సరళసుబోధకంగా అందించిన మొల్ల రామాయణం సంక్షిప్తతలోనే కాదు, వర్ణన, పాత్రచిత్రణ, నుడికార ప్రయోగం ఇత్యాది విషయాల్లోనూ ప్రత్యేకతను పొంది ఉంది. ముఖ్యంగా మొల్ల తీర్చిదిద్దిన కైకమ్మ, సీతమ్మ వంటి స్త్రీ పాత్రలు స్వతంత్ర వ్యక్తిత్వము, స్వాభిమానము, ధీరత వంటి సులక్షణాలతో శోభిల్లుతూ పరోక్షంగా మొల్ల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. మొల్ల తీర్చిదిద్దిన సీతమ్మ పాత్రలోని విశిష్ట లక్షణవిశేషాలను తెలియజేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

కీలకపదాలు :

మొల్ల, సీతమ్మ, ముగ్ధ సుకుమారం, శోకమూర్తి, స్వాభిమానం, పశ్చాత్తాపం, స్థితప్రజ్ఞత.

వ్యాస వివరణ :

మొల్ల దృష్టిలో సీతమ్మ :

"సీతాయాశ్చరితం మహత్" అని వాల్మీకి మహర్షి శ్రీరామాయణంలో సీతమ్మకు మిక్కిలి ప్రాధాన్యం కల్పించినప్పటికీ అనంతర కాలంలో వచ్చిన చాలా తెలుగు రామాయణాలు సీతమ్మ పాత్రను ముగ్ధసుకుమారిగా, బేలతనం నిండిన అబలగా, కష్టాల కడలిపాలై కన్నీరు కార్చిన కరుణామూర్తిగా వర్ణించాయి. అందువల్లనే జనవ్యవహారంలో సీతమ్మ అనగానే తండ్రి చాటు బిడ్డ, ఏమీ ఎరుగని అమాయకురాలైన ఇల్లాలనే భావన బలంగా నెలకొంది. కానీ కవయిత్రి మొల్ల సీతమ్మ పాత్రను వాస్తవికతకు దగ్గరగా తీర్చిదిద్దింది. రాకుమారిగా జనకునింట పెరిగి స్వయంవరంలో వీరవరుడైన రామున్ని వరించిన సీతమ్మను రావణునికి ఏ మాత్రం భయపడకుండా సమాధానం చెప్పగలిగే ధీశాలిగా వర్ణించడంలో వాస్తవికత కనిపిస్తుంది.

మొల్ల రామాయణంలో సీతమ్మ పాత్ర సుకుమార సౌందర్యము. పరిస్థితులను అర్థం చేసుకునే పరిణితి, క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా ఉండగలిగే స్థితప్రజ్ఞత. భర్త వీరత్వం లోకవిదితం కావడానికి తాను కొంతకాలం కష్టాలను భరించడానికి కూడా సిద్ధపడే ధీరత. తెలియక చేసిన తప్పును గుర్తిరిగి పశ్చాత్తాపపడి క్షమాపణ కోరుకునే చక్కని వ్యక్తిత్వం వంటి లక్షణాలతో తీర్చిదిద్దబడింది.

స్వయంవర సీత :

వాల్మీకి రామాయణంలో జనకుడు సీతమ్మను వీర్యశుల్కగా ప్రకటించాడు. శివధనస్సును చూడడానికి వచ్చిన రాముడు విశ్వామిత్రుని ఆజ్ఞ మేరకు ధనుర్భంగం చేస్తాడు. అనంతరం జనకుడు దశరథుల సన్నిధిలో సీతారాముల కళ్యాణం జరుగుతుంది. ఇక్కడ సీత పాత్రకు ప్రాదాన్యం చాలా తక్కువ. తండ్రి చాటు కూతురుగా ధనుర్భంగం చేసిన రామున్ని వరించినట్టు కనిపిస్తుంది.

ఈ కళ్యాణ ఘట్టంలో మొల్ల సీతమ్మను ముగ్ధసుకుమారిగా మాత్రమే కాదు రాముని మీద మిక్కిలి ప్రేమానురాగం ఉన్న రాకుమారిగా వర్ణించింది. ధనుర్భంగం జరిగిన సమయంలో సీతమ్మ సభలోనే ఉందని, రాముని వీరత్వం చూసి అంతటి వీరునికి భార్య అవుతున్నాననే సంతోషంతో సీతమ్మమేను పులకాంకురమయిందని వర్ణించడం ఔచిత్యంగా కనిపిస్తుంది. "...శంకరు చాపమెక్కడిన సత్త్వ ఘనుండగు వానికిత్తు నీ పంకజనేత్ర సీత.."ను (మొల్ల రామాయణం బాలకాండ పద్యం -71) అని జనకుడు సీతమ్మకు స్వయంవరం ప్రకటించాడు. వచ్చిన రాజులంతా విల్లు ఎక్కుపెట్టలేక "..తలగిపోయిరి దవ్వుగా ధనువు విడిచి" (మొల్ల రామాయణం బాలకాండ పద్యం -75) అనడంలో ఆ ధనస్సు ఎంత కఠినమైందో బలమైందో తెలుస్తుంది. కానీ విశ్వామిత్రుని ఆజ్ఞతో రాముడు శివధనుస్సు ఎక్కుపెట్టాడు. అప్పుడు "ఉర్వీనందనకై రామోర్వీపతి ఎత్తునిప్పుడుగ్రుని చాపం" (మొల్ల రామాయణం బాలకాండ పద్యం-79) అని విశ్వామిత్రుని నోట చెప్పించడంలో రాముడు విల్లు ఎక్కుపెట్టడానికి కారణం తన వీరత్వ ప్రదర్శన మాత్రమే కాదు సీతమ్మను వరించడం కూడా అని పరోక్షంగా సీతమ్మ పాత్రకు ప్రాధాన్యం కల్పించింది. "ఇన వంశోద్భవుడైన రాఘవుడు గుణంబు పట్టి పటు బాహాశక్తితో తీసిన తునిగెన్ చాపము" అని (మొల్ల రామాయణం బాలకాండ పద్యం 81) రాముడు ధనుర్భంగం చేసిన విధానాన్ని వర్ణిస్తూ "ధనువువిరిగినంత ధరణీశ సూనులు/ శిరములెల్ల వంచి సిగ్గు వడిరి/ సీత మేను వెం చె శ్రీరామచంద్రుని/ పొగిడెనపుడు జనక భూ విభుండు" (మొల్ల రామాయణం బాలకాండ, పద్యం-82) ఇక్కడ సీతమ్మ మేనుపెంచడం అనే మాటతో వీరుని వరించబోతున్నా నే సీతమ్మ మానసికోల్లాసము శారీరకంగా వ్యక్తం చేయించింది. పైపెచ్చు ఆ వీరుని వీరత్వాన్ని తండ్రి నోట పొగిడించింది. యుక్త వయస్సులో ఉన్న అమ్మాయి సంపదలను మాత్రమే కోరుకోదు. తనను సంరక్షించగల ధైర్యశౌర్యాలున్న

వీరున్ని వరించడానికి ఇష్టపడడం వాస్తవికాంశం. ఇలా స్వయంవర ఘట్టంలో సీతమ్మను తండ్రి చాటు బిడ్డగా కాకుండా తనకిష్టమైన వరుణ్ణి భర్తగా స్వీకరించడానికి ఆనందంతో సన్నద్ధమైన స్వాభిమానం గల యువతిగా తీర్చిదిద్దింది.

దశరథుడు కైకమ్మకిచ్చిన వరం ప్రకారం శ్రీరాముడు పట్టాభిషేకాన్ని వదులుకొని వనవాసానికి బయలుదేరాల్సిన సమయం వచ్చినప్పుడు రాముడు "వల్కలంబులు దాల్చి ధనుర్ధరుండై యున్నంత లక్ష్మణుడు భూపుత్రిక తోడన్ జనుదేరా" (మొల్ల రామాయణం అయోధ్యకాండ పద్యం -30) అని సంక్షిప్తంగా చెప్పినప్పటికీ క్లిష్టపరిస్థితుల్లో తన సుఖాన్ని కోరుకోకుండా భర్తననుసరించి నడిచిన భార్యగా సీతమ్మ మనకు దర్శనమిస్తుంది.

ముగ్ధశృంగార రసమూర్తి సీతమ్మ :

రామలక్ష్మణుల చేత పరాభవం పొందిన శూర్పనఖ ప్రతీకారం కోసం రావణుని ఆశ్రయించింది. సీతమ్మ అందం గురించి చెప్పి రావణుని మనసులో విషబీజం నాటింది. ఆ సందర్భంలో శూర్పనఖ వర్ణించిన సీతమ్మ శృంగారస మూర్తిగా దర్శనమిస్తుంది. "కన్నులు కలువలో కాముబాణంబులో తెలివిగా నింతికి తెలియరాదు...కురులు నీలంబులో తేటి గుంపు లొక్కొ...వెలది యొప్పారు లావణ్య విభ్రమముల" (మొల్ల రామాయణం అరణ్యకాండ పద్యం-22) "బంగారు నీరు నిలువున/పొంగారుచునుండ నజుడు పోసిన మాడ్కిన్ /శృంగారమెల్ల నిలువున/పొంగారుచునుండ.." (మొల్ల రామాయణం అరణ్యకాండ పద్యం-38) అంటూ సాగిన వర్ణనలో రమణీయత రూపు కట్టిన శృంగారమూర్తిగా, రాకుమారిగా, రాణిగా సీతమ్మ సౌందర్యాతిశయాన్ని వెల్లడిస్తుంది.

సమస్యలోనూ సాలోచన :

వాల్మీకి రామాయణంలో రావణుడు సీతమ్మను అపహరించకపోతున్న సమయంలో రావణుని నుండి విడిపించు కునే పెనుగులాటలో సీతమ్మ ఆభరణాలు కింద పడ్డాయని వర్ణించబడింది. మొల్ల రామాయణంలో "వనచరులక గిరిచేరువ/ వనమున చరియింపజూచివసుధాసుతయున్/ తన చీర కొంగు తునుకకు/ తన సొమ్ములు మూటగట్టి ధరపై వైచెన్" (మొల్ల రామాయణం అరణ్యకాండ పద్యం-45) అని చాలా ఆలోచనాత్మంకంగా వర్ణించింది. రావణుడు తనను ఎత్తుకుపోతున్నాడు అతని నుంచి విడిపించుకునే శక్తిసామర్ధ్యాలు తనకు ఎలాగూ లేవు కనీసం తన ఆభరణాలైన రామునికి తోవచూపేందుకు దోహదపడతాయని సీతమ్మ భావించింది. వాటిని ఎక్కడో అడవిలో పడవేయకుండా ఒక కొండ మీద కనిపించిన వానరులకు దొరికేటట్టుగా పడవేసిందని చెప్పడం ఔచిత్యవంతంగా క్లిష్టసమయంలో కూడా చక్కగా ఆలోచించగలిగిన వ్యక్తిగా సీతమ్మను తీర్చిదిద్దింది.

రామనామమే సీతమ్మకు సర్వస్వం :

సీతాన్వేషణలో బయలుదేరిన హనుమంతుడు లంకకు చేరుకున్నాడు. అక్కడ కనిపించిన అందమైన స్త్రీలందరినీ సీతమ్మగానే భ్రమించాడు. వారిలో ఎవరు రాముని భార్య సీతమ్మనో గుర్తించలేకపోయాడు. అలాంటి సమయంలో రామ నామమే సీతమ్మను హనుమంతుడు గుర్తించేలా చేసింది. "పతిభాసినట్టి యాపద కంటే పలుమారు వివిధ మాయల చేత వేగి వేగి.." న సీతమ్మ "రాము దలుచుకొంచు రాముని పేర్కొంచు / రామ రామ యనుచు రమణి పలుక / కపివరుండు సూచి కామినీ రత్నంబు సీతయనుచు పొంగె చిత్తమందు" (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-41) అని హనుమంతుడు సీతమ్మను గుర్తిం చిన సందర్భంలో సీతమ్మ నిరంతర రామనామాన్ని జపిస్తూ లంకలో స్థిరంగా ఉండగలిగిందని రామనామము ఆమెకు ధైర్యాన్నిచ్చిందని తెలపడంలో సీతమ్మ పతిభక్తిపరాయణత ప్రస్ఫుటమవుతుంది.

పశ్చాత్తాపబాధాతప్త హృదయినిగా సీతమ్మ :

అశోవనంలో కుమిలిపోతున్న సీతమ్మను చూడడానికి వచ్చిన హనుమంతునితో సీతమ్మ తన సందేశాన్ని పంపింది.

ఆ సందర్భంలో లక్ష్మణుని గురించి సీతమ్మ నోట పలికిన మాటలు ఆమె సౌశీల్యాన్ని తెలియజేస్తాయి. "జనకునిభంగి రామనృపచంద్రుని, నన్ను ను తల్లి మారుగా కని కొలువంగ నేర్చు.. నీతిపారగున్.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-115) అయిన లక్ష్మణున్ని మాయలేడి కోసం రాముడు వెళ్ళినప్పుడు పరిస్థితిని అర్థం చేసుకోలేక "...వినగన రాని పల్కులవివేకం చేత పలికి నట్టి యావినుత మహా ఫలంబు యనుభవించితినంచు.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-115) ఎంతో బాధపడింది.

"ఆ మాటలు మదినుంచక / నా మానము గావు మనుచు...రాముని తమ్ము డు సౌమిత్రికి చెప్పవయ్యా సాహసవర్యా" (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-116) అని తన పశ్చాత్తాపాన్ని లక్ష్మణునికి తెలియజెప్పి తనను సంరక్షించమని హనుమంతుని కోరింది. ఈ సన్నివేశంలో సీతమ్మ పాత్ర ఉదాత్తంగా కనిపిస్తుంది. తప్పు చేయడం మానవ సహజం కానీ దాన్ని గుర్తించి సరిదిద్దుకోవడం సజ్జనుల లక్షణం. సీతమ్మ తెలిసీతెలియక చేసిన లక్ష్మణ నింద గురించి అనంతర కాలం ఎంతో కుమిలిపోయింది. ఆ పాపఫలితంగానే లంకలో ఉండిపోయే దుస్థితి కలిగిందని భావించింది. క్షమాపణ కోరుకోవడమే దానికి ప్రాయశ్చితమని తలచి చిన్నవాడైన లక్ష్మణున్ని తానన్న మాటలు మనసులో ఉంచుకోవద్దని ప్రాధేయపడింది. ఈ సన్నివేశంలో సీతమ్మ ఉదాత్తమైన సుగుణశీలగా కనిపిస్తుంది.

రావణునికి ఎదురాడిన సీతమ్మ స్థితప్రజ్ఞురాలు :

సౌశీల్యము, లావణ్యము, పశ్చాత్తాపము వంటి లక్షణాలతో పాటు రావణునితో సీతమ్మ మాట్లాడిన సందర్భాల్లో సీతమ్మను ధైర్యవంతురాలిగా తీర్చిదిద్దింది. రావణుడు సీతమ్మను అపహరించి అశోకవనంలో ఉంచాడు. తనను వరించమని దిగజారి మాట్లాడాడు. అనేక రకాల బహుమానాలు పంపించాడు. తన వైభవం గురించి గొప్పలు చెప్పుకున్నాడు. "ఇట్లు నోరికి వచ్చినమచ్చున బ్రేలుచున్న యానీచుని దుష్టభాషణంబులకు రోసి తృణంబు చేపట్టి జనకభూపాలనందన.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-58) గట్టిగానే సమాధానమిచ్చింది. ఉగ్రరూపము, అధికారమదము కలిసి మాట్లాడిన రావణున్ని సీతమ్మ గడ్డిపరకలాగా తీసేసింది. ఏ మాత్రం భయపడకుండా మాటకు మాట సమాధానం చెప్పింది. "పరదారాపేక్షకులగు పురుషులకు ఆయువు నశించు.. నరకమున బడుదురు.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-59) అనే న్యాయాన్ని భయం లేకుండానే గుర్తు చేసింది. "తన సాహసంబు తానే కొనియాడునతడుహీనగుణుడని.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-60) రావణున్ని వ్యక్తిత్వాన్ని ఏ మాత్రం భయపడకుండా అవహేళన చేసింది. "రామాభూపాలుడు ఆదినారాయణుడని" అటువంటి వీరుడైన రామునికి "లంక యననెంత దనుజుల పొంకమెంత / నీ వనగనెంత నీలావు చేవయెంత.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-65) అని ధైర్యంగా బదులిచ్చింది. "వీరాలాపములాడనేల వినుమి..రాఘవుడు కోపస్ఫూర్తి దీపింపగా ఘోరాజిన్ నిన్ను డాసి మస్తముల్ దునిమి భుక్తుల్ వెట్టు భూతాలికిన్" (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-66) అని హెచ్చరించింది. ఇలా రావణుని క్రూరత్వానికి అధికారానికి ఏమాత్రం భయపడకుండా తగిన రీతిలో సమాధానమిచ్చిన సీతమ్మ పాత్రలో అణువణువులో ధైర్యం తొణికిసలాడుతుంది.

అలాగే హనుమంతుడు సీతమ్మను తనతో పాటు భుజాల మీద కూర్చుండబెట్టుకొని తీసుకెళ్తానని కోరినప్పుడు కూడా సీతమ్మ అంగీకరించలేదు. "దొంగిలి తెచ్చిన దైత్యుని దైత్యుని సంగడులగు వాని వారి సాహసమొప్పన్/ సంగర ముఖమున చంపక దొంగిలి కొనిపోవ తగునె దొరలకు.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-121) అని రావణుని చంపిన తర్వాతనే రాముడు తనను తోలుకొని పోవడం సముచితమని భావించడంలో ఆమె స్థితప్రజ్ఞత ధైర్యం వెల్లడవుతుంది.

శోకమూర్తిగా సీతమ్మ :

వనవాసంలో రాముని వెంట నడిచిన సీతమ్మ వర్ణనలోనూ, అశోకవనంలో రామునికై ఎదురుచూసిన సీతమ్మ

రూపంలో దైన్యత, కరుణ రసపోషణ కన్నీరు పెట్టిస్తుంది. "నడుప నేరనికొమ్మ యడుగులు పొక్కులై శర్కరస్థలముల శ్రమము జెంది...ధవుని యడుగడుగునకు కైదండగొనుచు/ నెగడు దప్పి నిట్టూర్పు లెగసి చిగురు/ పెదవులెండగ నీడకు నుదిలగొనుచు/ మనసులో జేవ యూ తగా జనడువేళ" (మొల్ల రామాయణం అయోధ్యకాండ పద్యం-4) చెప్పిన మాటలు రాకుమారి సుకుమారి అయిన సీతమ్మ అడవిలో రాముని వెంట సాగుతూ పడిన కష్టాలను కళ్ళకు కట్టిస్తుంది. అయితే అంతటి కష్టంలో కూడా రాముని చేతిని ఆధారంగా, మానసిక శక్తిని ఊతగా చేసుకొని నడిచిందని వర్ణించడం విశేషం.

అశోకవనంలో రావణుడు బెదరించి వెళ్ళినప్పుడు చుట్టూ ఉన్న రాక్షస స్త్రీల మాటలకు "..అదిరి సీత/ తనకు దిక్కులేమి తలపోసి దు:ఖింప.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-91) మరియు "నిడుదపున్నె రవేణి జడలుగా సవరించి మలినజీర్ణాంబరంబోలియగట్టి/ భూ మీరజంబు విభూతిపూతగబూసి.." (మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-113) శోకమూర్తిగా హనుమంతునికి కనిపించిన సీతమ్మ రూపంలో దైన్యత కనిపిస్తుంది. అయినా కూడా శ్రీరామ నామాన్ని శ్వాసగా "..తారకబ్రహ్మ మంత్రంబు పఠింపుచు.."(మొల్ల రామాయణం సుందరకాండ పద్యం-113) ధైర్యాన్ని కూడగట్టుకుని శోకంలోనూ వీడని ధైర్యాన్ని సీతమ్మలో చూపించింది.

సంక్లిష్టస్థితిలో సడలని స్వాభిమానం: రావణ సంహారం తరువాత శ్రీరాముడు సీతమ్మతో "కులసతి చెరగొనిపోయిన/ యలశాత్రవు ..గెలిచితి, పగజంపితి నెలతా! నీ యిచ్ఛజను నేనొల్లన్" (మొల్ల రామాయణం యుద్ధకాండ, ఆ-3, పద్యం-115) అని అంటాడు. రాముడు తప్ప మరో ధ్యాస లేని సీతమ్మ ఈ మాటలు విని భరించలేకపోయింది. ఎవరి కోసం తాను ఆరాటపడిందో ధర్మాత్ముడైన ఆ రాముడే రాజధర్మాన్ననుసరించి మాట్లాడిన మాటలు తన మనస్సును కకావికలం చేశాయి. అయితే అంతటి ఆవేదన, దు:ఖంలో కూడా సీతమ్మ ధైర్యం కోల్పోలేదు. రామున్ని సూటిగా ప్రశ్నిస్తూ అతనికి నిర్భయంగా సమాధానమిచ్చింది. "నరవర నాదు చిత్తము మనంబున నీవ యెరింగి యుండియున్, పరుషములాడనేమిటికి పాపము నాయెడ లేదు...మేటి సొద జచ్చెద.." (మొల్ల రామాయణం యుద్ధకాండ, ఆ-3, పద్యం-117) అని ఆత్మవిశ్వాసంతో పలికింది. తప్పు లేని చోట భయం ఉండదు. అందుకే ప్రాణేశ్వరుడైన రాముని మాటలు తనను బాధిస్తే ఊరుకోలేదు సీతమ్మ. దు:ఖాన్ని దిగమింగుకొని నిర్దుష్టంగా నిక్కచ్చిగా సమాధానం ఇచ్చి తను శీలసంపదను నిరూపించుకుంది. ఇలా సంక్లిష్ట స్థితిలోనూ స్వాభిమానం చూపిన ధీరగా సీతమ్మను తీర్చిదిద్దింది.

ఉపసంహారం :

"ఈ కావ్యంలో మేను పెంచి దర్శనం ఇచ్చిన సీతమ్మ తుది వరకు అట్లాగే ధీరంగా మేను వంచకుండానే నిల బడింది" (ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ మొల్ల రామాయణం పేజీ 29) అని మొల్ల తీర్చిదిద్దిన సీతమ్మ గురించి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ చెప్పిన మాటలు సీతమ్మ పాత్ర ప్రాధాన్యతను వెల్లడిస్తున్నాయి. భారతీయ ధార్మికతకు, బలమైన కుటుంబ వ్యవస్థకు, భార్యాభర్తల అనుబంధానికి, ఆదర్శ సమాజానికి ప్రతీకగా నిలిచిన రామాయణంలో ప్రముక పాత్ర సీతమ్మనే. ఇతివృత్తానికంతా సీతమ్మ పాత్రే ఆధారంగా కనిపిస్తుంది. అటువంటి సీతమ్మ పాత్రను అంతే ప్రత్యేక లక్షణాలతో ఆదర్శవంతంగా మొల్ల మలిచింది. మొల్ల రామాయణంలో సీతమ్మ సర్వదా సార్వకాలికంగా అనుసరణీయమైన దృఢమైన వ్యక్తిత్వం కలిగిన స్త్రీగా మలిచిన విధానం విలక్షణంగానే కాదు ఔచిత్యవంతంగాను కనిపిస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. మొల్ల రామాయణం, ఎమెస్కో ప్రచురణ, 2019. 2. మొల్ల రామాయణం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, 2008. 3.మొల్ల రామాయణం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, 2023.

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

12. యక్షగాన సాహిత్యంలో రామాయణ కథాంశములు

- డా॥. తండు కృష్ణయ్య
అధ్యక్షులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట, యాదాద్రి భువనగిరి జిల్లా.

పరిచయం :

యక్షగానం అనగా యక్షుల యొక్క పాటయని అర్థం. జక్కుల జాతి ఒకప్పుడు యక్షగాన ప్రదర్శనమే ప్రధాన వృత్తిగా అవలంభించిన జాతి అని, వారి వృత్తికి సంబంధించిన యక్ష శబ్దం క్రమంగా జాతి వాచకంగా పరిణమించి ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం. యక్షగానాలను ప్రదర్శించడం వలన ఆ తెగ వారికి యక్షులు, జక్కులు అనే పేర్లు వచ్చినవి. యక్షకన్యల నృత్య ప్రదర్శన క్రీడాభిరామంలో ప్రస్తావించబడింది. యక్షపాత్ర వేషధారణం ఒక వృత్తిగా అవలంభించినవారని చెప్పదగిన జక్కుల పురంధ్రుల గాన ప్రధాన వినోద క్రీడలే యక్షగాన ఉత్పత్తికి కారణమై ఉంటాయి. యక్షుల ప్రస్తావన, వారి ఆటపాటల ప్రస్తావన పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోని పర్వత ప్రకరణంలో ఉన్నప్పటికీ యక్షగాన ప్రస్తావనమాత్రం శ్రీనాథుని భీమేశ్వరపురాణంలో స్పష్టంగా కనబడుతుంది -“కీర్తింతురెద్దానికీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన సరణి”(భీమేశ్వర పురాణం- 3ఆ.65ప.) తెలుగులో తొలి యక్షగానం ప్రోలుగంటి చెన్నశౌరి రచించిన సౌభరిచరితమైనప్పటికీ అది లభించకపోవడం వల్ల లభిస్తున్న యక్షగానాల్లో కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయమే తొలి యక్షగానమని చెప్పవచ్చు. ఆ తర్వాత అనేక యక్షగానాలు తెలుగు సాహిత్యంలో విరివిగా వెలువడ్డాయి. తంజావూరు రాజుల కాలంలో యక్షగానసాహిత్యం బాగా పరిఢవిల్లింది. ఆధునిక కాలంలో తెలంగాణ ప్రాంతంలో ఆచార్య చెర్విరాల భాగయ్య కవి యాభైకి పైగా యక్షగానాలను రాసి తెలంగాణ యక్షగాన పితామహుడుగా ప్రసిద్ధిగాంచారు. తెలంగాణలో యక్షగానమును ‘వీధి భాగవతం’, ‘వీధిభాగోతం’ అని కూడా పిలుస్తారు. యక్షగాన సాహిత్యంలో రామాయణ కథాంశాలను తీసుకొని రాయబడ్డ యక్షగానాలు ఉన్నాయి. అయితే మూలకథను యధావిధిగా తీసుకోకుండా జానపద కథల్లో ప్రాచుర్యంలో ఉన్నటువంటి రామాయణ కథాంశాలను గ్రహించి యక్షగాన కవులు రచనలు చేశారు. సీతారాముల పట్ల తమకు ఉన్నటువంటి భక్తి ప్రపత్తులను చాటుకోవడం కోసం, మరింతగొప్పగా ప్రజలకు తెలియజేయడం కోసం కొన్ని కల్పిత కథాంశాలను చేర్చి రాశారు. అటువంటి రామాయణ కథాంశాలను కలిగిన యక్షగానాలను గూర్చి సమగ్రంగా వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

కీలక పదాలు :

యక్షగానం, గేయ రూపం, సంవాద రూపం, పాత్రోచిత భాష, తాళం, దరువు, సమాహారకళ, వీధి నాటకాలు, రామాయణం, కల్పిత కథాంశాలు, జానపదులు, జానపద కళారూపాలు మొదలగునవి.

వ్యాస వివరణ :

భారతీయ ఇతిహాసములో మొదటిది రామాయణం. భారతీయ సంస్కృతిని, విలువలను ప్రతిబింబించే ఇతిహాసంఇది. మహోన్నత విలువలు కలిగిన, ధర్మస్వరూపుడైన శ్రీరాముని జీవనయానమే రామాయణం. భారతీయ భాషల్లోకి మాత్రమే కాకుండా ఇతర భాషల్లోకి కూడా అనువదించి ప్రపంచవ్యాప్తంగా రామాయణం గొప్పతనాన్ని చాటిచెప్పిన కవులు, రచయితలు ఎంతోమంది ఉన్నారు. తెలుగులో రామాయణాన్ని రచించిన కవులు చాలామంది ఉన్నారు. గోనబుద్ధారెడ్డి నుండి మొదలుకొని ఇప్పటివరకు ఎంతోమంది కవులు రామాయణాన్ని తెలుగులో రాశారు. అదే విధంగా జానపద సాహిత్యంలో కూడా పలు జానపద కళారూపాలుగా రామాయణం ప్రదర్శించబడింది. ఒగ్గు కథ, బుర్రకథ, తోలుబొమ్మలాట లాంటి అనేక కళారూపాలద్వారా రామాయణ విశిష్టతను జానపదులకు తెలియ జేయడం జరిగింది. ఈ క్రమంలో రామాయణ కథాంశములతో కూడిన యక్షగానములనుకూడా రాసి ప్రదర్శించారు. ఆయా పురాణాల, ఇతిహాసాలకు సంబంధించిన కథాంశాలు యక్షగానాల్లో ఇతివృత్తాలుగా ఉన్నట్లే రామాయణ ఇతిహాసానికి సంబంధించిన కథాంశములతో కూడిన యక్షగానాలు ఉన్నాయి. వాల్మీకి రామాయణంలోని కథాంశాలే కాకుండా వాల్మీకి రామాయణంలో లేని జానపద కథల్లో సుప్రసిద్ధమైన కథాంశాలను జోడించి ఆయా కవులు యక్ష గానాలను రాశారు. వీటిలో శ్రీరామ విజయము, సులోచనా పరిణయము, మైరావణ చరిత్రము, సుగ్రీవ విజయము, కుశలవ చరిత్రము ముఖ్యమైనవి.ఆయా యక్షగానాలను పరిశీలిద్దాం.

శ్రీరామ విజయము :

ఈ యక్షగానాన్ని రావూరు పురవాసుడైన బూరెల విఠల్ రాశాడు. యయాతి రాజు భాస్కరపురాన్ని పరిపాలిస్తుంటాడు. అతడు ఒకనాడు కాపుల పంటచేలను రక్షించడానికి అడవి మృగాలను వేటాడడానికై అడవికి వెళ్తాడు. ఒకచోట తపస్సు చేస్తున్న విశ్వామిత్రుడు మొదలైన ఋషులను చూసి వారందరికీ ఒకేసారి నమస్కారం చేసి వెళ్ళిపోతాడు. విశ్వామిత్రుడది చూసి తనను అందరితో సమానంగా భావించి, నిర్లక్ష్యంతో అవమానించాడని యయాతి రాజుపై కోపిస్తాడు. యయాతి రాజును శ్రీరామునిచే చంపించాలని నిశ్చయించి అయోధ్యకు వెళ్తాడు. శ్రీరాముని దగ్గర అభయం తీసుకున్న తర్వాత యయాతిని చంపాలని శ్రీరామునికి చెబుతాడు. తన భక్తుడైన యయాతి రాజును ఏ విధంగా చంపాలని శ్రీరాముడు చింతిస్తాడు. విశ్వామిత్రునికి ముందుగానే అభయం ఇచ్చినందువల్ల యయాతిని చంపడానికి నిర్ణయిస్తాడు. ఈ సంగతిని తెలుసుకున్న నారదుడు భాస్కరపురానికి వెళ్లి యయాతికి తెలియజేస్తాడు. యయాతి చింతాక్రాంతుడై “తనను రక్షించే నాథుడే లేడా?” అని నారదుని వేడుకుంటాడు. శ్రీరాముని భక్తుడు, అంజనీ దేవి కొడుకైన హనుమంతుడు ఉన్నాడని, అతణ్ణి శరణు వేడుమని నారదుడు యయాతికి తెలియజేస్తాడు. వెంటనే యయాతి గంధమాదన పర్వతం పైకి వెళ్లి ఆంజనేయుని శరణు వేడుతాడు. ముందు హనుమంతుని నుండి అభయం తీసుకున్న తర్వాత జరిగిన విషయాన్ని అతనికి తెలియజేస్తాడు. “అయ్యో! నా దైవమైన శ్రీరామ చంద్రునితో యుద్ధం చేయవలసివచ్చెనే” అని ఆంజనేయుడు ఎంతో బాధపడుతాడు. ఆడిన మాట తప్పకూడదు కాబట్టి శ్రీరామునితో యుద్ధానికి సిద్ధపడి ఆంజనేయుడు సుగ్రీవుని సహాయం కోరుతాడు. సుగ్రీవుడు వానరసైన్యంతో వచ్చి ఆంజనేయునికి అండగా నిలుస్తాడు. శ్రీరాముడు ఆంజనేయుడు భీకర యుద్ధం చేస్తుంటారు. అప్పుడు శ్రీరాముడు రామబాణాన్ని వేయడానికి పూనుకుంటాడు. విశ్వామిత్రుడు, నారదుడు కలిసి కౌసల్య, అంజనీదేవిల దగ్గరికి వెళ్లి వారి చేత యుద్ధాన్ని విరమింప జేస్తారు. శ్రీరాముడు యయాతికి ప్రాణభిక్ష పెట్టి అతణ్ణి ప్రాణాలతో

వదిలివేస్తాడు. ఈ కథ రామాయణంలో ఎక్కడా లేదు. యయాతి చరిత్ర మహాభారతంలో ఉంది. మహాభారతంలోని యయాతి చరిత్రకు ఈ యక్షగానములోని యయాతి చరిత్రకు ఏమాత్రం సంబంధం లేదు. భారతంలో యయాతి తండ్రి పేరు నహుషుడు, తల్లి పేరు ప్రియంవద. భార్యలు శర్మిష్ఠ, దేవయాని. ఈ యక్షగానములో యయాతి రంగ ప్రవేశం చేసి తనను తాను ఈ విధంగా ప్రేక్షకులకు పరిచయం చేసుకుంటాడు.

శ్రీ పరమేశ్వరు కృప చెన్నొందినట్టి
శూరసేనవనీశుడ వినరోరి
కరమొప్పుచున్న భాస్కర పురమందు
సురరాడ్విభవమునమరచెన్నొందె
సరసుండు మా తండ్రి సత్యవతుండు
కదన జయప్రదుడు గణుతింపగాను
కనకాంగి చంద్రరేఖయు నాదు భార్య''   (శ్రీరామ విజయం- పు. సం. 10)

పురం భాస్కరపురం, తండ్రి సత్యవతుడు, తల్లి మదనావతి, భార్య చంద్రరేఖ అని చెప్పడం జరిగింది. కాబట్టి ఇందులో ఉన్న యయాతి చరిత్రకు, మహాభారతంలోని యయాతి చరిత్రకు ఎలాంటి సంబంధం లేదు. ఒక కల్పిత కథను సృష్టించి సుప్రసిద్ధమైన పాత్రలకు ముడిపెట్టి చెప్పడం విశేషం.

సులోచన పరిణయము :

రామాయణ సంబంధమైన ఇంకొక కల్పిత కథాత్మక యక్షగానం సులోచన పరిణయము. ఈ యక్షగానకర్త గజ్జెల నరసయ్య గుప్త. రామాయణంలో ఇంద్రజిత్తు పెళ్లి గూర్చి కాని, సులోచన గూర్చి గాని ఎక్కడా ప్రస్తావించబడలేదు. యక్షగానంలో రామాయణంలోని ప్రసిద్ధమైన కొన్ని పాత్రలకు కల్పితమైన పాత్రలను జోడించి చెప్పడం జరిగింది. రావణునికి మండోదరి యందు ఒక కొడుకు జన్మిస్తాడు. అతనికి మేఘనాథుడని పేరు పెట్టి అతని జాతకాన్ని చూపిస్తారు. పిల్లవానికి పన్నెండవ రోజునపెళ్లి అవుతుందని జాతకకర్తలు చెబుతారు. రావణుడు తన కొడుకు పెళ్లిని తప్పించాలనే ఉద్దేశ్యంతో మీనరాజను రప్పిస్తాడు. పిల్లవాణ్ణి ఒక పెట్టెలో ఉంచి ఆ పెట్టెను నోట్లో ఉంచుకొని సముద్రంలో ఉండుమని రావణుడు మీనరాజుకు చెబుతాడు. మీనరాజు రావణుడు చెప్పినట్టుగానే పెట్టెను నోట్లో ఉంచుకొని సముద్రంలో ఉంటాడు. అప్పుడు గజరాజు అతనితో యుద్ధానికి దిగుతాడు. అప్పుడు మీనరాజు పెట్టెను ఇసుక తిన్నెలపై పెట్టి గజరాజుతో యుద్ధానికి సిద్ధపడుతాడు. వారు ఆ విధంగా యుద్ధం చేస్తుండగా నాగలోకంలోని నాగరాజు కూతురగు సులోచన అక్కడికి వస్తుంది. అక్కడున్న పెట్టెను తెరచి చూడగా అందులో ఒక పిల్లవాడు కనబడుతాడు. ఆ పిల్లవాని అందానికి ముగ్గురాలై అతణ్ణి మోహించి ఇంటికి తీసుకొని వెళ్తుంది. ఆ పిల్లవాణ్ణి తన తండ్రికి చూపించి పెళ్లి చేసుకుంటానని చెబుతుంది. నాగరాజు సంతోషించి బ్రహ్మ విష్ణు దేవేంద్రాదులను రప్పిస్తాడు. ఎంతో ఘనంగా వారిద్దరికి పెళ్లి చేస్తాడు. నారదుడు చెప్పిన ప్రకారం భార్యాభర్తలను పెట్టిలో పెట్టి ఎప్పటివలెనే ఇసుక తిన్నెలపై పెట్టి వస్తాడు. మీనరాజు గజరాజును ఓడించి పెట్టెను తీసుకొని వెళ్లి ఎప్పటిలాగే సముద్రంలో ఉంటాడు. రావణుడు నారదుని ద్వారా జరిగిన విషయాన్ని తెలుసుకొని మీనరాజును రప్పిస్తాడు.పెట్టెను తెరచి చూడగా పెళ్లి చిహ్నాలతో ఉన్న కొడుకును మరియు కోడల్ని చూస్తాడు. సులోచన తన మామకు పాదాభివందనం చేసి తనను దీవించుమని కోరుతుంది. రావణుడు ఆమె వినయ విధేయతలకు ఎంతో సంతోషిస్తాడు.

మైరావణ చరిత్రము :

రామాయణానికి సంబంధించిన కల్పిత కథాత్మకమైన మరొక యక్షగానం మైరావణ చరిత్రము. దీనిని కొల్లూరు

పురుషోత్తము రాశాడు. మైరావణ చరిత్ర రామాయణంలో ఎక్కడా కనిపించదు. అయినప్పటికీ ఈ కథ చాలా ప్రసిద్ధిగాంచింది. శ్రీరాముడు వానరసైన్యంతో లంకపై దండెత్తి రావణుని సైన్యాన్నంతా చంపుతాడు. చివరికి రావణుడు మాత్రమే మిగిలి ఉంటాడు. తన వారందరూ చనిపోయారనే బాధతో యుద్ధం చేయలేక యుద్ధరంగం నుండి పారిపోతాడు. రావణుడు తన స్నేహితుడు, పాతాళ లోకాధిపతియైన మైరావణునికి ఒక ఉత్తరాన్ని రాసి, దానిని ఒక భటునికిచ్చి పంపుతాడు. మైరావణుడు ఆ ఉత్తరాన్ని చదువుకుని రావణునికి సహాయం చేయాలని భావిస్తాడు. ఇక్కడ లంకలో రామలక్ష్మణులకు రాక్షసుల వల్ల ఎటువంటి ఆపద రాకుండా ఆంజనేయుడు తన తోకతో కోటను నిర్మిస్తాడు. రామలక్ష్మణులను అందులో నిద్రింపజేసి ద్వారం దగ్గర కాపలా ఉంటాడు. ఈ సంగతిని మైరావణుడు తెలుసుకొని విభీషణుని రూపంలో ఆంజనేయులు దగ్గరికి వస్తాడు. ఒకసారి రామలక్ష్మణులను దర్శించి వస్తానని ఆంజనేయుని అనుమతితో లోనికి వెళ్తాడు. మైరావణుడు నిద్రిస్తున్న రామలక్ష్మణులపై మచ్చుచల్లి వారిని ఒక పెట్టెలో పెట్టుకొని పాతాళానికి తీసుకొని వెళ్తాడు. ఒక శుభ ముహూర్తాన రామలక్ష్మణులను కాళికాదేవికి బలి ఇచ్చుటకు పూనుకుంటాడు. ఆంజనేయుడు, విభీషణుడు మొదలైన వారు రామలక్ష్మణులుకోటలో లేకపోవడం వల్ల విచారించి ఇదంతా మైరావణుని మాయయే అని గ్రహిస్తారు. వెంటనే ఆంజనేయుడు పాతాళానికి వెళ్లి తనను ఎదిరించిన మత్స్యవల్లభుని తన కొడుకుగా గుర్తించి దోర్దండి సహాయంతో మైరావణుని ప్రాణ రహస్యాన్ని తెలుసుకుంటాడు. సప్త సముద్రాలను దాటి ఏడుకొండ గుహల్లో తిరిగే ఏడు తుమ్మెదలను పట్టుకొని వచ్చి మైరావణుని ముందు నలిపి వేయగా అతడు చనిపోతాడు. రామలక్ష్మణులను బంధవిముక్తులను చేసి వారిని లంకకు తీసుకొని వస్తాడు. మరునాడు శ్రీరాముడు యుద్ధంలో రావణుని చంపి సీతను తీసుకొని అయోధ్యకు వస్తాడు. ఇందులో కల్పిత కథతోపాటు కల్పిత పాత్రను కూడా చేర్చడం జరిగింది. ఆ జన్మ బ్రహ్మచారియైన ఆంజనేయునికి మత్స్యవల్లభుడనే కొడుకు ఉండడం, మైరావణుడు మాయా విభీషణుడై రావడం, రామలక్ష్మణులు సామాన్య మానవుల్లాగా ఆంజనేయుని తోకతో నిర్మించిన కోటలో రక్షింపబడడం ఇవన్నీ కల్పితాలే.

సుగ్రీవ విజయము :

రామాయణ కథాంశముగల మరొక యక్షగానం సుగ్రీవ విజయం. ఈ యక్షగానాన్ని తెలంగాణ యక్షగాన పితామహుడుగా పరిగణించదగిన చెర్విరాల భాగయ్యకవిచే రాయబడింది. తెలుగులో తొలి యక్షగానంగా ప్రసిద్ధిగాంచిన సుగ్రీవ విజయంలోని ఇతివృత్తమే ఇందులోని ఇతివృత్తం. కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం తెలుగులో తొలి యక్షగానంగా ప్రసిద్ధిగాంచింది. అదే ఇతివృత్తాన్ని స్వీకరించి చెర్విరాల భాగయ్యకవి సుగ్రీవ విజయం యక్షగానాన్ని రాశాడు. నాటకాల్లో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు రచించిన గయోపాఖ్యానం ఎంత ప్రసిద్ధిగాంచిందో, యక్షగానాల్లో చెర్విరాల భాగయ్య కవి రచించిన సుగ్రీవ విజయం కూడా అంతే ప్రసిద్ధిగాంచింది. కొన్ని వేల ప్రతులు అమ్ముడుపోయిన యక్షగానం ఇది. రామాయణంలోని కథను యథాతథంగా స్వీకరించి రాయబడిన యక్షగానం ఇది. వాలి మాయాసురునితో యుద్ధం చేస్తూ ఒక గుహలోకి ప్రవేశించగా ఎంతకు రాకపోయేసరికి తన అన్న చనిపోయినాడని భావించి సుగ్రీవుడు ఆ గుహ ద్వారానికి అడ్డుగా పెద్ద బండరాయిని పెట్టి తానే రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడు. కొంతకాలం తర్వాత వాలి మాయాసురుని చంపి గుహ ముఖ ద్వారం వద్ద ఉన్న బండరాయిని పడదోసి బయటికి వచ్చి రాజ్యాన్ని పరిపాలిస్తున్న సుగ్రీవునిపై కోపించి తిట్టి, కొట్టి రాజ్యం నుండి వెళ్లగొడుతాడు. అన్నకు భయపడి సుగ్రీవుడు ఋష్యమూక పర్వతమున ఉంటాడు. ఒకరోజు దుందుభి అను రాక్షసునివాలి చంపి అతని శవాన్ని ఋష్యమూక పర్వతం పైకివిసిరి వేస్తాడు. పర్వతంపై పడిన శవాన్ని చూసి మతంగ మహాముని కోపించి "ఎవడైతే ఈ శవాన్ని ఈ పర్వతంపై వేశాడో అతని తల పగిలిపోతుంది" అని శపిస్తాడు. ఆ కారణంగా వాలి ఆ పర్వతం దగ్గరికి రాకపోవడం వల్ల సుగ్రీవుడు తన మంత్రియైన హనుమంతునితో నిశ్చింతగా ఉంటాడు.

రామలక్ష్మణులు సీతను వెదకుతూ ఆ ప్రాంతానికి రాగావారికి సుగ్రీవునితో పరిచయం ఏర్పడుతుంది. అప్పుడు శ్రీరాముడు వాలి నుండి సుగ్రీవుని కాపాడుతానని అభయమిస్తాడు. సీతాన్వేషణలో తాను సహకరిస్తానని సుగ్రీవుడు శ్రీరామునికి మాట ఇస్తాడు. వాలిసుగ్రీవులు యుద్ధం చేస్తుండగా చెట్టు చాటు నుండి బాణం ప్రయోగించి శ్రీరాముడు వాలిని చంపుతాడు. సుగ్రీవునికి పట్టాభిషేకం చేసి వాలి కుమారుడైన అంగదుని యువరాజుగా నియమిస్తాడు. ఇది ఈ యక్షగానంలోని ఇతివృత్తం.

కుశలవ చరిత్రము :

ఈ యక్షగానాన్ని చెర్విరాల భాగయ్య కవి ప్రియ శిష్యుండైన మహమ్మద్ అబ్దుల్లా రాశాడు. ఈయన నేటి యాదాద్రి భువనగిరి జిల్లా టేకుల సోమవరం గ్రామానికి చెందినవాడు. రామాయణంలోని ఉత్తరకాండ యందలి ఇతివృత్తమును స్వీకరించి కుశలవ చరిత్రము అను యక్షగానాన్ని రాశాడు. రావణ వధ అనంతరం అయోధ్యకు వచ్చి శ్రీరాముడు రాజ్య పట్టాభిషేకం చేసుకొని రాజ్యాన్ని పరిపాలిస్తుంటాడు. గర్భవతియైన సీత ఒకరోజు గంగానది తీరాన ఉన్న మునుల ఆశ్రమాలను సందర్శించాలన్నతన కోరికను శ్రీరామునికి తెలియజేస్తుంది. ఇది తగిన సమయం కాదని, కొంతకాలం తర్వాత ఆ కోరికను తీరుస్తానని శ్రీరాముడు అంటాడు. ఒక చాకలివాడు తన భార్య శీలాన్ని శంకిస్తూ ఇంట్లో నుంచి వెళ్లగొడితే అతని మామ వచ్చి సర్ది చెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఎంత చెప్పినా వినిపించుకోడు. అప్పుడు అతడు తన అల్లునితో ఇలా అంటాడు.“మన రాజ్యాన్ని పరిపాలించే శ్రీరాముడే తన భార్య సీతను పది నెలలు పరాయి పంచన ఉంటే తీసుకొచ్చి ఏలుకుంటున్నాడు కదా! నీవెందుకు ఏలుకోవు? అనిప్రశ్నిస్తాడు. ఈమాటల్ని ఈ యక్షగానంలో ఇలా రాశాడు-

పరునితో పొర్లి వచ్చిన భార్య నేను
ఇంటిలో నేలుకొనుటకు వెధవగాను
వెర్రి రాముడు గనుకను ఏలుకొనెను
అట్టివాడనుకుంటివాఅంజి కొడుక! (కుశలవ చరిత్రము-పు.సం. 19)

అదే సమయంలో భద్రుడు అనే భటుడు ఆ మాటల్ని విని శ్రీరామునికి తెలియజేస్తాడు. తన భార్యయైన సీత శీలాన్ని ఇంకా ప్రజలు శంకిస్తున్నారని భావించి లక్ష్మణుని పిలిపించి సీతను అడవిలో వదిలిపెట్టి రమ్మని ఆజ్ఞాపిస్తాడు. లక్ష్మణుడు అన్న మాటను కాదనలేక సీతను అడవిలో వదిలి పెట్టివస్తాడు. అప్పుడు వాల్మీకి సీతను చేరదీసి తన ఆశ్రమానికి తీసుకొని వెళ్తాడు. కొన్నాళ్లకు కుశలవులు జన్మిస్తారు. వాల్మీకి వారికి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకుల్ని చేస్తాడు. శ్రీరాముడు అశ్వమేధ యాగం చేయగా యాగాశ్వాన్ని కుశలవులు బంధిస్తారు. కుశలవులతో యుద్ధం చేసి వరుసగా శత్రుఘ్నుడు, భరతుడు, లక్ష్మణుడు, రాముడు మూర్ఛ వచ్చి పడిపోతారు. శ్రీరాముడు సీతానామ స్మరణ చేస్తూ కలవరిస్తుండగా సందేహంతో కుశలవులు శ్రీరాముని కిరీటమును, ఇతర ఆభరణములను తీసుకొని వెళ్లి తల్లికి చూపిస్తారు. అవి తన శ్రీరాముని ఆభరణములని గుర్తించి ఎంతో బాధపడుతుంది. వాల్మీకి వెంట రాగా తన కుమారులను వెంటబెట్టుకుని అక్కడికి వెళ్లడం జరుగుతుంది. వాల్మీకి మూర్ఛితులైన వారినందరినీ మరల బ్రతికిస్తాడు. తనను క్షమించుమని శ్రీరాముడు సీతను వేడుకుంటాడు. ఆ తర్వాత కుశలవులకు పట్టాభిషేకం చేయడంతో యక్షగానం ముగుస్తుంది. అయితే రామాయణంలో శ్రీరామునితో కుశలవులు యుద్ధం చేస్తుండగా ఆంజనేయుని సహాయంతో సీత అక్కడికి వెళ్లి యుద్ధాన్ని విరమింప చేసినట్లుగా ఉంటుంది. అదేవిధంగా సీత భూదేవి ఒడిలోనికి వెళ్లిపోయిన విషయాన్ని ఈయక్షగానంలో కవి విస్మరించాడు.

రచనా విధానం :

యక్షగాన కవులు సాధారణ ప్రజలు మాట్లాడే భాషలో రచనలు గావించడం వల్ల యక్షగానములు ఎంతో

ప్రజాదరణ పొందినవి. పలు దరువులతో, తాళములతో కూడిన సంవాదములను రాయడమే కాకుండా వాటి కింద వచనమును కూడా సులభశైలిలో రాసి వివరణాత్మకంగా ఆయా పాత్రలచే చెప్పించడం జరుగుతుంది. ముఖ్యంగా ఆటతాళం, ఆది తాళం, జంపె తాళం మొదలగు తాళములతో కూడిన దరువులను రాయడమే కాకుండా దేశీ ఛందస్సుకు సంబంధించిన ఆటవెలది, తేటగీతి, సీసం, ద్విపదవంటి పద్యాలను కూడా అక్కడక్కడ ప్రయోగించారు. ఎక్కువగా ద్విపద పద్యాలను రాసి సాహిత్య పరంగా యక్షగానాలకు మరింత విశిష్టతను సంతరింపజేశారు. అదే విధంగా కందార్ధ దరువులను కూడా సందర్భోచితంగా ప్రయోగించి దరువులకు మరింత సొగసును సమకూర్చారు. కందమును దరువుగా పాడిగిస్తే అది కందార్థ దరువుగా మారుతుంది. ఇలాంటి కందార్ధ దరువులను యక్షగానాల్లో చాలామంది కవులు ప్రయోగించారు. చెర్విరాల భాగయ్య కవి సుగ్రీవ విజయంలో కందార్ధ దరువులను చాలా ప్రయోగించాడు. సుగ్రీవుడు తారతో పలికిన సందర్భంలో ప్రయోగించిన కందార్ధ దరువునుపరిశీలిద్దాం-

వలదమ్మయిటుల కఠినపు
పలుకులు పలుకంగబోకు బలిమిచే నీవున్
వలనొప్పగ మాయన్నయు
బలిమితొ కూర్చుండబెట్టే బాసాలు జేసి
అసురుని ద్రుంచబాయే నను బాసి
వాసిగ నేనన్న వచనంబు నమ్మితి
దోస మెరుగను తల్లి దూషించబోకుమి (సుగ్రీవ విజయం- పు. సం. 19)

ఆయా పాత్రల ప్రవేశం, పాత్రల పరిచయం, పాత్రల మధ్య సంభాషణ, పాత్రోచితమైన భాష, లయబద్ధమైన దరువులు కవి రచనా నైపుణ్యానికి అద్దం పట్టడమే కాకుండా ప్రదర్శనను రక్తి కట్టించే విధంగా చేస్తాయి. ఆయా పాత్రధారులు పాడే దరువులకు అనుగుణంగా తెర వెనుక ఉన్న వాయిద్యకారులు ఆయా వాయిద్యాల్ని వాయిస్తుంటే వంతలు వంత పాడుతూ ప్రదర్శనను మరింత రక్తి కట్టించే విధంగా యక్షగాన రచయితలు ఆయా యక్షగానాల్ని రాశారు.

ఉపసంహారం :

సంగీత, సాహిత్య, నృత్య సమన్వితమైన సమాహార కళారూపం యక్షగానం. ప్రదర్శన యోగ్యమై ఒకప్పుడు ఎంతో ప్రజాదరణ పొందినది. పౌరాణిక, ఇతిహాస, జానపద, సాంఘిక, ఆధ్యాత్మిక సంబంధమైన ఎన్నో కథలు ఇతివృత్తాలుగా గల యక్షగానాలు ఉన్నాయి. సుప్రసిద్ధ ఇతిహాసమైన రామాయణమునకు సంబంధించిన కథాంశాలతో కూడిన యక్షగానాలు కూడా ప్రదర్శింపబడి ప్రజాదరణ పొందాయి. సినిమా, టి.వి. లాంటి సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల చాలా కళారూపాలు నిరాదరణకు గురై కనుమరుగయ్యాయి. యక్షగానం కూడా కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది. ఇటువంటి విశిష్ట జానపద కళారూపమైన యక్షగానంతో పాటు ఇతర కళారూపాలను కూడా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన, స్వచ్ఛంద సంస్థల పైన, మనందరి పైన ఉంది. పద్యం, గేయం, వచనం వంటి వివిధ కవితా ప్రక్రియల్లో రామాయణం ఆదరణ పొంది విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. యక్షగాన సాహిత్యంలో రామాయణ కథాంశాల గూర్చి మరింత సమగ్రంగా విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. భీమేశ్వరపురాణము - శ్రీనాథుడు
2. శ్రీరామ విజయము- బూరెల విఠల్-వేంకటేశ్వర పబ్లికేషన్స్-హైదరాబాద్(1976).
3. సులోచన పరిణయము- గజ్జెల నరసయ్య గుప్త-డి.వి.కృష్ణాబుక్డిపో- హైదరాబాద్(1993).
4. మైరావణ చరిత్రము- కొల్లూరు పురుషోత్తము- శ్రీ మల్లికార్జున పబ్లికేషన్స్- హైదరాబాద్(1988).
5. సుగ్రీవ విజయము-చెర్విరాలభాగయ్య కవి-శిద్దేశ్వర పబ్లికేషన్స్- హైదరాబాద్(1992).
6. కుశలవ చరిత్రము- మహమ్మద్ అబ్దుల్లా-శిద్దేశ్వర పబ్లికేషన్స్- హైదరాబాద్(1993).

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

13. అచ్చ తెలుగు రామాయణం - విశిష్ట తెలుగు పదాల ప్రయోగం

- డా॥. పెబ్బేటి మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, వివేకానంద గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (స్వ), విద్యానగర్, హైదరాబాద్.

పరిచయం :

నన్నయ కంటే ముందు శాసనాలలో ఉన్న పద్యాలను బట్టి ఆంధ్ర మహాభారతం కంటే ముందు నుండే తెలుగులో గ్రాంథిక భాష ప్రచారంలో ఉందని చెప్పవచ్చు. గోల్కొండ ప్రాంతంలో 14వ శతాబ్దానికి చెందిన పొన్నగంటి తెలగన్న యయాతి చరిత్ర అనే కావ్యాన్ని అచ్చ తెలుగులో రచించాడు. ఇది అచ్చ తెలుగులో వచ్చిన మొట్టమొదటి కావ్యం. అంటే 14వ శతాబ్దం వరకు తత్సమ పదాలతోనే సాహిత్య రచన కొనసాగింది. ఈ కావ్యంలో తత్సమ శబ్దాలను వదిలేసి కేవలం దేశీ పదాలను ఉపయోగించుకున్నాడు. అచ్చ తెలుగు కావ్యాలకు దారి చూపిన క్రమంలో ఆ పరంపర కొనసాగింది. 17వ శతాబ్దానికి చెందిన కూచిమంచి తిమ్మకవి అచ్చ తెలుగులో రామాయణాన్ని రచించాడు. ఆ క్రమంలోనే ఆధునిక కాలంలో మాండలికాలలో కవిత్వం, కథలు, నవలల సృజన కూడా జరిగింది.

తెలుగులో భిన్న ప్రక్రియలు, భిన్న పరిణామాలు, భిన్న లక్ష్యాలతో దాదాపుగా 60 రామాయణాలు వచ్చాయి. సంగనభట్ల నరసయ్య గారు చెప్పినట్లు "తెలుగులో వచ్చిన రామాయణ కావ్యాలలో రంగనాథ రామాయణం అతి ప్రాచీనం, అతి మనోహర కావ్యం". రంగనాథ రామాయణం తర్వాత తెలుగులో రామాయణాల రచనా ప్రవాహం కొనసాగింది. సురవరం ప్రతాపరెడ్డి గారు చెప్పినట్లు "భారతదేశమందలి సర్వభాషలను మాట్లాడు హిందూ కవులందరును మొదట వాల్మీకికీ నమస్కారము చేయనిది కవిత్వం మారంభించిన వారు కారు. సంస్కృత సాహిత్యం నందే కాక దేశ భాషలలోని కవితలందును వాల్మీకి స్మరణ అగ్రస్థానము వహించినట్టిదై యున్నది."

కూచిమంచి తిమ్మకవి జీవించిన 17వ శతాబ్దంలో తెలుగు సాహిత్యము తెలుగు ప్రాంతంతో పాటు కర్ణాటక, తమిళ ప్రాంతాల్లో కూడా వర్ధిల్లింది. తిమ్మన కాకినాడకు సమీపమున గల కందరాడ గ్రామ నివాసి. పిఠాపురం సంస్థానంలో కవిగా ఉన్నాడు. వీరు తన గురించి "గ్రామ విభుడు, నగర శాసనుడ" అనే పదాలు పేర్కొనడం వలన వీరు గ్రామాధికారిగా పనిచేశారని కూడా తెలుస్తుంది. పిఠాపురం మహారాజు రావు నీలాద్రి మాధవరావు ఈ కవికి 'కవిసార్వభౌమ' బిరుదుతో సత్కరించినట్లు "రసిక జన మనోభిరామ" పీఠికలో ఉన్న

"రావు నీలాద్రి మాధవరాయ నృపతి
చేత కవి సార్వభౌమ విఖ్యాత బిరుద
మందిన ఘనుండ తిమ్మయాహ్వయుడ నేను విమలతర భక్తి మదిలోన విస్తరిల్ల"

అని చెప్పుకోవడం వలన తెలుస్తుంది. వీరు అచ్చ తెలుగు రామాయణాన్ని తొలి 5 కాండలలో 728 పద్యములు, యుద్ధకాండములో 600 గద్య పద్యాలు రాశాడు. రామాయణంతోపాటు "నీలా సుందరి పరిణయం" అనే అచ్చ తెలుగు కావ్యాన్ని కూడా రచించాడు. కపిలవాయి లింగమూర్తి గారు చెప్పినట్లు "లాక్షణికునికి సంస్కృత పదాల ఉచ్చారణ ఎట్లా మలుచుకోవలెనో ఒక నియమమున్నట్లు జానపదునికి కూడా శిష్ట వ్యవహారికాన్ని తన ఉచ్చారణకు అనువుగా మలుచుకునేందుకు కూడా ఒక నియమం ఉంది." ఈ నియమాలతో పాటు తత్సమ పదాలను తెలుగు చేయడమనేది చాలా కష్టంతో కూడిన పని. ఈ పనిని తిమ్మకవి చాలా సులువుగా చేశాడు.

తిమ్మకవి తన కృతిని "సిరులకు మన్కియై హొయలు చెన్నల రారెడు వెండి కొండపై" అనే పద్య పాదంలో "సిరులకు" అనే తెలుగు పదంతో ప్రారంభించాడు. తెలుగు సాహిత్య సంప్రదాయం ప్రకారం కావ్య ప్రారంభంలో "శ్రీ" అనే అక్షరం ఉండాలి. కానీ ఇది అచ్చ తెలుగు కావ్యము కావడం చేత శ్రీకి తద్భవ రూపమైన "సిరి" అనే పదాన్ని ఉపయోగించాడు.

బాలకాండలో విష్ణుమూర్తిని స్తుతిస్తున్న సందర్భంలో.....

"గ్రుడ్డు కానుపు రేడు గ్రుడ్డు కాన్పురేడు
గుర్రంబు పాన్పునై కొమరు మిగుల జింకతాలు పరియు జింకతాలు పరియు
మరదియు ననుగునై మెరపు జూప నీరు పుట్టువయును నీరు పుట్టువయును
బూరయు దొడవునై పొలుపు నెరప
బచ్చవార్వపు జోదు పచ్చ వార్వపు జోదు
వలకన్ను కొడుకు నై వలపు గులుక". (బాలకాండ-3)

ఈ పద్యంలో కవి తెలుగు మాటల మీద చమత్కారం చేసి చూపించాడు. ఒక్కొక్క మాటకు రెండు అర్థాలు స్ఫురింప చేశాడు. గ్రుడ్డు కానుపురేడు అంటే పక్షి రాజు అయిన గరుత్మంతుడు మరియు సర్పరాజైన ఆదిశేషుడు. జింక తాలుపరి అంటే శివుడు మరియు చంద్రుడు. నీరు పుట్టువా అనగా నీటిలో జన్మించిన శంఖము మరియు పద్మము. పచ్చ వార్వపుజోదు అంటే సూర్యుడు మరియు మన్మధుడు. తెలుగు మాటలు సమానమైన ఒకే మాటకు రెండు అర్థాలు కలిగించడం ఇందులోని పదప్రయోగ విశిష్టత.

"వెలుదమ్మి క్రోమ్ బువ్వ కొలువు సింగపు బీట
....
మామ మామ యనుంగు మామగారు". (బాలకాండ-6)

సరస్వతీ దేవిని వర్ణిస్తున్న సందర్భంలో సముద్రుని కూతురైన లక్ష్మీదేవిని విష్ణుమూర్తి వివాహము చేసుకోవడం వలన సముద్రుడు మామయ్యాడు. కానీ సముద్రునికి భార్య అయిన గంగాదేవి విష్ణుమూర్తి యొక్క కుమార్తె. కాబట్టి విష్ణుమూర్తి సముద్రునికి అంటే మామకు మామ అయ్యాడు. ఇది ఇందులోని పద ప్రయోగ విశిష్టత.

ఈ కావ్య ప్రారంభ పద్యాలలో ఈశ్వరుని గురించి కీర్తిస్తూ

"మలవిల్లు జిలువ నారియు

....

"జెలగగ దిగప్రోలు గూలిచిన బలియునకున్"

అని శివుని గురించి చెప్పిన దిగప్రోలు అనేది విశేష ప్రయోగం. తిగ అనేది త్రిక అనే తత్సమానికి రూపాంతరము. అంటే మూడు అని అర్థము. ప్రోలు అనే దానికి పట్టణము అని అర్థం. త్రిపురములు అనే మాటను తిగప్రోలు అని కవి అచ్చ తెలుగు పదంగా మార్చాడు.

దశరథుడు పుత్రకామేష్టి యాగము చేసే సందర్భంలో ఋశ్య శృంగుని గురించిన ప్రస్తావన వస్తుంది. ఆ సందర్భంలో "అని తెలిపిన నతప్పుడా....... మనుబోతు కొమ్ము తపసిం" (బాలకాండ - 29) అనే పద్యంలో ఋశ్యశృంగుని అనే పేరుకు 'మనుబోతు కొమ్ము తపసి' అనే విశేష తెలుగు ప్రయోగము చేశాడు. ఋశ్యము అంటే మనుబోతు అని అర్థం. శృంగం అనగా కొమ్ము , కాబట్టి మనుబోతు కొమ్ము తపసి అని అచ్చ తెలుగు పదప్రయోగం చేశాడు.

విశ్వామిత్రుడు రామ లక్ష్మణులను రాక్షస సంహారానికి తీసుకెళ్లడానికి దశరథుని దగ్గరికి వచ్చిన సందర్భంలో దశరథుడు ...

"ఇంచు కేనియు మిము బరికించి కొలువ
నేర నేమియు నా యెడ నేరమిడక చెలిమి మెరయంగా మెల్లన తెలుపు మిటులు
దారి రాయని యో జడదారి రాయ" (బాలకాండ-65)

ఇందులో దశరథుడిచే విశ్వామిత్రుడిని మునిశ్రేష్ట అని పలకడానికి బదులు "జడదారి రాయ" అని విశిష్ట తెలుగు ప్రయోగం చేశాడు.

దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట అడవికి పంపించే సందర్భంలో

"మానక పూనిక డంకన్

....

కూనల గానలకు బలుపుకొన నేరుతునే"

అనే పద్యంలో "కూనలను కానలకు పంప" అని అచ్చ తెలుగు పదాలు ప్రయోగించాడు. చిన్న పిల్లల్ని తల్లిదండ్రులు ప్రేమతో కూనలుగా భావించే సందర్భం ఉంటుంది. దశరథుడు పిల్లలపై విపరీతమైన ప్రేమ కలిగి ముక్కుపచ్చలారని ఆ పిల్లల్ని అడవులకు పంపే సందర్భంలో సన్నివేశానికి తగినట్టుగా కూనలు అనే పదప్రయోగాలు చేశాడు.

విశ్వామిత్రుడు రాజుల యొక్క దుష్ట పనులను దూషిస్తున్న సందర్భంలో "పలుమారు జలువతావులజేరి పొరలుచు" అనే పద్యంలో బ్రాహ్మణులు అనే పదాన్ని వాడకుండా "ఇరుబుట్టువు దొరలు" అనే పద ప్రయోగం చేశాడు. రెండుసార్లు జన్మించేవారు అనే అర్థంలో ఇరుబుట్టువు దొరలు అనే అచ్చ తెలుగు పదాన్ని ప్రయోగించాడు. ఇంకొకచో విశ్వామిత్రుని గురించి

"అత్తేరంగున వేవేగ నరుగుచుండ బాస వాల్మీన్న యా రాచ పట్టికనియే (బాలకాండ-85)

ఇక్కడ విశ్వామిత్రుడు అనే పేరు రాకుండా బాసవాలు మిన్న అనే విశేష ప్రయోగం చేశాడు. బాస అంటే

మాట. వాలు అంటే ఆయుధము. ఋషులకు సంస్కృతంలో శాపాయుధులు అనే వ్యవహారం ఉంది. ఆ కోణంలో తెలుగులో దానిని బాసవాలు అనే పదప్రయోగం చేశాడు. మిన్న అనేది శ్రేష్ట వాచకం. ఇది అచ్చ తెలుగు ప్రయోగాల్లో ఎంతో వైచిత్రితో కూడుకొని ఉంది.

రామలక్ష్మణులు విశ్వామిత్రుని వెంట రాక్షస సంహారం కొరకు అడవులకు వెళ్ళినప్పుడు అక్కడి ఆశ్రమాల గురించి వర్ణిస్తున్న సందర్భంలో "గొనకొని ఎలుగించు మరునిగుర్రపు దుటుముల్" (బాలకాండ-93) అనే పద్యంలో మన్మదుడిని అచ్చ తెలుగులో 'మరుడు' అని అంటారు. అతని వాహనమైన చిలుకకు మరుని గుర్రము అని అచ్చ తెలుగులో ప్రయోగించాడు.

అహల్య శ్రీరాముని యొక్క అవతారాల గురించి వర్ణించే సందర్భంలో "తివిరి జేజేలు మానసి దిండికాండ్ర" (బాలకాండ- 126) అనే పద్యంలో రాక్షసులు మనుషులను భక్షించేవారు కాబట్టి "మానసి తిండికాండ్రు" అనే అచ్చ తెలుగు పద ప్రయోగం చేశాడు. ఈ సందర్భంలోనే

"వెన్నుని జాపుమంచు బదివేల వితంబుల గన్నబిడ్డని
న్మిన్నిక సృక్క జేయుమిడి మేలపు నంజుడు దిండిరాచ బ
ల్మన్నియ జెండావే బిరుసుమానిసి సింగపు మేను పూనియో
యన్న పసిండి బొజ్జ దొరకైన నినుం గొనియాడ బోలునే". (బాలకాండ-128)

ఈ పద్యంలో విష్ణుభక్తుడైన ప్రహ్లాదుని కష్టపెట్టిన అతని తండ్రి హిరణ్యకశిపుడుని సంహరించడం కొరకు నారసింహ రూపం ధరించిన విష్ణుమూర్తి గురించి చెప్పడం జరిగింది. ఇందులో నరసింహ అనే పదప్రయోగం చేయకుండా అచ్చ తెలుగులో "బిరుసుమానిసి సింగపు మేను "అంటే మనిషి రూపము సగము సింహము రూపము సగం కలిగిన నరసింహ" అనే అర్థంలో ప్రయోగించారు. హిరణ్య గర్భుడైన బ్రాహ్మ పేరును "పసిడి బొజ్జ దొర" అంటే బంగారు గర్భము దాల్చిన బ్రహ్మ అనే అర్థంలో కొత్త పదప్రయోగ వైచిత్రిని ప్రదర్శించాడు. జనకమహారాజు సీతకు వివాహం చేసిన సందర్భంలో రాముడి గురించి చెప్పేటప్పుడు "బుడమి కాన్పు మగని బొగడుచు నపుడాకు" (బాలకాండ-171) అనే పాదంలో రాముడు అనే పదప్రయోగం చేయకుండా భూమి కుమార్తె అయిన సీతాదేవికి భర్త అనే అర్థంలో "పుడమి కాన్పు మగడు" అనే విశేషమైన అచ్చ తెలుగు పదప్రయోగం చేశాడు.

శ్రీరామునికి పట్టాభిషేకం చేయాల్సిన సమయంలో దశరథుడు మాట్లాడే సందర్భంలో రాముడు అని ప్రయోగించకుండా "పుడమి చెలియల్లు వానిని బుడమి కిప్పు" (అయోధ్యకాండ - 7) అనే పదంలో పుడమి చెలి అల్లుడు అంటే భూదేవి కూతురైన సీతాదేవిని వివాహం చేసుకున్న వాడు అనే అర్థంలో విశేష పద ప్రయోగం చేశాడు. "తగువారి బిలిచి యిదిగో" (అయోధ్యకాండ- 8) అనే పద్యంలో రాముడు అని చెప్పడానికి "రక్కసి మగువం బొరిగొన్న వాడిమగని గడంకన్" అని ప్రయోగించాడు .అంటే రాక్షస స్త్రీ అయిన తాటకిని సంహరించిన మహావీరుడైన అని అర్థం.

రాముడు వనవాసానికి బయలుదేరుతూ గంగానది ప్రాంతానికి వచ్చినప్పుడు "సుడివాలు దాల్పు నడుగున బొడమిన పెన్వెల్లి దరిసి పొలు పొందగాన" (అయోధ్యకాండ -98). ఈ పద్య పాదాలలో గంగా అనే రెండు అక్షరాలు చెప్పడానికి "సుడివాలు దాల్పు నడుగున బొడమిన పెన్వెల్లి" అని అచ్చ తెలుగులో పద ప్రయోగం చేశాడు. అంటే గుండ్రంగా ఉండే చక్రాయుధాన్ని ధరించిన విష్ణుమూర్తి యొక్క పాదములో పుట్టిన గొప్ప ప్రవాహం

అని అర్థం. గంగా అని రెండు అక్షరాలలో చెప్పే పదాన్ని అచ్చ తెలుగులో రాసే క్రమంలో ఇంత పెద్ద పదప్రయోగం చేయడానికి కవి ఎంత కష్టపడ్డాడో అర్థం చేసుకోవచ్చు.

అడవిలో రాముడు మాయా జింకను వేటాడే సమయంలో ఆ జింక రాముని గొంతు ధ్వనిగా పిలిచిన పిలుపులకు సీత వెంటనే రాముని దగ్గరకు వెళ్ళవలసిందిగా లక్ష్మణుడిని ఆదేశించింది. ఆ సందర్భంలో సీత అనే పదాన్ని వాడకుండా "విని కలంగి పుడమి విరిబోడి కూరిమి కాన్పు ముద్దు మరది గాంచి పలికె" (అరణ్యకాండ-45) అనే పద్య పాదాలలో "పుడమి విరిబోడి కూరిమి కాన్పు" అంటే భూమి పుత్రిక సీత అనే అర్థంలో వాడిన తెలుగు సమాసము విశేషంగా ఉంది. కిష్కింధ కాండలో హనుమంతుడు రాముడికి పరిచయం చేసుకున్న సమయంలో "దనరగేసరి యనుకోన మనికి పట్టు" (కిష్కింధ కాండ-11) అనే పద్య పాదం హనుమంతుడు అని చెప్పడానికి బదులు "కోనమనికి పట్టు" అంటే కొండల్లో నివసించే వానరుడు అనే అచ్చ తెలుగు పద ప్రయోగాన్ని చేశాడు. ఇదే సందర్భంలో సీత గురించి చెప్పేటప్పుడు " అనిన రతనాల బొజ్జ ప్రోయాలి ముద్దు పాప" (కిష్కింధకాండ -36) రత్నాలనే గర్భంగా కలిగిన భూదేవి యొక్క ముద్దుల కూతురు సీత అని అర్థం.

ఇంకా సుందరకాండలో రావణాసురుడు అనే పదానికి "నల్ల ద్రావుడు దొర" అని, సుగ్రీవుడు అనే పదానికి "సత వారువముల జోదు కొడుకు" అని, ఆంజనేయుడికి "గాలి బుడుత" అని, యుద్ధకాండలో దశరథుని కొడుకు రాముడు అనే అర్థంలో "తేరుల దొర బిడ్డ" అని, నారదుడు అనే అర్థంలో "కయ్యపు దిండి జడ దారి" అని, సూర్యవంశం అనే అర్థంలో "ఇరుల గొంగ వంగడము" అనే అచ్చ తెలుగు పదాల ప్రయోగాలు అనేకంగా కనిపిస్తాయి.

ఈ కావ్యంలో చివరగా తెలుగు కావ్యాల గురించి చెప్తూ ...

"తెనుగు చదువున బున్నియం బెనయ దనుచు
గొందరాడుదు రాడిన గొరత యేమి మును మరా యంచు నుడివిన చెనటి బోయ
నెర నిరాబారి యగుటయే గురుతు గాదే". (యుద్ధకాండ - 592)

కవులు తెలుగులో రాసిన రామాయణం వన్నె నీయదని చెప్పారు. కానీ పూర్వము వాల్మీకి రామా అని పలికిన పదము చేతనే ప్రసిద్ధి పొందెను కదా! గుర్తుకు రాలేదా మనకు? అని ప్రశ్నించాడు.

ఉపసంహారం :

సాహిత్యము నిత్య నూతనము, నిత్య ప్రవాహంగా సాగాలి. అప్పుడు మాత్రమే అది సమాజ ఉపయోగకరంగా ఉంటుంది. ప్రాచీన కాలంలో కూడా పద్యమే ప్రధానమైనా ప్రక్రియలలో, భాషా విధానంలో, వస్తువులో మార్పులు చేసుకుంటూ సమాజానికి దగ్గరగా తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. పాల్కురికి సోమనాథుడు లాంటి వ్యక్తి వస్తువుతో, భాషతో సాహిత్యాన్ని సమాజానికి దగ్గరగా చేరిస్తే, పొన్నగంటి తెలగన్న, కూచిమంచి తిమ్మకవిలాంటి వాళ్ళు దేశీయమైన భాషతో సమాజంలోకి సాహిత్యాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అచ్చ తెలుగు రామాయణం కావ్యంలోని ఆరు కాండలలో కూడా దే దేశీయమైన అచ్చ తెలుగు పదాలను ప్రయోగించాడు. నామవాచకాలలో కూడా అచ్చ తెలుగు పదాల ప్రయోగాలు చేయడం అనేది చాలా విశిష్టమైన ప్రయోగం. ఒక పదానికి అచ్చ తెలుగులో అర్థాన్ని సాధించే క్రమంలో నాలుగైదు పదాల సమాసానికి కూడా వెనకాడలేదు. అచ్చ తెలుగు పదాల ప్రయోగంలో ఈ కవి విజయవంతమై, చక్కని కావ్యాన్ని సాహిత్య లోకానికి అందించాడు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్రామాయణము- చదలవాడ సుందర రామశాస్త్రి, పుల్లెల శ్రీరామచంద్రుడుబి ఆర్ష విజ్ఞాన ట్రస్ట్ హైదరాబాద్. 1987.
2. అచ్చ తెలుగు రామాయణము- సమగ్ర వ్యాఖ్యానము- ఆచార్య మొరంగపల్లి బాగయ్య- నవోదయ పబ్లికేషన్స్, 2005.
3. రామాయణ విశేషములు- సురవరం ప్రతాపరెడ్డి - విజ్ఞాన సరోవర ప్రచురణలు - చతుర్ధ ముద్రణ, 2013.
4. శ్రీ రంగనాథ రామాయణం- గోనబుద్ధ భూపతి- కర్త, డా.సంగనభట్ల నరసయ్య- పరిష్కరణ- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ -ద్వితీయ ముద్రణ - 2016.
5. పామర సంస్కృతం-డా. కపిలవాయి లింగమూర్తి-వాణి ప్రచురణలు-2016.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

14. అచ్చ తెలుగు రామాయణం - అవాల్మీకాంశాలు

- డా॥. ఎల్. విజయ

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్, హైదరాబాద్.

పరిచయం :

వాల్మీకి కాలము నుండి నేటి వరకు అనేకమంది కవులు వివిధ భాషలలో రామాయణాలు రచిస్తున్నారు. తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణం, గోన బుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణం, మొల్ల రామాయణం, భాస్కర రామాయణం, దశరథ రాజనందన చరిత్ర, కంకంటి పాపరాజు రచించిన ఉత్తర రామాయణంతోపాటు తెలుగులో ఇంకా కొన్ని రామాయణాలు వచ్చాయి. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు చెప్పినట్లు "శిష్టసాహిత్యమున నొక రచనకు దాని కర్తచేత రూపురేఖలు దిద్దబడి పరిణత స్వరూపమేర్పడును. కానీ జానపద గేయము నొక్కక్కరి నోట నొక్కక్క రూపము దిద్దుకొనును. ఒకచో తరుగును. ఇంకొకచో పెరుగును". అయితే రామాయణం, భారతాలను జానపద కవుల్లాగా తర్వాతి కవులు తమ అభిప్రాయాలకు అనుగుణంగా కొంతమేరకు మార్చిన సందర్భాలు ఉన్నాయి. మూలంలో ఉన్నది కొన్నిచోట్ల కథకు సరిపోవడం లేదు అని భావించినప్పుడు మారుస్తారు, కథను రమ్యంగా మరల్చడానికి కొన్ని సన్నివేశాలు తొలగిస్తారు. కొన్ని కల్పనలు లేదా ప్రజలలో ఉన్నటువంటి కథలను జోడించి రచన చేస్తారు. వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని వివిధ భాషలలో అనువాదం చేసేటప్పుడు మరియు తెలుగులో దాదాపు అన్ని రామాయణాలలో ఈ మార్పు జరిగింది. అదేవిధంగా కూచిమంచి తిమ్మకవి రచించిన అచ్చ తెలుగు రామాయణంలో కూడా మూలంలో లేని అంశాలను జోడించడం జరిగింది.

దశరథ మహారాజు సంతానం కొరకు అశ్వమేథ యజ్ఞము, పుత్రకామేష్టి యజ్ఞము చేయడం జరిగింది. వాల్మీకి రామాయణంలో దశరథుడు మొదట అశ్వమేథ యజ్ఞం చేసి ఆ తరువాత ఋశ్య శృంగుని ఆదేవతో పుత్రకమేష్టి యజ్ఞం నిర్వహించడం జరిగింది. కానీ అచ్చ తెలుగు రామాయణంలో కూచిమంచి తిమ్మకవి మార్పు చేశాడు.

తే॥. అనుచు నిటు లొజ్జ చెప్పిన యట్ల యతని
దోడుకొని వచ్చి వేల్పులందరును దనియ
బారులగ బారులను గూర్చి వారువంపు
జన్న మొనరించి యారాచమిన్న మరియు

వశిష్టుడు దశరథునికి చెప్పిన ప్రకారం ఋశ్యశృంగుని తీసుకొని వచ్చి అశ్వమేధ యజ్ఞము చేశాడని, "కొమరులు గలిగెడి వ్రేలిమి" అనే పద్యంలో పుత్రకామేష్టి యజ్ఞం చేశాడని మార్పు చేశాడు.

పూర్వకాలంలో విద్యను అభ్యసించడానికి ఆశ్రమాలను పంపడానికంటే ముందు ఉపనయనం చేసేవారు. ఉపనయనం తర్వాత బ్రహ్మచర్య ఆశ్రమం వస్తుంది. ఆ సమయంలోనే విద్యాభ్యాసానికి పంపేవాళ్ళు. ఆ తర్వాత విద్యతోపాటు శారీరక వ్యాయామాలు నేర్చుకుంటున్న రామలక్ష్మణ భరతాది సోదరుల శరీర సౌష్టవాన్ని కూచిమంచి తిమ్మకవి సందర్భానుసారంగా క్రింది పద్యలో కల్పన చేశాడు.

సీ॥. చిన్ని క్రొన్నెల నెన్ను నెన్నొసళ్ల
 నియారి సల్ల నొయారీ
యలతి కస్తూరి రేకలనువు
 మీర గెలు దామరల మెల్జాలు
వా మురుగులు కెంపు
 లుంగరములు సొంపు నెరప...

ఈ పద్యంలో రామ సోదరుల ముఖాలు చిన్నచంద్రుని లాగా, తామరలాగా ఉండే వారి చేతులలో బంగారు కడియాలు అలంకరించి, మాణిక్యపు ఉంగరాలు పెట్టారని, నడుముకు బంగారు జలతారు పట్టుబట్టలు కట్టి, రతనాలు తాపిన మొలతాడు ధరించారని, ముత్యాల సరులు అలంకరించుకొని ముఖాలలో చిరునవ్వుతో ప్రకాశవంతంగా మెరిసిపోతున్నారని వర్ణించాడు.

విశ్వామిత్రుడు రాక్షస సంహారం కొరకు రాముని తీసుకువెళ్లడానికి అయోధ్యకు వచ్చిన సందర్భంలో తన యొక్క తపశక్తిని దశరథునికి చెప్పాడు. కూచిమంచి తిమ్మకవి విశ్వామిత్రుని యొక్క శక్తిని తెలియజేయడం కొరకు ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని క్రింది రెండు పద్యాలలో విశ్వామిత్రుని యొక్క శక్తిని అతని మాటల్లోనే చెప్పించాడు.

"కల్లల కెల్లను బుట్టిన
యిల్లన బెల్లున జెలంగు నెకిమీ డులకే
బల్లిదులుం గొరయగుదురె తెల్లంబుగ నొకటి నీకు దెల్పెద వినుమా"

"రక్కసులదెంత పలుమారు శుక్కి కన్న
పున్నియం బెల్ల జెడునని యేన్నికాక
కినికి తిట్టిన బరియలైచనక యున్నె
పసిడి పెన్బొజ్జరా గ్రుడ్డుపన టిగములు"

విశ్వామిత్రుని యొక్క తపఃశక్తిని ఈ పద్యాలలో ప్రతిపాదిస్తూ చాలాసార్లు తపస్సు చేసి సంపాదించిన పుణ్యము నశించి పోతుందేమోనని శపించడం లేదు కానీ, నేను శపిస్తే ఆ రాక్షసులే కాదు బంగారు బొజ్జలు కలిగిన రాజకుమారులు కూడా అల్పులై నశించిపోతారు అని దశరథునికి సందర్భానుసారంగా చేసిన హెచ్చరికలు కూచిమంచి తిమ్మకవి అవాల్మీకాంశాలే.

అహల్య శాపవిమోచనం ఘట్టంలో అహల్య శ్రీరాముని స్తుతిచేసినట్లు వాల్మీకి రామాయణంలో లేదు. అతిథి మర్యాదలు చేసినట్లు మాత్రమే ఉంది. కానీ కూచిమంచి తిమ్మకవి శ్రీరాముని యొక్క అవతారాలను అహల్య స్తుతించినట్లుగా ప్రతి అవతారాన్ని కూడా ఒక్కొక్క పద్యంలో చెప్పాడు.

"తివిరి జేజేలు మానసి దిండికాంద్ర" బాలకాండ - 127

"వెన్నుని జూపుమంచు బదివేల వితంబుల గన్న బిడ్డని" బాలకాండ - 128

"గుజ్జువడుగవై మునుదన" బాలకాండ - 129

వాల్మీకి రామాయణంలో రాముడు శివధనుర్భంగం చేసిన తర్వాత జనకుడు తన అనుచరులను అయోధ్యకు పంపి సీతారాముల వివాహం గురించిన కబురు అందించినట్లుగా ఉంది. కానీ కూచిమంచి తిమ్మకవి శుభలేఖను కూడా అయోధ్యకు పంపినట్లు కల్పించాడు.

"కేలెత్తి మ్రొక్కి వెసదము
నేలిన వాడిడిన కమ్మ ఇడుటయు నాతం
డోలినది చదువుకొని కడు
నాలెంకల నీగి వలన నలరించి తగన్"
అయోధ్యకాండలో కైకేయి,

రాముడిని అడవులకు పంపి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే శిబి చక్రవర్తంత కీర్తి వస్తుందని మూలంలో చెప్పబడితే ఈ కావ్యంలో తిమ్మకవి మార్పు చేశాడు.

"ఆడి తప్పక కొమరుని నాలి నమ్మి మాలనకి లెంక యై కొల్చి మట నిలుపు
కొన్న మీ వంగడుపు బెద్ద యున్నవాడే
యతని పేరెన్నటికీ బోవ దయ్యేగాక".

ఈ పద్యంలో విశ్వామిత్రుని చేసిన వాగ్దానం ప్రకారం రాజ్యాన్ని వదిలివేసి, భార్యాపుత్రులను విక్రయించి, సేవకుడిగా మారిన సూర్యవంశ రాజు సత్యహరిశ్చంద్రునిలాగా కీర్తిని పొందుతావని మార్పు చేశాడు.

అయోధ్యకాండలోనే కైకేయి రామున్ని అడవికి వెళ్లవలసిందిగా ప్రత్యక్షంగా చెప్పినట్లు మూలంలో ఉంది. తిమ్మకవి ఈ కావ్యంలో...

కII. "మోమోటమిచే మీతో నేమియునన నోపడీతడిప్పుడు
మీ రా రాముని గానల కనుపుడు
సేమంబున బుడమి రేని జేయుడు భరతున్"

కైకేయి రామునితో ప్రత్యక్షంగా కాకుండా వశిష్టునితో, సుమంతునితో దశరథుడు అవమానం చేత మీతో ఏమీ మాట్లాడలేడు. అందుచేత మీరు ఆ రాముని అడవులకు పంపించి, అందరికీ క్షేమం కలిగేటట్లు భరతునికి పట్టాభిషేకం చేయండని చెప్పినట్లుగా మార్పు చేశాడు.

అరణ్యకాండలో శూర్పణఖ వృత్తాంతములో మూలంలో శూర్పణఖ యొక్క ముక్కు, చెవులు రాముని ఆదేశం మేరకు లక్ష్మణుడు కోసినట్లుగా ఉంది. రాముని పాత్రకు అపవాదు వస్తుందనే లక్ష్యంతో తిమ్మకవి మార్పు చేశాడు.

"సంతసించియతని చెంత కట్టులు వోవ
జేటగోల్లబోటి బూటకంబు
దెలిసి యవ్వలంతి దిట మొప్పగా దాని
ముక్కు చెవులు నొకట జెక్కివైచె".

రాముని మాటలకు శూర్పణఖ సంతోషించి లక్ష్మణుని కడకు వెళ్లగా, శూర్పణఖ యొక్క అసత్యమైన ప్రేమ,

కామవాంఛను తెలుసుకొని ధైర్యంతో ఆ వనిత యొక్క ముక్కు, చెవులను ఏకముగా లక్ష్మణుడు ఖండించాడని మార్పు చేశాడు.

కిష్కింధకాండలో రాముడు అంగుళియకాన్ని సీతాదేవికి ఇవ్వవలసిందిగా హనుమంతునికి ఇచ్చిన సందర్భంలో...

"అనపుడు నాతడుక్కు దనరారగా నిట్లను నేలతాల్సయి
ప్పని దలబూని రక్కసుని బాలెము వాలెము జొచ్చి చేడియం
గనుగొని ఉంగరం బొసగి క్రన్నన నౌదల మానికంబు గై
కొని పరతెంతు వెండియును గోతి దొరల్గని సంతసిల్లగన్".

అని మూలంలో లేని సంభాషణను చేర్చి, హనుమంతుడు తన బలాన్ని ప్రకాశవంతం చేస్తూ, రాముడు చెప్పిన మాటలు శిరసావహించి, రాక్షసుల పట్టణమైన లంకా నగరంలో ప్రవేశించి, సీతాదేవిని దర్శించి, ఆమెకు ఉంగరం ఇచ్చి, ఆమె శిరోభూషణం తీసుకొని వస్తానని సంభాషించినట్లు మార్పు చేశాడు.

ఉపసంహారం : మహాభారతంలో కూడా తెలుగు కవులు ప్రధాన కథకు సరిపోని సందర్భాలను తీసివేయడం, ప్రధాన కథకు బలాన్ని చేకూర్చే కల్పిత కథలను చేర్చడం చేశారు. అదేవిధంగా అచ్చ తెలుగు రామాయణంలో కూడా కూచిమంచి తిమ్మకవి సన్నివేశాన్ని బట్టి కొన్ని మార్పులు చేశాడు. ఈ మార్పులు ప్రధాన కథకు భంగం కలుగనంతవరకు అంగీకరించవచ్చు. ఇందులో ప్రధాన కథ స్వేచ్ఛగా సాగుతూ, అవాల్మీకాంశాలు కథను ఉద్దీపింప చేశాయి.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్రామాయణము, చెదలవాడ సుందర రామశాస్త్రి, పుల్లెల శ్రీరామచంద్రుడు, ఆర్ష విజ్ఞా ట్రస్ట్, హైదరాబాద్, 1987.
2. తెలుగు జానపద గేయ సాహిత్యము, ఆచార్య బి. రామరాజు, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్, 1978.
3. అచ్చ తెలుగు రామాయణము - సమగ్ర వాఖ్యానము, ఆచార్య మొరంగపల్లి బాగయ్య, నవోదయ పబ్లికేషన్స్, 2005.
4. రామాయణ విశేషములు, సురవరం ప్రతాపరెడ్డి, విజ్ఞాన సరోవర ప్రచురణలు, చతుర్ధ ముద్రణ, 2013.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

15. అచ్చ తెలుగు రామాయణం – అలంకారాల అభిషేకం

– డా॥. వి. కళ్యాణి

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్, హైదరాబాద్.

లక్షణకారులు కావ్య రచనలో అలంకారాల ఆవశ్యకతను చెప్తూ, అలంకార సంఖ్య నిర్ణయం కూడా వివిధ రకాలుగా చేశారు. అలంకారాలు లేని కావ్యం లేదు. ప్రబంధ కవులు కావ్యాలను అలంకారాల పల్లకిలో ఊరేగించారు. ఈ విషయంలో ప్రబంధ కవులు ముందంజలో ఉన్నారని చెప్పవచ్చు.

కూచిమంచి తిమ్మకవి రచించిన అచ్చ తెలుగు రామాయణంలో అలంకారాలను విరివిగా ప్రయోగించారు. సహజమైన వర్ణన చేసేటప్పుడు స్వభావోక్తి అలంకారాన్ని, ఉపమాలంకారాన్ని విరివిగా వాడాడు. పట్టణ నాగరికతలను వర్ణిస్తున్నప్పుడు ఉత్ప్రేక్ష అలంకారానికి పట్టాభిషేకం చేశాడు. రమణీయ వర్ణనలో ఔచిత్యం ప్రాణంగా ఉండాలి. సర్వ అలంకారాలకు మూలమేది అని చూసినప్పుడు శాస్త్ర దృష్ట్యా ఉపమాలంకారం కాగా, అనుభవం దృష్ట్యా అతిశయోక్తి మౌలికమైనదిగా చెప్పవచ్చు. ఇందులో అతిశయోక్తులు అనేకంగా ఉన్నాయి. శబ్దాలంకారాల ప్రయోగాలు కూడా విరివిగా కనిపిస్తాయి. ఇందులో ఉన్న అలంకారాలన్నింటిని ఈ కావ్యానికి ఒక అలంకారంగా ఏరి, కూర్చడమే ఈ వ్యాస ఉద్దేశం.

కూచిమంచి తిమ్మకవి బాలకాండలో చేసిన అయోధ్య నగర వర్ణన పాఠకులకు ఒక భ్రాంతిని కలిగిస్తుంది.

"అలరంబున్న మరేలు మెల్పోయలుచే నవ్వీటిగాటం
పుక్రో న్నెలరామేడల నాడు చేడియలు పూర్కిమ్ జెంత గన్పట్టు వే
ల్పుల బువ్వం దేలి నిల్వుటద్దమని కేలుందమ్ములం బట్ట ని
మ్ములగం దండెను గాక యందు గలదే మున్నిర్రియు స్మరియున్"

అయోధ్య నగరంలో చంద్రకాంత శిలలతో నిర్మించిన భవనాలు అధికంగా ఉన్నాయి. ఆ భవనాలలో నివసించే సుందరిమణులకు పూర్ణిమరోజు దగ్గరకగా వచ్చిన చంద్రుడిని వారు స్వచ్ఛమైన నిలువటద్దమి భ్రాంతి చెంది తమ పద్మాల వంటి చేతులతో పట్టుకుంటారు. అప్రకృతమైన దానితో ప్రకృత వస్తువును చూచినప్పుడు అప్రకృత వస్తువు యొక్క జ్ఞానము భ్రాంతిమదాలంకారము. ఇక్కడ చంద్రుని చూచి నిలువుటద్దమని సుందరీమణులు భ్రాంతిపడ్డారు.

ఈ కావ్యంలో చాలాచోట్ల దృష్టాంత అలంకారాన్ని విరివిగా ప్రయోగించిన పద్యాలు ఉన్నాయి.

"తొలి వేల్పుల మొగములు తెల
తెలవారగ తెల్ల బారె దెరవల మోముల్
తులువల నడకలు దడబడ
దలిరాకు బోండ్ల నడలు దడబడ దొడగెన్" (బాల - 52)

విష్ణుమూర్తి అవతరించే సందర్భంలో రాక్షసుల ముఖాలు కాంతి విహీనమైనాయని, వారి ప్రవర్తనలు అస్తవ్యస్త మైనయని ఇందులో చెప్పబడింది. ఇక దశరథుని రాణుల ముఖాలు తెల్లబారినాయి. వారు గర్భవతులైనారు కాబట్టి. అట్లే వారి నడకలు తడబాటు పొందాయి. ఇందులో రాక్షసులకు, దశరథుని భార్యలకు, వారి ప్రవర్తనలకు బింబ ప్రతిబింబ భావము చెప్పడం వలన దృష్టాంత అలంకారము పొదగబడింది.

ఈ కావ్యం అక్కడక్కడ వర్ణనలతో కూడుకొని, అతిశయోక్తి అలంకారాలకు అభిషేకాన్ని చేసింది. సీత స్వయంవరానికి మిథిలా నగరానికి వచ్చిన రాజుల సమూహాన్ని క్రింది పద్యంలో అతిశయంగా వర్ణించారు.

"పుడమి యీనిన వడుపున నెడ ఒకింత
లేక మూకల చేత బ్రోల్వెలుగు చుండే
నిట్లు గూడిన ఎకిమింద్ర కెల్లా జెలిమి
మెరయ విడిపట్టు లొసగె నమ్మిథిలరేడు"

సీత స్వయంవరానికి దేశ దేశాల నుండి ఎక్కువమంది యువరాజులు వచ్చారు అని చెప్పడానికి నేల ఈనినట్లు అని మిథిలా నగరాన్ని వర్ణించటంలో అతిశయోక్తి అలంకారము ప్రస్ఫుటిస్తుంది.

ప్రబంధ కవులు ఉత్ప్రేక్షలను విరివిగా ఉపయోగించారు. కూచిమంచి తిమ్మకవి ఈ కావ్యంలో అయోధ్యకాండలో రాముని పట్టాభిషేక సమయంలో అయోధ్య నగరం అంతా అలంకారాలతో ముస్తాబైన సమయంలో సూర్యాస్తమయ వర్ణనలో అయోధ్య నగరమే కాదు, ఆకాశం కూడా అలంకరించబడి ఉందని చెప్పే సందర్భంలో

"రికరాయడు దమిమీర రేవెలది బెండ్లి యగునని కడయను పేరటాలు
మొనసియై రేని నీటికై ముంచు పసిడి
కుండ యన ప్రొద్దు మున్నీట గ్రుంకెనంత" (అయోధ్యకాండ - 12)

నక్షత్రాలకు నాయకుడైన చంద్రుడు తృప్తి కలిగినట్లుగా, రాత్రి అనే వనితను పెళ్లి చేసుకొనునని, దిక్కు అనే పుణ్యస్త్రీ, బంగారు కడవను నీటిలో ముంచనేమో అన్నట్లుగా సూర్యాస్తమయం అయిందని చెప్పాడు. ఇక్కడ సూర్యుని బంగారు కుండతో పోల్చి స్వధర్మాన్నీ ప్రకటించాడు.

ప్రబంధాలలో అష్టాదశ వర్ణనల్లో సూర్యాస్తమ వర్ణన ఒకటి. ఇందులో నాలుగు పద్యాలలో సూర్యాస్తమ వర్ణన చేశాడు.

"చలి వెలుగు రాకగని తమ సామి యైన
వేడివేలుపు నేలు బల్విడిని ద్రోచే
గడయను గయాలియని యొజక్క వలు వెన్ను
నడుగువట్టుక మొరసేయ దొడగే నప్పుడు"

ఇందులో చంద్రుడు ఉదయించడం చూచి తమకు నాయకుడైన సూర్యుడిని పడమర దిక్కు అనే ఒక దూర్త స్త్రీ సముద్రంలో తోసేసిందని, తాము దిక్కులేకుండా పోయామని చక్రవాక పక్షులు విష్ణుమూర్తి పాదాలు పట్టుకొని

ప్రార్థించినాయట. సూర్యడు అస్తమించినప్పుడు, చంద్రుడు ఉదయించి వెన్నెల కాస్తున్నప్పుడు, చక్రవాక పక్షులు జంట విడిపోయి విరహాన్ని అనుభవిస్తూ ఆక్రందన ధ్వని చేస్తాయని కవులు సహజంగా వర్ణిస్తారు. ఈ ధ్వని తమ నాయకుడైన సూర్యన్ని పడమర దిక్కు అనే స్త్రీ సముద్ర గర్భంలోనికి త్రోసి వేసిందా అన్నట్లుగా కవి ఈ పద్యంలో ఊహించాడు. కాబట్టి ఇందులో ఉత్ర్పేక్ష అలంకారం ఉంది.

నిజానికి చక్రవాక పక్షులే కాకుండా ఏ పక్షులైనా సూర్యుడు అస్తమించిన తరువాత, కనులు కనిపించకపోవడం చేత తమ ఆప్తుల కొరకు వెతకడం సహజం ఈ స్థితిని కవులు చక్రవాకాలకు ఆరోపిస్తారు. చక్రవాకం పక్షులు కూడా కల్పన మాత్రమే.

కిష్కింధకాండలో భూదేవి కూతురైన సీత కొరకు విలపించిన కన్నీటిని తిమ్మకవి ఒక సీస పద్యంలో ఒడిసిపట్టాడు.

"గాటంపు వలి నాలిగాడ్పు లూర్పలు గాగ
గొమరొందు తెలినుర్వు లుమిక యుల్లెలు గాగ
నెరయస ల్జిరాయ నేరులు గాగ మొగలి
పూ బొదలు మోమున చేర్చు చీరగా
బూరి మోసులు గగుర్పొడుపు గాగ
జిమ్మట రోదలు గాసిలి యుస్స రానుటగా
సలరు నెమలి కూత లార్పులుగను" (కిష్కింధకాండ - 66)

భూమి అనే వనిత తన కుమార్తె సీతాదేవి కొరకు దుఃఖించి విలాపము చెందిన విషయం వర్షఋతువులో కలిగే లక్షణాలతో సమన్వయించడం జరిగింది. భూమి మీద ఉండే సుడిగాలులు భూదేవి నిట్టూర్పులు లాగా, వరదలు ఆమె కన్నీరు లాగా, తెల్ల నురుగులు తరంగాలలాగా, మొగలిపూల జోన్నాలు కన్నీరు తుడుచుకునే కొంగులాగా, గడ్డి మొలకలు శరీరంలోని పులకల్లాగా ఉన్నాయని, ఆరుద్ర పురుగులు సుందరమైన ఎర్రని రాళ్ల కెంపులు లాగా భూదేవి తన ముద్దుల కుమార్తె అయిన సీతాదేవిని తలుచుకుని అంతము లేనట్టి దుఃఖముతో విలపించినట్లుగా వర్ణించడంలో ఉపమాలంకారం పోలిక ఉంది.

తిమ్మకవి తెలుగు పదాలతో చమత్కారం చేసి ఒక్కొక్క మాటకు రెండు అర్థాలు స్పురించేటట్లు శేషాలంకారములో పద్యాలను రాశాడు.

"గ్రుడ్డు కానుపు రేడు గ్రుడ్డు కాను పురేడు
గుర్రంబు పాన్పునై కొమరు మిగుల
జింకతాలు పరియు జింకతాలు పరియు
మరదియు ననుగునై మెరుపు జూప
నీరు పుట్టువయును నీరు పుట్టువయును
బూరయు దోడవునై పొలుపు నెరప
బచ్చువార్పపు జోడు పచ్చ వార్పపు జోదు
వలకన్ను కొడుకు నై వలపు గులుక" (బాలకాండ - 3)

ఇందులో విష్ణుమూర్తి యొక్క స్తుతి ఉంది. గరుత్మంతుని అశ్వముగా కలిగి, గుడ్డులో పుట్టిన ఆదిశేషున్ని పాన్పుగా కలిగి, చంద్రునికి బావై, నీటిలో పుట్టిన పద్మాన్ని ధరించి, సూర్యుని కుడికన్నుగా కలిగి, మన్మథుడిని

కుమారునిగా కలిగి, చక్రాయుధాన్ని ధరించి, దరిద్రాన్ని పోగొట్టే లక్ష్మీదేవినీ భార్యగా కలిగి, ప్రకాశవంతమైన బంగారు పట్టు వస్త్రాలు ధరించనవాడు అని చెప్పబడింది.

ఇందులో కానుపురేడు అనగా పక్షిరాజు అయిన గరుత్మంతుడు, సర్పరాజు అయిన ఆదిశేషుడు. జింక తాలుపరి అంటే శివుడు మరియు చంద్రుడు. నీరు పుట్టువా అంటే నీటిలో జన్మించిన శంఖము మరియు పద్మము. పచ్చ వార్వపు జోదు అనగా సూర్యుడు మరియు మన్మధుడు. తెలుగు మాటలలో సమానమైన ఒకే మాటకు రెండు అర్థాలు కలిగించడం ఇందులో చమత్కారము మరియు శ్లేషాలంకారం ఉందని చెప్పవచ్చు.

ఈ పద్యములో గ్రుడ్డు కానుపు రేడు, నీరు పుట్టువు, పచ్చ వాద్యపు జోదు అనే పదాలు ఆవృత్తి అయ్యాయి. శాబ్దిక సౌందర్యాన్ని సాధించడమే శబ్దాలంకారాల యొక్క ప్రయోగానికి కారనం. ఇందులో పదాల ఆవృత్తి వలన అనుప్రాస అలంకారం కూడా ఉందని చెప్పవచ్చు.

అరణ్య కాండములో సీతాదేవి సౌందర్య వర్ణన చేసేటప్పుడు అలంకారాలను ఆలంబనగా చేసుకొని వర్ణించాడు.

“కన్నుల చిన్ను పెన్నేరుల కప్ప” అనే పద్యలో సీతాదేవి కన్నుల్లో ఉన్నట్టి అందము, కొప్పులోని నల్లతరం, పలు వరుసల అందము, ముఖ సౌందర్యం, శరీర శోభను చాలా సహజసిద్ధంగా వర్ణించి స్వభావోక్తి అలంకారాన్ని తిమ్మకవి ఇందులో సాధించాడు.

ఉపసంహారం :

పద్యాలకు యతులు, ప్రాసలు, చందస్సు శాబ్దిక సౌందర్యాన్ని సాధిస్తే, అలంకారాలు శాబ్దిక సౌందర్యంతో పాటు అర్థ సౌందర్యాన్ని కూడా తీసుకొస్తాయి. సంస్కృతంలో మిళితమైన తెలుగు భాషలో కేవలం అచ్చ తెలుగులోనే కావ్యాలు రాయడం సాహసోపేతమే. పాఠకులను మెప్పించడం కూడా సాహసోపేతమే. కూచిమంచి తిమ్మకవి అచ్చ తెలుగులో రచించినా వీలైనంత వరకు అర్థ, శబ్దాలంకారాలను ప్రయోగించి, విజయవంతమై, కావ్యానికి ఉన్నతిని సాధింపజేశాడు. అచ్చ తెలుగు పదాలతో శ్లేషాలంకారాన్ని సాధించటం కూచిమంచి తిమ్మకవి యొక్క కవిత్వ పటుత్వానికి నిదర్శనం.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్రామాయణము చదలవాడ సుందర రామశాస్త్రి - పుల్లెల శ్రీరామచంద్రుడు - ఆర్ష విజ్ఞాన ట్రస్ట్ - హైదరాబాద్, 1987.
2. అచ్చ తెలుగు రామాయణము - సమగ్ర వ్యాఖ్యానము - ఆచార్య బాగయ్య - నవోదయ పబ్లికేషన్స్ - 2005.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

16. శ్రీరఘుకుల సార్వభౌమ శతకం - రామతత్త్వం

- డా॥. ఎం. వేణుగోపాల్ శర్మ
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్, తెలంగాణ.

శతకకర్త పరిచయం :

బహుగ్రంథకర్త, ఉపన్యాస కళానిధి, భాగవత కథా కథన నిపుణ బిరుదాంకితులు బ్రా॥శ్రీ ఆచార్య సి. పుండరీక శర్మ గారు (1939 2002) కామారెడ్డి జిల్లా వాస్తవ్యులు. శృంగేరి, హంపి, పుష్పగిరి, శంకరపీఠాలలో సన్మానమునొందిన వీరు కామారెడ్డి ఓరియంటల్ డీగ్రీ కళాశాలలో ఆచార్యులుగ సేవలు చేసారు. ఆంధ్ర,మహారాష్ట్రాలలో ధార్మికోపన్యాసాలు ఇచ్చారు. పలు జాతీయ అంతర్జాతీయ పత్రికలలో సాహిత్య వ్యాసాలు రాసారు.

మనిషి తన జీవితాన్ని సఫలం చేసుకోవడానికి ఎన్నో మార్గాలను అనుసరిస్తాడు. సమాజంలో ఒక వ్యక్తిగా, శక్తిగా నిలిచేందుకు జ్ఞానవిజ్ఞానాలను ఆశ్రయిస్తాడు. తాను ఎన్నుకొన్న వృత్తిలో, ఉద్యోగంలో రాణించడానికి నిరంతరం కృషిచేస్తాడు. సమాజంలో తనకు కీర్తి ప్రతిష్ఠలు రావాలని కోరుకుంటాడు. ఇంతటితో మనిషి తన జీవితంలో పరిపూర్ణత సాధించినట్లు కాదు. భౌతికంగా ఎంతగా ఎదిగినా, మానసికంగా కూడా ఎదగకపోతే అన్ని ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరులా అవుతాయి. మానసికంగా ఉన్నతిని సాధించాలంటే ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయక తప్పదు.

ఆధ్యాత్మికత విచారధారలో నేనెవరు ? ఎందుకు పుట్టాను ? నేను ఏమి సాధించాలి ? దేనిలో మానసిక ప్రశాంతత దొరుకుతుంది? అనే ప్రశ్నలుదయిస్తాయి. ఇలాంటి సందేహాలను తీర్చుకునేందుకు మనిషి ఎన్నో దారులను ఎన్నుకుంటాడు. ఈ లక్ష్య మార్గంలోనే కవి పండితులు తన భక్తి భావనలను భగవంతునితో పంచుకోవడానికి, సమాజానికి మంచి హితబోధ చేయడానికి శతక ప్రక్రియను ఎన్నుకొని దానిలో తన భక్తితో కూడిన ఆర్ద్రతను కవిత్వం ద్వారా నివేదించుకుంటారు.

మానవ శరీరంలోని అన్ని ఇంద్రియాలు, మనస్సుతోనే పనిచేస్తాయి. మనసుతో అనుసంధానం లేకుంటే ఏ ఇంద్రియమూ చక్కగా పని చేయదు. కనుక మనసును గొప్ప భావనలకు, ఆలోచనలకు వినియోగించాలని పెద్దలమాట. అన్ని వైపుల నుండి వచ్చే మంగళకర భావనలను మనిషి మనసుతో స్వీకరించాలని వేదం చెబుతోంది. కావున అన్ని

దారులు మంచివే. ఏ దారిలో వెళ్ళినా అనుకున్న గమ్యాన్ని చేరడమే కదా కావలసింది ? దారులు కాదు గమ్యమే ముఖ్యం అన్నది జీవితసత్యం.

ఆచార్య పుండరీక శర్మగారు రాసిన ఈశతకంలో నాలుగు విభాగాలను గమనించవచ్చు రామవర్ణన, తత్సంబంధ మంత్ర ప్రస్తావన సంస్తుతి మొదటి భాగం యోగ, వేదాంత, నీతిశాస్త్రాదులను ప్రస్తావించినవి రెండవ భాగం. మొదటి 60 పద్యాలలో ఇవి ముగిసి 61వ పద్యం నుండి 112వ పద్యం వరకు రామకథ సంగ్రహింపబడింది. తర్వాత ఎనిమిది పద్యాలలో స్వీయ విషయాలు, చివరి పద్యంలో మంగళవాక్యంతో ఈ శతకం ముగుస్తుంది. ఇవియే కాక ఈ శతకానికి ముద్రదాతలను సకుటుంబంగా ప్రస్తావిస్తూ అయిదు పద్యాలున్నాయి. వీటికి కూడా మకుటం ఉంది మొత్తానికి 126 పద్యాలు గల ఈ శతకం "సకల గుణధామ రఘుకుల సార్వభౌమ" అనే మకుటంతో(ఏకపాద మకుటం) పూర్తయింది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనురామ వాక్యము ననుసరించి శ్రీ శర్మగారు ఈ కృతిని ఉప్పల్వాయిలో కొలువుదీరిన రామభక్తుడగు శ్రీ అంజనేయ స్వామికి అంకితం చేయటం సముచితంగా జరిగింది.

ఈ శతకం రాయడానికి శర్మగారు ఎందుకు పూనుకున్నారో వారే ఈ శతక పీఠికలో స్వయంగా చెప్పుకొన్నారు. "శ్రీరఘుకుల సార్వభౌమ శతకం" రాయాలనిపించింది. శ్రీరాముడు నాతో వారం రోజుల్లోనే దీనిని పూర్తి చేయించాడు. శ్రీరామోపాసనం కవిత్వ శక్తిని కలిగిస్తుందని సంప్రదాయకుల అభిప్రాయం. ఆ శక్తి నన్ను ఈపని చేయించి ఉంటుందని అంటారు.

మా ఉప్పలవాయిలో పురాతనమైనవి రెండు దేవాలయాలున్నాయి. ఒకటి ఉత్తరాన కొద్దిదూరంలో చెరువు గట్టున ఉన్న "శ్రీరామలింగేశ్వరస్వామి" ఆలయం. ఇది నాకు తపోభూమి. ఈ స్వామికి "శ్రీరామలింగ శతకం" రాసి అంకితమిచ్చాను. ఇక రెండవది గ్రామం మధ్యలో ఉన్న "శ్రీ అంజనేయ స్వామి" ఆలయం ఇదీ నాకు తపోభూమే. ఈ స్వామి ఏకాదశి రుద్రావతారాల్లో ఒకడు. అందుకని లఘురుద్ర పూజ చేయాలని ఉండేది. అది కుదరలేదు అందుకే అతని ఇష్టదైవమైన శ్రీరామునిపై "శ్రీరఘుకుల సార్వభౌమ అనే మకుటంలో 121 పద్యాలు రాశాను. ఈ పుస్తకాన్ని శ్రీ అంజనేయస్వామికి అంకితమిచ్చాను ఈ విధంగా లఘురుద్ర పూజ పూర్తి చేశాను అని కవి చెప్పుకొన్నాడు.

సకల గుణాలకు నిలయడైన ఆ రఘువంశతిలకునిపై శతకం రాయపూనిన శర్మగారు మొదటగా సంప్రదాయ సిద్ధంగానే పద్యాన్ని శ్రీకారంతో ప్రారంభిస్తూ ముక్కోటి దేవతలలో అగ్రపూజార్హుడైన ఆ గణనాథుని "అఖిల సిద్ధులగందురోయాగణేశు గొలుతు నిరతంబు భక్తితో గొల్కెలబ్బ" అని స్తుతించాడు.

తే॥. "ఆరువర్ణములను గల్గియఖిలభోగ
భాగ్యమోక్షంబు లిచ్చెడు పరమ మంత్ర
రాజమొప్పను తంత్రాభిరామమగుచు
సకల గుణధామ రఘుకుల సార్వభౌమ

ఈ పద్యంలో సర్వజనులు ఉపాసితమైన రాముని యొక్క షడక్షరీ మంత్రాన్ని వివరించడం జరిగింది. శర్మగారే శతకపీఠికలో స్వయంగా మంత్రతంత్రాల అంతర్రహస్యాన్ని ఏయే పద్యాలలో పొందుపరిచాడో వివరించాడు. దీనిని బట్టీ చూస్తే కవిగారు వేదం, శాస్త్రం ఇత్యాది అంశాల పట్ల కూడా విశేషమైన ప్రజ్ఞా పాటవాలున్నట్లు తెలుస్తుంది. ఆ పద్యాల వరుస ఈ విధంగా చెప్పాడు.

7వ పద్యం "ఆవరణ షట్కములు గూడి యలరుచున్న యంత్రరాజంబు నీదు దివ్యార్థదంబు దేవమునిగణ పూజమైతేజరిల్లులో జగత్పూజ్యమైన రామయంత్రం చెప్పబడింది ఇది రామ రహస్య ప్రతిపాదితమైంది అన్నాడు.

తే॥. తారకంబగు నీదు మంత్రంబు సతము
సంస్మరించెడు విబుధులు సత్పదంబు
జేరియానందులౌదురు శ్రీవిలాస

పద్యంలో అమోఘమైన రామ తారక మంత్ర వైశిష్ట్యాన్ని పొదిగింపజేశాడు ఎల్లపుడు ఈ మంత్రాన్ని స్మరించే భక్తజనకోటికి సత్ఫలితంబు ముక్తి ప్రదాయిలు అవుతారని వ్యక్తమౌగుచున్నది. పూర్వం రాముని ఆశ్రయించిన చాలు రామ: శబ్దాన్ని నిరంతరం జపించినచాలు మోక్షసిద్ధులయ్యారన్నది మనం పూర్వకథల ద్వారా తెలుస్తుంది రామతారక మంత్రానికి అంత శక్తి యున్నది.

తే॥. నీదు షడ్వర్ణమంత్రముల్ నిక్కమరయ
శతముపై నిరువదెన్మిది సంఖ్యదనరు
సర్వమంత్రంబులను జెప్పసాధ్యమగునె ?

లో రామమంత్రాలు పరశ్శతాలని వివరించబడింది. శ్రీ అంజనేయ మంత్రాలు ఏకముఖ, పంచముఖ, సప్తముఖ, ఏకాదశముఖ, శతముఖాదికాలని తంత్రాలు సూచిస్తున్నాయి. ఇవన్నీ ఇహపర సాధకాలే అని చెప్పవచ్చు.

తే॥. ఆపదలద్రుంచువాడవు నమితమైన
సంపదల బెంచువాడవు సకల లోక
సుందరాకారుడవు నీకు వందనములు

ఇందులో భక్తుల ఆపదలను, దుఃఖాలను తీర్చుతాడని, మితముకానట్టి సుఖ సంపదల నొసగువాడనీ, సకల లోకాలకు సుందరమైన ఆకారం(రూపం) కలవాడని కీర్తించడం జరిగింది. ఆ భగవత్స్వరూపాన్ని దర్శించిన పిమ్మట పంచప్రాణాలు కదలాడినట్లుగా ఎప్పుడు మందస్మితుడై శతృవుల పాలిట రుద్రుడై ఉన్నటివాడు ఆ రఘుకులోత్తముడు ఆ రామచంద్రమూర్తి అని చెప్పవచ్చు.

రామనామ జపం ఎంత గొప్పదో వివస్తున్నాడు

తే॥. "జప తపంబులకన్నను సర్వయోగ
సాధనంబులకన్న యజ్ఞాదికంబు
కన్న హెచ్చుగు నీ నామ ఘనత జూడ

నిరంతరం జపములు, యోగసాధనాలు, యజ్ఞాలు చేయుట కన్న చాలా కీర్తి ప్రధానమైనది రామనామ తారక మంత్రమేనని స్పష్టీకరించాడు కవి.

తే॥. 'వేద వేదాంత వేద్యుడు వివిధతత్త్వ
ములకు నాద్యుడు నానందమూర్తి యనుచు
బుధులు సేవింతురనిశంబు పూర్ణ భక్తి

నీవు వేదపురుషుడవు వేదాంత వేద్యుడవు, తత్త్వ జ్ఞానంలో తాత్వికుడవు, ఆనందమయుడయిన నిన్ను సర్వము ఈ భక్తులు సతతము నిన్నే భజింతురు. వారు నిష్కామ మనస్కులై, పూర్ణభక్తి భావంతో నిన్ను కొనియాడుతారు. ఇక్కడ రామునిపై ఉన్న భక్తి, ప్రేమ, సద్భావనలు భక్తులలో ఉన్నట్లు వ్యక్తమగుతున్నది.

నీ యొక్క నామము మహిమచేత పౌరాణిక కాలంలో నారదుడు ఎదిగాడు, నీపాద మహిమను శాపవశాత్తు వల్ల శిలగా పడియున్న ఆ గౌతముని భార్య అహల్యాదేవి గుర్తించినది. అన్ని మహిమలను ఎరిగినవాడు ఆ శర్వుడు ఒకడే అని 35వ పద్యంలో ప్రస్తావించడం జరిగింది.

తే॥. "గుహుని బ్రోచిన చెలిమియు కూర్మిమీర
శబరినేలిన దయనేడు జననిదేమొ?
నన్నుగాపాడకుంటివి న్యాయనిపుణ

పూర్వం గుహుని, శబరిని, పోలినట్లే నన్ను ఈ కలియుగమునందు కాపాడుమని భక్తుడు మొరపెట్టుకుంటున్న తీరు గుర్తించదగినది.

తే॥. "కష్టములయందు ధైర్యము కలిమియందు
నోర్పు విద్యయందునపేక్ష నూర్జితయశ
మందుప్రీతిని గలిగింపు నహరహంబు

నాకు కష్టకాలమందు ధైర్యాన్ని, అన్ని విద్యలందు ఓర్పును నిన్నారాధించడానికి మంత్ర ప్రీతి కలిగించమని ప్రాధేయ పడ్డారు. బహుశ దీనిని ఇక్కడ ప్రస్తావించడానికి కారణం భర్తృహరి శతకంలోని ఒక పద్యం ఇక్కడ మనకు స్ఫురిస్తుంది. "ఆ పదలయందు ధైర్యగుణ మంచిత... అని అంటే భర్తృహరి సుభాషిత త్రిశతి ప్రభావం దీనిపై ఉన్నట్లు తెలుస్తుంది.

తే॥. "దేవదేవుని నినువేడ దేవగణము
దశముఖాదుల నిర్జింప దశరథేశు
కవతరింపవె రాముడవనగ నీవు
సకల గుణధామ రఘుకులసార్వభౌమ

ఈ పద్యములో రామకథను సంగ్రహంగా చెప్పడం జరిగింది. ఆ దేవదేవుని దేవతా గణాలన్నీ కూడా వేడుకొంటున్నాయి. దశకంఠుని ధూర్త భావాలను ద్రుంచడం కొరకై దశరథా కౌసల్యల గర్భమున శ్రీరామునిగా త్రేతాయుగంలో జన్మించాడు. ఆయన అవతారమెత్తినది శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ కొరకే. విశేష గుణసంపన్నుడు, రూపలావణ్యుడు ఆ శ్రీరామచంద్రమూర్తి

కౌశిక గోత్రికుడు యాగరక్షణార్థియై తండ్రిని కోరగా, అనుగ్రహించెను గురువుగా విశ్వామిత్రుడుదయించి బల, అతిబల విద్యాలను ప్రసాదించాడు.

తే॥. "తండ్రి దురవస్థగని ధైర్యమూని
జానకీ లక్ష్మణులతోడ సాగిపోవ
ప్రజలు దు:ఖితులైరినిన్ బాయలేక
సకల గుణధామ రఘుకులసార్వభౌమ

కైక కోరిన కోరికలకు దశరథుడు మూర్ఛపోయాడు. ఆ దురవస్థను చూచి తండ్రియాజ్ఞ మీరక, సీతా లక్ష్మణ సమేతుడై కాననములకు వెళ్ళాడు శ్రీరాముడు. ఆసన్నివేశాన్ని చూసి ఆయన మీది భక్తి తోడ, అభిమాన ప్రీతితోడ అయోధ్య వాసులంతా శోకసంద్రులైనారు. రాముని యొక్క ఎడబాటు ఎంత ముఖ్యమైనదో, ఆయన లేని లోటు ప్రజలలో కన్నుల కనిపించే విధంగా పై పద్యంలో మనకు వ్యక్తమగుచున్నది.

విధియు రుద్రుడు, విష్ణువు వివిధ దైవ గణములైనను తమ కర్మఫలము ! ననుభవింప తీరునాయమరవినుత అను పద్యంలో ఎవరికైన విధి వ్రాత తప్పదని నిరూపితమగుతున్నది.

శతకాలు దాదాపుగా ముక్తకాలు. ఏపద్యానికి ఆ పద్యమే ప్రత్యేకంగా భావాన్నిస్తాయి. కానీ ఈ శతకంలో తద్భిన్నంగా కూడా పద్యాలున్నాయి "చనుచు పాపంబులణచియు సర్వపుణ్యము అనే పద్యానికి "పాద పద్మమ్ము లగడిగి భక్తితోడ గుహుడు దాటించె నదినంత కూర్మిమీద అనే 78వ పద్యానికి అన్వయమున్నది. రాముని మీది భక్తితోడ గుహుడు రాముని కాళ్ళు కడిగి, పడవ ఎక్కించుకొని గంగానదిని దాటించాడు. శ్రీరామునిపై ఉన్న భక్తి భావం, సర్వప్రాణులకత్యంత ప్రీతప్రదమని ఈ పద్యాల ద్వారా తెలుస్తుంది.

తే॥ "ధర్మపథమును వీడిన దశముఖుండు
వాలమున కగ్నిరగిలింప వాయుసుతుడు
గాల్చెలంకను రాక్షసగణములేడ్వ
సకల గుణధామ రఘుకుల సార్వభౌమ

దశకంఠుడు ధర్మం వీడి ప్రవర్తించాడు. వచ్చిన దూతను అవమానించరాదు. అనుమానించనూరాదు. కానీ వాయు సుతుని తోకకు నిప్పంటించాడు. అప్పుడు ధర్మం వీడిన ఆ రావణునికి తగిన గుణపాఠం చెప్పివచ్చాడు. ఆ కాల్చిన తోకతోనే ఆ లంకా నగరాన్నంత అంటించాడు ధర్మమే సర్వకాలమందు సర్వావస్థలందు నిల్చును అన్న అంశం ఇక్కడ మనకు ద్యోతకమౌతుంది.

శుత్రువంశం నుండి వచ్చిన విభీషణుని అక్కున చేర్చుకొన్న ఆనంద స్వరూపుడు ఆ శ్రీరామచంద్రుడు దీనిని బట్టి శతృవులకు కూడా రామ శబ్దముపై రామునిపై గల భక్తి ఎట్టిదో తెలుస్తుంది.

తే॥ "శరణువేడ విభీషణ జాగులేక
రాజు గాజేసినట్టి రారాజు నీవు
నీదు మహిమలు బొగడంగనేర్తురెవరు

అనన్య సామాన్య భక్తితత్త్వం నీకు, నీభక్తులకున్నది. శ్రీరామచంద్రా! నీ బాహుబల విజృంభణకు శతృవులు తాళలేక నేల పాలయ్యారు. లోకానికి కంటకులు అయిన ఆ రాక్షన సంహారాన్ని చూసి ఆ దేవతలు నీపై కుసుమ వర్షం కురిపించారు.

చాలామంది కవులు భగవంతుని నుండి ముక్తిని కోరుతారు కానీ ఈ శతకంలో శర్మగారు నీ సేవ చేయడానికి నాకు అపారమైనట్టి భక్తిని ఒసంగుమయ్య అని కోరుకొన్నాడు. నేను నిన్ను ముందు ఏమీ కోరలేదు. ఇన్ని చేసి ఏది కోరకపోతే బాగుండదు. కావున నాకు భక్తినొసంగుము అని వేడుకొన్నాడు.

తే॥ "ఇన్ని జేయించినాడవు నిన్ను ముందు
గోరగా నేదియునులేదు కోరికొకటె
భక్తితో సేవజేసెడి భాగ్యమిమ్ము
సకల గుణధామ రఘుకుల సార్వభౌమ

తర్వాత చివరకు మంగళము భక్త మానస మందిరునకు మంగళము భూమి సంజాత మదనునకును అని చివరకు మంగళకరంగా శతకాన్ని ముగించాడు. అదే కదా మన సంప్రదాయం "మంగళాదీని, మంగళ మధ్యానీ, మంగళాంతాని అన్నది.

ఈ శతకములో ప్రస్తావించబడిన పద్యాలలోనే భక్తి తత్త్వం కాదు అపారమైన మంత్రతంత్ర శక్తిని కూడా పుండరీక శర్మగారు ఇనుమడింపజేశారు. శర్మగారి కవిత్వ విశేషములు అమోఘమైనవిగా తెలుస్తుంది. శ్రీరామునిపై భక్తి ప్రపత్తులతో ఈ శతకమును పఠించి ఆనందించుటయే ప్రథమ కర్తవ్యం. ఇది చిన్న శతకమైనను అనేకమైన మహామంత్ర విషయాలను ప్రస్తావించాడు. నేను వాటి జోలికి వెళ్ళలేదు. కేవలం భక్తి భావన దృష్యానే చూడడం జరిగింది. ఇందులో నీతులు, సందేశాలు, ఉపదేశాలు, శాస్త్రాంశాలు, ఎన్నో చోటు చేసుకొన్నవి. ఇవన్నియు రత్నముల వలె భక్తి సూత్రంలో అనుసధానింపబడినవై రాముని కంఠమున రమణీయ హారములై శోభిల్లుతున్నాయి. ఇంత మంచి శతకమును రచించిన పుండరీక శర్మగారి కృత కృత్యత పొందినదని చెప్పవచ్చు.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

17. బంజారాలు పాడుకునే శ్రీరాముని పాటలు – విశ్లేషణ

– డా॥. పి.భగ్గు

తెలుగు అతిథి అధ్యాపకులు, డా.ఎ.పి.జె అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా.

1. పరిచయం :

సీతాన్వేషణ కోసం లంకానగరానికి వెళ్ళిన హనుమంతుడు అశోకవనంలో శింశుపావృక్షంపై సూక్ష్మరూపం ధరించి ఉన్నప్పుడు తన భార్యలతో కలిసి సీత దగ్గరికి వచ్చిన రావణాసురుడు సీతతో పరుషంగా మాట్లాడిన మాటలను విన్న తర్వాత సీతాదేవి ముందుకు వెళ్ళి నేను శ్రీరాముని దగ్గరి నుండి వచ్చానని విన్నవించుకోగా అప్పుడు సీత హనుమంతుడితో నీవు శ్రీరామున్ని చూశానని చెప్పావుగా శ్రీరాముడు ఎలా ఉంటాడో అతని యొక్క గుణగణాలు స్వభావాన్ని తెలుపమని అడుగుతుంది. శ్రీరాముడు నీలి మేఘం వర్ణపు శరీరచ్ఛాయను కలిగినవాడు, తెల్లని పద్మరేకుల వంటి కన్నులు కలవాడు. శంఖాన్ని పోలిన కంఠంతో అందమైన చీలమండలతో పొడవైన చేతులతో, దుందుభి ధ్వని వంటి కంఠస్వరముతో, అందమైన వక్ష స్థలము కలిగినవాడు, సత్యాన్ని పలుకుతూ ఉండేవాడు. కపటము తెలియనివాడు. రాముడు శుభలక్షణాలను కలిగినవాడని చెడుతాడు. అలాంటి శ్రేష్ఠమైన ఉత్తమ గుణాలను కలిగిన త్రేతాయుగ పురుషుడు శ్రీరాముని చరిత జగమెరిగిన సత్యం.

2. వివరణ :

రామాయణ కాలం నాటి సుగ్రీవుడు తన అన్న వాలిని చంపి వదిన తారను వివాహమాడినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. బంజారాలలో కూడా అన్న భార్యను వివాహమాడే పద్ధతి ఆచరణలో ఉంది. బంజారా పెద్దలు కూడా వాలి, సుగ్రీవులకు బంజారాలకు సంబంధాలు ఉన్నాయని చారిత్రక కథనాలు చెబుతున్నారు. దీనిని బట్టి కొంత చరిత్ర తెలుస్తుంది. తమ పండుగ దినాలలో శ్రీరామున్ని పూజిస్తూ పాటలు పాడుతుంటారు. వాటిని 1. పురుషులు పాడే పాటలు, 2. స్త్రీలు పాడే పాటలు అని రెండు విధాలుగా విభజించి ఈ వ్యాసంలో విశ్లేషణ చేస్తాను.

3. పురుషులు పాడే పాటలు:

బంజారా పురుషులు పండుగల సందర్భంలో కంచుపళ్ళాలు, తాళాలు మోగిస్తూ ఒకరు పాటను ఎత్తుకోగా మిగిలిన వారు శృతి కలుపుతూ పాటలను పాడుతారు. అలాగే హెూళి పండుగ సందర్భాలలో కూడా వలయాకారంగా

నిలబడి ముందుకు కదులుతూ, చుట్టూ తిరుగుతూ ఆడుతూ పాటలను పాడుతూ ఉంటారు. ఆయా సందర్భాలలో పురుషులు పాడుకునే పాటలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పూరో భరోసో ప్రభూ తారో రేణూరే రాం
బదరాచలమేమా సరీరాం హూబోయేరో
కాంకేమా బాణ సరీరాం ఘూలమేలో
కాంకేమా బాణ కాడన్ హాత ఝులమేలో
మాయార లేడిన రామ మారలూ కన్ కేరో
రామ బాణం చోడదతో టాలో యేనికేరో
జిండి కలమ జాన రామ గోడి వాళ దేరో
రామదాస్ మారాజ్ ప్రభూ దేవళ్ భందామేలో
రామేరి లచమణేరి దేవళే భందామేలో
మ డగరి జాయూ జేర్ పచ్చ
సోనేర్ ముచ్యాల్ పడియకన్ ఆంక లఖమేలో

(నేనావత్ బిచ్యా: 90. పాన్‌గోత్ గండా, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

శ్రీరామా తండ్రి నీ అభయం మాకెప్పుడు ఉండాలి. భద్రాచలంలో నీవు నిలబడి ఉన్నావు. చేతిలో బాణాన్ని పట్టుకొని గురి పెట్టి, మాయలేడిని చంపేస్తానని మోకాలి మీద కూర్చున్నావు. రామబాణం గురి తప్పదు. రామదాసు నీకు దేవాలయాన్ని కట్టించాడు. నేను వెళ్ళిపోయినా బంగారు ముత్యాలు పడతాయని చెప్పి రాత రాసి పెట్టావు.

శ్రీరాముని అభయం ఎప్పుడూ ఉండాలని కోరుకుంటూ రామబాణం గురి తప్పదని, భద్రాచలంలో రామదాసు ఆలయం కట్టించాడని శ్రీరామలక్ష్మణులు ఆశీర్వదించాలని వేడుకుంటూ పాడిన పాట ఇది.

రామ రామ భజూర బాపూ రామ సాయి వీయ
రామ సాయి వీయ జత పాంచి భాయి రీయ
పాంచి భాయి రీయ జత డావసాణ రీయ
డావసాణ రీయ జత బావా భగత రీయ
బావా భగత వీయ జత సాయిర్ బచన్ కీయ
సాయిర బచన్ కీయ బావా హరో భరో రీయ

(కేతావత్ జాంజూ:60. బచ్చాపురంతండ, చందంపేట మం. నల్లగొండ జిల్లా)

భావం :

శ్రీరామ, శ్రీరామ అని పిలిస్తే భగవంతుడు పలికి ఆశీర్వదిస్తాడు. స్వామి ఆశీర్వదించిన చోట ఐదుగురు అన్నదమ్ములుంటారు. ఐదుగురు కలిసి ఉన్నచోట అనుభవజ్ఞులు, పెద్దవాళ్ళ తోపాటు పూజారులు, బావాజీలు ఉండి, సమాజానికి మంచి, చెడులను బోధిస్తూ ఉంటారు. బావాజీలు ఆశీర్వదించిన దగ్గర అందరికి శుభాలు కలిగి, ఆనందంగా పచ్చగా కళకళలాడుతూ నిండైన సంపదలతో తలతూగుతూ ఉంటారు.

రామ హెూళి బాళో లచమణ దాండో కాడో
హనుమాన్ తుకారి ఛోడో మాల్ ఖేదేపర్

మాల్ ఖేడేపర్ భై భై ర
సమోర్ నాచోర భై భై ర

(రమావత్ శివ్లా: 50. పలుగుతండ, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం: శ్రీరాముడు "హెూళి" కాల్చాడు. అప్పుడు లక్ష్మణుడు ఆ మండుతున్న హెూళిలో నుంచి కట్టె తీసాడు. దానిని దాండో అంటారు. మాల్ఖేడ్ మీద హనుమంతుడు హెూళి కాల్చారని కేకలు వేశాడు. ఇప్పుడు మనం కూడా అదే విధంగా హెూళి పండుగ చేసుకుందాం రండి.

అస్సి ధరతీర పరియా రామన లచమణ చాలగే
వోరి చాల చలాయిర సోనేరి హెూళి యే
హెూళి రమ్మొర భై భై ర
హెూళి రమ్మొర చెటి చెటి
హెూళి రమ్మొర అడుగు భెళ్ నూ
హెూళి రమ్మొర గమతేతి

(పానుగోతు స్వామి: 55. లచ్యతండ, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

ఈ భూమిపై రాముడు, లక్ష్మణుడు నడిచారు. హెూళి అలా తన పద్ధతిని నడిపించింది. కాబట్టి ఆ పద్ధతి ప్రకారం మనం హెూళిని దూరం దూరంగా జరుగుతూ, అడుగు, అడుగు కలుపుకుంటూ, ఆనందంగా హుషారుగా అందరం కలిసి ఆడుకుందాం రండి.

ఈ విధంగా హెూళి పండుగ సందర్భంలో శ్రీరామలక్ష్మణులను గురించి బంజారాలు పాటలు పాడుకుంటారు.

భాయి మ భాయి బాపూ లచమణే బాయి
పాంచీర భాయిమా బాపూ లచమణే భాయి
ప్రభూ బేటామ బేటార్ బాపూ సరమణే బేటా
నారిరే నారిమా బాపూ యాడి సీతచే నారి
దాదా రాం భజరోరే బాపూ ప్యానారి సమియామా
బాపూ భూండో టాళోరే అబేరే సమియామా

(పానుగోతు దేవుజి: 50. లచ్యతండ, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

అన్నా తమ్ముళ్ళలో ఉత్తముడు లక్ష్మణుడు. అదేవిధంగా ఐదుగురు అన్నదమ్ములలో మంచి లక్షణాలు కలిగినవాడు లక్ష్మణుడే. కుమారులలో ఉత్తముడు సర్వణుడు. స్త్రీలలో ఉత్తమ గుణాలు కలిగిన స్త్రీ సీతాదేవి. ఆ కాలంలో అందరూ ఉత్తమ లక్షణాలు కలిగి ఉండడం తోపాటు అన్ని శుభాలు జరిగేవి.

లోకంలో ఉత్తమ లక్షణాలు కలిగిన వారైన తమ్ములలో ఉత్తముడు లక్ష్మణుడు అని, కుమారులలో ఉత్తముడు సర్వణుడు అని, స్త్రీలలో ఉత్తమ స్త్రీ సీతా అని ఆ విధంగా ఉత్తములైన వారు ఆ కాలంలో ఉండేవారని, కాని ఈ కాలంలో చాలావరకు చెడు ఉన్నదని కాబట్టి శ్రీరామచంద్ర ప్రభువు ఆ చెడును తొలగించి సకల శుభాలు జరిగేలా ఆశీర్వదించమని వేడుకుంటున్నారు.

లంకారో లచమణ సీతాన పాడలేగో
హనుమాన దాంటో చడోరే చడాయి
సీతారే ఖబరేన రామ కేన మేలో
హనమా దేవేన చడాయే చడాయి
లంకారే రామణేతి మారోరే లడాయి
లంకారే దేశేమా కరరో దవాయి

(ధనావత్ పకీరా: 55. పలుగుతండ, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

లంకలోని రావణాసురుడు వచ్చి సీతను తీసుకొని పోయాడు. హనుమంతుడు ఆ లంకను ఎక్కాడు. సీత జాడను వెతకడం కోసం శ్రీరాముడు ఎవరిని పంపించాడు. హనుమంతున్ని పంపించాడు. లంకలో రావణాసురుడును హనుమంతుడు ఎదురించి లంకను నాశనం చేసి వచ్చాడు.

రామ లచమణ బాలాజి లచమణ్ ర
లంకారో రామణ్ తెలగాణో రేణూర
ఓడాపలిమా బాపూ పోలిసేరో టాణో
మిరాలగూడా తాలూకేమా తేలేరో ఘణో
నలగుండా జిలామా బాపూ రపియారో ఘణో
కిలో చడన్ దేకో దాదా దీసో తెలగాణో
క్వారేర గ్వారేమా దాదా సాయి వేజాణూ
తీసర మడిమా దాదా సాయి వేజాణూ

(పానుగోతు దేవుజి: 50. లచ్యతండ, త్రిపురారం మం.నల్లగొండ జిల్లా)

భావం :

శ్రీరామలక్ష్మణులు, బాలాజి దేవుళ్ళు ఉన్నారు. లంకలో రావణాసురుడు ఉన్నాడు. అలాగే తెలంగాణ ఉన్నది. వాడపల్లిలో పోలీస్ స్టేషన్ ఉంది. మిర్యాలగూడ తాలూకాలో నూనె చాలా ఎక్కువగా ఉంది. నల్లగొండ జిల్లాలో రూపాయలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఖిల్లా ఎక్కి చూస్తే తెలంగాణ కనపడుతుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారిని భగవంతుడు చల్లగా చూడాలి. అందరూ సుఖశాంతులతో ఉండాలి.

ఈ పాటలో రామలక్ష్మణులు, శ్రీవేంకటేశ్వర స్వామి ఒక్కరే అనే భావనను తెలుపుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఉన్న ప్రస్తుత వజీరాబాద్‌కు పూర్వం 'ఓడాపల్లి' అని పేరు ఉండేది. అక్కడ ఒక పోలీస్ స్టేషన్ ఉండేది. పోలీసుల వలన పడిన బాధలకు గుర్తుగా ఆ ఊరిలోని ఠాణాను గుర్తుంచుకుంటున్నారు. అలాగే మిర్యాలగూడ తాలూకా చుట్టు ఉన్న ప్రాంతంలో నూనెకు కొదవలేదని, ఇక్కడ అందరి దగ్గర రూపాయలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలియజేస్తూ ఖిల్లా ఎక్కి చూస్తే అనగా గొల్కొండ ఖిల్లా ఎక్కి చూస్తే తెలంగాణ మొత్తం కనిపిస్తుందని చెప్పడం ఆనాటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా ఈ పాటలో వర్ణించబడింది.

స్త్రీలు పాడే పాటలు :

బంజారా స్త్రీలు ఇంట్లో, పొలంలో పనులు చేస్తున్నప్పుడు శుభకార్యాలు జరిగే సమయాలలో, పండుగలు,

జాతరల సమయాల్లో పాటలను ఉత్సాహంగా పాడుతుంటారు. ఆ విధంగా వివిధ సందర్భాలలో పాడిన పాటలు ఈ విధంగా ఉన్నాయి.

రామ చాలే లచమణ చాలే
ఊంపర కూణ చాలర లోకో
లాఖ దనియావో దేకో
ఊంపరేన మేరామా చాలర లోకో
లాఖ దనియావో దేకో

(రమాత్ జ్యోతి: 35. ఇందిరానగర్ తండ, దామరచర్ల మం. నల్లగొండ జిల్లా)

భావం :

ఈ భూమిపై రామలక్ష్మణులు నడిచారు. ఆ పైన ఎవరు నడిచారో ఓ జనులారా! లక్షల మంది చూస్తూ ఉన్నారు. అక్కడ మేరామా తల్లి నడుస్తూ ఉంది. లక్షల మంది చూస్తున్నారు.

ఈ భూమిపైన రామలక్ష్మణులు నడిచారు. వారు నడిచిన మార్గం ఉత్తమమైనది. సుగుణాలు కలిగినవారు ఆచరించిన మార్గం మానవులకు చాలా ఆదర్శమైనది. కాబట్టి వారు నడిచిన మార్గంలో పయనిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి మన వంతు కృషి చేయాలని మనల్ని లక్షల మంది చూస్తూ ఉంటారని, అలాగే లోక జనని అయిన జగదాంబ తల్లి నడుస్తూ ఉంటుందని చెప్పడం విశేషం.

పాంచ సాంకడో కడపా పర మేలి
రపియారో బానో దేవేన చడగో
హరి చిటి లకమేలి
లకి లకాయి చిటి రామేరి జేబేమా
లచమణ గోచే దూండేన లాబగిచే చిటి

(నేనావత్ రక్మ: 40. కాపువారిగూడెం, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

ఐదు వందలు కడప మీద పెట్టాను. ఆ డబ్బులు దేవునికి కానుకగా సమర్పించబడినవి. ఆకుపచ్చని చీటి రాసి ఉంచడం జరిగింది. ఆ రాసి ఉంచిన చీటి రాముని జేబులో ఉంది. లక్ష్మణుడు ఆ చీటిని వెదకడానికి వెళ్ళాడు. అప్పుడు ఆ చీటి దొరికిపోయింది.

శ్రీరామునికి ఐదు వందలు సమర్పించాము. తమ కోర్కెలను తీర్చమని చీటి రాసి శ్రీరాముని సన్నిధిలో ఉంచి వచ్చాము. కాని ఆ చీటిని వెదకడానికి లక్ష్మణుడు వెళ్ళాడు. అప్పుడు ఆ చీటి లక్ష్మణునికే దొరికిందని చెప్పడం అన్నదమ్ముల మధ్య ఉండే అనురాగానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

రామేరి జడే హాట లోకణిరో ఝాడ ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
లోకణిరే ఝాడే హేట పీట పలేంగ ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
పీట పలేంగే పర సీతా బ్యాటిచ ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
బ్యాటి బ్యాటి సిత హారే పోరోయి ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
హారే పోరోన సీతా గళేమా ఘాలి ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
గళేమా ఘాలిర సీతా డళ డళ రోయి ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్

రామేరి జడే హాట లోకణిరో ఝాడ ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
లోకణిరే ఝాడే హేట పీట పలేంగ ర హెూరిలో నాచేన హెూరిలో హూంస్
(పానుగోతు సేలి: 45. లచ్యతండ, త్రిపురారం మం. నల్లగొండ జిల్లా)

భావం :

ఆకాశపు వేరు కింద అశోకవనంలో శింశుపావృక్షం ఉంది.హుషారుగా ఆడి,పాడే ఉత్సాహం ఉన్నవాళ్ళు ఆడి పాడండి. ఆ అశోకవనంలోని శింశుపావృక్షం కింద సీతమ్మ పీటలాంటి దిమ్మ మీద కూర్చొని ఉంది. ఆ పీట మీద సీతాదేవి కూర్చొని ఒక హారాన్ని తయారు చేసి, ఆ తర్వాత ఆ హారాన్ని మెడలో వేసుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

భూమిపై అశోకవనంలో మొలచిన శింశుపావృక్షాన్ని ఆకాశపు వేరు కింద మొలచిందని వర్ణించడం, ఆ శింశు పావృక్షం కింద సీతాదేవి దిమ్మ మీద కూర్చుందని కల్పించడం, అశోకవనంలో కూర్చున్న సీత పూసలతో హారాన్ని తయారు చేసిందని చెప్పడం, ఆ తర్వాత ఆ హారాన్ని మెడలో వేసుకొని ఏడ్చిందని పాడటం బంజారా స్త్రీల వర్ణనా నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

ఈ విధంగా బంజారా స్త్రీలు, పురుషులు శ్రీరాముని గురించి పాటలు పాడుకుంటూ ఉంటారు.

ముగింపు :

శ్రీమన్నారాయణుడు దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడానికి, ధర్మాన్ని కాపాడటానికి ధరించిన అవతారమే శ్రీరామావతారము. మానవులను ఉత్తమమార్గంలో, ధర్మమార్గంలో నడిపించడానికి శ్రీరాముని జీవితం ఆదర్శమైనది, అనుసరించదగినది. ఆ ఆదర్శమార్గాన్ని బంజారాలు కూడా అనుసరిస్తున్నారు అని చెప్పడానికి ఈ పాటలు నిదర్శనంగా నిలుస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. గోనానాయక్ ఎం. 2002. సుగాలి సంస్కృతి భాషా, సాహిత్యాలు. హైదరాబాదు: పద్మశ్రీ గ్రాఫిక్స్.
2. భగ్యు, పి. 2014. నల్లగొండ జిల్లా గిరిజన సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం. హైదరాబాదు విశ్వవిద్యాలయం (పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం)
3. రామరాజు, బి. 1958. తెలుగు జానపద గేయ సాహిత్యం. హైదరాబాదు: జానపద విజ్ఞాన ప్రచురణలు.
4. మోహన్, జి,ఎస్. జానపద విజ్ఞానాధ్యయనం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
5. సుందరం ఆర్వీఎస్. 1983. ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
6. సూర్యాధనంజయ్, డి. 2007. నల్లగొండ జిల్లా బంజారాలు జీవన చిత్రణ. హైదరాబాదు: శీతల్ పబ్లికేషన్స్.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

18. రంగనాథ రామాయణం - భరతుని పాత్ర చిత్రణ

- శ్రీమతి గొంగులూరి కృష్ణవేణి

అతిథి అధ్యాపకురాలు, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల (స్వ), సంగారెడ్డి, తెలంగాణ.

1. పరిచయం :

తెలుగులో వెలువడిన రామాయణాలలో గోనబుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణం మొదటిది. గోనబుద్ధారెడ్డి క్రీ.శ.1210లో జన్మించినట్లు తెలుస్తుంది. ఆయన తన తండ్రి విట్టల లక్ష్మీనాథుని కోరిక మేరకు రంగనాథ రామాయణాన్ని రచించాడు. ఈ రామాయణం వాల్మీకి రామాయణాన్ని అనుసరిస్తూనే కొన్ని అవాల్మీకాంశాలను కూడా చేర్చుకున్నట్లుగా కనిపిస్తుంది. గోనబుద్ధారెడ్డి తెలుగు వారి అభిరుచులకు తగినట్లుగా దేశీయతను ప్రతిబింబింప జేస్తూ, జాను తెనుగులో ద్విపద కావ్యంగా సర్వజన సుబోధకంగా రామాయణాన్ని రచించాడు. సంస్కృత అనువాద కవులలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా కథాకల్పనలు చేసినవారిలో గోనబుద్ధారెడ్డి ప్రథమగణ్యుడు. “వాల్మీకి రామాయణంవలె ఇదియు ‘పాఠ్యేగేయేచ మధుర’ మై పాటగా పాడుకొనేవారికి, కావ్యముగా చదువుకునేవారికి సమాదరపాత్రమై పండితులకేకాక పామరులకూ వినియోగపడి సార్వజనీనమైన పేరును గడించింది” అన్న ఆచార్య పింగళి లక్ష్మీకాంతం మాటలు రంగనాథ రామాయణం ప్రాశస్త్యాన్ని తెలుపుతాయి.

ఈ ద్విపద రామాయణంలో భావప్రధానమైన శబ్దాలను ఎన్నుకొని వాటిని సన్నివేశయోగ్యంగా ప్రయోగించాడు కవి. రసస్ఫోరక పదజాలం, దృశ్యమయంగా దర్శింపజేసే వర్ణనలు, పాత్రల మనోభావ వ్యక్తీకరణలు, మనసును ఆకట్టుకునే ఔచిత్యాలతో రంగనాథ రామాయణం కావ్య సౌరభాలను వెదజల్లుతుంది. 1729 ద్విపదల్లో నడిచిన ఈ రామాయణం అత్యంత జనాదరణ పొందిన గ్రంథంగా ప్రశస్తిని పొందింది.

2. వివరణ :

రంగనాథ రామాయణంలో గోనబుద్ధారెడ్డి గారు 1300ల ద్విపద దగ్గర నుండి 1660 వరకు ద్విపదలలో భరతుని గురించి పేర్కొన్నారు. సకల సుగుణ సంభరితుడు భరతుడు. శ్రీరామ భక్తునిగా లక్ష్మణుని కన్నా మిన్న భరతుడు. లక్ష్మణుడు తన సర్వస్వమూ రాముడే అని అతని వెన్నంటే ఉండి సేవగావించాడు.

ఇక భరతుడు తన శరీర సుఖ సంపత్తులనే కాక రాజ భోగాలన్నీ విడిచి రాముని దివ్యాజ్ఞ శిరసావహించాడు. రాముని ఆజ్ఞను అణుమాత్రమైన అజాగ్రత్త చూపలేదు. రాముని పాదుకలనే సింహపీఠిపై నుంచి, వానికి ప్రతినిధిగానే

ఉన్నాడు. అయోధ్య రాజ్యలక్ష్మిని క్రీగంటనైనా తిలకించక అర్హుడగు శ్రీరామునికి పువ్వులలో నుంచి అతని పాదాలకు సమర్పించాడు. ఇంతటి త్యాగము భరతునికి తప్ప ఏ చరిత్రలో ఎవరినైనా చూపగలమా? పరమ సుందరి చెంత ఉన్నప్పటికీ కఠోర బ్రహ్మచారిగా ఉన్న భరతుని హృదయం అతని భక్తి మనకు అర్థమవుతుంది.

రామాయణంలో లక్ష్మణుని పాత్ర ఎంత గొప్పదో భరతుని పాత్ర కూడ అంతే ప్రాధాన్యతని సంతరించుకుంది. లక్ష్మణుడు ప్రత్యక్షంగా రామునితో ఉంటూ సేవలు చేస్తూ, తోడుగా ఉంటూ అన్నింట్లో అండగా ఉండే పాత్రగా కనిపిస్తుంది. కానీ భరతుడు కూడా అన్న పాదుకలను నెత్తిన మోస్తూ రాముడు తన వనవాసం పూర్తిచేసుకుని తిరిగి అయోధ్యకు వచ్చే వరకు రామరాజ్యం సుభిక్షంగా ఉండడంలో పాలన సాగించాడు కాబట్టి భరతుడు కూడా పరోక్షంగా రామునికి తోడ్పాటును అందించాడు.

రంగనాథ రామాయణంలోని భరతుని పాత్రని, స్థానాన్ని, కవి ఏ విధంగా తీర్చిదిద్దాడో ఈ వ్యాసంలో పేర్కొనడం జరిగింది. ఎక్కువగా సారాంశం గా పేర్కొన్నాను.

భరతుడు తాత గారింట్లో ఉండగా అతనికి దుశ్శకునాలు కనిపించాయి. ఏమి జరుగుతుందో అనుకొనుకొంటూ ఉండగా అయోధ్య నుండి దూతలు అక్కడికి వచ్చారు. వశిష్ఠ మహర్షులు వారి ఆజ్ఞ ప్రకారం తక్షణం భరతుని అయోధ్యకు రమ్మని చెప్పారు. దుస్స్వప్నాలు - తక్షణం రమ్మని మహర్షులవారి ఆజ్ఞ ఇంక భరతుడిని అక్కడ నిముషం నిలువలేకపోయాడు. అయోధ్యకు బయల్దేరాడు.

అలా భరతుడు అయోధ్య పొలిమేరల్లోకి రథంపై వచ్చాడు. అక్కడ సూర్యవంశ శ్రేష్ఠులూ తన వంశ మూల పురుషులు విగ్రహాలను ఎంతో అనల్ప శిల్ప చాతుర్యంతో తయారుచేసి శిల్పులను మెచ్చుకొని తాతలనందరినీ దూతలు పరిచయము గావిస్తుండగా భరతునికి ఒక విగ్రహాన్ని తిలకించి ఆశ్చర్యాద్భుతాలతో మనస్సు తిలకిస్తుంది.

"సూతా! యీ విగ్రహ మెవరిదీ?" అడిగాడు. " ఆర్యపుత్రా! తమ తాత అజ మహరాజు గారిది" అన్నాడు "మరి ఆ ప్రక్కనే ఉన్న ఆ విగ్రహమెవరిది?" సూతుడు తమ తండ్రి దశరథ మహారాజుగారిది. భరతునికి కాళ్లాడలేదు. తమ తండ్రిగారు విగ్రహరూపమయ్యారా? సూతా! ఇక్కడ ఉంచారెందుకు ? సూతుడు - వారి పితృదేవుల ప్రక్కనుండక మరెక్కడుంటారు?

భరతుడు - సందేహముతో "అయితే మా పితృదేవులు కూడా కీర్తిశేషుడయ్యారన్నాడు సూతుడు. సూతా! రథాన్ని తొందరగా పోనీ!

"యిది ఏమి విధమొకో? యీ పట్టణంబు - తుదిముట్ట శూన్యమై తోచుచున్నదీయు
పౌరులు నను జూచి బాష్పము లదొరుగా - దూరుచు దవ్వుల దొలగి పోయేదరు"

(పుట:125/1328 ద్వి)

అలా అయోధ్యకు వచ్చిన భరతునికి ప్రజలు స్వాగతం పలికిన తీరును మనం గమనించవచ్చు. భరతుడుడికి రాజ్య పౌరులు రాజమార్గములో నిత్యమూ రాత్రీపగలూ ఒక్కలాగ వచ్చే పోయే జనసమ్మర్థం ఎవరూలేరు. తిన్నగా తల్లి కైకేయి భవనానికి చేరాడు.

భరతుడు- అమ్మా! పితృదేవులెక్కడ ?

"నాయనా! సర్వ భూతాలకు సహజ నివాస మెక్కటో అక్కటికే వెళ్ళారు అతిగంభీరంగా చెప్పింది కైక. ఆవార్త వినేసరికి భరతునికి తలపై పిడుగు పడినట్లయి తలకొట్టుకుంటూ ఏడుస్తూ భూమిపై పడిపోయాడు.

భరతుని లేవదిస్తూ- నాయనా! పోయినవారు తిరిగిరారుకదా? "అమ్మా! నాకు కులగురుదేవులు తక్షణం రమ్మని దూతలను పంపించారు. అయితే శ్రీరామాచంద్రుని కనకాభిషేకము చేస్తారో! యజ్ఞయాగాలు అతడుచేస్తాడో

అనివచ్చాను"అని భరతుడు అన్నాడు. "ఇంత ఘోరకృత్యము ఎందుకు జరిగింది? "ఏముంది? సీతాలక్ష్మణులనే తలచుకుంటూ జీవితాన్ని విడిచారు"

"ఏ మమ్మా! రామాదులిక్కడలేరా?"

"సీతాలక్ష్మణులతో చీర-వస్త్రాలు ధరించి రాముడు దండ కారణ్యానికి వెళ్ళాడు"

"అమ్మా! సీతాలక్ష్మణులతో ఎందుకు వనవాసానికి వెళ్ళాడు?

అంతఘోరకార్యం రాముడేమిచేశాడు?

భరతుడు తన అన్న అయిన రాముడుని గురించి పరి పరి విధాలుగా అడిగినట్టుగా కంపించిన తల్లి కైకేయి మాత్రం తన అసహనంతో జవాబిస్తుంది.

కైక! నా తల్లివై కరుణకు బాసి ఈ కష్ట వర్తన మేల కైకొంటి?
ముని వేషమున వనంబున రామునుండు - మని పల్క నెట్లు నోరాడనే తల్లి?

(పుట. 148, ద్వి.140)

అని భరతుడు ఒకవైపు అంటుంటే మరొక వైపు "యువరాజ్యాభిషేకము పొందనుండే రాముడు అరణ్యానికి పంపాలని-నిన్ను అభిషేకింపమనీ నేనే కోరాను. అందువల్ల నీవు నీతండ్రికి అపరకర్మ చేసి అనంతరం పట్టాభిషేకాన్ని చేసికో నాయనా?" అంది కైక.

భరతునికి ఆమాటలు వినేసరికి తల వేయి ముక్కలయినట్లఇంది. దుఃఖం ఒకప్రక్క-కోపం పరవళ్లు త్రోక్కుతుంది.

ఏ మాత్రం రాజ్యకాంక్ష లేకుండా కేవలం పితృ భక్తి, సోదర భావం కల్గిన పాత్రగా చిత్రించిన తీరును అభినందించవచ్చును. స్వంత తన తల్లి అయిన కైకేయి తో కూడా తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా పేర్కొన్నాడు.

"ఛీ! పాపిష్టి! ఎంత ఘోరకృత్య మాచరించావే కులనాశినీ!?

సూర్యవంశానికే నీవల్ల కళంకము వచ్చిందే! దశరథ మహరాజును శ్మశానానికి- రాముని అరణ్యానికి పంపావు. అసలు వీళ్లు నీకేమి చేసారని ఇలా చేశావు? నాకన్న మిన్నగా నిన్ను రాముడు మాతృభక్తితో నిత్యమూ పూజించేవారు గదే? ఆ సూర్యవంశ -పరమ పావని సీతమ్మ నీకేమి చేసింది? భ్రాతృవత్సలుడు లక్ష్మణుడు నీకేమిచేశాడు? వారిపై నీకెందుకింత కోపం? వారునీకేమి చేశారు?

"నాపేరుమీద యీ సామ్రాజ్యాన్ని పరిపాలించాలని నీకు దుర్మార్గపు ఆలోచన పుట్టిందేమో! ఇప్పుడే పోయి అరణ్యాన మా అన్నను తీసికొని వచ్చి అతనికి యావత్ సామ్రాజ్యాన్నీ పట్టముగట్టి అతని పాదసేవచేస్తూ బ్రతుకుతాను" అన్నాడు భరతుడు. తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పే గుణం అందరికీ ఉండదు.

భరతుడు అలా అంటాడని కైక కలలోగూడా ఊహింపలేదు. కైకకు భరతుని మాటలు ఆకాశము తలపై పడ్డట్లయి. ఆమె అంతకుముందు ఎన్నో ఆకాశభవనాలు ఊహాలోకములో నిర్మించుకొంది.

"నాకుమారుడు ఈ కోసల సామ్రాజ్యాభిషిక్తుడౌతాడు. నేనుచెప్పినట్లే పరిపాలిస్తాడనీ, భూప్రజలూ మంత్రి-సామంతాదు లందరూ నాకే వందనములాచరిస్తారనీ-కౌసల్య-సుమిత్రాది రాణులంతా తన కటాక్షాన్నే పొందటానికి ఎదురు చూస్తున్నట్లు" ఇలా ఎన్నో రకాలు భావించింది కైక. తన కొడుకే ఇలా ఔతాడని అనుకోలేదు. భరతుడు తననేమి చేస్తాడోఅని భయంతో చేష్టలుడిగి చిత్తరువులాగ నిల్చింది కైక. అయినా గంభీరంగా నిల్చింది.

"భరతా! నామాటలు విను. నీకెవ్వరూ సోదరులు లేరు. యథేచ్ఛగా రాజ్యాన్ని పాలించుకో! నీవు మరల రాముని

అడవి నుండి ఇక్కడకు తీసుకొస్తావా? ఎందుకు? నువ్వీ రాజ్యాన్ని పాలించడానికి రాముడిక్కడ అడ్డుగా ఉన్నాడనే అతన్ని అరణ్యానికి ముందుగా పంపాను.

ఆ కైక మాట గోరుచుట్టుపై రోకటి పోటువలే భరతుని బాధించాయి. అతడు దుఃఖముతో కుమిలి పోయాడు.''దుష్టులం! ఈ ఇక్ష్వాకు వంశములో పెద్దవాడే రాజ్యాన్ని పాలించాలి.

ఈ విధంగా భరతుడు సింహాసనాన్ని, పట్టాభిషేకాన్ని కాదని అన్న రాముడి కోసం పరితపించాడు.

రాముడు కేవలం ధర్మ రక్షణకే జన్మించాడు. కేవల దుస్స్వార్ల- దురూహ దుష్టతలపులుగల నీకెక్కడర్థమౌతుంది? మా వంశప్రతిష్టనే మంటగలిపావు. నీకు పుట్టి నందువల్ల నేను నరకమనుభవిస్తున్నాను. నేనిప్పుడెలా తలెత్తి తిరగగలను?

నాకు ఇక్కడ ఏమి జరిగిందీ తెలీదు. ఇప్పుడిక్కడికి వచ్చిన తరువాతనే తెలిశాయి. రాముని అరణ్యవాసాన్ని నాకన్నులతోనే నేనేలాచూస్తాను? అని భరతుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.

ఇక కౌసల్య దగ్గరకు వెళ్ళి భరతుడు ఏడుస్తూ ఆమె పాదాలపై బడ్డాడు ''అమ్మా ఇంత ఘోరమా? నా సోదరుడుకాదు నాదేవుడు రాముడు అన్నాడు. ఇంతలో సుమిత్రా దేవి అక్కడికి వచ్చింది. భరతుడామెకు వందనం చేశాడు. ''తల్లులారా! వెంటనే వెళ్ళి అరణ్యములోనున్న రాముని తీసుకొని వచ్చి సింహాసనమెక్కించి నేనరణ్యవాసానికి వెళతాను అన్నాడు.

అప్పుడు కౌసల్య
పతి బాసి సుతుబాసి బహుళ దుఃఖముల - మతి మాకు శోకింప మరి దగుగాక

(పుట. 1363)

అని భర్తమరణం, కొడుకు అరణ్యావాసం తీరని లోటు అని దుఃఖిస్తూ అన్నది.

''కుమారా! భరతా! నీ కన్నతల్లి చలువ ఇలా రాజ్యాభోగాలనుభవించడం నీవు చూస్తూన్నావుకదా! ఇప్పుడు సుమిత్రా నేనూ వనవసానికి వెళ్లమంటే వెళతాము. ఇక్కడ మాప్రభువు లేడు. కన్నకొడుకులు లేరు. మేమెవరి కొరకు ఇక్కడుండాలి? మారాజ్యభోగాలు మాప్రభువుతోనే అంతరించాయి. ఇంకా మిగిలుంటే కుమారులతో అరణ్యములో ఉన్నాయి'' అని అనగానే

భోరున భరతుడు ఏడుస్తూ వారి పాదాల మీదపడి ''మాతృమూర్తులారా! నేనే పాపమెరగను? హాయిగా శాంతిగా ఉన్న గోమాతను కాలుతో తన్నిన వాడు, తన పనివారలతో దుర్మార్గపు కార్యాలను చేయించేవాడు. విపరీతంగా ప్రజా ధనాన్ని పన్నుల పేర దోచుకొని ప్రజా రక్షణ చేయలేని రాజుబీ యజ్ఞయాగాదులు గొప్పకుచేసి, ఋత్విజులకు ధనమీయలేని వాడు- రణరంగాన విరోధులతో పోరాడలేని రాజు- ఏపాపాలందునో- నేనూ అంతకన్న యెక్కువ పాపాలందుతాను.

గురువుల దిట్టిన కుటిలాత్ము గతికి నరయ స్వామి ద్రోహియగువాని గతికి
దల్లిదండ్రుల దిట్టు తనయుని గతికి - గల్ల లాడెడు పాపకర్ముని గతికి

(పుట. 127: 1376)

పరస్త్రీలోలుడూ, సంధ్యాసమయాన నిద్రపోయేవాడు- భ్రూణహత్య చేసేవాడు వేద పండితులను నిందించినవాడూ- అమాయకులను ఆయుధాలతో కొట్టి బాధలు పెట్టేవాడు- మాతా-పితరుల దూషించే వాడూ - యేవిధమైన నరక బాధలు పడతాడో అలాగే నేనూ పడతానన్నాడు భరతుడు.

''కుమారా! కోపోద్వేగముతో నిన్నేమన్నానో నాకే తెలీదు, అంది కౌసల్య. వశిష్ట మహర్షి రాత్రంతా పెద్దమ్మ భవనాన నిద్రించిన భరతుని తీసుకొని రమ్మని పంపగా వచ్చాడు.

తైల ద్రోణిలో నున్న దశరథ మహారాజు కళేబరాన్ని సింహపీఠిపై ఉంచారు. భరతుడు దానిని చూసి భోరున విలపిస్తూ దానిపైబడి ఎంతో దుఃఖించాడు.

తేరుకొని ఈకళేబరానికి పేటిక చేయించారు. శిబికపైపెట్టి అయోధ్యరాజ మార్గం గుండా సర్వ సూర్య వంశ లాంఛనాలతో శ్మశానానికి గొని పోతూ దారి పొడుగునా బంగారు నాణాలను నూతన వస్త్రాలనూ జల్లుతూ వేద పండితుల వేదనాదాలతో దేవ దారు కట్టెలతో చితిని తయారు చేశారు అక్కడ అగ్నిసంస్కారాన్ని పూర్తిచేసి రాణులందరితో "సరయూనదిలో స్నానాలు గావించారు. మహారాజు దివ్యాత్మకు నమస్సులర్పించారు.

"పితృదేవా! పరమ పావనుడు శ్రీరాముని వనవాసమునకు పంపి ఇలా చేసిన తరువాత గోదాన- హిరణ్యదాన- భూదానాది షోడశదానాదికాలు మమ్ము- అయోధ్యవాసులందరినీ దుఃఖాసాగరానముంచావు. అని భరథుడు దుఃఖించి బాధపడ్డాడు- శత్రుఘ్నుడూ అలాగే అయ్యాడు. అందరూ లేపారు. అనంతరం దుఃఖాభారముతో దశరథుని అస్తికలు సరయూ నదిలో నిమజ్జనము గావించారు తరువాత అందరూ రాజమందిరాలకు చేరారు.

అనంతరము బంగారాభరణాలు ధరించి పట్టు పుట్టాలు కట్టి శరీరమంతా సువాసలతోనింపే మంచిగంధము పూసుకొని అష్టవంకరలు గల మంథర మందిర ద్వారము దగ్గరనిలబడింది.

"ఇంత జరగ డానికి ఈ రాక్షసి- పాపిష్టి కారణము, అని ద్వారపాలకుడన్నాడు.

వెంటనే మంథరను శత్రుఘ్నుడు నేలకు పడగొట్టి నాలుగు తన్నగా "తమ్ముడూ అబలను చంపరాదు. పాపము అన్నాడు భరతుడు. శత్రుఘ్నుడు దాన్ని చేతులు పట్టుకొని దూరముగా విసిరి కొట్టాడు.

మంత్రులు- పెద్దలూ చేరి " రాజ పుత్రా! మీతండ్రి మహారాజు మనందరనూ విడిచి స్వర్గము చేరాడు. సింహాసనము శూన్యముగా ఒకక్షణము కూడా ఉండరాదు. దానిని అధిష్ఠించడానికి నీకధికారముంది. అందుకు పట్టాభిషిక్తుడు అవసరము. పట్టాభిషేకానికి కావలసిన సంబారాలన్నీ మేము సమకూర్చాము. నీవువెంటనే ఆ సింహపీఠముపై అధిష్ఠించు అని వశిష్టుడు అనగా భరతుడు ఈ కింది విధంగా సమాధానం ఇచ్చాడు.

"మాయన్న గానబోవలయు
తెరువులు చక్కగా దిద్దింప డఖిల - పురజనులకు నేగ బొసగినరీతి
నెడనెడ విడుదు లనేకవస్తువులు - గడు సమగ్రాలుగా గావింపుడు

(పుట. 129:1430)

"మహాజనులారా! మా వంశాచారము మీకు తెలుసు. రాజ్యాభిషేకానికి పెద్దకుమారుడే అర్హుడు రాముడొక్కడే. ఒకవేళ దశరథ మహారాజు కుమారుడు ఒకరు అరణ్యములో ఉండాలన్న నేను అరణ్యములో నుండి రాముని తీసికొని వచ్చి ఇక్కట పట్టాభిషేకము జరిపిద్దాము. లేదా నేనిప్పుడే పట్టాభిషేక సంబారాలతో వెళ్లి అరణ్యములోనే ఆతనికి రాజ్యా భిషేకాన్ని జరిపించి- నేనిక్కడకి రాముని తీసికొని వస్తాను.

అలా భరతుడనే సరికి ప్రజలందరూ పరమ సంతోషాన్ని వెలి బుచ్చి కేరింతలు కొట్టారు. జై జై నాదాలు చేశారు. వారందరి నేత్రాల నుండి ఆనంద బాష్పాలు రాలాయి. మంత్రులకు తాను అరణ్యానికి వెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించాడు.

శిల్పులు తమ అనల్ప శిల్పసౌందర్యము చూపిస్తూ తమశక్తినంత చూపించారు. ఏనుగులూ- గుఱ్ఱాలూ ప్రయాణించడానికి అనుకూలంగా చెట్లూ లేకుండా చేశారు. ఎక్కడెక్కడ బసలేర్పాటు చేయాలో ముందుగానే చూచి రాజ క్రమలూ కొట్టి విశాలమైన రహదారులు యేర్పాటు గావించారు. రాళ్లూ తుప్పలూ సౌధాలను యేర్పాటు

చేశారు. మార్గమంతా పచ్చని తోరణాలు కట్టారు. జెండాలు ఎంతో అందంగా రెపరెపలాడేటట్లు చేశారు. అనేకవిధాల చిత్రాలంకారాలతో భరతుడు వెళ్ళే బాటలకు రెండు ప్రక్కలూ అందము ఆనందము చిందేటట్లు ఏర్పాటు చేశారు.

భరతుడూ- మంత్రులూ - పురోహితులు - పండితులూ- కవులూ-మేధావులూ - పౌరులూ శ్రీరామునికి అరణ్యం లోనే అక్కడే పట్టాభిషేకాన్ని జరిపి తీసుకొని రావాలని ఏర్పాట్లు చేయగా వశిష్ఠ మహర్షి భరతుని పట్టాభిషేకము చేసికొమ్మన్నాడు. భరతునికి పట్టరాని ఆగ్రహము వచ్చింది.

"గురువర్యా! ధర్మాన్ని ప్రభోధించే పురోహితులు మీనోటినుండి రావలసిన మాటలాఇవి? మీరిలా అంటే ఇంకా ఇతరులేమంటారు? కంచే చేనుమేస్తే కాపుదలేదీ?

తన అన్న అరణ్యములో నుండగా తనను రాజ్యమేలమను మాట చెవిని పడినంతనే భరతుని కన్నులనుండి దుఃఖాశ్రువులు బొట బొటకారాయి. మాటరాలేదు. ఆతడు ఆ సభలోనే భోరున యేడ్చాడు. ఇంకా ఇలా అన్నాడు.

"మహర్షివర్యా! "రాజ్యం చాహంచ రామస్య" ఈ రాజ్యము రామునిదే! నేనూ రామునికి చెందేవాడనే! బ్రహ్మచర్య వ్రతదీక్షితుడై అరణ్యమంలో ఉన్న రాముడే రాజు. మాపూర్వులు సూర్య వంశ రాజులు ఇక్ష్వాకు - మాంధాత - హరిశ్చంద్ర సగర - రఘువు మొదలైన రాజులతో సరిసమానుడైన రాముడే రాజ్యము పాలించడానికి అర్హుడు. మేమందరము ఆతని క్రీగంటచూపు క్రింద బ్రతకాలి.

నారాయణుడు సింహవిక్రముడు. బ్రహ్మదేవుడు నా హృదయాన్ని వజ్రముతో తయారు చేశాడేమో! ఈ దుఃఖ భారముతో బ్రద్దలయి ఉండేది కదా! రాజ్యలక్ష్మిని ఈ భరతుడు హస్తగతం చేసికుంటాడనుకొనుచున్నారా? నేనంత అధమాధముడననుకున్నారా? కానప్పుడు రామరాజ్యం భరతుని రాజ్యమెలా అవుతుంది? మా తల్లి కైక దుర్మార్గంచేతో దురాశచేతనో - అశ్వపతి కూతురగుటనో రాజ్యమాశించవచ్చును.

అని వారియొక్క వంశ చరిత్రను చెప్తూ సింహాసనాన్ని కచ్చితంగా సోదరులలో పెద్దవాడే పట్టాభిషేకం చేసుకోవాలని పలుమార్లు సూచించాడు.

నేను సూర్యవంశ సంజాతుడు దశరథ మహారాజు కుమారుడను నాకలాంటి బుద్ధి ఉంటుందని మీరెలా అను కున్నారు? అన్నాడు భరతుడు. భరతుడు నిష్కల్మషత్వము నిరుపమానము. ఆతనికి రాముని పట్ల గల భక్తి గౌరవ ప్రపత్తులు కొలతమీరినవి.

అయోధ్యలో జరిగిన ఇంత ఘోరము భరతునకు అణుమాత్రమూ తెలీదు. తృణప్రాయముగా రాజ్యాన్ని విసర్జించిన భరతుని త్యాగనిష్ఠ నిరుపమానము. భరత లక్ష్మణులకు రాముని పట్ల ఉన్న భక్తి, గౌరవ, ప్రేమాభిమానాలు సమానముగానే ఉన్నాయి. వారిద్దరి ప్రాణాలు రామునిలో ఉన్నాయి. ఇంతటి సోదర ప్రేమ ప్రపంచ భాషల్లో గల యే గ్రంథాలలో మనము చూడము.

అరణ్యానికి వెళ్ళిన భరతుడు రామునికి తన తండ్రి మరణవార్త తెలిపి, తక్షణమే రాజ్యాన్ని పరిపాలించాల్సినదిగా అభ్యర్థించాడు. తండ్రి మరణవార్త కి తల్లడిల్లిన సీతారామ లక్ష్మణులు ఇచ్చిన మాటకే కట్టుబడి రాజ్యాధికారాన్ని తిరస్కరించారు. ఆ మాటలు విన్న భరతుడు బాధాతప్త హృదయంతో తన అన్న రాముడి పాదుకలను నెత్తిన పెట్టుకుని రాజ్యానికి వచ్చి రామ రాజ్యం గా పాలన నిర్వర్తించాడు.

రాముడు రాజ్యాన్ని పాలిస్తే ఏవిధమైన పాలన సాగిస్తాడో భరతుడు కూడా అంతే ఓర్పుతో, అదే దృష్టితో పరిపాలన జరిపించాడు. ఎంత గొప్ప వ్యక్తిత్వం కాలవాడో భరతుడు మనకు స్పష్టమవుతుంది. అటు కొడుకుగా, రాజు అయ్యే లక్షణాలు అన్నీ కలిగినవాడు, రాజు అయ్యే అవకాశం కలిగి ఉంది కూడా పదవి ఆశించని గొప్ప

సంస్కారవంతమైన లక్షణం కలిగిన 'మహా పురుషుడు భరతుడు'గా మన చరిత్రలో నిలిచిపోయే స్థానం గలిగిన రాజు భరతుడు.

ముగింపు :

రాముని చెంతనుండి ఆతనిని కంటికిరెప్ప లాగ అన్ని విధాలా కాపాడు చుండేవాడు. రామునికి దుఃఖము కలిగే కేవల ధర్మాన్నే కాదు తన ప్రాణాలనైనా ఫణముగా పెట్టగలవాడు లక్ష్మణుడు రాముని సుఖమే సర్వ ధర్మములూ. అతని ఆజ్ఞయే లక్ష్మణుని జీవిత పరమార్ధము కర్తవ్యము.

భరతుడో, రామునికి దూరముగా ఉన్నా అతని సుఖమే తనసుఖముగా భావిస్తాడు. ధర్మానుకూలమైన రాముని ఆజ్ఞను తలదాలుస్తాడు. అధర్మమే అయితే రాముని మాటనూ వినడు. రాజ్య స్వీకారమూ మొదలైన విషయాలే ఇందుకు తార్కాణము, రామునికి దూరముగా ఉండి ఆతని శాసనాన్ని శిరోధార్యముగా స్వీకరిస్తాడు.

ఉద్యానవనం తీగ చక్కగా పోషించి బాగా అల్లుకున్నట్లు లక్ష్మణుని ప్రేమ గౌరవాభిమానాలు రాముని చెంత నుండి యెంతో రమణీయ కమనీయముగా ఉంటాయి.

భరతుని ప్రేమ అలాకాక దోహదాదులు లేకుండా ప్రకృతి సహజములగు పదార్థాలతో పరిపుష్టినంది అరణ్యలతలాగ అలరారుతుంటుంది. అందువలన వీరిద్దరిలో అధికులెవరో మనమే నిర్ణయించుకొనాలి. అధికులు అనే బదులు ఇద్దరి వారి వారి బాధ్యతను సమానంగా నిర్వర్తించారు అని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. బుద్ధారెడ్డి, గోన. రంగనాథ రామాయణం. కడప. రాయలు అండ్ కో పబ్లిషర్సు: 1949.
2. శ్రీ చిత్ర, పురాణ పండరి. సంపూర్ణ రామాయణం. రాజమండ్రి, మోహన్ పబ్లికేషన్స్: 2008.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

19. కన్నడ శ్రీరామాయణ దర్శనం - తెలుగు శ్రీమద్రామాయణ కల్పవృక్షం - తులనాత్మక పరిశీలన

- డా॥. పి. విజయకుమార్

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

కవి జీవితానికి, కావ్యానికి విడదీయరాని సంబంధం ఉంటుందని సాహితీవేత్తల భావన. కాబట్టే కవి దేశకాలాలు, వంశ విశేషాలు, విద్యాసంస్కారాలు, జీవితానుభవాలు, సమకాలీన సామాజిక రాజకీయాది పరిస్థితులు మున్నగు వానిని గూర్చిన పరిశోధన ఇటీవలి కాలంలో జరుగుతుంది.

సంస్కృత వాఙ్మయాలు అంటే ప్రపంచ వాఙ్మయానికి ఆదికవి వాల్మీకి బోయవాని వేటకు గాయపడిన కోకిలను చూచి "మానిషాద" శ్లోకం నాందిగా శ్రీమద్రామాయణం కావ్యం అంకురించిన తొలిపువ్వు, పండిన తొలి ఫలంగా భావించాలి.

తెలుగు సిలో పుష్పించిన తొలి జ్ఞానపీఠ విశ్వనాథ, విశ్వనాథ సత్యనారాయణ తెలుగు దేశాచారము ననుసరించి ఇంటి పేరు సొంత మేలు కలిసి విశ్వనాథ సత్యనారాయణ కాగా కువెంపు కన్నడ దేశపు పద్ధతి ప్రకారం ఊరు పేరు, తండ్రి పేరు, తన పేరు కలుపుకొని కుప్పళ్ళి వెంకటప్ప పుట్టప్ప అయ్యాడు. ఈ పేరుకు సంక్షిప్త రూపం కువెంపు.

విశ్వనాథ, కువెంపులిద్దరు సమకాలీనులు. దాదాపు సమవయస్కులే. విశ్వనాథ 10-09-1895లో జన్మించారు. కువెంపు జననం 29-12-1904. విశ్వనాథ అంటే కువెంపు సుమారు తొమ్మిదేండ్లు చిన్న. విశ్వనాథ జన్మించింది ఆంధ్రదేశపు నడిబొడ్డని చెప్పదగిన కృష్ణా జిల్లా నందమూరను గ్రామంలో. కవెంపు జన్మస్థలం కన్నడనాడులో చిక్కమగుళూరు జిల్లా కుప్పళ్ళి అనే కుగ్రామం. విశ్వనాథ కువెంపుల బాల్య, కౌమార దశలలో అధికభాగం గ్రామాలలోనే గడిచింది.

కాబట్టే వీరి రచనలలో విసర్గ, గ్రామీణ జీవిత సౌరభం గుబాళిస్తుంటాయి. విశ్వనాథ వారిది కృష్ణా జిల్లా, అనగా డెల్టా ప్రాంతం. కువెంపు గారిది "మలెనాడు" అనగా కొండ ప్రాంతం. కాబట్టే విశ్వనాథ కంటే కువెంపులో గిరవన ప్రీతి అధికంగా కనిపిస్తుంది.

విశ్వనాథ శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. కాబట్టే విశ్వనాథ వారి రచన తడిపొడి అయిన మడి బట్టల వాసన వెదజల్లుతుంది. కువెంపు వ్యవసాయిక గౌడ కుటుంబంలో పుట్టాడు. కాబట్టే ఆయన రచనలో తొలకరి వానలకు తడిసిన దుక్కిటి పొలం మట్టి వాసనలు వెదజల్లుతుంటాయి.

విశ్వనాథ, కువెంపు లిరువురును సాహిత్య ప్రక్రియలన్నింటిలో ఉత్తమ రచన సాగించిన సర్వతోముఖ ప్రతిభా సంపన్నులు. విశ్వనాథ వారు శ్రీమద్రామాయణ కల్పవృక్షం, ఆంధ్ర ప్రశస్తి, శశిదూతము, శృంగారవీధి, కుమారాభ్యుదయం ఇలా 25కి పైగా పద్యకావ్యాలు రచించారు. కువెంపు కూడా 'శ్రీరామాయణ దర్శనం', చిత్రాంగద, పక్షికాశి, ఇక్షు గంగోత్రి మొదలగు 25కి పైగా కావ్యాలు రచించారు. విశ్వనాథ అనార్కలీ, నర్తనశాల, త్రిశూలం మొదలగు 15 నాటకాలు రచించగా, కువెంపు కూడా శూద్ర తపస్వి, రక్తాక్షి మొదలగు 12 నాటకాలు రచించారు. విశ్వనాథ వారు 30కి పైగా కథలు రాయగా కువెంపు కూడా సుమారు 20 కథలు రాశారు. విశ్వనాథ వారితో దాదాపు అటు ఇటుగా విమర్శా గ్రంథాలు రచించారు. కాని నవలా ప్రక్రియలో మాత్రం విశ్వనాథ వారిదే పైచేయి. వేయిపడగలు, ఏకవీర మొదలగు 70కి పైగా నవలలు రాస్తే కువెంపు రెండే రెండు నవలలు 'మలెగళల్లి మదుమగళు ", "కానూరు హెగ్గడితి" మాత్రం రచించాడు. విశ్వనాథ వారి కంటే కువెంపు జీవిత చరిత్రలో బాల సాహిత్య గ్రంథాలు ఎక్కువగా రచించారు.

విశ్వనాథ ఆంధ్ర సాహిత్య పరిషత్ అధ్యక్షత వహించినట్లే కువెంపు కూడా కన్నడ సాహిత్య సమ్మేళనమున అధ్యక్షత వహించారు. విశ్వనాథ, కువెంపులిద్దరూ విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డి.లిట్ బిరుదులు పొందినవారే. కేంద్ర, రాష్ట్ర, సాహిత్య / అకాడమీ పురస్కారాలు పొందినవారే. పద్యభూషణ్ ప్రశస్తిని పొందినవారే. ఇరువురూ భారతీయ జ్ఞానపీఠ పురస్కారాలు అందుకున్నవారే. ఇంకొక ఆశ్చర్యకరమైన సాదృశ్యం ఏమంటే ఇరువురు తన రామాయణ మహాకావ్యాలకే జ్ఞానపీఠ పురస్కారం లభించింది. చివరకు ఇరువురు తమ తమ రాష్ట్ర ప్రభుత్వాలచే ఆస్థాన కవులుగా గౌరవింపబడినవారే.

> "విశ్వనాథ వారు రామాయణ కల్పవృక్షం రాసేటప్పుడు ఇలా పేర్కొన్నాడు.
> మరల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచక మెల్ల వేళల
> తినుచున్న యన్నమే తిను చిన్నదిన్నాళ్లు తన రుచి బ్రతుకులు తనవిగాన
> చేసిన సంసారమే సేయుచున్నది తనదైన యనుభూతి తనదిగాన
> తలచిన రామునే తలచెద నేనును నా భక్తి రచనలు నావి గాన
> కవి ప్రతిభలోన నుండును కావ్యగతి శ
> తాంశముల యందు తొంబదియైన పాళ్ళు
> ప్రాగ్వి పశ్చన్మతంబున రసము వేయి
> రెట్టు గొప్పది నవకథా దృతిని మించి

ఇలా ఆంధ్రుల కొంగు బంగారంగా కవి సామ్రాట్టు కృషి ఫలితంగా శ్రీమద్రామాయణ కల్పవృక్షం సమకూరింది.

సంపూర్ణ మూర్తిత్వం కలిగిన రసజగత్తు రామాయణ కావ్యంలో దర్శనమిస్తుంది. విశ్వనాథ వారి కవితా స్వరూపం. వ్యక్తిత్వ హిమాలయ ఉన్నతి కల్పవృక్షంలో కానవస్తాయి. ఆధునికాంధ్ర సాహిత్య జగత్తులో విశ్వనాథ ఒక విరాణ్మూర్తి. నవ్యసంప్రదాయల ప్రయోక్త. వచన కవిత్వాన్ని విన్నా ప్రాచీనాధునికాంధ్ర ప్రక్రియల్లో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు.

గేయం రాసినా, పద్యం రచించినా, మనోకావ్యాన్ని రచించినా విశ్వనాథ కృతిలో ఆయనదైన ఒక వ్యక్తిత్వం

ప్రతిబింబిస్తుంది. వాక్కులో, వాక్యంలో, శబ్దంలో సమానంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం వెల్లివిరుస్తుంది. మహాకవిగా మనుగడ సాగించడానికి ఉండవలసిన మొదటి లక్షణం ఈ వ్యక్తిత్వం.

"అందరికీ కవిత్వం తెలియాలనే వాళ్లు నా కవిత్వం చదువక్కరలేదు, పూర్వ కవులను ఏ అనురాగ విశేషంతో అర్థం చేసుకొంటున్నారో, ఆ మార్గాన అర్థం చేసుకోగలిగిన వారికి నా కవిత్వం ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుంది. ఈ అందాలు తెలియాలంటే కావ్యం కావ్యంఆ చదువగలిగిన శక్తి కావాలి. "కల్పవృక్షమా నాలుగు పళ్ళు పారేయి" అంటే అలా గిరాటు వెయ్యదు. దానిని కూడా ఉపాసించాలి. భక్తి ప్రవత్తులు కలిగి ఆదరంతో చదివిన వారికే నా గ్రంథం అర్థమవుతుందని ఆ భావాన్ని కవిత రూపంలో విశ్వనాథ ఇలా చెప్పాడు.

"తనలోతు నెఱుగని జనుల పూజకుఁది ర
స్మృతి జూపు మత్సరస్వతి సుభద్ర
తనలోతు నెఱిగిన జనుల పూజకు నవా
ధృతి ఁజూపు మత్సరస్వతి సమార్ద్ర
మత్సర స్వతి భావ సామ్రాజ్య లక్ష్మి
భక్తి యున్నట్టిచో మెత్తబడెదు దేవి"

విశ్వనాథ తాను కావ్య రచన చేసేటప్పుడు పాఠకుని దృష్టిలో ఉంచుకొని రాయమని స్పష్టంగా చెప్పాడు.

I will never have a reader in my mind and so I neither write for the Hign brow or the low brow or the midlle brow.

విశ్వనాథ రామాయణం 'స్వాంత స్సుఖాయ' మాత్రమే రచించాడు. ఆ సమయంలో విశ్వనాథ మదిలో ఉన్నది పరమేశ్వరుడు మాత్రమే పాఠకుడు కాదు.

"ఇది మెచ్చెదరో మెచ్చరో?
యిదియును జదివెదరు జదువరేలా నాక
య్యది; నాయెద నీతోరా
చెద నదానికి ఫలంబు జెందించు శివా"

విశ్వనాథ కావ్యం తమకు అర్థం కాలేదను అపరిణత మనస్కులకు విమర్శలు అనవరములు. అది వారి దురదృష్టమని రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ పేర్కొన్నాడు.

కువెంపు కూడా దాదాపుగా విశ్వనాథ సత్యనారాయణ అభిప్రాయాలతో సరిపోయే అభిప్రాయాలను వెలువరించారు.

"అట్టి కావ్యం కొత్తదిగా ఉన్నప్పుడు ప్రజలకు అది రుచించకపోవచ్చు అర్థం కాకపోవచ్చు. ఆ కావ్యం లోతు, ఎత్తులు తెలుసుకోవడం సాధ్యం కాకపోవచ్చు. అపుడు వారు దానిని తిరస్కరించడం, ఆక్షేపించడం సహజం. అలా అని ఆ కళాకృతిని అల్పమని త్రోసివేయడానికి వీలవుతుందా అని కువెంపు కళాసుందరి 'మున్నుడి'లో స్పష్టం చేశారు.

నిజమైన యోగ్యత గుర్తించటానికి యోగ్యత కావాలంటాడు కువెంపు. పూర్ణ దృష్టితో శ్రీరామాయణ దర్శనం కావ్యాన్ని అర్థం చేసుకోవడం అందరికి సాధ్యం కాదు. దానికర్హత కావాలి. కానీ సాధన వలన మరల మరలా కావ్య పద్యం చేయడం వలన అది సాధ్యమవుతుంది. మహాకవి అయిన వాడు జగత్తు యొక్క మనస్సును తమ మట్టానికి ఎక్కువజేయవలెనే గాని తాను దాని మట్టానికి దిగిపోరాదు అని కువెంపు తన ఆలోచనను తెలియజేశారు.

విశ్వనాథకు వాల్మీకి యందు గల భక్తి అంతా ఇంతా కాదు. ఇది మూడు సందర్భాలలో గుర్తింపదగింది.

1. శ్రీరామాయణ కల్పవృక్షం అవతారికలో పూర్వకవి స్తుతి సందర్భంలో
2. చిత్రకూటంలో రాముడు వాల్మీకి దర్శించిన సందర్భంలో
3. విశ్వనాథ అనేక సందర్భాలలో చేసిన ఉపన్యాసాలలో

కువెంపు కూడా వాల్మీకి పట్ల అపారమైన గౌరవ భావం ఉంది. లేనట్లయితే అసలు కువెంపు రామాయణ రచనకు పూనుకొని ఉండేవాడు కాదు. విశ్వనాథ వలె కువెంపు కూడా.

1. తన కావ్యావతారికలోను
2. చిత్రకూట ఘట్టంలో
3. అనేక సందర్భాలలో వాల్మీకిని గురించిన అభిప్రాయాలలో వాల్మీకి పట్ల అభిమానం స్పష్టమయ్యింది.

ఒక కావ్యాన్ని విమర్శించు విమర్శకుని ధర్మం గురించి ఒక బంగారం లాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

"యదభిముఖముగ జెప్పిరో యల్ల దాని
దదభిముఖముగ జూచిన ధర్మమొప్పు
నవముఖంబుగ జూచిన నఖిలదోష
ఖనులుగాఁదోచు ....."

రచయిత తన రచన ఏ దృక్పథంతో సాగించాడో విమర్శకుడు అదే దృక్పథంతోనే ఆ రచనను విమర్శించాలి. అప్పుడే విమర్శకుడు సహృదయ విమర్శకుడుగా పరిగ్రహించబడతాడు.

ఈ విషయంపై విశ్వనాథ కంటె కువెంపు తన అభిప్రాయాన్ని స్పష్టంగా తెల్పాడు. "ఈ నా కావ్యాన్ని మూడు దృష్టులతో చూడవలసింది. మొదటిది కేవలం సాహిత్య దృష్టి. రెండవది మనశ్శాస్త్ర దృష్టి. చివరిది దర్శన దృష్టి. వీనిలో ఏ ఒక్క దృష్టితో చూచి అర్థం చేసుకొన్న చాలు. కాని ఈ దృష్టులన్నింటితో వీక్షించనిచో కావ్యాస్వాదలు పూర్ణ దృష్టి ఉంచినట్లు కాదు.

ఇంకొక సందర్భంలో కువెంపు 'ఈ నా కావ్యాన్ని రెండు, మూడు దృష్టులతో చూడవలసి ఉన్నది. కావ్యం కావలసిన వారికి ఇందులో కావ్యం లభిస్తుంది. కథ కావలసిన వారికి కథ లభిస్తుంది. దర్శనం కావలసిన వారికి దర్శనం లభిస్తుంది" అని స్పష్టం చేశాడు.

మొదటిసారి తెల్పిన మూడు దృష్టులు సాహిత్య ధృష్టి, మానశ్శాస్త్ర దృష్టి, దర్శన దృష్టి. రెండవసారి తెల్పిన మూడు దృష్టులు కావ్య దృష్టి, కథా దృష్టి, దర్శన దృష్టి. కావున మొత్తం మీద కథా దృష్టి, కావ్య దృష్టి, మనశ్శాస్త్ర దృష్టి, దర్శన దృష్టి అనే నాలుగు దృష్టులలో కువెంపు కావ్యాన్ని విమర్శిచదలచి ఉన్నదన్న మాట.

కువెంపులాగా విశ్వనాథ ఇంత స్పష్టంగా చెప్పకపోయినా ఆయా సందర్భాలలో ఆయన తెలిపిన అభిప్రాయాన్ని బట్టి ఆయన కూడా ఇదే దృక్పథాన్ని అభిమానించాడని చెప్పవచ్చు.

భాష :

కళలన్నిటింకిని లక్ష్యం ఒకటే; కళాకారుని హృదయానుభూతిని కళా రసికుని హృదయానుభూతిగ చేయటమే. శిల్పం రూపాన్ని, చిత్రకళ వర్ణాన్ని, సంగీతం నాదాన్ని ఆశ్రయించాయి. కవిత్వం వీటి కంటే భిన్నమైనది. పై కళలన్ని భౌతిక పదార్థాశ్రితాలు, ఇంద్రియ గోచరాలు, కవిత్వానికి, భాష వాహకం. ఈ క్రింది పద్యంలో విశ్వనాథను 'పాషాణ పాక ప్రభూ' అని జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి పేర్కొన్నాడు.

"కిచిత్తిక్త కషాయ షాడబ రసక్షే పాతిరేకాతి వ
క్సంచార ప్రచయావకాశములలోఁ గవ్యచ్ఛ గండాశ్మముల్
చంచల్లీల సుదార వాగ్గరిమతో సాధించి వేధించుమా
పంచారించి ప్రవహ్లికా కృతి కృతిన్ పాషాణ పాక ప్రభూ"

నిషావర్షదమోఘ మేఘ పటలీ నిర్గచ్ఛదత్యాతిత
స్ఫేష్ఠే రమ్మద మాలికా యుగపదుజ్జృంభస్మహా ఘోర బం
హిష్ఠ స్ఫూర్జథు షండ మండిత రవాహీన క్రియాప్రౌఢి దాఁ
ఘిష్ఠంబై యొక రావమంతట నె సంగన్ చిన్న చూపంబునన్.

ఈ పద్యం చూస్తేనే పాషాణ పాక స్వభావం తలపుకు వస్తుంది. నారికేళ పాకంతో పాటు ద్రాక్షాపాకాన్ని తలపించే భాషా ప్రియుడు. 'నాది వ్యవహార భాష - మంథరము శైలి అంటాడు' విశ్వనాథ.

శ్రీ రామాయణ దర్శనం నందలి భాషా ప్రధాన లక్షణాలుగా చెప్పదగినవి సంస్కృత హళెగన్నడముల ప్రాచుర్యమే. అందుచేతనే ఈ రెండు భాషలలో పరిచయం తక్కువైన ఆధునిక కన్నడిగ విద్యావంతులకు చాలామందికి శ్రీరామాయణ దర్శనం కొరకురాని కొయ్య అవుతున్నది. కాని పౌరాణికేతి వృత్తంతో కూడిన ఈ మహాకావ్యమునకే భాష జిగిని, బిగిని కూర్చ గలిగినదనుటలో సందేహం లేదు.

విశ్వనాథ కథాకథన శిల్పం :

"కథాకథన శిల్పానేక మార్గాభిరామము" అని విశ్వనాథ చెప్పుకొన్న శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో ఆయన ప్రదర్శించి కొన్ని శిల్ప మార్గాలను పరిశీలిద్దాం.

విశ్వనాథ ప్రధాన కథ చాలా వరకు కవి కథనాలుగానే కాలక్రమ పద్ధతి అనుసరించి చెప్పడం జరిగింది. దశరథ యజ్ఞం, రామాదుల జననం, తాటకి వధ, విశ్వామిత్ర యజ్ఞ సంరక్షణం, అహల్యా శాపవిమోచనం, శివ ధనుర్భంగం, సీతాకళ్యాణం, రామ పట్టాభిషేక ప్రయత్నం, తద్భంగం, రామవన గమనం, శూర్పణఖా పరాభవం, మారీచ వధ, సీతాపరహరణం జాటాయు వధ, శబరీ మోక్షము, సుగ్రీవ సఖ్యం, వాలివధ, సీతాన్వేషణం, లంకా దహణం, రామరావణ యుద్ధం, రావణ వధ, శ్రీరామ పట్టాభిషేకం ఇవన్నీ సాధారణ మార్గంలో పేర్కొనడం జరిగింది.

ప్రధాన కథలో భాగమైన సీత పుట్టుక, దశరథశాప వృత్తాంతం, ప్రాసంగికములైన తాటక చరిత్ర, వాలిసుగ్రీవ వైరం, వాల్మీకం నందే సింహావలోకన క్రమంలో చెప్పబడ్డాయి. విశ్వనాథ ఇవిగాక ప్రధాన కథలోఓని అనేక కథాంశాలను పాత్ర కథనంగా సింహావలోకన క్రమంలో చెప్పటం జరిగింది. దీనివలన సాధించే ప్రయోజనాలు బహుళం. ఉదాహరణకు ఒక ఘట్టాన్ని పరిశీలిద్దాం.

చిత్రకూటమి ససైన్యుడై వస్తున్న భరతుని చూచిన లక్ష్మణుడు అతని రాకలోని ఉద్దేశం గూర్చి శంకించటం, రాముడతని శంకా నివారణం చేయడం అనే విషయంలో విశ్వనాథ కాలక్రమ పద్ధతిలో మొదట చెప్పలేదు. తరువాత భరతుడు రామపాదుకలు గొని అయోధ్యకు తిరిగిపోతున్న సందర్భంలో లక్ష్మణుడు పరుగు పరుగున పోయి అతనితో ఈ వృత్తాంతాన్ని చెప్పి అతనిని శంకించినందుకు క్షమాపణ కోరతాడు. ఇట్లు కథన క్రమాన్ని మార్చటంలో కథన శిల్పమే మొదటి ప్రయోజనం, ముఖ్య ప్రయోజనం లక్ష్మణుని శీల పోషణం. మూలంలో లక్ష్మణునికి కలిగిన శంకను గురించి భరతునికి ఎవ్వరూ చెప్పినట్లు లేదు. విశ్వనాథ లక్ష్మణుని చేతనే స్వయంగా తన పొరపాటును చెప్పించి క్షమాపణ కోరించుటతో అతని శీలసంపద మెరుగెక్కింది.

విశ్వనాథ తాను సాక్షాత్తుగా ఒకసారి చెప్పిన కథాంశాన్ని మరొకసారి ఏ పాత్ర చేతనో చెప్పించవలసి వచ్చినపుడు పాత కథనే కొత్త తీరున చెప్పించటం జరుగుతుంది.

కువెంపు కథా కథన శిల్పం :

కువెంపు కూడా కథకథన శిల్పం అభిమానించువాడే. తన గ్రంథాన్ని కథా దృష్టితో, కావ్యదృష్టితో విమర్శించాలని కువెంపు స్వయంగా చెప్పుకోవడంలో కథాకథన దృష్టి స్పష్టమవుతుంది.

కువెంపు ప్రధాన ప్రాసంగిక కథాంశాలన్ని తన మాటల్లోనే చెప్పడం జరిగింది. పాత్ర కథనంగా మూలంలో, చెప్పబడిన వాలిసుగ్రీవ వైర కారణం కూడా కువెంపు తన మాటల్లోనే చెప్పాడు. సంపాతి కథ మాత్రం సింహావలోకన పద్ధతిలో అతని చేతనే చెప్పించబడింది. దశరథుని శాప వృత్తాంతం అతనిచే స్మరించటం మాత్రమే జరిగింది.

కువెంపు కథాకథన శిల్పం ఎక్కువగా సన్నివేశ కల్పనపైన, సంభాషణ శైలిపైన ఆధారపడి వుంటుందని చెప్పవచ్చు. శిశువైన రాముడు చంద్రుని కొరకేడ్చుటం, సీత వచ్చి కట్టెలతో వంట చేయలేక పోవటం, శశిమౌళి అనే ముని బాలకుడు సీతకు మసి పాత్రలు శుభ్రం చేయడంలో సహాయం చేస్తూ ముఖం నిండా మసి పూసుకోవడం, వాలి సుగ్రీవుని చిన్నతనంలో ఉప్పుగోనె వలె మోయడం, అతడు నీటిలో మునగగా ఒడ్డు చేర్చడం మొదలైన సన్నివేశాలు ఉదాహరణలు. ఈ సన్నివేశాలన్ని అత్యంత సరళ ధోరణిలో చెప్పబడి పాఠకునకు విసుగు గొలుపక చదివింపజేస్తాయి. ఈ సహజత్వ సారళ్యాలే కువెంపు కథాకథన విధానమండలి విశిష్టత. సంభాషణా శైలికి రామ శూర్పణఖల సంభాషణం, రావణ మారీచుల సంభాషణలు ఉదాహరణలు.

కువెంపు చేసే కల్పనలు నవ్యంగా, ఆసక్తికరంగా ఉంటాయి. రావణుడు రాముని జయించి సీతకు కానుకగా సమర్పింతునని పూని ఆ ప్రయత్నంలోనే హతుడయ్యాడన్న కల్పన బాగున్నది కాని వాలి విషయమై కూడా కువెంపు అదే కల్పనను పునరుచ్చరించుట శిల్పదృష్ట్యా మెచ్చదగిందిగా లేదు.

ఇరువురు గ్రంథాలు దర్శన ప్రధానమైనవే. విశ్వనాథ కావ్యం సంప్రదాయ సిద్ధమైన అద్వైతం శ్రీవిద్యను గర్భీకరించుకొన్నది. కాగా కువెంపు కావ్యం అద్వైతం యొక్క ఆధునిక రూపమైన దర్శనాన్ని ప్రతిపాదించింది.

కథా నిరూపణలోను ఈ దృష్టి బేధం గమనించవచ్చు. విశ్వనాథ రాక్షస, వానరులను గురించిన ప్రాచీన సంప్రదాయ భావనలనే ప్రదర్శిస్తుంది. రాక్షసులలో పలువురు ఘోరస్వరూపులు, క్రూరదారులు అయినట్లు చిత్రించాడు. వానరులను వాలులుగనే చెప్పారు. కువెంపు రాక్షసులు వానరులు కూడా ఆర్వేతరులైన సాధారణ మానవులే అంటారు. రాక్షసులు ద్రావిడ జాతీయులనడం జరిగింది. రాముడు దక్షిణ దేశమున ఆర్య నాగరికతా వ్యాప్తికి కృషి చేస్తున్న ఋషుల రక్షకునిగా రామ రావణ సంగ్రామ ఆర్య ద్రావిడ సంఘర్షణగ చిత్రించడం జరిగింది.

గ్రంథ విభజనలో కూడ ఈ భేదం గుర్తించవచ్చు. విశ్వనాథ గ్రాంధిక భాషలో ఆధునిక వ్యవహారిక రూపాలను, నుడికారం చొప్పించాడు. కువెంపు ఆధునిక భాషలో అనగా హొస కన్నడములో ప్రాచీన గ్రాంధిక రూపాలను అనగా హళెగన్నడ, నడుగన్నడ రూపాలను చొప్పించాడు. విశ్వనాథ ప్రాచీనులలో నవ్యుడు. కువెంపు నవ్యులలో ప్రాచీనుడు.

ఇరువురి భాష సంస్కృతపద, సమాన భూయిష్ఠమైనదే. కువెంపు భాషాశైలి విశ్వనాథ భాషాశైలిలాగా ప్రౌఢం కాకపోయినా, తెలుగువారికి విశ్వనాథ శైలివలె, కన్నడిగులకు కువెంపు శైలి కూడా నారికేళపాకంలా భాసిస్తుంది.

విశ్వనాథ ఒకాకువులను, జాతీయములను సామెతలను అధికంగా ప్రయోగించాడు. అందువల్ల సంస్కృతపద భూయిష్ఠమై విశ్వనాథ భాష వ్యావహారికంలాగా భాసిస్తుంది. కువెంప భాషలో ఇవి విరళం. అందువల్ల అది వ్యవహారానికి దూరమైనదానిలె కనిపిస్తుంది.

విశ్వనాథ రామాయణం వాల్మీకం కంటె ఒకటిన్నర రెట్లు పెద్దది. కువెంపు రామాయణము వాల్మీకములో సగం పరిమాణం కలది. అనగా విశ్వనాథ రచన కువెంపు దానికంటే మూడురెట్టు పెద్దది. రచనా కాలము కూడా కువెంపు కంటే విశ్వనాథకు మూడు రెట్లయింది. కువెంపు తన రామాయణాన్ని ప్రారంభించిన పదేండ్లలోపులోనే ముగించగా విశ్వనాథ ముప్పై ఏళ్లకు ముగించాడు. విశ్వనాథ మొదట నుండి చివర వరకు ఒకే విధంగా నాతి విస్తరంగా నాతి సంగ్రహంగా రచన సాగించాడు కువెంపు మొదట అత్యంత సంగ్రహంగా, పోనుపోను అత్యంత విస్తరంగాను రచన సాగించాడు.

విశ్వనాథ రామాయణంలోని పాత్రలు తెలుగువారికి తెలుగువారుగనే కనిపిస్తారు. ఆ చరిత్ర అంతా నడిచింది తెలుగు నేలపైననే అనిపిస్తుంది. అట్లే కువెంపు రచనలో కూడా కన్నడిగులకు విశేష ప్రీతిదాయకాలు కాగల వర్ణనలు ఎడనెడపొడ సూపుతుంటాయి. విశ్వనాథ రచన అంతా గ్రామీణత తొణికిసలాడుతుంటుంది. వ్యావసాయిక వాతావరణము వ్యాపించి ఉంటుంది. కువెంపు రచనలో ఆయన గిరివన ప్రీతి ప్రస్ఫుటమవుతుంటుంది.

విశ్వనాథ చిత్రణలో రాముడు మానవుడు, భగవంతుడు రెండూ ఎట్లు దర్శింపదలచుకొన్న వారికి అట్లు దర్శనమవుతుంది. కువెంపు చిత్రణలో రాముడు దివ్యుడుగా పరిణతి చెందిన మానవుడు. ఈ పరిణామం స్పష్టంగా గోచరిస్తుంది. అట్లే విశ్వనాథ చిత్రించిన రావణుడు కాముకుడు, సాధకుడుగా కనిపిస్తాడు. ఎట్లు చూడగోరినవారికట్లు కనిపిస్తాడు. కువెంపు చిత్రించిన రావణుడు సాధకుడుగా మారిన కాముకుడు. ఈ పరిణామం కూడా స్పష్టంగా గోచరించేదే. విశ్వనాథ చిత్రణ 'బ్రహ్మసత్యం జగన్మిధ్య' యన్నట్లుంటుంది. కువెంపు చిత్రణ 'ఈశావాస్య మిదం సర్వం' యన్నట్లుంటుంది. విశ్వనాథ పాత్రలన్ని జగద్వివర్త సిద్ధాంత నిరూపకాలు. కువెంపు పాత్రలన్ని జగద్వికాస సూత్రానికి ఉదాహరణలు.

విశ్వనాథ పండిత కవికాగా, కువెంపు దార్శనిక కవిగా విశ్వనాథ రామాయణము కల్పవృక్షం, కువెంపు రామాయణం కావ్యాలలో దర్శనమిస్తాయి.

★★★

RNI No. APTEL/2003/12253

సంపాదకుని పరిచయం

డా॥. గొట్టె శ్రీనివాసరావు

జననం	:	05.08.1973
జన్మస్థలం	:	గుండ్లపహాడ్ (పూర్వపు నల్లగొండ జిల్లా. ప్రస్తుత సూర్యాపేట జిల్లా)
తల్లిదండ్రులు	:	గొట్టె జానకీ రామకృష్ణులు
ధర్మపత్ని	:	గొట్టె జోత్స్నాదేవి
కుమారుడు	:	గొట్టె రాధాకృష్ణ

విద్యాభ్యాసం :

పాఠశాల విద్య (1990 వరకు)	:	రఘునాథపాలెం, మఠంపల్లి (మం.)
ఇంటర్మీడియట్ విద్య (1990-92)	:	ప్రభుత్వ జూనియర్ కళాశాల, హుజూర్‌నగర్.
స్నాతక విద్య (1992-95)	:	కె.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కోదాడ.
స్నాతకోత్తర విద్య (1995-97)	:	ఎమ్.ఏ (తెలుగు), హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
ఉపాధ్యాయ శిక్షణా విద్య (1997-98)	:	బి.ఈడి., ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా కళాశాల, వరంగల్.
పరిశోధన (1998-99)	:	ఎమ్.ఫిల్ (తెలుగు) (అంశం : చిత్రదీపాలు - అధ్యయనం), హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
పరిశోధన (1990-2004)	:	పిహెచ్.డి (తెలుగు) (అంశం : పోతన భాగవతం - అలంకార శిల్పం), హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఉద్యోగము :

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ (2002 నుండి)

- ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాడూర్ (నాగర్‌కర్నూల్ దగ్గర)
- ప్రభుత్వ జూనియర్ కళాశాల, చౌటుప్పల్.

అసిస్టెంట్ ప్రొఫెసర్ (2010 నుండి)

- ఎస్.ఆర్.ఎన్.కె. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాన్సువాడ.
- బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు.

అసోసియేట్ ప్రొఫెసర్ (2022 నుండి)

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు.
- తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి.

ముద్రిత రచనలు :

1. పోతన భాగవతము - అలంకార శిల్పం
2. చిత్ర దీపాలు - కవిత్వానుశీలన